www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సోమవారం | 1-12-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 243

శ్రీ విశ్వావసునామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం; తిథి: ఏకాదశి రా.7.01 తదుపరి ద్వాదశి; నక్షత్రం: రేవతి రా.11.18 తదుపరి అశ్విని; వర్జ్యం: మ.12.14-1.42; దుర్ముహూర్తం: మ.12.26-1.10, మ.2.38-3.22; అమృతఘడియలు: రా.9.05-10.33; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.33; సూర్యాస్తమయం: 5.35

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఐటీలో హెచ్ఐవీ బగ్!



ఆ రంగానికి చెందినవారిలో ఇటీవల పెరుగుతున్న వైరస్ కేసులు

విచ్చలవిడి వీకెండ్ పార్టీలు, డ్రగ్స్ మత్తు ఇంజెక్షన్ల వినియోగంతో సమస్య

జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ హెచ్చరిక

వ్యవసాయ కార్మికుల్లో హెచ్ఐవీ విస్తృతి.. అవగాహనలేమి, వలసలతో రిస్క్

ఐటీ, వ్యవసాయ రంగాల వారికి హెచ్ఐవీ పరీక్షలు పెంచాలని సూచన

తెలంగాణలో తగ్గిన హెచ్ఐవీ వ్యాప్తి, మరణాల రేటు 12

చనిపోయిన ప్రియుణ్ని పెళ్లాడిన ప్రియురాలు

యువకుడిని దారుణంగా చంపిన యువతి తండ్రి, సోదరులు 2

కులాంతర వివాహానికి సిద్ధమైనందునే..

మహారాష్ట్రలోని నాందేడ్‌లో కులోన్మాద హత్య

స్థానిక సంప్రదాయం ప్రకారం.. ప్రియుడి మృతదేహంపై పసుపు పూసి పెళ్లాడిన యువతి

పోలీసుల అదుపులో నిందితులు



నేలకేసి బాది.. కాలితో తొక్కి..

ఐదేళ్ల పాపపై స్కూల్ ఆయా దాడి

గొంతు పిసికి, చెంపలపై కొట్టి అమానుషం

పలుమార్లు కింద పడేసి కొడుతూ కర్కశం

బాలికకు తీవ్ర గాయాలు.. ఆస్పత్రికి తరలింపు

హైదరాబాద్‌లోని షాపూర్‌నగర్‌లో దారుణం

జీడిమెట్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నర్సరీ చదువుతున్న చిన్నారి పట్ల పాఠశాల ఆయా అమానుషంగా ప్రవర్తించింది. చెంపలపై కొడుతూ, కింద పడేస్తూ పాపపై విచక్షణారహితంగా దాడి చేసింది. బాలిక జుట్టు పట్టుకుని తలను పలుమార్లు సిమెంటు నేలకేసి బాదింది. అంతటితో ఆగక

మిగతా 3వ పేజీలో...


చిన్నారిని కాలితో తొక్కుతున్న ఆయా లక్ష్మమ్మ


తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఆహ్వానపత్రికను విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు

రేపటి కోసం..

రైజింగ్ సమ్మిట్‌పై మంత్రులతో సీఎం సమీక్ష

6 వరకు జిల్లాల్లో రైజింగ్ ఉత్సవాలు: భట్టి

క్యూర్, ప్యూర్, రేర్ ప్రాంతాలుగా రాష్ట్రం.. గత అనుభవాల పాఠాలతో విధానపత్రం

తెలంగాణ సత్తాను ప్రపంచానికి చాటుతాం

అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడేలా విజన్

నేటి నుంచి తెలంగాణ రైజింగ్ ఉత్సవాలు

ఓఆర్ఆర్ లోపల కాలుష్యరహితంగా మారుస్తాం

అంతర్జాతీయ విద్యా సంస్థలను రప్పిస్తాం

మెట్రో, బుల్లెట్ ట్రైన్‌కు కేంద్రం ఓకే: సీఎం రేవంత్

హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం గత అనుభవాల నుంచి నేర్చుకున్న పాఠాలతో పాలసీ డాక్యుమెంట్‌ను రూపొందిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. భవిష్యత్తు తరాల కోసం దీనిని జాతికి అంకితం చేయబోతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా తెలంగాణ రైజింగ్ పేరుతో నిర్వహిస్తున్న ఉత్సవాలు సోమవారం ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. 13 రోజులపాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో తెలంగాణ రైజింగ్ సమ్మిట్ నిర్వహిస్తున్నామని, 9న విజన్-2047 విధానాన్ని ప్రకటిస్తామని చెప్పారు. ఈ అంశంపై ఆదివారం మంత్రులతో సీఎం సమీక్ష నిర్వహించిన అనంతరం

మిగతా 13వ పేజీలో...

గ్లోబల్ సమ్మిట్‌కు మోదీ, రాహుల్‌కు ఆహ్వానం.. స్వయంగా ఆహ్వానించనున్న రేవంత్

నియోజకవర్గానికో ఎంఎస్ఎంఈ పార్కు!

మహిళల కోసం ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తాం

రాష్ట్ర పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు

తెలంగాణలో 'అదితి'కి ఆతిథ్యం

ఎంఎస్ఎంఈల బలోపేతంలో ఇంధన సామర్థ్య ప్రాజెక్టులదే కీలకపాత్ర: శ్రీధర్‌బాబు 13

నేడు నారాయణపేట, వనపర్తి జిల్లాల్లో సీఎం పర్యటన

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మక్తల్ బహిరంగ సభలో ప్రసంగం

71,550 కోట్లు

రెండేళ్లలో మద్యం విక్రయాలివి..

724 లక్షల కేసుల లిక్కర్.. 960 లక్షల కేసుల బీర్లు

2023-25 మద్యం విధానంలో భారీగా అమ్మకాలు

మద్యం ఆదాయంలో 80 శాతం ప్రభుత్వ ఖజానాకు

ముగిసిన పాత విధానం.. నేటి నుంచి కొత్త దుకాణాలు

జీహెచ్ఎంసీ పరిధిలో ఏటా లైసెన్స్ ఫీజు రూ.1.10 కోట్లు

మద్యం అమ్మకాన్ని బట్టి శ్లాబులుగా ఇతర ఫీజులు

లైసెన్స్ రుసుములో ఆరో వంతు ఇప్పటికే వసూలు



హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వానికి అతిపెద్ద ఆదాయ వనరుగా ఉన్న మద్యం అమ్మకాలకు సంబంధించి నూతన విధానం సోమవారం అమల్లోకి రానుంది. దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులు వాటిని ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లూ చేసుకున్నారు. ఈ నూతన పాలసీ 2027 నవంబరు వరకూ అమల్లో ఉండనుంది. దీని ద్వారా రాష్ట్ర ఖజానాకు భారీగా నిధులు సమకూరే అవకాశం ఉందని ఎక్సైజ్ శాఖ అంచనా వేస్తోంది. 2023-25 పాత మద్యం పాలసీ గడువు ఆదివారంతో ముగియగా.. ఈ రెండేళ్లలో మద్యం అమ్మకాలు ఊహించని

మిగతా 14వ పేజీలో...

మన అంతరిక్షానికి 'ఇన్ఫినిటీ' ఉత్సాహం



దేశ యువశక్తికి స్కైరూట్ ఇన్ఫినిటీ క్యాంపస్ ప్రతిబింబం

'మన్ కీ బాత్'లో హైదరాబాద్ స్టార్టప్‌పై మోదీ ప్రశంసలు

ప్రపంచంలోనే అతిపెద్ద లీప్ ఇంజిన్ ఎంఆర్‌వోను హైదరాబాద్ నగరంలో ప్రారంభించినట్లు వెల్లడి 2

కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ, లోహ శిల్పకళలపై ప్రశంసలు

పల్లెపోరు.. నామినేషన్ల జోరు

4,236 సర్పంచ్‌లకు 25,654, 37,440 వార్డులకు 82,276

సర్పంచ్‌కు సగటున ఆరుగురు, వార్డుకు ఇద్దరు చొప్పున..

తొలివిడత నామినేషన్ ఉపసంహరణకు 3 దాకా గడువు

రెండో విడత నామినేషన్లు షురూ

ప్రెసిడెంట్ గారి భర్తనైనా అవుదామని..! 14

ప్రియురాలితో సర్పంచ్ పదవికి నామినేషన్ వేయించిన ప్రియుడు

ఆ వెంటనే ఆమెతో పెళ్లి

సంగారెడ్డి జిల్లా తాళ్లపల్లిలో రిజర్వేషన్ కోసం యువకుడి చర్య

బంగారిగడ్డ సర్పంచ్ @73లక్షలు

వేలంలో ముస్లిం మహిళ సొంతం

ఆ సొమ్ముతో గ్రామంలో ఆలయ నిర్మాణానికి తీర్మానం

'శీతాకాలం'.. గరంగరమే! 2

నేడే పార్లమెంటు సమావేశాలు

'సర్', పలు అంశాలపై సర్కార్‌ను నిలదీసేందుకు విపక్షాలు సిద్ధం

15 బిల్లులు పెట్టనున్న కేంద్రం!

ఆ డీల్ తర్వాతే.. ఈ డీల్!

అమెరికాతో వాణిజ్య ఒప్పందం తర్వాతే ఎస్‌యు-57 ఒప్పందం

పుతిన్ పర్యటనలో డీల్ లేనట్టే?

రష్యా నుంచి మరో ఐదు ఎస్-400 రెజిమెంట్ల కొనుగోలు 2

సర్ గడువు వారం పొడిగింపు

» 9 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో సాగుతున్న ప్రక్రియ

» ఫిబ్రవరి 14న ఓటర్ల తుది జాబితా విడుదల

న్యూఢిల్లీ, నవంబరు 30: తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సర్వే(సర్) ప్రక్రియ గడువును ఎన్నికల కమిషన్(ఈసీ) ఒక వారం పొడిగించింది. చాలా తక్కువ వ్యవధి ఇవ్వడం వల్ల క్షేత్రస్థాయి ఎన్నికల అధికారులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ప్రతిపక్ష పార్టీలు ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో ఈసీ ఆదివారం ఈ నిర్ణయం తీసుకుంది. గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఎన్యూమరేషన్ ఫారాలను ఈనెల(డిసెంబరు) 4వ తేదీ వరకు పంపిణీ చేయాల్సి ఉండగా, దాన్ని 11వ తేదీ వరకు పొడిగించినట్టు ఆదివారం ఒక ప్రకటనలో ఈసీ వెల్లడించింది. అలాగే, ముసాయిదా ఓటర్ల జాబితాను డిసెంబరు 9న ప్రచురించాల్సి ఉండగా, 16న ప్రచురించనున్నట్టు తెలిపింది. ఓటర్ల తుది జాబితాను వచ్చే ఏడాది ఫిబ్రవరి 7న విడుదల చేయాల్సి ఉండగా, ఫిబ్రవరి 14న విడుదల చేయనున్నట్టు వెల్లడించింది.

సర్ కొనసాగుతున్న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఇవీ..

అండమాన్-నికోబార్ దీవులు, లక్షద్వీప్, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, పుదుచ్చేరి, రాజస్థాన్, తమిళనాడు, యూపీ, పశ్చిమ బెంగాల్‌లలో సర్ ప్రక్రియ కొనసాగుతోంది. వీటిలో తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, బెంగాల్‌లలో 2026లో ఎన్నికలు జరుగనున్నాయి. అసోంలోనూ 2026లోనే ఎన్నికలు జరుగనున్నప్పటికీ ఆ రాష్ట్రానికి విడిగా సర్ ప్రక్రియను ప్రకటించారు. పుట్టిన ప్రదేశాన్ని పరిశీలించి విదేశీ అక్రమ వలసదారులను ఏరివేయడమే సర్ ప్రధాన లక్ష్యం. కాగా, ఇంత తక్కువ గడువులో సర్ ప్రక్రియ పూర్తి చేయడం సాధ్యం కాదని ఈసీ గ్రహించిందని కాంగ్రెస్ పేర్కొంది. ఆదివారం ఢిల్లీలో కాంగ్రెస్ నాయకుడు ప్రమోద్ తివారీ విలేకరులతో మాట్లాడుతూ ఈసీ అహాన్ని వీడాలన్నారు.

నేషనల్ హెరాల్డ్ కేసులో.. సోనియా, రాహుల్‌లపై మరో ఎఫ్ఐఆర్

న్యూఢిల్లీ, నవంబరు 30: నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించిన అక్రమాల కేసులో కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా, రాహుల్‌లపై పోలీసులు మరో ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. ఈ వ్యవహారంలో మనీ ల్యాండరింగ్ జరిగిందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అందజేసిన వివరాల ఆధారంగా.. సోనియా, రాహుల్‌తోపాటు సుమన్‌దూబే, శామ్‌పిట్రోడా, మోతీలాల్ వోరా, ఆస్కార్ ఫెర్నాండెజ్, యంగ్ ఇండియా, డాటెక్స్ మర్చండైజ్, అసోసియేటెడ్ జర్నల్స్ సంస్థలు, మరికొందరిపై ఢిల్లీ ఆర్థిక నేరాల విభాగం (ఈవోడబ్ల్యూ) పోలీసులు ఈ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఢిల్లీ కోర్టులో ఈడీ దాఖలు చేసిన చార్జిషీటులో వీరందరినీ నిందితులుగా పేర్కొనడం గమనార్హం. ఆ చార్జిషీటుపై కోర్టు డిసెంబరు 16న విచారణ జరపనుంది. ఈ సమయంలో ఢిల్లీ ఈవోడబ్ల్యూ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడం చర్చనీయాంశంగా మారింది.

నన్ను క్షమించండి..!

» ఇజ్రాయెల్ దేశాధ్యక్షుడికి నెతన్యాహు అభ్యర్థన

టెల్ అవీవ్, నవంబరు 30: అవినీతి కేసులో తనపై జరుగుతున్న సుదీర్ఘ విచారణను ముగించేందుకు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు దేశాధ్యక్షుడిని క్షమాపణ కోరారు. ఈ మేరకు అధ్యక్ష కార్యాలయ న్యాయ విభాగానికి తన అభ్యర్థనను సమర్పించారని ప్రధాని కార్యాలయం ఆదివారం తెలిపింది. అయితే ఇది 'అసాధారణ అభ్యర్థన'గా అభివర్ణించిన అధ్యక్ష కార్యాలయం.. దీనితో పాటు పలు ముఖ్యమైన చిక్కులున్నట్లు పేర్కొంది. ఇక ఇజ్రాయెల్ చరిత్రలో విచారణకు హాజరైన ఏకైక ప్రధానిగా నెతన్యాహు నిలిచారు. తన సంపన్న రాజకీయ మద్దతుదారుల కోసం నెతన్యాహు అక్రమాలకు పాల్పడ్డారని.. మూడు వేర్వేరు కేసుల్లో ఆయనపై మోసం, నమ్మక ద్రోహం, లంచాలు స్వీకరించడం వంటి అభియోగాలున్నాయి. అయితే ఇంకా ఏ కేసులోనూ ఆయన దోషిగా తేలలేదు. నెతన్యాహును క్షమించాలంటూ అధ్యక్షుడు ఐజాక్ హెర్జాగ్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ లేఖ రాసిన వారాల వ్యవధిలోనే.. ఈ పరిణామం చోటుచేసుకుంది.

క్షిపణులకు ఏఐ పవర్..!

» సాఫ్ట్‌వేర్ అభివృద్ధిపై డీఆర్‌డీవో కసరత్తు

న్యూఢిల్లీ, నవంబరు 30: ఒకప్పుడు యుద్ధాలంటే.. సైనికుల సంఖ్య, భూ, వాయు, జల మార్గాల్లో సైనిక పోరాటాలపై ఆధారపడేవి. కానీ.. ఇప్పుడు టెక్నాలజీదే కీలకపాత్ర. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వచ్చాక యుద్ధ స్వభావమే పూర్తిగా మారిపోయింది. డ్రోన్లు, ఏఐ, క్షిపణి సాంకేతికత వంటివి యుద్ధ రంగాన్ని శాసిస్తున్నాయి. దీంతో దేశాలు తమ రక్షణ వ్యూహాలను కూడా మార్చుకుంటున్నాయి. ఈ క్రమంలోనే రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీవో) కూడా క్షిపణులకు కృత్రిమ మేధను జోడించనుంది. శత్రు దాడులను ముందస్తుగానే పసిగట్టి స్వయంప్రతిపత్తితో జట్టుగా దాడిచేసే అధునాత మిస్సైల్స్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. జీపీఎస్ పనిచేయని వాతావరణంలోనూ ఇవి అత్యంత కచ్చితత్వంతో శత్రు టార్గెట్లపై దాడిచేసే 'స్వీయ అవగాహణ క్షిపణులు' రూపొందించడమే లక్ష్యంగా డీఆర్‌డీవో సాఫ్ట్‌వేర్ అభివృద్ధి పనులు మొదలుపెట్టిందని ఉన్నతస్థాయి అధికారులు వెల్లడించినట్టు తెలిసింది. సాఫ్ట్‌వేర్ అభివృద్ధి దశలో ఉన్న ఈ అధునాతన క్షిపణులకు 2027 నాటికి ట్రయల్స్ నిర్వహించాలని డీఆర్‌డీవో భావిస్తోంది. 2032నాటికి ఇవి భారత వాయుసేనకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

నెల రోజుల వ్యవధిలో ఇద్దరు డీఆర్‌డీవో శాస్త్రవేత్తల మృతి

జైపూర్, నవంబరు 30: నెల రోజుల వ్యవధిలో భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో)కు చెందిన ఇద్దరు శాస్త్రవేత్తలు మరణించడం చర్చనీయాంశంగా మారింది. గత అక్టోబరు 21న ఆకాశ్‌దీప్ గుప్తా ఇంట్లో డిన్నర్ చేసిన తర్వాత అకస్మాత్తుగా కుప్పకూలి మరణించగా.. తాజాగా ఆదిత్య వర్మ (28) అనే మరో శాస్త్రవేత్త రాజస్థాన్‌లో అల్వార్‌లోని తన నివాసంలో మరణించారు. ఆయన పెళ్లైన రెండు రోజులకే ఇంట్లోని బాత్‌రూమ్‌లో విగతజీవిగా కనిపించారు. ఆదిత్య వర్మ మైసూర్‌లోని డీఆర్‌డీవోలో జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఆదిత్య తన భార్య నవ్యతో కలిసి గతనెల 29న హనీమూన్‌కు కూడా వెళ్లాల్సి ఉంది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిత్య వర్మకు గత నెల 25న ఓ పోలీసు అధికారి కుమార్తెతో వివాహమైంది. 26న కొత్త పెళ్లికూతురు వారి ఇంటికి వచ్చింది. తర్వాతి రోజు 27న ఉదయం ఆదిత్య వర్మ ఇంట్లోని బాత్‌రూమ్‌కు వెళ్లి.. ఎంత సేపటికీ బయటకు రాలేదు. దీంతో కుటుంబసభ్యులు తలుపు పగలకొట్టి చూడగా.. ఆదిత్య అపస్మారక స్థితిలో కనిపించారు. ఆస్పత్రికి తరలించగా మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా, అక్టోబరు 21న డీఆర్‌డీవో శాస్త్రవేత్త ఆకాశ్‌దీప్ గుప్తా ఇదేవిధంగా మరణించారు. ఆయనకు ఆరు నెలల క్రితమే వివాహమైంది. యూపీ లఖ్‌నవూలోని తనఇంట్లో రాత్రి భోజనంచేసిన తర్వాత అస్వస్థతకు గురై మృతి చెందారు. ఆయన మరణానికి కచ్చితమైన కారణం ఇంకా తెలియరాలేదు.

ఒక్క కిడ్నీతో పుట్టినా ఆరోగ్యంగానే..!

» జాగ్రత్తలతో అందరిలాగే ఎదుగుదల: వైద్య నిపుణులు


న్యూఢిల్లీ, నవంబరు 30: సాధారణంగా మనిషికి రెండు కిడ్నీలు ఉంటాయి. కానీ.. ప్రపంచవ్యాప్తంగా ఎపెడిమియోలాజికల్ డేటా ప్రకారం ప్రతి 1000 నుంచి 2000 మంది పిల్లల్లో ఒకరు ఒకే మూత్రపిండంతో జన్మిస్తున్నారు. ఈ పరిస్థితిని యూనిలేటరల్ రెనాల్ అజెనిసిస్ (యూఆర్ఏ) అని పిలుస్తారు. ఇలా ఒక కిడ్నీతో పుట్టిన పిల్లల తల్లిదండ్రులు సహజంగానే ఆందోళన చెందుతారు. అయితే వైద్య నిపుణులు మాత్రం ఒక్క కిడ్నీతో పుట్టినంతమాత్రాన భయపడాల్సిన అవసరం లేదని.. సరైన జాగ్రత్తలు, పోషకాహారం తీసుకుంటే వారు కూడా సాధారణ పిల్లల్లాగే చురుకుగా, ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. 'ఒక్క కిడ్నీతో పుట్టిన చిన్నారుల్లో చాలామందిలో ఇది పెద్దదిగా మారుతుంది. రెండు కిడ్నీలు చేసే పనిని ఇదొక్కటే చేసేలా ఇది సహకరిస్తుంది. సాధారణ పర్యవేక్షణ, సరళమైన జీవనశైలి, తగిన జాగ్రత్తలతో వారు పూర్తిగా సాధారణ జీవితాన్ని గడపవచ్చు' అని గురుగావ్‌లోని మేదాంత ఆస్పత్రిలో పీడియాట్రిక్ యూరాలజీ డైరెక్టర్ డాక్టర్ సందీప్ కుమార్ సిన్హా తెలిపారు.

చనిపోయిన ప్రియుణ్ని పెళ్లాడిన ప్రియురాలు



నాందేడ్, నవంబరు 30: ప్రేమకు కులం, మతం, దేశం వంటి హద్దులు లేవంటారు. కానీ, మహారాష్ట్రలోని నాందేడ్‌లో జరిగిన ఓ ఘటన ప్రేమకు ఏకంగా చావు కూడా అడ్డంకి కాదని నిరూపించింది. తన ప్రియుడిని కుటుంబసభ్యులే దారుణంగా హత్య చేసినప్పటికీ ఆ 21 ఏళ్ల యువతి.. ప్రాణం పోయినా అతడే తన భర్త అంటూ మృతదేహాన్ని వివాహమాడింది. నవంబరు 27న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నాందేడ్‌కు చెందిన అంచల్ మామిడ్వార్ తన సోదరుని స్నేహితుడైన సాక్షమ్ తాతేతో ప్రేమలో పడింది. ఇద్దరూ కలిసి బతకాలని కలలు కన్నారు. ఇరువురి కులాలు వేరు కావడంతో ఆంచల్ తండ్రి, ఇద్దరు సోదరులు ఈ బంధాన్ని వ్యతిరేకించారు. ఆంచల్ కుటుంబం నుంచి తీవ్ర బెదిరింపులు ఉన్నా, పెళ్లి చేసుకోవడానికి సిద్ధమయ్యారా ప్రేమికులు. వేరే కులం వాడిని పెళ్లి చేసుకుంటే పరువుపోతుందని భావించిన ఆంచల్ కుటుంబ సభ్యులు.. సాక్షమ్‌ను ఎలాగైనా చంపాలని నిర్ణయించుకున్నారు. నాలుగు రోజుల క్రితం ఆంచల్ తండ్రి గజానన్, ఇద్దరు సోదరులు సాహిల్, హిమేశ్ మరో ఇద్దరితో కలిసి సాక్షమ్‌పై దాడి చేశారు. తుపాకీతో కాల్పులు జరిపి.. ఆ తర్వాత రాయితో మోది దారుణంగా హత్య చేశారు. విషయం తెలుసుకున్న అంచల్ గుండెలవిసేలా రోదించింది. గత నెల 28న సాయంత్రం అంత్యక్రియలకు ఏర్పాట్లు జరుగుతున్న సమయంలో సాక్షమ్ ఇంటికి చేరుకుంది. ప్రియుడిని చంపి తన తండ్రి, సోదరులు గెలిచామని భావిస్తున్నారని.. తన ప్రేమకు మర ణం లేదని లోకానికి చాటాలని భావించింది. చనిపోయినా, బతికున్నా అతడే తన భర్త అంటూ.. ప్రియుడి మృతదేహంపై పసుపు పూసి, తన నుదుటిపై సిందూరం దిద్దుకుని.. జీవితాంతం సాక్షమ్ భార్యగా అతని ఇంట్లోనే బతుకుతానని ప్రతిజ్ఞ చేసింది. తన తండ్రి, సోదరులను ఉరి తీయాలని ఆమె డిమాండ్ చేసింది.

లోకం తీరు



భారత అంతరిక్షానికి 'ఇన్ఫినిటీ' ఉత్సాహం

దేశ యువశక్తికి 'స్కైరూట్ ఇన్ఫినిటీ' క్యాంపస్ ప్రతిబింబం

» 'మన్ కీ బాత్'లో హైదరాబాద్ స్టార్టప్‌పై మోదీ ప్రశంసలు



న్యూఢిల్లీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): భారత దేశ అంతరిక్ష పర్యావరణ వ్యవస్థకు.. హైదరాబాద్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పేస్'కు చెందిన ఇన్ఫినిటీ క్యాంపస్ కొత్త ఉత్సాహాన్ని ఇస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. ఈ కేంద్రం దేశంలోని నవీన ఆలోచన, ఆవిష్కరణ, యువశక్తికి ప్రతిబింబంగా నిలిచిందని కొనియాడారు. 128వ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఆయన.. హైదరాబాద్‌కు చెందిన ఈ స్టార్టప్ సంస్థపై ప్రసంశలు కురిపించారు. అలాగే.. ప్రపంచంలోనే అతిపెద్ద లీప్ ఇంజిన్ 'మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్‌హాల్ (ఎంఆర్‌వో)' సౌకర్యాన్ని ఇటీవలే హైదరాబాద్‌లో ప్రారంభించినట్టు వెల్లడించారు. విమాన నిర్వహణ, మరమ్మత్తు, పునఃపరిశీలన రంగంలో మనదేశం కీలక ముందడుగు వేసిందన్నారు. అలాగే.. 'వోకల్ ఫర్-లోకల్'ను ప్రోత్సహించే క్రమంలో.. పలు దేశాల ప్రధానులకు కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ నైపుణ్యాన్ని పరిచయం చేశానని, వివిధ కళాకృతులను వారికి బహూకరించానని వెల్లడించారు. "మీరంతా 'వోకల్ ఫర్ లోకల్' అనే మంత్రాన్ని పాటించాలి" అని జీ-20 శిఖరాగ్ర సమావేశాల్లో వివిధ దేశాల ప్రతినిధులు, నాయకులను కోరినట్టు తెలిపారు. "మన దేశప్రజల తరఫున వారికి బహుమతులు అందించేటప్పుడు ఈ భావనను దృష్టిలో ఉంచుకున్నాను. జీ-20 సందర్భంగా జపాన్ ప్రధానికి వెండి బుద్ధుడి ప్రతిరూపాన్ని బహూకరించాను. అది తెలంగాణలోని కరీంనగర్‌కు చెందిన ప్రసిద్ధ సిల్వర్ క్రాఫ్ట్ నైపుణ్యాన్ని ఆవిష్కరిస్తుంది. అలాగే.. ఇటలీ ప్రధానికి పూల ఆకృతులతో కూడిన వెండి అద్దం బహుమతిగా ఇచ్చాను. అది కరీంనగర్ సంప్రదాయ లోహ శిల్పకళా నైపుణ్యానికి నిదర్శనం. ఇలా పలు దేశాధి నేతలకు దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన అద్భుతమైన కళా రూపాలను బహూకరించాను. భారతీయ హస్తకళలు, కళలు, సంప్రదాయాల గురించి ప్రపంచానికి అవగాహన కల్పించడం, మన చేతివృత్తులవారి ప్రతిభను ప్రపంచానికి అందించడం నా లక్ష్యం. రాబోయే రోజుల్లో క్రిస్మస్, నూతన సంవత్సర షాపింగ్‌లో 'వోకల్ ఫర్ లోకల్' అనే మంత్రాన్ని గుర్తుంచుకోండి. దేశంలో తయారు చేసిన వాటిని మాత్రమే కొనండి. దేశప్రజలు కష్టపడి తయారుచేసిన వాటిని మాత్రమే అమ్మండి' అని మోదీ పిలుపునిచ్చారు.

అదే.. గొప్ప బలం

యువత అంకితభావం వికసిత్ భారత్‌కు గొప్ప బలమని నరేంద్ర మోదీ తెలిపారు. "సోషల్ మీడియాలో ఒక వీడియో కొన్ని రోజుల కిందట నా దృష్టిని ఆకర్షించింది. ఈ వీడియో ఇస్రో నిర్వహించిన ఒక ప్రత్యేకమైన డ్రోన్ పోటీకి సంబంధించింది. ఈ వీడియోలో దేశ యువత ముఖ్యంగా మన జెన్-జీ అంగారక గ్రహ వాతావరణంలో డ్రోన్‌లను ఎగరవేసేందుకు ప్రయత్నిస్తోంది. వారి ప్రయత్నాలు ఫలించలేదు. కానీ, పుణె నుంచి వచ్చిన యువకుల బృందం ఈ పోటీలో కొంతమేరకు విజయాన్ని సాధించింది. వారి డ్రోన్ కూడా చాలాసార్లు పడిపోయి కూలిపోయినా పట్టు వదలలేదు. చాలా ప్రయత్నాల తర్వాత ఈ బృందం డ్రోన్ అంగారక గ్రహ వాతావరణంలో కొంతసేపు ఎగరగలిగింది. ఈ వీడియో చూస్తున్నప్పుడు నాకు మరొక దృశ్యం గుర్తుకు వచ్చింది. చంద్రయాన్-2తో సంబంధం తెగిపోయినప్పుడు.. యావద్దేశం.. ప్రధానంగా శాస్త్రవేత్తలు కొద్దిక్షణాలు నిరాశకు లోనయ్యారు. కానీ, ఆ వైఫల్యం వారిని నిలువరించలేదు. చంద్రయాన్-3 విజయగాథను అదే రోజు రచించడం మొదలుపెట్టారు. చంద్రయాన్-3 ల్యాండ్ అయిన క్షణం.. వైఫల్యాన్ని అధిగమించిన తర్వాత సాధించిన ఆత్మవిశ్వాస విజయం. సోషల్ మీడియాలో చూసిన ఆ వీడియోలో కనిపించిన యువకుల కళ్లలోనూ నేను అదే మెరుపును చూశాను. యువతరం చూపే ఈ అంకితభావం 'వికసిత్ భారత్'కు గొప్ప బలం' అని ప్రధాని మోదీ ప్రశంసించారు.

ఒకరి తీర్పును మరొకరు కొట్టివేయడం ఆందోళనకరం

» జస్టిస్ నాగరత్న వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, నవంబరు 30: ఒక ధర్మాసనం ఇచ్చిన తీర్పును కొంత కాలం తరువాత మరో ధర్మాసనం కొట్టివేస్తున్న సంఘటనలు ఇటీవల కాలంలో సుప్రీంకోర్టులో చోటు చేసుకుంటుండడంపై న్యాయమూర్తి జస్టిస్ బి.వి.నాగరత్న ఆందోళన వ్యక్తంచేశారు. తీర్పు రాసిన న్యాయమూర్తి పదవీ విరమణ చేశారనో, స్థానాన్ని మారారనో చెప్పి తీర్పులను కొట్టివేయకూడదని సూచించారు. దేశంలో చట్టబద్ధ పాలన అమలు చేయాల్సిన బాధ్యత న్యాయ వ్యవస్థపై ఉం దని స్పష్టం చేశారు. హరియాణాలోని సోనీపట్‌లో ఉన్న ఓపీ జిందాల్ గ్లోబల్ వర్సిటీలో న్యాయ వ్యవస్థ స్వతంత్రతపై శనివారం నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఆమె ఈ అంశాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. న్యాయమూర్తి ఒకసారి ఇచ్చిన తీర్పు స్థిరంగా ఉంటుందంటూ చట్టవ్యవస్థ ఇచ్చిన భరోసా మేరకే న్యాయ వ్యవస్థ స్వతంత్రత అన్న భావన వృద్ధి చెందిందని తెలిపారు. న్యాయమూర్తులు సిరాతో తీర్పులు రాస్తారని, ఆ తీర్పును గౌరవించాల్సిన బాధ్యత న్యాయవ్యవస్థలోని అందరు భాగస్వాములు, ప్రభుత్వ యంత్రాంగంపై ఉందని చెప్పారు. ఒకవేళ ఏవైనా అభ్యంతరాలు ఉంటే అది సంప్రదాయ విధానాలకు అనుగుణంగా జరగాల్సి ఉంటుందని ఆమె తెలిపారు.

ఆ డీల్ తర్వాతే.. ఈ డీల్!



అమెరికాతో వాణిజ్య ఒప్పందం తర్వాతే ఎస్‌యు-57 ఒప్పందం

రష్యా అధ్యక్షుడు పుతిన్ 4-5 తేదీల్లో ఇండియా పర్యటనకు వస్తున్నారు! ఈ పర్యటనలో... రష్యా నుంచి స్టెల్త్ సామర్థ్యం ఉన్న ఐదోతరం యుద్ధ విమానాలు 'ఎస్‌యు-57'లను కొనుగోలు చేసేందుకు భారత్ ఒప్పందం కుదుర్చుకునే అవకాశం ఉందన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే.. ఈ విమానాల విక్రయానికి, 100 శాతం సాంకేతిక పరిజ్ఞానాన్ని బదిలీ చేసేందుకు రష్యా ఇప్పటికే ఆమోదం తెలిపింది. వాటిని భారత్‌లో తయారుచేయడానికే కాక.. వేరే దేశాలకు ఎగుమతి చేయడానికి కూడా అనుమతిస్తామని మరో బంపర్ ఆఫర్ ఇచ్చింది. రెండు దేశాలూ కలిసి ఈ విమానాలను తయారుచేయడానికి.. రష్యా నుంచి వచ్చిన బృందం ఒకటి నాసిక్‌లో 'హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్'కు చెందిన ఎస్‌యు-30ఎంకే విమానాల తయారీ కేంద్రాన్ని పరిశీలించింది.ఎస్‌యు-57ల తయారీకి అక్కడ ఉన్న సదుపాయాలు దాదాపు యాభై శాతం దాకా సరిపోతాయని, మిగతా ఏర్పాట్లు తాము చేస్తామని పేర్కొంది. అయినప్పటికీ.. ఈ డీల్ పుతిన్ పర్యటనలో కుదరకపోవచ్చని రక్షణ రంగ నిపుణులు కొందరు విశ్లేషిస్తున్నారు. భారత్-అమెరికా నడుమ చాలాకాలంగా జరుగుతున్న వాణిజ్య ఒప్పందం ప్రస్తుతం తుది దశలో ఉండడమే ఇందుకు కారణం.

అమెరికాతో సత్సంబంధాల కోసం..

సుఖోయ్-57 కాకుండా ఐదో తరం యుద్ధవిమానాలకు సంబంధించి భారత్ ముందున్న మరో ప్రత్యామ్నాయం అమెరికాకు ఎఫ్-35లు. వాటిని భారత్‌కు అమ్మడానికి అమెరికా ఇంతవరకూ అధికారికంగా ముందుకు రాలేదు. ట్రంప్ మాత్రం ఒకసారి.. ఎఫ్-35లను భారత్‌కు విక్రయించడానికి సిద్ధమని నోటిమాటగా అన్నారు. ఒకవేళ అమెరికా వాటిని అమ్మజూపినా.. రష్యాకు చెందిన క్షిపణి రక్షణ వ్యవస్థలైన ఎస్-400లు ఉన్నచోట వాటిని నియోగించొద్దని ఆంక్షలు విధిస్తుంది. ఆ విమానాలకు సంబంధించిన 100 శాతం సాంకేతిక పరిజ్ఞానాన్ని మనకు బదిలీ చేయదు. కాబట్టి వాటిని కొన్నా వాటి ఉపయోగం పరిమితమే అవుతుంది. కాబట్టి అవి వద్దనుకుంటే.. రష్యా నుంచి ఎస్‌యూ-57లను కొనడం ఒక్కటే ప్రత్యామ్నాయం అవుతుంది. కానీ, అమెరికాతో వాణిజ్య ఒప్పందం చర్చలు తుదిదశకు చేరుకున్న సమయంలో రష్యాతో ఎస్‌యు-57 డీల్ కుదుర్చుకుంటే అగ్రరాజ్యంతో వ్యవహారం చెడుతుందన్న ఆందోళన ఉంది. కాబట్టి అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదిరి.. ఆ దేశంతో సానుకూల సంబంధాలు ఏర్పడిన తర్వాత రష్యాతో ఎస్‌యు-57 డీల్ కుదుర్చుకోవచ్చన్నది భారత ప్రభుత్వ యోచనగా చెబుతున్నారు. ఈ క్రమంలోనే.. అమెరికాతో చర్చలు సానుకూలంగా సాగేందుకు, ఆ దేశంతో సంబంధాలు దెబ్బతినకుండా ఉండేందుకే.. ఎఫ్-35 యుద్ధవిమానాల కొనుగోలును పరిశీలిస్తున్నామంటూ భారత వాయుసేన వర్గాలు ప్రకటనలు చేస్తున్నట్టు చెబుతున్నారు. దీంతోపాటు.. రక్షణరంగానికి సంబంధించి అమెరికాతో ఇతరత్రా ఒప్పందాలపై భారత్ దృష్టి సారించింది. అందులో భాగంగానే.. భారత వాయుసేన అమెరికాకు చెందిన బోయింగ్ కేసీ-135 స్ట్రాటో ట్యాంకర్‌ను (గాలిలోనే యుద్ధవిమానాల్లో ఇంధనం నింపే ట్యాంకర్)ను లీజుకు తీసుకుంది. ఆ 'మిడ్ ఎయిర్ రీఫ్యూయెలర్' కొద్దిరోజుల క్రితమే భారత్‌కు వచ్చింది. అలాగే.. నౌకాదళం కోసం కొన్న 24 ఎంహెచ్-60ఆర్ సీహాక్ హెలికాప్టర్లకు వచ్చే ఐదేళ్లపాటు అవసరమయ్యే సర్వీసింగ్ సపోర్ట్ అందించేందుకు రూ.7995 కోట్లతో 'ఫాలో ఆన్ సపోర్ట్' ఒప్పందాన్ని ఇటీవలే కుదుర్చుకుంది. వచ్చే ఐదేళ్లపాటూ ఆ 24 సీహాక్ హెలికాప్టర్లకు అవసరమైన విడిభాగాలను సరఫరా చేయడం, వాటి నిర్వహణ, సాంకేతిక సహాయం, లాజిస్టిక్స్ ఈ ఒప్పందంలో భాగం. దీంతోపాటు.. 93 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.825 కోట్ల) విలువైన.. 100 ట్యాంకు విధ్వంసక జావెలిన్ క్షిపణులు, ఎక్స్‌కాలిబర్ ప్రెసిషన్ గైడెడ్ ఆర్టిలరీ ప్రొజెక్టైల్స్ సంబంధిత రక్షణ పరికరాలను అమెరికా నుంచి కొనుగోలు చేయడానికి భారత్ సిద్ధమైంది. ఈ విక్రయానికి అమెరికా ప్రభుత్వం నవంబరు మూడోవారంలో ఆమోదం తెలిపింది. భారత్ ఉత్పత్తులపై దిగుమతి సుంకాలను ట్రంప్ 50 శాతానికి పెంచేసిన తర్వాత.. అమెరికాతో మనదేశం కుదుర్చుకున్న అతిపెద్ద రక్షణ పరికరాల ఒప్పందం ఇదే. అలాగే.. నేవల్ గస్తీ కోసం అత్యంత శక్తిమంతమైన రేడార్లు కలిగిన ఆరు 'పీ-8ఐ' లాంగ్ రేంజ్ మారిటైమ్ పెట్రోల్ ఎయిర్‌క్రాఫ్టల కొనుగోలుకు సంబంధించి 4 బిలియన్ డాలర్ల ఒప్పందంపై ఇరుదేశాల మధ్య చర్చలు జరుగుతున్నాయి. ఇప్పటికే మన నేవీ వద్ద 12 'పీ-8ఐ' విమానాలున్నాయి. మరో 10 విమానాల కోసం నేవీ అడిగినప్పటికీ.. ఆరు విమానాల కొనుగోలుకు ఆమోదం లభించింది. అమెరికాతో ఒప్పందం కుదిరి ఆ ఆరు విమానాలు అందుబాటులోకి వస్తే హిందూ మహాసముద్రంలో భారత నేవీ నిఘా పటిష్ఠమవుతుంది. యాంటీ-సబ్‌మెరైన్ వార్‌ఫేర్ సామర్థ్యం పెరుగుతుంది. వీటన్నింటికంటే పెద్దది.. అమెరికా నుంచి బీ-1బీ లాన్సర్ అనే దీర్ఘ శ్రేణి సూపర్‌సానిక్ బాంబర్ కొనుగోలు లేదా లీజు ప్రతిపాదన పెట్టారు. వాస్తవానికి.. ఫైటర్ ఎయిర్‌క్రాఫ్టలతో పాటు బాంబర్స్‌ను కూడా రష్యా నుంచే తీసుకుందామని, రష్యా అభివృద్ధి చేసిన తుపెలోవ్-160 బాంబర్లను లీజుకు తీసుకుందామని భారత్ అనుకుంది. కానీ.. తాజా పరిస్థితుల నేపథ్యంలో అమెరికా బీ-1బీ బాంబర్ల కొనుగోలు/లీజు ప్రతిపాదనలను పరిశీలిస్తున్నారు. ఒకవేళ ఈ ఒప్పందం కుదిరితే అది చాలా పెద్ద డీల్ అవుతుంది. ఇలా.. ఎస్‌యు-57 డీల్‌ను పక్కన పెట్టడం, ఇతరత్రా పలు ఒప్పందాలు కుదుర్చుకోవడం ద్వారా అమెరికాతో సత్సంబంధాలను కొనసాగించాలని భారత్ భావిస్తోంది.

రష్యాతోనూ..

ఎస్‌యు-57 డీల్‌ను ప్రస్తుతానికి పక్కన పెట్టినప్పటికీ.. పుతిన్ పర్యటనలో కొన్ని మేజర్ ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశం ఉంది. వాటిలో ముఖ్యమైనది.. ఎస్-400 డీల్. ఇప్పటికే మన గగనతల రక్షణ వ్యూహంలో ఎస్-400లు కీలకపాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. వాటికి అదనంగా మరో ఐదు ఎస్-400 ఎయిర్ డిఫెన్స్ రెజిమెంట్ల కొనుగోలుకు ఈ పర్యటనలో ఒప్పందం కుదుర్చుకునే అవకాశం ఉన్నట్టు సమాచారం. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో.. ఎస్-400 వ్యవస్థల ద్వారా వాడిన క్షిపణుల స్థానంలో కొత్త మిస్సైళ్లను కొనుగోలు చేయడానికి భారత్ ప్రణాళికలు రచించింది. వీటితోపాటు.. ధ్వనివేగానికి ఆరు రెట్ల వేగంతో దూసుకెళ్లి 300 కిలోమీటర్ల అవతల ఉన్న లక్ష్యాలను సైతం తుత్తునియలు చేయగల అల్ట్రా లాంగ్ రేంజ్ ఎయిర్ టు ఎయిర్ మిస్సైల్స్ 'ఆర్-37ఎం యాక్స్ హెడ్'ల కొనుగోలుకు సంబంధించి కూడా రష్యాతో భారత్ కొన్నాళ్లుగా చర్చలు జరుపుతోంది. అవి కూడా పుతిన్ పర్యటనలో తుదిరూపు దాల్చే అవకాశం ఉంది. ఇలా ఒకవైపు అమెరికాతో సత్సంబంధాల కోసం ప్రయత్నిస్తూనే.. రష్యాతోనూ దీర్ఘకాలంగా కొనసాగిస్తున్న సంబంధాలను కాపాడుకునే దిశగా భారత్ అడుగులు వేస్తున్నట్టు సమాచారం.

- సెంట్రల్ డెస్క్

రాజకీయాలకు లాలూ దూరం?!

» ఆర్‌జేడీ పగ్గాలు పూర్తిగా తేజస్వికే!!

పట్నా, నవంబరు 30: బిహార్ రాజకీయాలను తన కనుసన్నల్లో నడిపిన ఆర్‌జేడీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి లాలూప్రసాద్ యాదవ్ ఇక రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉండదలిచారా? తాజా పరిణామం దానినే సూచిస్తోంది. పట్నాలోని తన పాత నివాసాలను వదిలి లాలూ ఇప్పుడు కొత్త ఇంటికి మారారు. ఆయన పట్నాలో దశాబ్దాల తరబడి రెండు నివాసాల్లో ఉండేవారు. ఇందులో అన్నే మార్గ్‌లోని ఒకటో నంబరు ఇల్లు ఆయన సీఎంగా ఉన్నప్పటి నివాసం. అలాగే సర్క్యులర్ రోడ్డులో కుటుంబ నివాసం. ఈ రెండూ ఆర్‌జేడీ కార్యకర్తలు, మద్దతుదారులు, రాష్ట్రం నలుమూలల నుంచీ తరలివచ్చే గ్రామీణులు, మంత్రులు, జర్నలిస్టులతో కళకళాడుతుండేవి. ఎవరూ అపాయింట్‌మెంట్ తీసుకునే అవసరం లేదు. తనిఖీలు కూడా ఉండేవి కావు. ఇప్పుడు మారిన కొత్త ఇంటికి ఎవరైనా సరే అనుమతుల్లేకుండా రావడానికి వీల్లేదు. రాజకీయ భేటీలకు ఆస్కారం ఉండదు. సందర్శకుల తనిఖీలను తప్పనిసరి చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న లాలూ కోలుకునేందుకు వీలుగా ఈ ఏర్పాట్లు చేసినట్లు ఆర్‌జేడీ వర్గాలు తెలిపాయి. కానీ నాయకత్వ మార్పునకు ఇది సంకేతమని, తన రాజకీయ వారసుడైన చిన్నకొడుకు తేజస్వికి పూర్తి బాధ్యతలు అప్పగించనున్నారని ఆ పార్టీ నేతలు కొందరు వెల్లడించారు.


'శీతాకాలం'.. గరంగరమే!

» నేటి నుంచి పార్లమెంటు సమావేశాలు

న్యూఢిల్లీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు శీతాకాల సమావేశాలు వాడీవేడిగా సాగే సూచనలు కనిపిస్తున్నాయి. బిహార్‌లో భారీ విజయంతో దూకుడు మీదున్న అధికారపక్షం ఒకవైపు.. ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ(సర్), ఢిల్లీ పేలుళ్లు, వాయు కాలుష్యం, అదానీ కంపెనీలో ఎల్ఐసీ పెట్టుబడులు వంటి అంశాలపై నిలదీసేందుకు ప్రతిపక్షం మరోవైపు సమావేశాలకు సిద్ధమయ్యాయి. సోమవారం ఉదయం 11 గంటలకు పార్లమెంటు సమావేశాలు ప్రారంభమై ఈ నెల 19వ తేదీ వరకు కొనసాగుతాయి. సెలవు దినాలు మినహాయించి మొత్తం 15 రోజులు సమావేశాలు జరుగుతాయి. కొత్తగా 10 బిల్లులతోపాటు నాలుగు ఆర్థిక సవరణ బిల్లులు, కాలం చెల్లిన మొత్తం 120 చట్టాలను రద్దు చేసే మరో కీలక బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టడానికి కేంద్రం సిద్ధమైంది. ప్రధానంగా అణుశక్తి, ఉన్నత విద్యా కమిషన్ ఏర్పాటు, కార్పొరేట్, బీమా, సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్, జాతీయ రహదారులు, మధ్యవర్తిత్వం- రాజీ చట్టాల సవరణ బిల్లులు ఉన్నాయి. వీటిలో అణుశక్తి రంగంలో ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని అనుమతించే అణుశక్తి బిల్లు-2025, వర్సిటీలు, ఉన్నత విద్యాసంస్థలకు స్వయం ప్రతిపత్తి, కేంద్ర విద్యా కమిషన్ ఏర్పాటు లక్ష్యంగా రూపొందించిన ఉన్నత విద్యా కమిషన్ బిల్లు-2025 కీలకమైనవి.

సజావుగా సాగేందుకు సహకరించండి: కేంద్రం

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సజావుగా సాగేందుకు సహకరించాలని విపక్షాలను కేంద్రం కోరింది. ఆదివారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అధ్యక్షతన న్యూఢిల్లీలో అఖిలపక్ష సమావేశం జరిగింది. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు, కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, అర్జున్‌రామ్ మేఘవాల్, ఎల్.మురుగన్, అనుప్రియ పటేల్‌తో పాటు జైరామ్ రమేశ్ (కాంగ్రెస్), లావు శ్రీకృష్ణ దేవరాయలు (టీడీపీ), మిథున్‌రెడ్డి (వైసీపీ), సురేశ్‌రెడ్డి (బీఆర్ఎస్), బాలశౌరి (జనసేన) సహా 36 పార్టీల నుంచి 50 మంది నేతలు పాల్గొన్నారు. భేటీ అనంతరం కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. విపక్షాలు పార్లమెంట్ సజావుగా సాగేందుకు సహకరించాలని, ఆటంకాలు సృష్టించవద్దని కోరారు. ఇక అఖిలపక్ష భేటీలో రెండు గంటలపాటు విపక్షాల డిమాండ్లు విన్నారేగానీ ఏమాత్రం స్పందించలేదని కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఉపనేత గౌరవ్ గొగోయ్ మండిపడ్డారు. ఏపీ, తెలంగాణ మధ్య నదీ జలాల అంశాన్ని పరిష్కరించాలని కోరినట్టు బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి చెప్పారు. టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు కూడా కృష్ణా జలాల వినియోగం, కేటాయింపులపై పార్లమెంట్‌లో చర్చించాలని డిమాండ్ చేశారు.



నేడు ఇండి కూటమి ప్రతినిధుల భేటీ

పార్లమెంటు సమావేశాల నేపథ్యంలో కాంగ్రెస్ సీనియర్ నేతలు ఆదివారం సాయంత్రం సోనియా గాంధీ నివాసంలో సమావేశమయ్యారు. ప్రభుత్వాన్ని ఏయే అంశాలపై నిలదీయాలనే దానిపై వ్యూహాన్ని ఖరారు చేసుకున్నారు. ఇక రాజ్యసభలో ప్రతిపక్ష నేత అయిన ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే చాంబర్‌లో సోమవారం ఉదయం ఇండి కూటమి పార్టీల ప్రతినిధులు సమావేశం కానున్నారు. సమావేశాల్లో లేవనెత్తాల్సిన అంశాలపై చర్చించనున్నారు.

నేలకేసి బాది.. కాలితో తొక్కి..

(మొదటి పేజీ తరువాయి)

చిన్నారిని కింద పడేసి కాలితో తొక్కింది. ఈ పాశవిక ఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని షాపూర్ నగర్‌లో జరిగింది. దారుణాన్ని పాఠశాల పక్కనే ఉండే కొందరు పిల్లలు సెల్‌ఫోన్‌లో రికార్డు చేసి చిన్నారి తల్లిదండ్రులకు ఇవ్వడంతో ఆయా బాగోతం బయటపడింది. విషయాన్ని పాఠశాల యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో బాధితులు ఆదివారం జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వీడియో ఆధారంగా కేసు నమోదు చేశారు. తీవ్ర గాయాలతో ఉన్న బాలికను ఆస్పత్రికి తరలించారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా ప్రాంతానికి చెందిన సంతోషి, కలియా దంపతులు తమ ఐదేళ్ల కుమార్తె ధరిత్రితో కలిసి బతుకుదెరువు కోసం నాలుగు నెలల క్రితం హైదరాబాద్‌కు వచ్చారు. సంతోషి.. షాపూర్ నగర్‌లోని పూర్ణిమా స్కూల్‌లో ఆయాగా పనిచేస్తోంది. ధరిత్రి అదే పాఠశాలలో నర్సరీ చదువుతోంది. ఈ కుటుంబం పాఠశాల ఆవరణలో ఓ గదిలో ఉంటోంది. ఆ పక్కనే మరో గదిలో అదే పాఠశాలలో ఆయాగా పని చేస్తున్న లక్ష్మమ్మ ఉంటోంది. సంతోషి.. బడి బస్సులో పిల్లలను ఇంటి దగ్గర దించి రావడం వంటి పనులను చేస్తోంది. అయితే, తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో లక్ష్మమ్మ కొన్ని రోజులుగా చిన్నారిని చితకబాదుతోంది. ఈ విషయాన్ని ఆ పాప అనేకసార్లు తల్లికి చెప్పింది. అయితే, సంతోషి ప్రశ్నించగా.. తానెందుకు కొడతానని లక్ష్మమ్మ సమాధానం చెప్పింది. ఈ క్రమంలో శనివారం సాయంత్రం తల్లి పాఠశాలలో లేని సమయంలో ధరిత్రిని లక్ష్మమ్మ దారుణంగా కొట్టింది. ఈ ఘటనను స్కూల్ పక్కన ఇంట్లో ఉన్న ఓ బాలుడు సెల్‌ఫోన్‌లో వీడియో తీసి చిన్నారి తల్లిదండ్రులకు ఇచ్చాడు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాడికి పాల్పడిన లక్ష్మమ్మను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమెపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


తీవ్ర గాయాలతో ఉన్న చిన్నారికి ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయిస్తున్న తల్లి

‘భద్రాద్రి మోడల్’ భేష్

సర్కారీ దవాఖానాల్లో అమలుకు ప్రభుత్వ యోచన.. మిగతా ఐటీడీఏ ప్రాంతాల్లోనూ

ఏజెన్సీ ఆస్పత్రులైనా.. ఏడు దవాఖానాల్లో అత్యుత్తమ చికిత్స

హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని వైద్య విధాన పరిషత్(టీవీవీపీ) ఆస్పత్రులు ప్రజారోగ్య సేవల్లో ఆదర్శ కేంద్రంగా నిలుస్తున్నాయి. జిల్లా పరిధిలో భద్రాచలం, అశ్వారావుపేట, మణుగూరు, ఇల్లందు ప్రాంతీయ ఆస్పత్రులతో పాటు పాల్వంచ, బూర్గంపహాడ్, చర్లలలో సామాజిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. ఒకప్పుడు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్య సేవలు తీవ్ర సంక్షోభంలో ఉండేవి. ఇప్పుడు అత్యుత్తమ సేవలు అందిస్తూ కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రశంసలు అందుకుంటున్నాయి. ఇటీవలే కేంద్రం నుంచి వచ్చిన జాతీయ కామన్ రివ్యూ మిషన్(సీఆర్‌ఎమ్) బృందం అక్కడి ఆస్పత్రుల పనితీరును ప్రశంసించడంతో ఒక్కసారిగా అందరి దృష్టిని ఆకర్షించాయి. దీంతో ఈ విజయవంతమైన ‘భద్రాద్రి మోడల్’ను రాష్ట్రంలోని మిగతా సర్కారీ దవాఖానాల్లో అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు టీవీవీపీ కమిషనర్ డా. అజయ్ కుమార్ జిల్లాలోని ఆస్పత్రులను సందర్శించి సర్కారుకు నివేదిక అందించారు. మెరుగైన వైద్య సేవలందిస్తున్నందుకు గాను డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రవికుమార్‌ను ఆదివారం హెల్త్ సెక్రటరీ క్రిస్టినా సచివాలయానికి పిలిపించి ప్రత్యేకంగా అభినందించారు.

గణనీయంగా పెరిగిన ఓపీ

.. మెరుగైన వైద్య సేవలు, ఆధునిక వసతుల కారణంగా టీవీవీపీల్లో ఔట్ పేషెంట్ల(ఓపీ)ల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. క్లిష్టమైన కేసులను కూడా ఇక్కడి వైద్యులు ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా పరిష్కరిస్తుండడంతో, ప్రజల్లో కూడా మరింత నమ్మకాన్ని పెంచింది. ప్రస్తుత జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ , డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రవిబాబు నిరంతర పర్యవేక్షణ, టీవీపీపీ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో ఈ మార్పు సాధ్యపడిందని వైద్యులు చెబుతున్నారు. ఇటీవల ఐఏఎస్ ఆఫీసర్లు అనుదీప్ దురిశెట్టి, జితేష్ పాటిల్‌తో పాటు ఐటీడీఏ పీఓ రాహుల్ వారి సతీమణులను ప్రభుత్వాసుపత్రుల్లో కాన్పు చేయించి, ఆదర్శంగా నిలిచారు. తాజాగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కూడా ఇల్లెందు ఆస్పత్రి సేవలపై సంతృప్తిని వ్యక్తం చేశారు. అధునాతన వైద్య పరికరాల సంఖ్య పెంచడం ద్వారా క్లిష్టమైన రోగ నిర్ధారణతో పాటు సరైన సమయంలో చికిత్సలను అందించడం సులభతరం చేసింది. గతంలో జిల్లాలో 30 డయాలసిస్ మెషీన్లు ఉండగా, ప్రస్తుతం అవి 53కు పెరిగాయి. మూడు బ్లడ్ స్టోరేజ్ సెంటర్లు ఉండగా.. ఇప్పుడు వాటి సంఖ్య ఆరుకు పెరగడంతో తలసేమియా, అనీమియా బాధితులకు, గర్భిణీలకు వరంగా మారింది. గర్భస్థ శిశువు ఎదుగుదలలో లోపాలను గుర్తించే అత్యాధునిక ‘టిఫా స్కాన్’ యంత్రాలు జిల్లాలోని ప్రతి ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయి. మోకీలు మార్పిడి ఆపరేషన్లు, క్రిటికల్ కండీషన్‌లో ఉన్న చిన్నారులకు ఎన్‌ఐసీయూలో చికిత్సలు అందుతున్నాయి. మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా వైద్యులు, సిబ్బంది మరింత సమర్థంగా పనిచేసేందుకు వీలు కలిగిందని డీసీహెచ్ తెలిపారు. ఖరీదైన చికిత్సల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లే పని లేకుండా ప్రజారోగ్యానికి పెద్ద ఊరట లభించింది. సిబ్బంది కొరత ఉన్నప్పటికీ, ఉన్న వనరులతోనే నాణ్యమైన సేవలు అందిస్తూ భద్రాద్రి జిల్లా ఆసుపత్రులు ‘శభాష్’ అనిపించుకుంటున్నాయి.

“ చర్ల మండలం జిపి పల్లికి చెందిన రంగారావు అనే వ్యక్తి కిడ్నీ, లివర్ ఫెయిల్యూర్ కారణంగా తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో లక్షలు ఖర్చు చేసి వైద్యం చేయించినా.. చివరకు డాక్టర్లు ఇక లాభం లేదని చేతులెత్తేశారు. చర్ల సీహెచ్‌సీ వైద్యులు వారం పాటు వైద్యం చేసి రంగారావును బతికించారు.”

“మరో వ్యక్తి పారాక్వాట్ అనే ప్రమాదకర గడ్డి మందు తాగాడు. ఆ మందు తాగితే 99 శాతం బతకడం కష్టం. కానీ అశ్వారావు పేట సీహెచ్‌సీ వైద్యులు ఆ వ్యక్తికి నెల రోజుల పాటు వైద్యం అందించి ప్రాణాలు కాపాడారు. ఇటువంటి కేసులు ప్రైవేటులో వైద్యం చేయిస్తే కనీసం రూ. 20 లక్షల వరకు ఖర్చు వస్తుంది. ఇప్పుడా ఆ ఆస్పత్రికి గడ్డిమందు తాగిన కేసుల్ని ఏకంగా మంత్రులు సైతం బతికించమని పంపుతున్నారు.”

“భద్రాచలం సర్కారీ దవాఖానాలో ఓ నవజాత శిశువు కేవలం 800 గ్రాముల బరువుతో జన్మించింది. అక్కడి ఎస్ఎన్‌సీయూ (స్పెషల్ న్యూబోర్న్ కేర్ యూనిట్)లో ఉంచిన వైద్యులు.. రెండు నెలల పాటు ఆ శిశువుకు వైద్యం చేసి కాపాడారు. ఇదొక్కటే కాదు అక్కడికి వచ్చే ఎన్నో క్లిష్టమైన పసిపిల్లల కేసుల్ని ధృఢ సంకల్పంతో నాణ్యమైన చికిత్స అందించి ప్రాణాలు కాపాడారు.”


చర్ల ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్న రోగులు


చర్ల ఆస్పత్రిలో ఓపీలో భారీ క్యూ,

ఆస్పత్రుల్లో ప్రగతి ఇలా..

- ఇల్లందు, అశ్వారావు పేట ఆస్పత్రుల్లో నెలకు 50కి పైగా డెలివరీలు
- మణుగూరులో ఒకప్పుడు 8 ఉండే ప్రసవాల సంఖ్య ఇప్పుడు ఏకంగా 100కిపైగా నమోదు
- చర్ల ఆస్పత్రిలో ఆరు ఉండే డెలివరీలు నేడు 25కు పైగా రికార్డు
- ఇల్లందు ఆస్పత్రిలో ఓపీల సంఖ్య 100 నుంచి 900 పెరుగుదల
- అశ్వారావుపేటలో రోజు 70 నుంచి 400కు చేరిన ఓపీలు
- మణుగూరులో 600లకు పెరగగా, చర్ల ఆస్పత్రిలో 300 వరకు ఓపీలు


అతిథిగృహాన్ని ప్రారంభిస్తున్న తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవి.. చిత్రంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, దాత ఏజే శేఖర్

తిరుమలలో ‘శ్రీభాగ్య’ అతిథిగృహం ప్రారంభం

» రూ.25 కోట్లతో 13 గదులతో నిర్మాణం

తిరుమల, నవంబరు30(ఆంధ్రజ్యోతి): తిరుమలలో రూ.25 కోట్లతో నిర్మించిన ‘శ్రీభాగ్య’ అతిథిగృహాన్ని ఆదివారం తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి ప్రారంభించారు. టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు, మాజీ ఎల్‌ఏసీ చెన్నై చైర్మన్ ఏజే శేఖర్ ఈ అతిథిగృహాన్ని నిర్మించారు. ఇందులో 13 గదులను నిర్మించారు. అలాగే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ కూడా అతిథిగృహాన్ని సందర్శించి నిర్మాణాన్ని పరిశీలించారు. త్వరలోనే ఈ అతిథిగృహం భక్తులకు అందుబాటులోకి రానుంది.

కొండగట్టులో భారీ అగ్నిప్రమాదం

» మంటల్లో బుగ్గి అయిన 20కి పైగా దుకాణాలు



మల్యాల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కొండగట్టు దిగువ ప్రాంతంలో శనివారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం సంభవించి 20కి పైగా బొమ్మల దుకాణాలు మంటల్లో బుగ్గి అయ్యాయి. దిగువ కొండగట్టులోని అభయాంజనేయస్వామి విగ్రహం సమీపంలో రహదారికి ఇరువైపులా కొందరు స్థలం అద్దెకు తీసుకొని దుకాణాలు ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందుతున్నారు. షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాపించి నిమిషాల వ్యవధిలోనే ఇరవైకి పైగా దుకాణాలు మంటల్లో చిక్కుకున్నాయి. దుకాణాల్లో నివాసముంటున్న కుటుంబాలు కట్టుబట్టలతో బయటకు పరుగులు తీశారు. కళ్లెదుటే సర్వం బుగ్గి కావడంతో వారి రోదనలు మిన్నంటాయి. ఘటనా స్థలాన్ని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పరిశీలించారు. బాధిత కుటుంబాలకు తక్షణ సాయం కింద రూ.20 వేలతోపాటు సెర్ప్ ద్వారా వడ్డీ లేని రూ.5లక్షల వరకు రుణాలు అందించాలని కలెక్టర్ సత్యప్రసాద్‌కు సూచించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి

» మరో ఐదుగురికి తీవ్ర గాయాలు

నేరడిగొండ/కరీంనగర్ క్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ఓ బాలుడు సహా నలుగురు మృతిచెందారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం బోథ్ క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న బాలుడు డి.నిసాద్(4), బస్సు క్లీనర్ రవి సింగ్ (50) అక్కడికక్కడే మృతి చెందారు. బాలుడి తల్లిదండ్రులు కరిష్మా, సోనుకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ ఇమ్రాన్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అదేరోజు రాత్రి కరీంనగర్ జిల్లా కేంద్రం సమీపంలోని నగునూర్-జూబ్లీనగర్ రోడ్డుపై జరిగిన ప్రమాదంలో మరో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. సుమారు 7.30 గంటల సమయంలో రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొనగా, వాటిపై ఉన్న నలుగురు వ్యక్తులు రోడ్డుపై పడిపోయారు. అదే సమయంలో వచ్చిన ధాన్యం లారీ రోడ్డుపై పడి ఉన్న నలుగురి పైనుంచి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం సాంబయ్యపల్లికి చెందిన రైతు కొమ్మిడి దేవేందర్ రెడ్డి(60), కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లికి చెందిన దూడం రఘురాం(33) అక్కడికక్కడే మృతి చెందారు. దేవేందర్ రెడ్డి భార్య హైమావతి, చామనపల్లికి చెందిన తొంటి రమేశ్ తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

తమిళనాట ఘోర రోడ్డు ప్రమాదం

» రెండు బస్సుల ఢీ.. 11 మంది దుర్మరణం

చెన్నై, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులో రెండు ప్రభుత్వ బస్సులు ఢీకొని తొమ్మిదిమంది మహిళలు సహా 11 మంది దుర్మరణం పాలయ్యారు. మరో 40 మంది గాయపడ్డారు. క్షతగాత్రులలో కొందరి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు వైద్యులు ప్రకటించారు. శివగంగ జిల్లా కారైక్కుడి నుంచి దిండుగల్‌కు బయలుదేరిన బస్సు, తిరుప్పూర్ నుంచి కారైక్కుడికి బయలుదేరిన మరో బస్సు సమత్తువపురం వద్ద ఆదివారం సాయంత్రం ఎదురెదురుగా ఢీకొన్నాయి. రెండు వాహనాల ముందు భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. రెండు బస్సుల డ్రైవర్లు, వారి వెనుక భాగాల్లో కూర్చున్న 9 మంది మహిళలు సహా మొత్తం 11 మంది అక్కడికక్కడే మరణించారు. మరో 40 మంది గాయపడ్డారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది క్షతగాత్రులను తిరుపత్తూర్, కారైక్కుడి ప్రభుత్వాసుపత్రులకు తరలించారు.

పోలీసు వ్యవస్థ-2047పై మార్గదర్శక ప్రణాళిక

» డీజీపీలు, ఐజీపీల సదస్సులో ఆవిష్కరించిన మోదీ

» నగర పోలీసింగ్ వ్యవస్థను పటిష్టం చేయాలని సూచన

రాయ్‌పూర్, నవంబరు 30: దేశంలో 2047 నాటికి పోలీసు వ్యవస్థ దృక్పథానికి సంబంధించిన సమగ్ర మార్గదర్శక ప్రణాళికను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆవిష్కరించారు. ఛత్తీస్‌గఢ్ రాయ్‌పూర్ ఐఐఎంలో జరిగిన అన్ని రాష్ట్రాల డీజీపీలు, ఐజీపీల 60వ వార్షిక సదస్సులో ఆయన దీన్ని ఆవిష్కరించారు. వికసిత్ భారత్- భద్రతా కోణాలు అనే అంశంపై ప్రధాని ప్రసంగించారు. పోలీసుల వృత్తి నైపుణ్యాలు, ప్రతిస్పందనలపై ప్రజల దృక్పథాన్ని మార్చేలా వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. వికసిత్ భారత్ లక్ష్యాల సాధనలో భాగంగా ఇది కీలకమన్నారు. కొత్త నేర చట్టాలపై ప్రజల్లో అవగాహన తీసుకురావాలన్నారు. నగర పోలీసింగ్ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని సూచించారు. అంతర్గత భద్రత, తీర ప్రాంత భద్రతపై కొత్త టెక్నాలజీని ఉపయోగించే ఉమ్మడి విధానాలు అవసరమని చెప్పారు. నిషేధిత సంస్థలపై ఓ కన్నేసి ఉంచాలన్నారు. మావోయిస్టుల ప్రభావం నుంచి విముక్తి పొందిన ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధి జరిగేలా చూడాలని సూచించారు. మాదక ద్రవ్యాలను, వ్యవస్థీకృత నేరాలను కట్టడి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రధాని సూచించారు. గోప్యంగా, కెమెరాలు అనుమతించని వాతావరణంలో జరిగిన ఈ సదస్సుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్, కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ తదితరులు హాజరయ్యారు.

అధిక పింఛనుపై కేంద్రం ఆదేశాలు బేఖాతర్!

సుప్రీం తీర్పునూ పట్టించుకోని ఈపీఎఫ్‌వో

కేంద్ర కార్మిక శాఖ లేఖతో వెలుగులోకి

ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ నిర్వాకం

న్యూఢిల్లీ, నవంబరు 30: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో).. చందాదారులకు అధిక పింఛను విషయంలో ఉదాసీనంగా వ్యవహరించిందా? పీఎఫ్ అధిక పింఛనుపై కేంద్రం ఆదేశాలను బేఖాతరు చేసిందా? సుప్రీంకోర్టు తీర్పును కూడా పట్టించుకోలేదా? అంటే ఈపీఎఫ్‌వోకు కేంద్ర కార్మిక శాఖ రాసిన లేఖ అవుననే చెబుతోంది. 2023 మే 31న కేంద్ర కార్మిక శాఖ రాసిన లేఖతో ఈ విషయం వెల్లడైంది. అధిక పింఛనుకు సంబంధించిన ఉద్యోగులు, యాజమాన్యాల చెల్లింపుల ప్రక్రియను అడ్డుకునేలా ఈపీఎఫ్‌వోనే అడ్డంకులు సృష్టించుకుందని సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్‌కు కేంద్ర కార్మిక శాఖ కార్యదర్శి ఒకరు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఉద్యోగులు పదవీ విరమణ చేయడానికి ముందు, వారి 60 నెలల సగటు వేతనాన్ని ఆధారంగా చేసుకొని అధిక పింఛన్‌ను లెక్కించాలని కేంద్ర కార్మిక శాఖ మంత్రి స్పష్టంగా ఆదేశాలు జారీ చేశారని కూడా గుర్తుచేశారు. “అధిక పింఛనుకు సంబంధించి ఈపీఎఫ్‌వో స్వయంగా రూపొందించిన నమూనాలతోనే సమస్య అని స్పష్టమవుతోంది. 1. అధిక పింఛనుకు చెల్లింపుల కోసం ఉద్యోగులు/యాజమాన్యాలు దరఖాస్తు చేసుకోవడం. 2. దానికి ఈపీఎఫ్‌వో అనుమతి ఇవ్వడానికి సంబంధించి సంస్థ వివరణ ఇవ్వలేదు. అలాగే అధిక పింఛను కోసం చెల్లింపులు చేసుకోవడానికి ఈపీఎఫ్‌వో కార్యాలయాలు వారికి ఎలాంటి అనుమతులూ ఇవ్వలేదు” అని లేఖ గుర్తుచేసింది. ఈపీఎఫ్‌వో నిర్వహణా లోపంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని పేర్కొంది. ఈపీఎఫ్‌వో తాను చేసిన తప్పులనే ప్రస్తుతం ఆధారంగా చేసుకొని అధిక పింఛను చెల్లింపులకు అర్హత లేదంటూ నిరాకరిస్తోందని ఆరోపించింది.



సుప్రీం ఆదేశాలనూ పక్కన పెట్టింది..

పీఎఫ్ చందాదారుల్లో అర్హులకు అధిక పింఛను ఇవ్వాలంటూ సుప్రీంకోర్టు 2022, నవంబరు 4న తీర్పు ఇచ్చింది. కానీ, అధిక పింఛను కోసం మే 2023 వరకు ఈపీఎఫ్‌వోకు 15.9 లక్షల దరఖాస్తులు రాగా.. అందులో ఒక్కరిని కూడా సంస్థ అర్హులుగా పేర్కొనలేదని కేంద్రం లేఖలో గుర్తుచేసింది. మొత్తం మీద అటు కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను, ఇటు సుప్రీంకోర్టు తీర్పునూ ఈపీఎఫ్‌వో పట్టించుకోలేదని స్పష్టం చేసింది.

అప్పులు తీర్చలేక చచ్చిపోతున్నా!

» ఖమ్మం జిల్లాలో కౌలు రైతు ఆత్మహత్య

» పురుగు మందు తాగుతూ సెల్ఫీ వీడియో


బానోతు వీరన్న (ఫైల్)

నేలకొండపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ‘ఆరుగాలం పండించిన పంటలకు మద్దతు ధర రావట్లేదు. నేను చేసిన అప్పులు తీర్చే పరిస్థితి కనిపించడం లేదు. గత్యంతరం లేని పరిస్థితిలో ఆత్మహత్యే నాకు శరణ్యం.’ అంటూ ఓ రైతు పురుగు మందు తాగుతూ సెల్‌ఫోన్‌లో సెల్ఫీ వీడియో తీసుకుంటూ ఆత్మహత్య చేసుకున్నాడు. రైతుల పంటలకు మద్దతు ధరను ఇవ్వాలని అదే వీడియో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాడు. ఈ ఘటన ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం శంకరగిరితండాలో శనివారం జరిగింది. తండాకు చెందిన కౌలు రైతు బానోతు వీరన్న (28) పదెకరాలు కౌలుకు తీసుకుని వాణిజ్య పంటలైన మిర్చి, పత్తి, చెరుకును సాగు చేస్తున్నాడు. పంటల సాగు కోసం సుమారు రూ.15 లక్షలు అప్పు చేశాడు. పంట చేతికొచ్చేసరికి ధరలు లేకపోవడం.. మార్కెట్‌లో డిమాండ్ లేకపోవడంతో.. అప్పులు తీర్చేమార్గం లేక.. జీవితంపై విరక్తితో శనివారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. బంధువులు వీరన్నను చికిత్స కోసం ఖమ్మంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో.. ఆదివారం తెల్లవారుజామున వీరన్న మృతి చెందాడు. కాగా, రైతుల పరిస్థితి ముఖ్యంగా కౌలు రైతుల పరిస్థితి దారుణంగా ఉందని సెల్ఫీ వీడియోలో వీరన్న ఆవేదన వ్యక్తం చేశాడు. తాను తెచ్చిన అప్పులు తీర్చే దారి లేకనే.. గత్యంతరం లేక ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నాడు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 199 కిలోల గంజాయి పట్టివేత

» దీని విలువ రూ.99.83 లక్షలు

టేకులపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి కారులో రాజస్థాన్‌కు తరలిస్తున్న రూ.99.83 లక్షల విలువైన 199.47 కిలోల గంజాయిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఆదివారం ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను వెల్లడించిన వివరాల ప్రకారం.. టేకులపల్లి సీఐ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం టేకులపల్లి మండలం సాయన్నపేట ఎక్స్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. కొత్తగూడెం వైపు నుంచి వచ్చిన కారులోని వ్యక్తి పోలీసులను గమనించి వేగం పెంచడంతో అదుపు తప్పి ఓ సిమెంటు దిమ్మెను ఢీకొట్టి ఆగిపోయింది. పోలీసులు వెళ్లి కారును తనిఖీ చేయగా.. డిక్కీ, మధ్య సీటులో 100 గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. కారు, గంజాయితోపాటు రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడు రాజస్థాన్‌కు చెందిన లాల్‌సింగ్ చౌహాన్ గతంలోనూ గంజాయి తరలిస్తూ ఏపీ పోలీసులకు పలుమార్లు చిక్కాడు. కాగా,

గంజాయి డాన్ కామాక్షి అరెస్ట్

ఏపీలోని నెల్లూరు జిల్లాలో గంజాయికి వ్యతిరేకంగా పోరాటం చేసిన వామపక్ష నేత పెంచలయ్య హత్య కేసులో ప్రధాన నిందితురాలు, గంజాయి డాన్ అరవ కామాక్షిని అరెస్ట్ చేశారు. ఆమె ఇంట్లో అక్రమ రవాణా కోసం దాచిన 25 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.


లొంగిపోయిన మావోయిస్టులు

37 మంది మావోయిస్టుల లొంగుబాటు

వారిలో 12 మంది మహిళలు.. 27 మందిపై 65 లక్షల రివార్డు

న్యూఢిల్లీ/ రాయిపూర్/ దంతేవాడ/ చర్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడ జిల్లాలో 37 మంది మావోయిస్టులు ఆదివారం లొంగిపోయారు. వారిలో 12 మంది మహిళలున్నారు. లొంగిపోయిన వారిలో 27 మందిపై రూ.65 లక్షల రివార్డు ఉంది. ఈ సందర్భంగా జరిగిన మీడియా సమావేశంలో దంతేవాడ ఎస్పీ గౌరవ్ రాయి మాట్లాడుతూ ఆదివారం లొంగిపోయిన వారిలో కుమాలి అలియాస్ అనిత మండవి, గీత అలియాస్ లక్ష్మి మడకం, రంజన్ అలియాస్ సోమ మాండవి, భీమ అలియాస్ జహజ్ కల్మలలో ఒక్కొక్కరిపై రూ.8 లక్షల రివార్డు ఉందన్నారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం చేపట్టిన ‘పూన మార్గెం (పునరావాసం నుంచి సామాజిక పునః సమ్మేళనం)’ కార్యక్రమంలో భాగంగా వీరంతా లొంగిపోయారన్నారు. వీరందరికీ తక్షణ సాయంగా రూ.50 వేల నగదును అందిస్తారు. వ్యవసాయ భూమి కేటాయింపు, నైపుణ్య అభివృద్ధిలో శిక్షణనిస్తారని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల చొరవతో రాష్ట్ర వ్యాప్తంగా గత 24 నెలల్లో అగ్ర నేతలు సహా 2200మందికి పైగా మావోయిస్టులు జన జీవన స్రవంతిలో కలిశారని తెలిపారు. గత 20 నెలల్లో దంతేవాడ జిల్లాలోనే 508 మందికి పైగా మావోయిస్టులు లొంగిపోగా, వారిలో 165 మందిపై రివార్డు ఉందన్నారు. మరోవైపు.. ఏపీలోని శ్రీకాకుళం జిల్లా వజ్రపు కొత్తూరు మండలం బాతుపురం గ్రామానికి చెందిన మావోయిస్టు నేత చెల్లూరు నారాయణరావు అలియాస్ సురేశ్ పోలీసు వలయం ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. కాగా, మావోయిస్టులకు పెట్టని కోటగా ఉన్న అబూజ్‌మడ్‌పై పట్టు సాధించిన ఐటీబీపీ జవాన్లు అదే ప్రాంతంలో నారాయణపూర్ జిల్లా కేంద్రానికి 140కి.మీ దూరంలోని లంక గ్రామంలో 44వ బెటాలియన్ ఆపరేషనల్ బేస్‌ను నవంబరు 28న ఏర్పాటు చేశారు.

అమ్మా.. నువ్వు అమ్మవేనా?

రోజుల బిడ్డను ముళ్లపొదల్లో పారేసిన కన్నతల్లి!

» పురిట్లోనే చనిపోయిందని భర్తకు చెప్పిన వైనం

» పొదల్లో పసికందును గుర్తించిన స్థానికులు

» ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శిశువు మృతి

» భార్య, ఆమె తల్లిపై పోలీసులకు భర్త ఫిర్యాదు

నారాయణపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లాలో అత్యంత అమానవీయ ఘటన జరిగింది. తాను ప్రసవించిన ఆడపిల్ల పురిట్లోనే చనిపోయిందని భర్తకు చెప్పిన ఓ మహిళ.. ఆ పసికందును ముళ్లపొదల్లో పారేసి అమ్మతనానికి మచ్చ తెచ్చింది. భూమ్మీదకు వచ్చిన ఆరు రోజుల తర్వాత ముళ్ల పొదల్లో అపస్మారక స్థితిలో కనిపించిన ఆ శిశువు చికిత్స పొందుతూ మరణించింది. నారాయణపేట జిల్లా, ధన్వాడకు చెందిన బాల నర్సింహులు, అప్పక్‌పల్లికి చెందిన సుతారి భారతి ప్రేమించుకుని పెళ్లి చేసుకున్నారు. నర్సింహులు దంపతులకు ఇప్పటికే కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉండగా దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో మరో మారు గర్భం దాల్చిన భారతి ప్రసవం కోసం పుట్టింటికి వెళ్లింది. నవంబరు 24న నారాయణపేట ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో భారతి ఆడబిడ్డను ప్రసవించింది. కానీ పుట్టిన బిడ్డ చనిపోయిందని భారతి ఆ మరుసటి రోజు తన భర్తకు ఫోన్ చేసి చెప్పింది. అనుమానించిన నర్సింహులు నవంబరు 29న నారాయణపేట ఆస్పత్రికి వచ్చి విచారణ చేయగా.. భారతి పుట్టిన బిడ్డతో కలిసి నవంబరు 26న డిశ్చార్జి అయినట్టు తేలింది. దీంతో భార్య, అత్తపై నర్సింహులు నారాయణపేట రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు వారిని విచారించగా తల్లీకూతుళ్లు సరైన సమాధానాలు ఇవ్వలేదు. ఈ క్రమంలో అప్పక్‌పల్లి శివారులోని కాటన్‌మిల్లు వద్ద ముళ్ల పొదల్లో ఓ పసికందును చూసిన స్థానికులు అంబులెన్స్‌ను పిలిపించారు. అపస్మారక స్థితిలో ఉన్న శిశువును అంబులెన్స్ సిబ్బంది నారాయణపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. కానీ, ఆ పాప ఆదివారం సాయంత్రం మరణించిం ది. అయితే, ఆ ఆస్పత్రిలో పనిచేస్తున్న భారతి బంధువు.. పసికందు ఒంటిపై ఉన్న వస్త్రాన్ని గుర్తించింది. దాని ఆధారంగా ముళ్లపొదల్లో దొరికిన ఆ పసికందు భారతి బిడ్డేనని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ విషయంలో పూర్తి స్పష్టత రావాల్సి ఉంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

కవిత్వం ముందు బతుకు బోనమెత్తిన కవి



"నా విన్నవి కన్నవి విన్నవించగా మాటలకై వెదుకాడగబోతే అవి..." – (శ్రీశ్రీ 'కవితా ఓ కవితా' నుంచి)

1.

ఈ విశ్వం ఒక బిందువు నుండి పెను విస్ఫోటనంతో (big bang) ఉద్భవించిందని నేటి శాస్త్రవేత్తల నమ్మకం. కొంత మంది శాస్త్రవేత్తలు అనూహ్యంగా విస్తరిస్తోన్న ఈ విశ్వం మళ్ళీ సంకోచించి బిందువులోకే నిష్క్రమిస్తుందని కూడా నమ్ముతారు. సిద్ధార్థ గారి కొత్త కవితా సంపుటి 'మల్లెల తీర్థం – మహాఖననం' చదవగానే భావావేశంతో ఉక్కిరిబిక్కిరయి కొన్నాళ్ళకు నిమ్మళించి ఆలోచించగా నాకు ఈ విషయమే జ్ఞప్తికి వచ్చింది. ఎందుకంటే జీవితాన్ని ఆవిష్కరించుకోవడం వ్యాకోచం వంటిదయితే, ఆవిష్కృతానంతర మానసికస్థితి సంకోచం వంటిది.

ఈ సంపుటిలో సిద్ధార్థ జీవంతమైన ఆకుపచ్చని భావాలు సిద్ధార్థ జీవంతమైన తెలంగాణా మాండలికంతో పాలూతేనెల వలె కలిసిపోయాయి. కవి visceral ప్రతీకల బలిమీ, అంత రంగపు నైర్మల్యమూ దేహాత్మల్లాగ కలిసి మనగలగడమొక wonder! ఎప్పుడో ప్రాచీనకాలంలోనే దేవతలైన అమ్మ తల్లులు అమ్మలై తల్లులై ఈ సంపుటిలో పునర్దర్శనమిచ్చి మన వారౌతారు. పాఠకులు తాము మెడ పైకెత్తి అంతెత్తు చూస్తేనే తప్ప కనిపించని archetypes ఈ స్త్రీలు, అలాగే పక్కకు తిరిగి చూసినా గతుక్కుమనిపించే స్వబాంధవులు. ఈ సంపుటి టైటిల్, "మల్లెల తీర్థం–మహాఖననం" అనడంలో Freudian దేవతాద్వయి – Eros & Thanatos – కదిలించిన శక్తులు పాఠకుల మనసుల్లో ఛాయలవలే జంటనృత్యాలు చేస్తూ వర్త మానం మొదలుకొని భవిష్యత్పథం మీదుగా సాగిపోతాయి. ఇది కవి మనకు అందిచ్చిన చేయూత.

సిద్ధార్థ గొంతు అనన్యం. ఏ సమకాలీన కవీ ఇటువంటి డిక్షన్‌తో ఇటువంటి వీధి గాలిలో తేలుతూన్న nuancesని ఒడిసిపట్టుకొని కవిత్వంగా మలచలేదు. జీవన వాస్తవికతను ఛిద్రశకలాల్లో ఆవిష్కరించిన కవులు చాలామందే ఉన్నారు గానీ సిద్ధార్థలా ethnic pluralismను గుర్తిస్తూ గుర్తింపు నిస్తూ పదపదానా గుంపు అస్తిత్వవేదనను ప్రశ్నలతో వెతుక్కుని వాస్తవికతను వడబోసి అందీ అందని భాషను దాని పరిమితుల్ని పునర్విచించిన వారు మనకు లేరు. ఈ సంపుటిలో ఆధునికానంతరవాదులకు కావలసినంత ఉంది – Self-reflexivity, fragmentation సరైన మోతాదులో కనిపిస్తాయి. Intertextuality తళుక్కుమంటుంది, కొన్ని స్వరాల్ని వినిపిస్తుంది. సిద్ధార్థగారు వాదాల వెనుకా ఈ post-modern మాయాజలం వెనుకా నక్కి దాక్కోలేదు. జీవితాన్ని గౌరవిస్తూ బతుకు బోనాన్నే కవిత్వం ముందు ఎత్తేరు.

2.

సిద్ధార్థ కంటి ముందే నగరం మహానగరమయింది. మహానగరం గల్లీల్ని, పల్లెల్ని మింగేసి భూమిని తప్ప దేనినీ జీర్ణించుకోలేక మనుషుల్ని విసర్జించేసింది. చెట్టూ చేమా చెరువూ దొరువూ మాయమయ్యాయి. నగరం గర్భంలోనే మనిషి మర మనిషయ్యాడు. ఈ dehumanizing urbanizationలో "కోకిలలకు వనాల్లేక", "పిట్టలకు గూడు లేక", "కౌగిలికి దేహమూ లేక" బాల్యాన్ని గడిపిన కవి తన చుట్టూ ఉన్న తనవారిని చూస్తూ తనను చూస్కుంటూ ఆక్రందిస్తూ ఏరుకున్న existential scraps ఈ కవిత్వమని తనే చెప్పుకున్నారు, స్వీయలిఖితమైన మున్నుడిలో. అస్తిత్వం అంటూ ఒకటుందా అనే సంశయమూ కవికి కలిగినట్టుంది. దాన్ని గురించి ఏ తర్జన భర్జనలు పడ్డారో గాని అదే మున్నుడిలో "అమ్మ గుండె చప్పుడును పిల్ల మాయి నుంచి అతికించి తెచ్చుకున్న నీ సోయి ఎప్పటికీ నీది కాదు" అన్న కవి రచనల్లో visceral ప్రతీకలు ('మాయి' అంటే placenta) మిక్కిలిగా కనిపించడం మానవాళిది ఒకే అస్తిత్వమనీనూ వ్యక్తులు తమ తమ time & spaceలో ఒకే తారను మీటుతూ అస్తిత్వచింతననూ అన్వేషణనూ అలా కొనసాగించాల్సిందే అన్న శాపం వంటి వరాన్ని తోడు తీసుకొని పిడికెడు బూడిదయ్యేదాకా బతకాలి అనీనూ చెప్పినట్టే. ఈ స్పృహ ఈ సంపుటిలో పదే పదే పాఠకులను ఆవహించేదే. "నువ్వు మాత్రం చెప్పకుండానే ఒక రాత విప్పినవ్/ కొసవరకల్ల కర్మము తప్పదని/ చేసిన తప్పులు గోశిలవెట్టుకుని/తోకవీకాలెవ్వడైనా... అని" అన్న స్పృహ, "You are condemned to exist", అన్న దేవత దీవెన.



సిద్ధార్థ గొంతు అనన్యం. ఏ సమకాలీన కవీ ఇటువంటి డిక్షన్‌తో ఇటువంటి వీధి గాలిలో తేలుతూన్న nuances ని ఒడిసిపట్టుకొని కవిత్వంగా మలచలేదు.

మహాఖననం అన్నమాట కేవలం మృత్యువుకే సంకేతం కాదు, తవ్విపారెయ్యడం అర్బన్ అమానవీయ ఆక్రమణ. "నీ వూరు లేదు. కాగితాలలో ఉరికొయ్యకు వేలాడుతూంది", లీగల్ కాగితాలే ఉరికొయ్యలు. "మోసపు వినయం మోసపు కారుణ్యం మోసపు లంజడితనం.../సినిమాను తిని సినిమాను తాగి సినిమాను పిట్ చెయ్యడం... కరెన్సీ రతి...", ఇదీ మహానగరంలో ఇవాళ్టి రియాలిటీ. "మా ఊరికి చేరుకోలేనిప్పుడు దారి పరాయిదయ్యింది", ఇది కవి పరాయీకరణ. ఈ అర్బన్ భూతానికి మంత్రోపచారంలా సాగే ప్రచారాల బాకా ఇలా ఉంటుంది, "ప్రచారమంతా/నగరాన్ని కరిచి/ రేబిస్ సోకి.. బతుకంతా పిచ్చెక్కి పాడుతుంది/ మీడియా... దాండియా ఆడుతుంది/ ఎవ్వని సిన్మా వానికి/ ఎవ్వని పంకా వానికి/ పగలగొట్టే.. తల్లి.. పగలగొట్టు/ నన్ను నీ కడుపులోకి మళ్ళీ తీసుకొని/ తగలబెట్టు.", అని అన్నప్పుడు ఎందుకో సీత రాముడ్ని విడిచి భూమాత గర్భంలోకే వెళ్ళిపోయిన వైనం గుర్తొస్తుంది. "కడియాలకు పట్నం పాము సుట్టుకుంది/ బొట్టునూ బట్టనూ కాటేసింది/ ఏం బతుకయ్యిందిరా కొడకా/ మనమంతా బతికే ఉన్నామా/నీ దర్మంగ జెప్పు/", అన్నదొక తల్లి కవితో, మహానగరంలో బతుకీడ్వలేక.

"చిన్న దెబ్బకే నెత్తొరోడే ప్రతీకను.", అనుకున్న కవికి చుట్టూ ఉన్న తనవారే సగం బలం, దెబ్బ తగుల్తే పరుగెత్తి వచ్చి మందు వేసే దిక్కూ మొక్కూ వారే. "కష్టాలను పాములై పెంచుకుని/ కాటేయించుకుంటావ్/ విషమే ఎక్కదేందే నీకు/ మత్తెక్కించే గాయం నీ పొయెమ్", విషాదానికి ఉన్నది వికర్షణ కాదు, ఏదో ఆకర్షణే. దీన్ని కవిత్వీకరించడం కవుల బలహీనతో బలమో గానీ, ఏ కవీ విషాదాన్ని ప్రస్తావించకుండా ఉండలేడు. "నీలాంటోడు ఒకడో.. ఎవడో ఉంటాడు/కొన్ని దినాలల్ల/ వాడూ పోతాడు". ఇది కవిలోని మృత్యునిర్లిప్తతా లేక, genetic continuity ఉన్నదనే భరోసానా? మృత్యువు ఎలాగూ తప్పదు కనుక మృత్యుస్పృహను మాలిమి చేసుకోవడమే మంచిది. "ఏయ్... ఆగాగు నిన్నే.../ వెళ్ళకు... ముఖం తిప్పుకోకు/ కిటికీని సగం మాత్రమైనా తెరువ్/ బార్లా తెరవడం... చావు/ అది అందరిదీ.../ అంతిమంగా అందరమూ బార్లా తెరుచుకుని/ అమ్మ భూమిపై/ చేతులూ కాళ్ళు విరుచుకుని కూలిపోవాల్సిందే...", ఇది బతికినన్నాళ్ళూ ఉండాల్సిన జీవత్-స్పృహ. "నేను చావును చీమనై సమీపిస్తాను/ నా పాత గల్లీల్లోకి పారిపోతాను/ అది కొసవూపిరి ఊది పంపుతుంది." మనిషి జీవచ్ఛవమై చావకూడదు. చచ్చేందుకూ జీవముంచుకోవాలి. "భూమ్మీద అందరికంటే ఎక్కువ ప్రేమించే/ పుణ్యాత్ముల వరుసలో/ ముందు నేనే ఉంటాను/ ఎవరూ ప్రేమించని శాపగ్రస్తుల/ వరుసలో వెనుక నేనే ఉంటాను.", గుంపు, గుంపు, గుంపు. గుంపే ముందు పుట్టి ఈ కవికి జన్మనిచ్చి ఇతన్ని తమ ప్రతినిధిగా ఇటు పంపింది. "నా లోపల ఒక స్త్రీ దేహముందని తెలుసు", అని జెండర్‌ను జయించినవాడే అనగలిగేది. ఈ కవి మున్నుడిలోనూ కవితల్లోనూ జీన్ మెమొరీల ప్రసక్తీ డీఎన్ఏల ప్రసక్తీ ఉన్నాయి. ఇది మందితో తాదాత్మ్యత. కవి కొన్నేళ్ళకు పెద్దవాడై ఏ బోధివృక్షపు నీడనో ఇలా ఉద్బోధిస్తున్నాడు:

"నా మాటను/ నువ్వు భాషలేకుండా వాక్యం తోడు లేకుండా/ అక్షరంతో కాలయాపన చెయ్యకుండా/ జరుగు/ వెనుదిరుగు/ వొక కాంతి కాలిబాటై పరుచుకుంటుంది/ జీవ ధార కురుస్తుంది/ అక్కడికి పో..పోపో/ వృత్త రాగధ్యానంగా నగ్న నిశ్శబ్దంగా/ కనువిప్పని కలింకాయ మొగ్గలాగ/ దాన్లోకి పోయి కూకో.../ నా మాటను/కవిత్వం దొరుకుతుంది." ఎక్కడ కవిత్వం దొరుకుతుందో కవి చెప్పినా, అక్కడికి ఎలా వెళ్ళాలో కవులే స్వయం కృషితో తెలుసుకోవాలి. కవితను రాయడమంటే కవితను చంపెయ్యడమేననీ, అచ్చు వెయ్యడమంటే దానికి సమాధి కట్టడమనీ నమ్మిన అజంతాను ఇక్కడ పాఠకులు తల్చుకుంటారు.

"ఎగిరే సున్నానే నేను/మండే వానమబ్బుని/గంధపు చెదను", కవికి తనను తాను ఎలా నిర్వచించుకున్నా తనివి తీరకపోవడానికి కారణం ఈయన తన గుంపుకి ప్రతినిధి కావడమే.

"తాటిచెట్ల నరాల్లో ప్రవహిస్తున్న ఆదిసూక్తాన్ని", ఈ వాక్యం చదివి పాఠకులు భూతభవిష్యత్కాలాలకున్న మామూలు అర్థాన్ని దాటి ఏ మహర్షి కల్పించిన time warp లోనో వేదమంత్రం వింటారు. ఎంత తియ్యగా ఉంది! అసలా తాటిచెట్టులో కల్లుందా అమృతముందా అని!

పుస్తకం పూర్తిచేశాక మనసులో సిద్ధార్థకి ప్రియమైన ఆడా, మగా, పిల్లా, పీచూ, ఇల్లూ, జాగా, బైరాగీ, పరివ్రాజకులూ – ఇవే కాక అందంగా ముక్కుపుల్లలూ మిగిలిపోతాయి. కవికి ముక్కుపుల్లలంటే ఎంతో ఇష్టమయినట్టుంది. ఎంతైనా నాసాభరణాలు స్త్రీలకు భర్తృవాల్లభ్యసూచకాలు. ఆ అందం ఇలా ఉంటుంది.

"ఆమె కళ్ళు మూసుకుని నిద్రిస్తూంటే/ మెటఫర్‌నై జాగారం చేస్తున్నాను"

"చాలా సార్లు ఆమె దేహాన్ని పుస్తకంగా చదివాను/ వొక మత్తుకు లోనయ్యాను"

3

మనిషి కేంద్రంగా గల్లీల నుంచి మహానగరంలో కాంక్రీట్ జంగల్ వరకూ జీవితాన్ని కవితాత్మకంగా ఆవిష్కరించిన ఈ సంపుటిని కవి సొంత గొంతుతో ఈ కవితలను చదివి పెట్టిన ఆడియోఫైల్స్‌తో పాటుగా మన కళాశాలల్లో విశ్వవిద్యాలయాల్లో పాఠ్యాంశంగా చేస్తే ఆధునిక తెలుగు కవిత ఇంకా బాగా బతుకుతుంది. అప్పుడు విద్యార్థినీవిద్యార్థులు ఇది చదివి ఎవరి విశ్వాన్ని వారు ఆవిష్కరించుకుంటారు. ఎవరి ethnic spiritual centreను వారు కనుక్కుంటారు. అవన్నీ ఒకే బిందువులోకి నిష్క్రమిస్తాయని నేననుకుంటున్నాను.

■ వాసు

✆ 99011 55133

'దిగులు వర్ణం' కవిత్వ సంపుటి

రోహిణి వంజారి తొలి కవిత్వ సంపుటి 'దిగులు వర్ణం' ఆవిష్కరణ సభ డిసెంబర్ 3 ఉ.10 గంటలకు అదర్శిని మీడియా ఆఫీస్, అయ్యప్ప సొసైటీ, హైదరాబాద్‌లో జరుగుతుంది. సభలో శీలా సుభద్రాదేవి, ఎం.వి.రామిరెడ్డి, జెల్డి విద్యాధర్, పెమ్మరాజు విజయరామచంద్ర, నస్రీన్ ఖాన్, కె.ఎ. ముని సురేష్ పిళ్ళై తదితరులు పాల్గొంటారు.

రోహిణి

'నువ్వు గింజవైతే' కవిత్వ సంపుటి

తెలంగాణ సాహిత్య అకాడమి ప్రతి నెలా ఒకటవ, మూడవ శనివారాల్లో నిర్వహిస్తోన్న 'సాహిత్యవారం' కార్య క్రమంలో భాగంగా హనీఫ్ కవిత్వ సంపుటి 'నువ్వు గింజవైతే' ఆవిష్కరణ సభ డిసెంబరు 6 సా.5గంటలకు రవీంద్రభారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. అధ్యక్షత ఎస్. బాలాచారి, ముఖ్య అతిథి & ఆవిష్కర్త జయధీర్ తిరుమల్ రావు, విశిష్ట అతిథి సంగిశెట్టి శ్రీనివాస్, పరిచయం రూపుమార్ డబ్బీకార్, సమన్వయం ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్.

నామోజు బాలాచారి

పలమనేరు బాలోత్సవం

పలమనేరు బాలోత్సవం డిసెంబర్ 6న జరుగుతుంది. ఇందులో 'తెలుగులోనే మాట్లాడుదాం', 'కథలు చెబుదాం', 'శాస్త్రీయ నృత్యం', 'పద్యాలు చెబుదాం', 'తెలుగు ఉక్త లేఖనం' తదితర 15 రకాల పోటీలు జరుగుతాయి. ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి, స్థానిక శాసనసభ్యులు తదితరులు హాజరవుతారు.

పి. తులసినాథం నాయుడు

బొమ్మలు: అక్బర్

'ఏకాంతం ఒక అతిథి' కవిత్వ సంపుటి

పసునూరు శ్రీధర్‌బాబు మూడవ కవిత్వ సంపుటి 'ఏకాంతం ఒక అతిథి' ఆవిష్కరణ సభ డిసెంబర్ 7 సా.6 గంటలకు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్, హైదరాబాద్‌లో జరుగుతుంది. ఆవిష్కర్త లక్ష్మణ్ ఏలె, అధ్యక్షత బి. నర్సింగరావు. ప్రధాన వక్తలు: వాడ్రేవు చినవీరభద్రుడు, విమల మోర్తాల, పిల్లలమర్రి రాములు, సిద్ధార్థ పాల్గొంటారు.

అక్షర్ మీడియోస్

సాహిత్య పోటీ ఫలితాలు

బాదం మాధవరావు జ్ఞాపకార్థం నిర్వహించిన పోటీలో ఏనుగు నరసింహారెడ్డి 'ఏడు కోలల బాయి' కావ్యం, కాఫ్కా 'మెటమార్ఫసిస్'కు మెహెర్ అనువాదం ఎంపికయ్యాయి. అవార్డ్ ప్రదానం డిసెంబరు 25న పిఠాపురంలో ఉంటుంది.

ర్యాలి ప్రసాద్

కథ 2024 ఆవిష్కరణ

సిద్ధార్థ కళాపీఠం, విజయవాడ నిర్వహణలో కథా సాహితి సంకలనాలలో 35వ కథ సంకలనం 'కథ–2024' ఆవిష్కరణ సభ డిసెంబరు 7 ఉ.10.15కి సిద్ధార్థ కాలేజీ ఆడిటోరియం, విజయవాడలో జరుగుతుంది. అధ్యక్షత పి. లక్ష్మణరావు, ఆవిష్కరణ సి. మృణాళిని, ఆత్మీయ అతిథి ఎ.వి. గురవారెడ్డి, పుస్తక సమీక్ష ఆర్.ఎమ్. ఉమామహేశ్వరరావు. కథా సాహితి సంపాదకులుగా వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్ పాల్గొంటారు. కథా రచయితలతో ముఖాముఖి ఉంటుంది.

బండ్ల మాధవరావు

జనజీవన కవనకళతో కట్టుకున్నది నా 'దూదిమేడ'

నా మొదటి పుస్తకం

నాళేశ్వరం శంకరం



మా ఊరిపేరు నాళేశ్వరం. అదే నా ఇంటిపేరు. అది నిజామాబాదు జిల్లాలో మారుమూల గ్రామం. మేము జంగాలం. బిక్షాటన మా కులవృత్తి. బిక్షాటన లేకపోతే జీవించలేని కుటుంబం మాది. బాల్యం నుంచే బిక్షాటన చేయడం వల్ల మా ఊరి ఇంటింటి దుఃఖం తెలిసి వచ్చింది. పిడికెడు బియ్యం నా జోలెలో వేయడమే కాదు, కుతిక దీరా రాసుకునే కవితా వస్తువును మా ఊరే ఇచ్చింది. దుఃఖ నిలయంగా ఉన్న మా ఊరును వెన్నెల నిలయంగా మలచాలనుకున్నాను గానీ నా పేదరికం ముప్పుతిప్పలు పెట్టింది. నాలోని నిత్యచైతన్య శీలమే నాకో రహస్య రహదారిని నేర్పింది. ఇంటికి దూరమైనా ఎదురీదుతూ డిగ్రీ దాకా వచ్చాను. కె. వివేకానందరెడ్డి, సునీతమ్మగార్లు చేసిన ఆర్థిక సహాయం వల్ల ఎం.ఏ చదవటానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం వచ్చాను. నా జీవితంలోని ఈ మలుపు నాకెంతో శక్తినిచ్చింది. నా కవిత్వానికి జీవం పోసింది. ఉద్యమాల, పోరాటాల, విప్లవాల రాజకీయ కవిత్వంలా కాక అవి జనజీవన తాత్త్విక స్వభావంలోకి సింకయ్యే స్వభావాన్ని అలవర్చుకున్నాను. సరళీకరణ ఆర్థిక విధానాలు, ప్రపంచీకరణ సృజిస్తున్న తుపాను నాలోకి ప్రవేశించింది. భూస్వామ్య, పెట్టుబడిదారీ, పాలక వర్గాలు మిళితమై జనజీవనాన్ని ఎలా దెబ్బతీస్తున్నాయో చాలా కవితల్లో వ్యక్తపరిచాను. ఎంఏ చదువుతున్న రోజుల్లో 'భారతి'తో కవిత అచ్చయితేనే కవి అన్న భావన ఉండేది. ఓమారు మా గురువుగారు సి. నారాయణరెడ్డి కవితా, నా కవిత ఒకేచోట అచ్చయినాయి. సినారె తరగతి గదిలోనే నన్ను నిలుచోబెట్టి అభినందించారు. ఎంఏ చదువుకున్న రోజుల్లో నందిని సిధారెడ్డి, గుడిహాళం రఘునాథం సీనియర్లు. నేను, ఎస్వీ సత్యనారాయణ, వసంతరావు దేశపాండె, సుంకిరెడ్డి నారాయణరెడ్డి జూనియర్స్‌ము. రాయాలన్న తపన తప్ప ఇంకేదీ దరి చేరేది కాదు. ఈ కాలంలో రాసిన కవితల్లో నుంచి కొన్ని ఏర్చి కూర్చిన కవితా సంపుటమే నా 'దూదిమేడ'.

'దూదిమేడ' ఆవిష్కరణ ఏప్రిల్ 30, 1997, బుధవారం సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. దేవిప్రియ సభాధ్యక్షులు, కె.శివారెడ్డి ఆవిష్కర్త. జ్వాలాముఖి 'దూదిమేడ' లోని లోతుపాతులు ఎత్తిచూపారు. ఆప్తవాక్యం ఎన్. గోపి, బైస దేవదాసు. కందుకూరి శ్రీరాములు వేదిక పైకి ఆహ్వానించారు. వీరందరి ప్రసంగాలతో నాలో నయాగార జలపాతం. ఇంతలో మా అవ్వ సంగవ్వ, సహచరి సుభద్రదేవి, పుస్తకాన్ని అచ్చు వేసిన చిక్కడ్‌పల్లి బాలప్రసాదును తగిన విధంగా గౌరవించి తలా ఓ కాపీ ఇచ్చాను. మా అమ్మ సంబరంతో హేలుహేలంతా మురిసిపోయింది. తెల్లవారి మేడే. 'దూదిమేడ' హైదరాబాద్‌లోనే గాక, గుంటూరులోను రెండవరోజు రెండవసారి ఆవిష్కరింపబడింది. గుంటూరులోని పెనుగొండ లక్ష్మీనారాయణ ఆకాంక్ష మేరకు అవగాహన సామాజిక సాంస్కృతిక వేదిక పైన మే డే సభలో ఈ ఆవిష్కరణ జరిగింది. పాపినేని శివశంకర్, కడియాల రామ్మోహనరావుతోపాటు కె.శివారెడ్డి, దేవిప్రియ, జ్వాలాముఖి రెండవసారి మాట్లాడారు. హైదరాబాద్‌లోను, గుంటూరులోను నేను ఆశ్చర్యపోయేలా అమ్ముడు పోయింది. దేవిప్రియ 200 కాపీలు తీసుకు రమ్మంటే 250 కాపీలతో గుంటూరుకు వెళ్లాను. వచ్చేటప్పుడు నా దగ్గర ఒక్క కాపీ మిగలలేదు. ఇక "కవిని కడతేర్చేది కవిత్వమొక్కటే" అన్న నా కవితా పాదాన్ని శీర్షికగా పెట్టి దేవిప్రియ 'దూదిమేడ'కు ముందుమాట రాశారు. అది 'దూదిమేడ'కు యోగ్యతాపత్రం లాంటిది.



ఆంధ్రజ్యోతి దినపత్రిక, వారపత్రిక 'దూదిమేడ'కు గౌరవాన్నిచ్చింది. పొనుగోటి కృష్ణారావు సాహిత్య పేజీలో నా చేత నన్ను గూర్చి రాయించి ప్రచురించారు. వారపత్రిక సంపాదకులు దాట్ల ఏకంగా 'దూదిమేడ'పై సంపాదకీయం రాశారు. డా. రంగయ్య 'దూదిమేడ'ను 'కపాస్‌కి అటారి' పేరుతో హిందీలోకి అనువదించారు. సోమసుందర్, ఎన్.గోపి, నాగభైరవ కోటేశ్వరరావు, జయధీర్ తిరుమలరావు, పి.వి. రమణ, గుడిపాటి, దర్భశయనం, ధింసా, పెన్నా శివరామకృష్ణ, పసునూరి శ్రీధర్‌బాబు, కొండేపూడి నిర్మల... మరికొందరు 'దూదిమేడ'లోని కవిత్వాన్ని విశ్లేషిస్తూ రాశారు. 'దూదిమేడ'కు ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డుతో పాటు పలు అవార్డులు వచ్చాయి. ఉత్తమ విమర్శకులు ఉత్తరాలు కూడా రాశారు. కె.కె. రంగనాథాచార్యులు 'మధ్యవర్తి చేతిలో రైతు, కవి' కవిత చదివి ఉత్తరం రాశారు. వారి ఉత్తరం వల్లనే ఆ కవిత అచ్చయిన పత్రికను తర్వాత సంపాదించుకున్నాను.



శీలా వీర్రాజు గారు అత్యంత ఆత్మీయులు. ప్రతి పది ఇరవై రోజులకు ఒకమారు మా ఇంటికి ప్రొద్దున పూట వచ్చేవారు. ఎన్నో మార్లు పుస్తకం వేయమని అన్నాడు. పుస్తకం వేస్తేనే మీ ఇంటికి వస్తానన్నాడు. నేను పుస్తకం వేయలేదు. ఆయన మా ఇంటికి రావడం మానేశారు. ఓ ఆరు నెలలు అయిందనుకుంట. మా నాన్న చనిపోయాడు. ఆ సందర్భంలో ఆయన మా ఇంటికి వచ్చాడు. చలించిపోయాను. ఆయన వల్లనే నా కవితలను నేనే ఎన్నుకుని 'దూదిమేడ'గా ప్రచురించి ఆయనకే అంకితమిచ్చాను. నా 'దూదిమేడ' వీర్రాజును మళ్ళీ మా యింటికి వచ్చేట్లు చేసిన సంపుటం.

✆ 94404 51960



గందరగోళం

ఇదంతా బయల్దేరిన చోటికి చేర్చే గోళమే
దాన్ని తెలియనివ్వని గందరగోళం కూడా
ఇదంతా ఒక తిక్క నాకొడుకు ప్రేలాపనే
ఐనా పదాల్ని తెంపి దండలు కట్టి చూడు!

అసలీ ప్రయాసంతా ఎందుకు? ఏమో తెలియదు!
రెండు విషయాలు నాకు ఎప్పటికీ తెలియవు
విశ్వావరణానికి బయట ఏముందో తెలియదు
మెదడుకు బయట ఏముందో కూడా తెలీదు!

మాటలు తుప్పపట్టి తెరుచుకోని తలపులు
అంతిమ సత్యం అంటూ ఒకటి లేదు గనుక,
మరీ బరి తెగించి అనకూడదు గాని; విశ్వానికి,
మస్తిష్కానికి బయటివి మనకెప్పటికీ తెలీవు

ఉన్న సత్యాలన్నీ చందస్సుల్లా, వాస్తుశిల్పాల్లా
ఏదో దొరికిన కాస్త స్థలంలో నిర్మించబడినవే;
అవి సహజాతాలు కావు; వస్తువులతో పాటు
పుట్టినవి కావు, పుట్టాక రూపాలు పొందినవే;

'అదే అదే అదేర నాన్నా, అదే శంకరుడన్న మాయ'
అంటావా సహవాసీ! నా ఆవేదన సహభోగీ! వేదాంతీ!
ఆగు ఆగు, కుదరదు! ఆలోచన ఇంకా అయిపోలేదు
బయటి మాయ సంగత్సరే, లోని పీడన సంగతేంటి?

ఆకలేసినా అన్నానికి వెళ్లనివ్వని పని సంగతేమిటి?
నీ మనసు కట్టిన పాటను నిన్ను పాడుకోనివ్వని
రాజదండాల సంగతేమిటి? మనిషిపై మనిషి స్వారీకి,
రేసు మైదానాల సంగతి, బుక్కీ కిటికీల వద్ద మన
మధ్యతరగతి పడిగాపుల సంగతేమిటి? నీచస్థితిని
వొదిలేసి చేయాల్సి ఉన్న దీర్ఘయాత్ర సంగతేమిటి?

మాయ అనేది మాయ అని కూడా మనకు తెలీదు
తెలిసింది ఏదో అదే తెలుసు, అన్నీ తెలుసు అని
ఉపదేశ ముద్రతో హస్తం చాచకు, పోజులు కొట్టకు,
ఏదీ తెలియదని రాత్రంతా చిడతలు మోగించి
పొద్దున్నే దొరగాని చేనిలో కలుపు తీయడానికి
మాత్రమే, దానికి మాత్రమే చూరులోని కొడవలి
పదును గురించి చాల దిగులు పడిపోతూ
ఆకలికి బానిసగా బతికి, మరణించ వద్దు!

పనికీ పనికి మధ్య విరామాల్లోనైనా నీకు నువ్వు బతుకు,
గుహల గోడల మీద బొమ్మలుగా, వేట కేకల కవితలుగా

■ హెచ్చార్కె

✆ 95023 45716


ప్రేమ కథలు నచ్చవు

చదువు ముచ్చట

రాజీ కన్నా

ఈమధ్య చదివి ఇష్టపడిన పుస్తకం?

ఈ నడుమ అంటే సోలోమన్ విజయ్ కుమార్ 'సన్ ఆఫ్ జోజప్ప' కోసం ఆత్రంగ ఎదురు చూసిన. అంతకు ముందు 'ముని కాంతపల్లి' కథల పుస్తకం నన్ను ఒకరకమైన ట్రాన్స్‌ల పడేసింది. ఆ కథలన్నీ ఎదో మా ఊర్లో, నా కళ్ళ ముందు జరిగినట్టున్నయ్. ఆ నెల్లూరు మాండలికం అయితే.. దానికోసమే ఆ బుక్ ఎన్నిసార్లు సదివిన్నో లెక్క లేదు. అంటే నాకు మాండలికాల మీద ఉన్న విపరీతమైన ఇష్టం తోని ఇంక ఎక్కువ నచ్చినట్టుంది.



తొలిసారి బాగా ఇష్టపడిన పుస్తకం?

నాది పూర్తిగా గవర్నమెంట్ స్కూల్ చదువు. అక్కడ అన్ని ల్యాబులకు, లైబ్రరీకి కలిపి ఒకటే రూమ్ ఉండేది. అందులో ఉన్న ఓ చెక్క బీరువలో మస్తు పుస్తకాలుండేవి. ఇగ అయిట్లల్ల.. పేర్లు గుర్తులేవు గాని, కథలు గుర్తున్నాయి. టీనేజ్ దాటిన తర్వాత చదివిన పుస్తకం కేశవరెడ్డి 'అతడు అడవిని జయించాడు.' నాన్‌స్టాప్‌గా చదివిన ఆ బుక్‌ను. తర్వాత అట్ల వదలకుండ చదివింది బిభూతి భూషణ్ బందోపాధ్యాయ రాసిన 'వనవాసి'. ఇవి రెండు నా ఆల్ టైం ఫేవరేట్ బుక్స్.

ఒకప్పటికీ ఇప్పటికీ పుస్తకాలు చదివే తీరులో వచ్చిన మార్పులు?

పుస్తకాలు చదవడం మొదలు పెట్టిన కొత్తలో పుస్తకాల మీద దండయాత్ర చేసేది. మొదలుపెట్టి అన్నం, నీళ్లు, నిద్ర మాని చదివేదాన్ని. నాకు బాగా గుర్తుంది.. ఒకసారి ఇంట్లోవాళ్ళు ఊరికి వెళ్తే, తలుపులు పెట్టుకొని బయటికి రాకుండా రెండు రోజులు దాక పుస్తకాలు చదువుతనే ఉన్న. ఎప్పుడు తిన్ననో ఎప్పుడు నిద్రపోయిన్నో. దెబ్బకు ఇంటి పక్కనోళ్లు 'ఏమైంది.. బయటికే రావడం లేదు.. ఆల్ ఓకేనా' అని అడిగిన్రు.

పుస్తకాల్లో రచనల్లో మీరు అంతగా ఇష్టపడని ధోరణి?

ప్రేమ కథలు.. ఎందుకో తెలియదు మరి.

సాహిత్యంలో మీకు ఆల్టర్ ఈగో అనిపించిన పాత్ర?

నేను అంత పెద్దగ సాహిత్యం చదవలేదు. గాని ఒక్కోసారి చలం స్త్రీ పాత్రలు అలా అనిపిస్తయి.

రాయటానికి వాడే భాష విషయంలో మీకు మోడల్‌గా నిలిచిన రచయితలు?

రాయడం స్టార్ట్ చేసినప్పుడు ఇంకా ఎవరి రచనలు చదవలేదు. ఆ తర్వాత మాత్రం అల్లం రాజయ్య, నామినిలా పాఠకులను కట్టిపడేయాలనుకుంట.

ఏ గత కాలం రచయితతోనైనా మాట్లాడగలిగితే?

'వోల్గా సే గంగా' రాసిన రాహుల్ సాంకృత్యాయన్‌తో మాట్లాడతా. భూమి మీద ఐదు వేల ఏళ్లకు ముందు.. మంచు యుగం చివరి దశలో మాతృస్వామ్యం ఉందని ఎలా ఊహించారో అడుగుతా.



(రాజీ కన్నా కథల సంపుటి 'అగ్రాసు' ఇటీవల విడుదలైంది.)



వర్షాకాలపు రాత్రి

నేను:
జమ్మిగడ్డి ఇంట్లో
ఒట్టినేల మీద బొంత పరచుకుని
ఇంటికప్పు మీద వర్షం చేసే సంగీతం వింటూ
చల్లటి రాత్రి ఇద్దరం
వెచ్చగా
ఒకే దుప్పటిలో నిద్రపోదామా

తాను:
దుప్పటి లోనున్న నిశ్శబ్దంలో
నీ హృదయ స్పందన వింటూ,
వాన చినుకులు మన కలలకి తాళం వేస్తూ,
మనిద్దరం ఒకరినొకరు కౌగిలించుకుని,
వెచ్చని శ్వాసల్లో మునిగిపోతూ,
ఆ ఉదయం మెలకువ వచ్చే వరకు
ప్రపంచం మొత్తాన్ని మరచిపోదాం

నేను:
గుండె కోసి ఇవ్వనా
ఈ రాత్రి కోసం
భూమ్మీద బంగారం అంతా
చాలునా నీ ముద్దుకోసం
ప్రాణాలు వదలనా
నీ కౌగిలింతలోని సుఖం కోసం

తాను:
ఇవన్నీ ఏవీ జరగాల్సిన అవసరమే లేదు
నీ ముద్దుల్లో మునిగిపోతూ
శ్వాసలు కలిసే వేడి తాకిడిలో
గుండె తాళం తప్పిపోయే
వేళ కోసమే ఎదురుచూస్తుంటా

నేను:
నది ఒడ్డున నీకోసం నావతో సిద్ధంగా ఉన్నాను

ఈ జన్మలోనైనా నువ్వు వస్తావేమోనని
నువ్వు రాగానే మన కలల దీవికి వెళ్ళిపోదాం
అక్కడ జమ్మిగడ్డి ఇల్లు ఉంది
మా అమ్మ పాతచీరతో కుట్టిన బొంత ఉంది
కుంచెడు బియ్యానికి బేరం ఆడి కొన్న
కొత్త దుప్పటి ఉంది.
ఏం కావాలి ఓ కల కనడానికి?

తాను:
ఈ కల నిజమైన నాడు,
నేను మొత్తానికే నీ సొంతం అవుతాను

నేను:
నేను ఎప్పుడో నీ సొంతం.
ఇది ఇంకో జన్మ అంతే

■ ప్రసాద్ సూరి



హసన్‌పర్తి మండలం నాగారంలో సర్పంచ్ స్థానానికి నామినేషన్ వేస్తున్న సందరాజు లావణ్యసంతోష్

రెండో విడతలో నామినేషన్ల జోరు

- పెద్ద ఎత్తున దాఖలు చేసిన అశావహులు
- గ్రామ పంచాయతీల్లో సందడి

హనుమకొండ టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లాలో పంచాయతీ ఎన్నికల రెండో విడతలో నామినేషన్లు తొలి రోజు ప్రారంభమైనట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదివారం తెలిపారు. జిల్లాలోని ధర్మసాగర్, హసన్‌పర్తి, వేలేరు, పరకాల, ఐనవోలు మండలాల్లో మొత్తం 73 సర్పంచ్ స్థానాలు ఉండగా, 51 మంది నామినేషన్లు దాఖలు చేసినట్లు చెప్పారు. అలాగే మొత్తం 694 వార్డు స్థానాలకు 44 నామినేషన్లు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. తొలి రోజు ధర్మసాగర్ మండలంలో 19 సర్పంచ్‌ల స్థానాలకు 21 నామినేన్లు దాఖలయ్యాయి. 186 వార్డు స్థానాలకు 19 నామినేషన్లు దాఖలయ్యాయి. హసన్‌పర్తి మండలంలో 15 సర్పంచ్ స్థానాలకు 8 నామినేషన్లు దాఖలయ్యాయి. 138 వార్డు స్థానాలకు 11 నామినేషన్లు దాఖలయ్యాయి. వేలేరు మండలంలో 12 సర్పంచ్ స్థానాలకు 6 నామినేషన్లు దాఖలయ్యాయి. 106 వార్డు స్థానాలకు 6 నామినేషన్లు దాఖలయ్యాయి. పరకాల మండలంలో 10 సర్పంచ్ స్థానాలకు 8 నిమినేషన్లు దాఖలయ్యాయి. 94 వార్డు స్థానాలకు 2 నామినేషన్లు దాఖలయ్యాయి. ఐనవోలు 17 సర్పంచ్ స్థానాలకు 8 నామినేషన్లు దాఖలయ్యాయి. 170వార్డు స్థానాలకు 6 నామినేషన్లు దాఖలయ్యాయి.

నామినేషన్ల వివరాలు

మండలం పేరు	సర్పంచ్ స్థానాలు	దాఖలైన నామినేషన్లు	వార్డు సభ్యులు	దాఖలైన నామినేషన్లు
ధర్మసాగర్	19	21	186	19
హసన్‌పర్తి	15	08	138	11
ఐనవోలు	17	08	170	06
వేలేరు	12	06	106	06
పరకాల	10	08	094	02
మొత్తం	73	51	694	44

నామినేషన్ల పరిశీలన పూర్తి

హనుమకొండ టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నిక తొలివిడత నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి ఆదివారం అధికారులు స్ర్కూటినీ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మొదటి విడతలో భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్ మూడు మండలాలకు సర్పంచ్‌స్థానాలకు 496 నామినేషన్లు దాఖలు కాగా, వార్డు స్థానాలకు 1,747 నామినేషన్లు వచ్చాయి. కాగా, మండలంలో ఏర్పాటు చేసిన క్లస్టర్ల వద్ద స్ర్కూటినీ నిర్వహించారు. అర్హతలేని అభ్యర్థుల (మిగతా 8వ పేజీలో)

- సమస్యాత్మక ప్రాంతాలపై పోలీసుల నజర్
- ఉమ్మడి జిల్లాలో 698 గ్రామాల గుర్తింపు
- వీటిలో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లకు సన్నాహాలు
- పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు
- రౌడీషీటర్లు, ఘర్షణలు సృష్టించేవారికి కౌన్సెలింగ్
- తాత్కాలికంగా లైసెన్సుడ్ తుపాకులు స్వాధీనం
- అదనంగా సీసీ కెమెరాల ఏర్పాటు

పంచాయతీ ఎన్నికలకు పటిష్ఠ భద్రత



గ్రామ పంచాయతీ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి

హనుమకొండ, నవంబర్ 30 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికార యంత్రంగాలు అన్ని చర్యలు తీసుకుంటున్నాయి. ఎన్నికల క్రమంలో, ముఖ్యంగా పోలింగ్ రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాయి. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లా పరిధిలోని ఆరు జిల్లాలు.. హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లోని సమస్యాత్మక గ్రామాలను గుర్తించారు. వీటిలో సాధారణ ప్రాంతాలకన్నా మిన్నగా భద్రతా ఏర్పాట్లను మరింత పటిష్టంగా ఏర్పాటు చేస్తున్నారు.

సమస్యాత్మక ప్రాంతాలు 698

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 698 సమస్యాత్మక ప్రాంతాలు ఉన్నట్టు గుర్తించారు. గత లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా గుర్తించిన ప్రాంతాలకు అదనంగా మరికొన్నింటిని చేర్చారు. ఈ సమస్యాత్మక ప్రాంతాలు.. హనుమకొండ జిల్లాలో 52, వరంగల్ జిల్లాలో 29, జనగామ జిల్లాలో 103, మహబూబాబాద్ జిల్లాలో 137, ములుగు జిల్లాలో 35, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో 342 ఉన్నాయి. ఇందులో సమస్యాత్మకంతో పాటు అతి సమస్యాత్మక ప్రాంతాలు కూడా ఉన్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 30 అతి సమస్యాత్మక ప్రాంతాలు ఉన్నాయి. ములుగు జిల్లాలోని వెంకటాపూర్, వాజేడు మండలాల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలను సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. గత లోక్‌సభ, అసెంబ్లీతో పాటు 2019 పంచాయతీ ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక ప్రాంతాల్లో ఎలాంటి ఘర్షణలు జరిగాయి? ఎవరి మధ్య జరిగాయి? ఇందుకు కారణాలేమిటి, ఇందులో రాజకీయంగా, వ్యక్తిగతంగా జరిగిన ఘర్షణలు ఏవీ? ఇందులో పాల్గొన్నవారు ఎవరు? వారి ప్రస్తుత ఉనికి ఏమిటీ? తదితర వివరాలను అధ్యయనం చేసి ప్రస్తుత పంచాయతీ ఎన్నికల్లో తీసుకోవలసిన భద్రతా చర్యలపై పోలీసు యంత్రాంగాలు కసరత్తు చేస్తున్నాయి. ఈ ప్రాంతాల్లో చేయాల్సిన భద్రతా ఏర్పాట్లపై ఉన్నతాధికారులు ఇప్పటికే సమీక్షిస్తున్నారు. ప్రస్తుతం నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. మొదటి విడత పోలింగ్ నాటికి సర్వసన్నద్ధంగా ఉండేలా ప్రణాళికలను సిద్ధం చేసుకున్నారు.

భద్రతా చర్యలు

పోలింగ్ సందర్భంగా సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక భద్రతా చర్యలను తీసుకుంటారు. ఇలాంటి ప్రాంతాలపై పోలీసుల నిఘా ఎక్కువగా ఉంటుంది. అవసరాన్నిబట్టి అదనపు బలగాలను మోహరిస్తారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తుంటారు. సాధారణ పోలింగ్ (మిగతా 7వ పేజీలో)

నామినేషన్‌ల ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలి

హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్

హసన్‌పర్తి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నామినేషన్ల ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. రెండోవిడత మండలాల్లో సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్‌ల స్వీకరణ ప్రక్రియ ఆదివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదివారం మండలంలోని సీతంపేట, నాగారం క్లస్టర్ గ్రామ పంచాయతీ కార్యాలయాలను సందర్శించి నామినేషన్‌ల స్వీకరణ ఏర్పాట్లను పరిశీలించారు. నామినేషన్ స్వీకరణ కేంద్రాల క్లస్టర్‌లలో ఏయే గ్రామాల సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్లు వేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితాను ప్రదర్శించాలన్నారు. హెల్ప్‌డెస్క్ ద్వారా అభ్యర్థులకు నామినేషన్లకు సంబంధించిన సమాచారం అందించాలన్నారు. నామినేషన్ల స్వీకరణకు తగిన కౌంటర్లు ఉండాలన్నారు. ఎన్నికల విధులలో పాల్గొంటున్న అధికారులు, పంచాయతీ కార్యదర్శులు గుర్తింపు కార్డులు ధరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె వెంట ఎంపీడీవో సుమనవాణి, సూపరింటెండెంట్ సురేష్, పంచాయతీ కార్యదర్శులు హరిత, గరిగె ప్రశాంతి ఇతర అధికారులున్నారు.



సీతంపేటలో నామినేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

నేటి కలెక్టరేట్ ప్రజావాణి రద్దు

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాతీయ ఎన్నికల దృష్ట్యా జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధికారులు ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లలో ఉన్నందున ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేశామని తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి కలెక్టరేట్‌కు రావద్దని సూచించారు.

వరంగల్ జిల్లా ప్రజావాణి రద్దు

వరంగల్ కలెక్టరేట్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో సోమవారం నిర్వహించే కలెక్టరేట్ ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ సత్యశారద ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ ఎన్నికల దృష్ట్యా అధికారులు వివిధ పనుల్లో నిమగ్నమయ్యారని, ఎన్నికలు ముగిసే వరకు ప్రజావాణిని నిలిపివేస్తున్నామని వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తయ్యేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

జీడబ్ల్యూఎంసీ ప్రజావాణి రద్దు

వరంగల్ కార్పొరేషన్: ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ప్రతీ వారం గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం రద్దు చేస్తున్నట్టు జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం బల్దియాలో కౌన్సిల్ సమావేశం ఉన్నందున ప్రజావాణి రద్దు చేసినట్టు వెల్లడించారు. ప్రజలు గమనించి మునిసిపల్ కార్యాలయానికి రాకూడదని కమిషనర్ తెలిపారు.

వణికిస్తున్న హెచ్ఐవీ

- రోజురోజుకూ పెరుగుతున్న కేసులు
- ప్రతీ సంవత్సరం మొక్కుబడిగా అవగాహన కార్యక్రమాలు
- నేడు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం

7

కొత్త కిక్కు



- నేటి నుంచి నూతన వైన్‌షాపులు ప్రారంభం
- ఇప్పటికే దుకాణాలకు చేరిన కొత్త స్టాక్
- ఉత్సాహంతో ఉన్న లిక్కర్ వ్యాపారులు



వరంగల్ క్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): లక్కీ డ్రాలో షాపులు దక్కించుకున్న యాజమానులు సోమవారం నుంచి కొత్త మద్యం షాపులను ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఇప్పటికే మద్యం షాపు నిర్వహణకు కావాల్సిన ఏర్పాట్లను చేసుకున్నారు. కొన్ని షాపులు పాత అడ్డాలోనే ప్రారంభించేందుకు ఏర్పాటు చేసుకోగా.. మరికొన్ని చోట్ల షెట్టర్, లీజు కారణాలతో మార్చుకున్నారు. అలాగే విక్రయాలకు అనుగుణంగా షాపులను ఆధునీకరిస్తున్నారు. మద్యం ప్రియులు కూర్చునేందుకు వీలుగా మరమ్మతులు చేయించుకుంటున్నారు.

రెండేళ్లకు..

రెండేళ్ల కాలవ్యవధికి ప్రభుత్వం కొత్త మద్యం షాపుల కోసం సెప్టెంబర్ 26న నోటిఫికేషన్ జారీ చేసింది. నవంబర్ 18 వరకు ఉమ్మడి జిల్లాలోని ఆయా జిల్లాలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయాల్లో దరఖాస్తులు స్వీకరించారు. అనుకున్నంత దరఖాస్తులు రాకపోవడంతో పాటు లిక్కర్ వ్యాపారులు దరఖాస్తు గడువు పెంచాలని కోరడంతో 23 వరకు గడువు పెంచగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10,493 దరఖాస్తులు వచ్చాయి. దీని వల్ల అబ్కారీశాఖ ద్వారా ప్రభుత్వ ఖాజానాకు రూ.314.79 కోట్ల ఆదాయం చేకూరింది. ఆపై 27న ఆరు జిల్లాల కలెక్టర్‌ల ఆధ్వర్యంలో లక్కీ డ్రా తీసి విజేతలను ప్రకటించారు.

షాపులు పెట్టొద్దని అందోళనలు

జనావాసాల మధ్య వైన్‌షాపులు పెట్టొద్దని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చాలా చోట్ల వ్యతిరేకతలు వ్యక్తమయ్యాయి. కొన్ని చోట్ల అందోళన నిర్వహించారు. ప్రధానంగా వరంగల్ అర్బన్ ఎక్సైజ్ శాఖ పరిధిలోని అశోకకాలనీలో వైన్ షాపు ఏర్పాటు చేయవద్దని కాలనీవాసులు కోర్టు మెట్లెక్కి స్టే తెచ్చారు. అదే విధంగా యాదవనగర్ క్రాస్‌లో వైన్‌షాపు వద్దని స్థానికులు ప్రధాన రహదారిపై అందోళన నిర్వహించారు. వరంగల్ రూరల్ పరిధిలోని వర్ధన్నపేట, గిర్నిబావి, నర్సంపేటలో వైన్‌షాపులు ఏర్పాటు చేయవద్దని అందోళన నిర్వహించడంతోపాటు జిల్లా ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు.

కలిసొచ్చిన ఎన్నికలు, మేడారం జాతర

లక్కీ డ్రాలో మద్యం షాపులు దక్కించుకున్న కొత్త వ్యాపారులకు పంచాయతీ ఎన్నికలు, మేడారం జాతరం కలిసిరానుంది. ఇదే నెలలో పంచాయతీ ఎన్నికలు మూడు దశల్లో ఉండటంతో విక్రయాలు అత్యధికంగా జరిగే ఆవకాశం ఉంది. అదే విధంగా జనవరి నెలలో మేడారం జాతర ఉన్న నేపథ్యంలో గ్రామాల్లో లిక్కర్ వ్యాపారం జోరుగా సాగనుంది.

బీసీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

- పంచాయతీ ఎన్నికల్లో 42శాతం కేటాయించాలి..
- ఇనగాలకు టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ సూచన



టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తో ఇనుగాల వెంకట్రాంరెడ్డి

హనుమకొండ సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు బీసీలకు అధిక ప్రాధన్యత ఇవ్వాలని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఆదేశించారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులైన ఇనుగాల వెంకట్రాంరెడ్డి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ఆదివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానిక ఎన్నికల్లో పార్టీ ప్రకటించిన బీసీలకు 42శాతం స్థానాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులను సంప్రదిస్తూ పరిస్థితుల ఆధారంగా బీసీలకు సర్పంచ్ పదవులు దక్కేలా చూడాలన్నారు. అలాగే జిల్లాలో అందరితో కలిసి పని చేయాలని, కార్యకర్తలతో మమేకం కావాలని సూచించారు. అదే విధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి విషయాలను ప్రజలకు విరి విరిగా చేరేలా ప్రణాళికలు రూపొందించి ఆ మేరకు ఫలితాలు సాధించాలని ఆదేశించారు. ప్రతీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేయాలన్నారు.

నేడు బాధ్యతలు

డిసెంబరు 2వ తేదీన హైదరాబాద్‌లో డీసీసీ అధ్యక్ష బాధ్యతలను ఇనుగాల వెంకట్రాంరెడ్డి చేపట్టనున్నారు. ఇటీవలే రాష్ట్రంలో డీసీసీ అధ్యక్షులుగా నియ మితులైన వారంతా బాధ్యతలు తీసుకోనున్నా రు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ తదితర కాంగ్రెస్ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఇక డీసీసీ బాధ్యతలు చేపట్టిన తరువాత ఈనెల 6వ తేదీన ఇనుగాల వెంకట్రాంరెడ్డి హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో తొలి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిసింది.

తెలంగాణపై కేసీఆర్‌ది చెరగని ముద్ర

- ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్
- దీక్షా దివస్ సందర్భంగా హనుమకొండలో కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తులతో అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

హనుమకొండ టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): 60ఏళ్ల కలను సాకారం చేసిన ఉద్యమ నేత కేసీఆర్ తెలంగాణపై చెరగని ముద్ర వేస్తే, తెలంగాణ బిడ్డల ప్రాణాలను బలి తీసుకొన్నది కాంగ్రెస్ పార్టీ అని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ హను మకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. ఆదివారం కేసీఆర్ దీక్షా దివస్ సందర్భం గా హనుమకొండ నక్కలగుట్టలోని కాళోజీ విగ్రహం నుంచి అదాలత్‌లోని అమర వీరులస్థూపం వరకు తెలంగాణ అమరవీరుల స్మారకం కొవ్వొత్తుల ర్యాలీ బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. చావు నోట్లో తలపెట్టి కేసీఆర్ స్వరాష్ట్రాన్ని సాధించారని అన్నారు. అమరుల బలిదానాలకు కారణం కాంగ్రెస్ పార్టీ అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో అగ్రభాగాన నిలిచిందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చింతం సదానందం, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు సంకు నర్సింగరావు, కుసుమ లక్ష్మీనారాయణ, తాళ్లపెల్లి జనార్ధన్‌గౌడ్, పులి రజినీకాంత్, నయిమొద్దీన్, పోలెపల్లి రాంమూర్తి, సదాంత్, తక్కళ్లపెల్లి వినిల్‌రావు, శ్రీకాంతాచారి, సృజన్, సారిక , పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్షా.. సమస్యలు తీర్చరా..?!

- నేడు గ్రేటర్ వరంగల్ కౌన్సిల్ సమావేశం
- ఈ సారైనా సభ్యులు సుదీర్ఘ చర్చ జరిపేనా?
- నిలదీసేందుకు ప్రతిపక్ష సభ్యుల సమాయత్తం
- అర్థవంతమైన చర్చ జరగాలంటున్న నగర జనం

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యుఎంసీ) కౌన్సిల్ సమావేశం సోమవారం గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కొత్త కౌన్సిల్‌హాల్‌లో జరుగనుంది. ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లను వేగవంతం చేస్తున్నారు. ఉదయం 11.30గంటలకు బల్దియా కార్యాలయంలో మేయర్ గుండు సుధారాణి అధ్యక్షత కౌన్సిల్ సమావేశం జరుగనుంది. కౌన్సిల్‌లో మేయర్‌తో పాటు కమిషనర్, మంత్రి, ఎక్స్ అఫీషియో సభ్యులు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లతో పాటు వివిధ విభాగాల వింగ్ అధికారులు పాల్గొననున్నారు. ఈ మేరకు ఐదు రోజుల ముందుగానే సభ్యులకు బల్దియా అధికారులు ఎజెండా అంశాలతో కూడిన నోటీసులు జారీ చేశారు. ఈ సర్వసభ్య సమావేశంలో వరంగల్ నగర అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలు ప్రస్తావించే అవకాశాలు ఉన్నాయని గ్రేటర్ అధికారులు అభిప్రాయపడుతున్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్లు, డ్రైనేజీల పునర్నిర్మాణం, చెరువుల పునరుద్ధరణ, శాటేషన్ పురోగతి, వర్షాకాల ప్రణాళిక, వరద ముంపుప్రాంతాల గుర్తింపు, స్మార్ట్‌సిటీ పనులు, హార్టికల్చర్ కార్మికుల వేతనాల పెంపు, 85 మంది ఔట్‌సోర్సింగ్ జవాన్‌లకు జీతాల పెంపుపై ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు సమాచారం.

ఈ సారైనా చర్చ కొనసాగేనా.. ?

గ్రేటర్ వరంగల్ పాలక వర్గం కౌన్సిల్ సమావేశంలో ఈ సారైనా అర్థవంతమైన చర్చ జరిగేనా? అనే అమనుమానాలు కలుగుతున్నాయి. ప్రతీసారి తూతూమంత్రంగా కౌన్సిల్ సమావేశం జరుగుతోందనే విమర్శలున్నాయి. 2గంటల్లోనే మమ అని ముగించడంపై నగర ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక ప్రజల సమస్యలు గాలికొదిలి ఆదాయ మార్గాలకు అవకాశం ఇచ్చేవిధంగా ఎజెండా అంశాల్లో చేర్చినట్టు తెలుస్తోంది. దీనిపై ప్రతిపక్ష నేతలు ఎంత మొత్తుకున్నా పాలకవర్గం పట్టించుకోవడం లేదని ప్రతిపక్ష కార్పొరేటర్లు విమర్శిస్తున్నారు.



నగరంలో సమస్యలు ఇలా..

లోతట్టు ప్రాంతాలలో సీసీ, డ్రైనేజీలు నిర్మించాలి. ఆక్రమిత డ్రైనేజీ కాల్వలను వెడల్పు చేయాలి. ప్రజావాణి కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ విభాగంపై వస్తున్న ఫిర్యాదులపై చర్చ జరపాల్సి ఉంది. 66 డివిజన్లలో వీధి దీపాల సమస్యను పరిష్కరించాలి. అలాగే నగరంలో చాలా చోట్ల వీధిలైట్లు వెలగడం లేదు. కాంట్రాక్టర్లు, ఇంజనీరింగ్ అధికారుల అలసత్వం వల్ల నగరంలో చాలాచోట్ల తాగునీరు వృథాగా పోతోంది. ప్రధానంగా పోచమ్మమైదాన్ నుంచి దేశాయిపేట ఫిల్టర్‌బెడ్ వరకు తరచుగా లీకేజీలు కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నారు. వరంగల్ వంద ఫీట్ల రోడ్డులో పైప్‌లైన్ పనులు నిర్వహించకపోవడం వల్ల రోడ్డుపై భారీ పైపులు ఉండడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక నగరంలో ప్రధాన (మిగతా 6వ పేజీలో)

భాషా సాహిత్యం కోసం గ్రంథాలయాలను వినియోగించండి

● వల్లంపట్ల సాహిత్య గ్రంథావిష్కరణలో రియాజ్

హనుమకొండ కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సాహితీపరంగా, సాంస్కృతిక పరంగా తెలంగాణ రాష్ట్రంలో ఓరుగల్లు స్థానం ప్రత్యేకమైందని, భాషా సాహిత్యానికై నేటి యువత గ్రంథాలయాలను వినియోగిస్తూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.డి.రియాజ్ పిలుపునిచ్చారు. ఆదివారం హనుమకొండ వాగ్దేవి కళాశాల ఆడిటోరియంలో జరిగిన సాహిత్య సదస్సులో ప్రముఖ కవి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు వల్లంపట్లపై కేయూలో నిర్వహించిన జాతీయ సదస్సు పత్రాలతో కూడిన వల్లంపట్ల సాహిత్యం, సామాజిక చైతన్యం గ్రంథాన్ని రియాజ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలుగు శాఖ విశ్రాంత ఆచార్యుడు ప్రొఫెసర్ బన్న అయిలయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో రియాజ్ మాట్లాడుతూ.. సమాజ ప్రగతికి మూలమైన భాషా సాహిత్య అభివృద్ధి కోసం రాష్ట్ర వ్యాప్తంగా గ్రంథాలయాలను మంచి గ్రంథాలతో ఉన్నతీకరిస్తున్నామన్నారు. దీనికి కావాల్సిన ప్రణాళికను సిద్ధం చేసి దశల వారిగా అన్ని గ్రంథాలయాల్లో సాహిత్య గ్రంథాలను పాఠకులకు అందుబాటులో ఉంచుతామన్నారు. భాషా సాహిత్యం పట్ల ఉత్సాహం ఉన్నవారంతా వీటిని ఉపయోగించుకొని సమాజ చైతన్యం కోసం విభిన్న ప్రక్రియల్లో సాహిత్య సృజన చేయాలని ఆయన పిలుపునిచ్చారు. హేతవాద దృక్పథాన్ని అభివృద్ధి పర్చాలనే వారి రచనలను ఆశయాలను సఫలీకృతం చేయాలన్నారు. ప్రముఖ నవలా రచయిత డాక్టర్ అంపశయ్య నవీన్ సదస్సును ప్రారంభిస్తూ.. అమెరికాకు చెందిన నోబుల్ బహుమతి గ్రహీత బాబ్ దిలానే వలే, ప్రజా వాగ్గేయకారుడిగా జీవితకాలం కృషిచేస్తున్న వల్లంపట్ల సాహిత్య అభిరుచి ఇతరులకు మార్గదర్శనంగా ఉందన్నారు. ఆచార్య బన్న అయిలయ్య అధ్యక్షోపన్యాసం చేస్తూ కిందటేడు తన ఆధ్వర్యంలో కేయూలో వల్లంపట్ల సాహిత్యంపై రెండు రోజుల జాతీయ సదస్సు విజయవంతంగా నిర్వహించామన్నారు. ఇందులో తెలుగు భాషా పరిశోధకులు సమర్పించిన వ్యాసాలను గ్రంథంగా తీసుకురావడం అభినందనీయమన్నారు. భవిష్యత్ తరాలకు ఈ గ్రంథం ఉపయుక్తంగా ఉంటుందన్నారు. డాక్టర్ తాళ్లపల్లి యాకమ్మ గ్రంథాన్ని తనదైన శైలిలో సమీక్షించారు. నాగబెల్లి జితేందర్ సామ్రాట్ స్వాగతం పలికిన సదస్సులో ప్రముఖ పర్యావరణవేత్త ఠాకూర్ రతన్‌సింగ్, కాళోజీ ఫౌండేషన్ కార్యదర్శి వీఆర్ విద్యార్థి, గంటా రామిరెడ్డి, ప్రొఫెసర్ పొడిశెట్టి కృష్ణమాచారి, డాక్టర్ పొన్నాల ఉపేందర్ తదితరులు వల్లంపట్ల సాహిత్య కృషిని కొనియాడుతూ మాట్లాడారు. అనేక మంది సాహితీ ప్రియులు, తెలుగు పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.


వల్లంపట్ల సాహిత్యంపై గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

రైఫిల్ షూటింగ్‌లో
గోపాల్‌రావుకు గోల్డ్ మెడల్


గోపాల్‌రావు

సంగెం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాపులకనపర్తి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఎర్రబెల్లి గోపాల్‌రావు రైఫిల్ షూటింగ్‌లో గోల్డ్‌మెడల్ సాధించారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లా కేంద్రంలోని ఐటీసీ హోటల్‌లో జరిగిన 50 మీటర్స్ స్మాల్‌బోర్ రైఫిల్ ప్రోన్ ఈవెంట్లలో కాపులకనపర్తి గ్రామానికి చెందిన ఎర్రబెల్లి గోపాల్‌రావు గోల్డ్‌మెడల్ సాధించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎం.మల్లికార్జున్ నాయక్ అవార్డుతో పాటు గోల్డ్‌మెడల్ అందించారు. గోపాల్‌రావు గత కొన్నేళ్ళుగా రైఫిల్ షూటింగ్‌లో రాణిస్తూ పలువురి మన్ననలు పొందుతున్నారు.

7న జిల్లా స్థాయి చెస్ టోర్నీ

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7న పబ్లిక్‌గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉమ్మ డి వరంగల్ జిల్లా స్థాయి చెస్ పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వహణ కార్యదర్శి కన్నా ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-17 బాలబాలికల విభాగంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి టోర్నీలో పాల్గొనే బాలబాలికలు 1 జనవరి 2008 తరువాత జన్మించిన వారు ఈ పోటీలకు అర్హులని కన్నా సూచించారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 4 బాలురు, 4 బాలికలను డిసెంబరు మూడోవారం హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు సెల్ 90595 22986 నెంబరులో సంప్రదించాలని కన్నా కోరారు.

ఫంగస్ బీర్ల కలకలం

మద్యం ప్రియుల ఆందోళన



బార్ నిర్వాహకులకు ఫంగస్ బీర్లను చూపిస్తున్న కస్టమర్, బీరులో వచ్చిన ఫంగస్

హసన్‌పర్తి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ కార్యాలయానికి కూతవేటు దూరంలోని సాయిని వెంటేజ్ బార్ అండ్ రెస్టారెంట్‌లో ఫంగస్ బీర్ల వివాదం కలకలం రేపింది. సీతంపేటకు చెందిన కొంతమంది గురువారం రాత్రి సాయిని వెంటేజ్ బార్‌లో బీర్లు కొనుగోలు చేసి మద్యం సేవిస్తుండగా రెండు బీర్లలో ఫంగస్ రావడంతో మద్యం ప్రియులు ఆందోళనకు దిగారు. బార్ నిర్వాహకులకు మద్యంప్రియులకు తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. అయితే బార్ నిర్వాహకులు మాత్రం తమ తప్పేమి లేదని, కంపెనీ నుంచి కొనుగోలు చేసిన బీర్లేనని, తాము తయారు చేసినవి కాదని చేతులు దులుపుకునే ప్రయత్నం చేయడంతో వివాదం ముదిరింది. దీంతో ఓ మద్యం ప్రియుడు డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఫంగస్ బీర్లను పరిశీలించి సమస్య సద్దుమణిగేందుకు కృషి చేసినట్లు తెలిసింది. ఈ విషయంపై ఎస్సై దేవేందర్‌ను ఫోన్‌లో వివరణ కోరగా కస్టమర్ కన్జూమర్ ఫోరంలో వేసుకోవచ్చని సలహా ఇచ్చారు.

బీరు బాటిల్‌లో చెత్త

● ఆందోళన వ్యక్తం చేసిన యువకుడు.. వర్ధన్నపేట అక్షయ బార్‌లో ఘటన


బీరు బాటిల్‌లో వచ్చిన చెత్త

వర్ధన్నపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని అక్షయ బార్ అండ్ రెస్టారెంట్‌లో బీరు బాటిల్‌లో చెత్త చెదారం వచ్చిన సంఘటన అదివారం చోటు చేసుకుంది. బాధిత యువకుడు తెలిపిన వివరాల ప్రకారం.. అదివారం మధ్యాహ్నం బీరు తాగి సేదతీరుదామని వర్ధన్నపేట పట్టణంలోని అక్షయ బార్‌లో బీరు కొనుగోలు చేసి తాగేందుకు గ్లాస్‌లో పోయగా , అధికంగా చెత్త రావడంతో అవాక్కయిన యువకుడు వీడియో తీసి బార్‌లో వ్యక్తులందరికీ చూపించి ఆందోళన వ్యక్తం చేశాడు. దీంతో బార్ యాజమని కలుగజేసుకొని యువకుడికి మరోక బీరు బాటిల్ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. ఎక్సైజ్ అధికారులు బార్‌లను తనిఖీలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అండర్-14 క్రికెట్ విజేత హనుమకొండ


అండర్-14 అంతర్ జిల్లాల క్రికెట్ విజేతగా నిలిచిన హనుమకొండ జిల్లా జట్టుతో నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ జిల్లాల అండర్-14 క్రికెట్ పోటీల్లో హనుమకొండ జిల్లా జట్టు విజయకేతనం ఎగరవేసింది. ఆదివారం వంగాలపల్లి క్రికెట్ మైదానంలో నిర్వహించిన వరంగల్ జిల్లా వర్సెస్ హనుమకొండ జిల్లా క్రికెట్ ఫైనల్ పోటీలను వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది ప్రవీణ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలకు చెందిన క్రికెటర్లను వెలుగులోకి తీసుకురావడానికి ఈ నెల 26న వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు జయశంకర్ భూపాలపల్లి జిల్లాల నుంచి ఆరు జట్లను ఎంపిక లీగ్ కం నాకౌట్ పద్ధతిన పోటీలు ప్రారంభించామన్నారు. ఈ ఆరు జట్లకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా క్రీడామైదానంతో పాటు హనుమకొండ జిల్లా కేంద్రంలోని వంగాలపల్లి క్రికెట్ మైదానాల్లో నాలుగు రోజులుగా పోటీలు నిర్వహించమన్నారు. ఈ మేరకు హనుమకొండ, వరంగల్ జిల్లా జట్ల మధ్య హోరాహోరీగా జరిగిన ఫైనల్ పోరులో హనుమకొండ జిల్లా జట్టు అంతర్ జిల్లా అండర్-14 విజేతగా నిలిచిందని ఆయన వెల్లడించారు. విజేతగా నిలిచిన హనుమకొండ జిల్లా జట్టులో బౌలింగ్, బ్యాటింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను డిసెంబరు చివరి వారంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న అండర్-14 బాలుర క్రికెట్ టోర్నీకి ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు తోట రాము, సంయుక్త కార్యదర్శి ఉపేందర్, కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎన్నికల జనరల్ అబ్జర్వర్‌గా
బాల మాయాదేవి

● ఫిర్యాదుల కోసం

8712735548 మొబైల్ నెంబర్

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రెండో విడత సాధారణ పంచాయతీ ఎన్నికల జిల్లా జనరల్ అబ్జర్వర్‌గా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయాదేవిని నియమించారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకు ఆమె విధుల్లో ఉంటారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘనకు సంబంధించిన సమాచారాన్ని, సమస్యలను నేరుగా ఆమె దృష్టికి తీసుకెళ్లవచ్చు. మండలం, గ్రామాలకు చెందిన వివిధ రాజకీయ పార్టీలు, ప్రజలు, ప్రజా సంఘాలు ఎవరైనా మొబైల్ నెంబర్ 8712735548 ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత పాటించడానికి ఈ అవకాశం కల్పించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సత్యశారద ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆల్ పెన్షనర్స్ సభను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సీతారాం

హనుమకొండ చౌరస్తా, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 2న హనుమకొండ అంబేద్కర్ భవన్‌లో నిర్వహించనున్న తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ మహాసభను విజయవంతం చేయాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తూపురాణి సీతారాం పిలుపునిచ్చారు. ఆదివారం హనుమకొండ చౌరస్తాలోని విద్యానికేతన్ పాఠశాలలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ మహాసభ సన్నాహక సమావేశం కలువల చంద్రమౌళి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సీతారాం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అంబేద్కర్ భవన్‌లో జరుగనున్న జిల్లా మహాసభలో పెన్షన్ భద్రత-ప్రభుత్వాల తీరుతెన్నులు, మన కర్తవ్యం గురించి సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య పాల్గొని తన సందేశాన్ని అందిస్తారన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధానకార్యదర్శి నారాయణగిరి వీరన్న, సభ్యులు మహేందర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు విభాగంలో
నిధుల దుర్వినియోగం

ఇంటెలిజెన్స్ డీజీకి హోంగార్డు ఫిర్యాదు

వరంగల్ క్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషనరేట్ హోంగార్డు విభాగంలో నిధులు దుర్వినియోగం జరిగినట్లు ఇంటెలిజెన్స్ డీజీతో పాటు రాష్ట్ర పోలీస్ అధికారులకు 15 నెలల కిందట సస్పెండ్‌కు గురైన హోంగార్డు మేకల గోపి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు డీజీ ఆదేశాలతో జిల్లా ఇంటెలిజెన్స్ అధికారులు తనను కార్యాలయానికి పిలిపించుకొని వివరాలు తెలుసుకున్నట్లు హోంగార్డు వెల్లడించారు. అదేవిధంగా తనపై హనుమకొండ పోలీస్ స్టేషన్‌లో తప్పుడు కేసు నమోదు చేసి విధుల్లో నుంచి తొలగించారన్నారు. దీనిపై సీపీకి ఫిర్యాదు చేయగా ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ విచారణ చేసి ఎలాంటి ఆధారాలు దొరకలేదని రిపోర్ట్ ఇచ్చారన్నారు. ఏ తప్పు చేయని తనను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని బాధిత హోంగార్డు సీపీ సన్‌ప్రీత్ సింగ్‌ను కోరుతున్నారు.

వైబ్రాంట్ టాలెంట్ టెస్టుకు విశేష స్పందన


వైబ్రాంట్ టాలెంట్ టెస్టు పరీక్షకు హాజరైన విద్యార్థులు

హనుమకొండ టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని వైబ్రాంట్ (రాజస్థాన్ కోట) టాలెంట్ టెస్టుకు ఆదివారం విశేష స్పందన వచ్చిందని వైబ్రాంట్ అకాడమీ డైరెక్టర్ సీహెచ్ రాజేందర్‌రెడ్డి అన్నారు. వైబ్రాంట్ సీటు స్కాలర్‌షిప్ టెస్టుకు నిర్వహించిన పరీక్షలకు పదో తరగతి చదువుతున్న విద్యార్థులు 1,479 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా అందులో 868 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరై విజయవంతం చేశారని తెలిపారు. విద్యార్థులకు ఐఐటీ, జేఈఈ, నీట్ సంబంధించిన విషయాలపై పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో అకాడమీ అడ్మిన్ జి. రఘుపతి, అకాడమీ హెడ్ రామకృష్ణ, అకాడమిక్ కో ఆర్డినేటర్ రాము, ఏజీఎంలు జి.రాజు, డి.రాజు, ఎం.నారాయణసింగ్, మార్కెటింగ్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ఈఈయూ- 327లో
నరసింహారావు చేరిక


దానంను 327లోకి కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఇనుగాల శ్రీధర్

రాంనగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్-327లో కేటీపీఎస్ ఎంప్లాయిస్ కో-ఆపరేట్ సొసైటీ డైరెక్టర్ దానం నరసింహారావు చేరారు. అదివారం హనుమకొండ పల్లా రవీందర్‌రెడ్డి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో 327 యూనియన్ సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ యూనియన్ కండువా కప్పి దానంను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జెన్కో అధ్యక్షుడు పిన్నింటి మాధవరావు, సెక్రటరీ సీహెచ్ సాయిబాబా, భద్రాద్రి జిల్లా లేబర్ సెల్ చైర్మన్ సాదం రామకృష్ణారావు, జెన్కో వర్కింగ్ ప్రెసిడెంట్ జక్కుల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్షా.. సమస్యలు తీర్చరా..?!

(5వ పేజీ తరువాయి)

రహదారులపై ఏర్పడిన గుంతల కారణంగా వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. నగరంలోని మురుగు కాల్వలలో పూడికతీత పనులు పారదర్శకంగా నిర్వహించలేదు. దీంతో కాల్వలలో గుర్రపుడెక్క, చెత్త చెదారం పేరుకుపోయింది. శానిటేషన్ సిబ్బంది రోడ్లు, మురుగు దొడ్లు, డ్రైనేజీలు శుభ్రం చేయడం లేదు. రోడ్లను శుభ్రం చేయడానికి కోట్లు వెచ్చించి దిగుమతి చేసిన అధునాతన భారీ వాహనాలు మూలకు పడ్డాయి. ఇంకా చాలాకాలనీలలో అర్బన్ మలేరియా సిబ్బంది నిర్లక్ష్యం వల్ల దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దోమల మందు, ఫాగింగ్ చేయకపోవడం వల్ల దోమలు వృద్ధి చెంది ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వీటిపై కౌన్సిల్ సమావేశంలో చర్చ జరిగేవిధంగా ప్రతిపక్ష కార్పొరేటర్లు సిద్ధమవ్వాలని ప్రజలు సూచిస్తున్నారు.

నిధుల వాడకంలో విఫలం

గ్రేటర్ వరంగల్ నగరపాలక సంస్థకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్మార్ట్ సిటీతో పాటు ప్రత్యేక నిధులు కేటాయించినా సంబంధిత అధికారులు నిధులు ఖర్చు చేయడంతో విఫలమయ్యారు. దీంతో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. ఇంకా నగరంతో పాటు విలీనగ్రామాలలో చాలాకాలంగా సమస్యలు స్వైరవిహారం చేస్తున్నాయి. వీటిపై సహేతుక వాదనలు జరగాల్సి ఉంది.

ఇన్‌చార్జి పాలనలో అస్తవ్యస్తం

గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంతో పాటు కాశిబుగ్గ, కాజీపేట సర్కిల్ కార్యాలయాలతో పాటు నక్కలగుట్ట, పబ్లిక్‌గార్డెన్ కార్యాలయాల్లో సరైన సిబ్బంది లేక ఇన్‌చార్జిల పాలనలో అవినీతి రాజ్యమేలుతోందనే ప్రచారం ఉంది. టౌన్‌ప్లానింగ్‌లో ప్రధాన అధికారి లేక యేడాదిన్నర అవుతోంది. అప్పటినుంచి ఇన్‌చార్జి అధికారి హవా సాగుతున్నట్లు తెలుస్తోంది. అయితే పోస్టింగ్‌పై వచ్చిన అధికారులు ఇక్కడి పాలకవర్గం ఒత్తిడి భరించలేక వెళ్లిపోతున్నట్లు ఉద్యోగులు గుసగుసలాడుకుంటున్నారు. ఇక గ్రేటర్ పరిధిలో కీలకమైన సీపీ (సిటీ ప్లానర్) బయాలజిస్ట్, సెక్రెటరీ పోస్టులతో పాటు మరో 30 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక శానిటేషన్ విభాగంలో 3వేల మంది పబ్లిక్ హెల్త్ (పీహెచ్) వర్కర్లలో చాలామంది కార్మికులు విధులు నిర్వహించడం లేదని ఆరోపణలున్నాయి. దీనిపై జరిగే కౌన్సిల్ సమావేశంలో ప్రతిపక్ష కార్పొరేటర్లు లేవనెత్తే అవకాశాలు ఉన్నట్టు తెలిపారు.

అంశాలు ఇలా..

గత కౌన్సిల్ సమావేశంలో డివిజన్‌ల అభివృద్ధికి రూ.50లక్షల చొప్పున ఇచ్చిన నిధుల బిల్లులు విడుదల చేయకపోవడంతో కార్పొరేటర్లు నిలదీసే అవకాశం ఉంది. యూజీడీ డీపీఆర్‌లు సిద్ధం చేయడానికి ఎన్‌కే బిల్డ్‌కాన్ సంస్థకు రూ.1.85కోట్ల అడ్వాన్స్, చెత్త తరలింపునకు రెండు కాంపాక్టర్ వాహనాల కొనుగోలుకు రూ.2.80కోట్లు, అమృత్ 2.0 పథకం నుంచి రూ.3కోట్ల వ్యయంతో నగరంలో 5 ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరపనున్నారు. హనుమకొండ జేఎన్ఎస్‌లో రూ.కోటితో ఐమాస్ లైట్ల ఏర్పాటు, వీధి లైట్ల టెండరు ముగియడంతో ఐదేళ్లపాటు స్వయంగా ఆర్ఎఫ్‌పీ టెండర్‌ను ఆమోదిస్తారు. అలాగే ప్రతీ డివిజన్‌లో రూ.1కోటితో అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 66 డివిజన్‌లలో జరిగే అభివృద్ధి పనులకు సంబంధించి టెండర్లను ఆహ్వానించనున్నారు. అంతేకాక బల్దియా ఆదాయ మార్గాన్ని పెంచుకునేందుకు గ్రేటర్ ఇండోర్ స్టేడియం ప్రైవేటు వ్యక్తులకు అద్దెకు ఇవ్వడంతో పాటు హనుమకొండ చౌరస్తా, హెడ్ పోస్టాఫీస్, నగరంలోని ప్రభుత్వ స్థలాలు ట్రాఫిక్ పాయింట్లుగా మార్చాలని ప్రతిపాదనలు ఆమోదానికి సిద్ధం చేశారు. ఇంకా పశ్చిమ ఎమ్మెల్యే సూచనల మేరకు ఏకశిల పార్క్, అంబేద్కర్ భవన్, కాజీపేట సర్కిల్ కార్యాలయంలో క్యాంటీన్‌లు ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు.

నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు

• ప్యాడీ క్లీనర్‌లో శుభ్రపరిస్తేనే టోకెన్ • కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోతున్న ధాన్యం రాశులు • రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు

ఖానాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ నత్తనడకన నడుస్తున్నాయి. మండలవ్యాప్తంగా ఇంకా 15 కొనుగోలు కేంద్రాల్లో కాంటాలే మొదలవలేదు. వాస్తవానికి వరంగల్ జిల్లాలోనే అత్యధికంగా వరి పంటను పాకాల ఆయకట్టు కింద సాగుచేశారు. 25 రోజుల కిందటే పాకాల ఆయకట్టులో వరి కోతలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్ల కోసం మండల వ్యాప్తంగా 24 కేంద్రాలను మంజూరు చేసింది. కాగా, ఇప్పటికే 22 కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం మండలవ్యాప్తంగా కేవలం 18,500 బస్తాలు కొనుగోళ్ల మాత్రమే అయ్యాయి.

ప్యాడీ క్లీనర్‌లో శుభ్రపరిస్తేనే టోకెన్

రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన అనంతరం నిబంధనల ప్రకారం ప్యాడీ క్లీనర్‌లో ధాన్యాన్ని శుభ్రపరిస్తేనే వ్యవసాయాధికారులు టోకెన్ ఇస్తున్నారు. ఈ నిబంధన రైతులకు గుదిబండగా మారింది. పాకాల ఆయకట్టులో పెద్దపెద్ద రైతులు ఉన్నారు. ఒక్కో కొనుగోలు కేంద్రానికి వేలాది బస్తాల ధాన్యం వస్తుంటుంది. అసలే కూలీల కొరత ఉన్న నేపథ్యంలో ప్యాడీ క్లీనర్‌లో ధాన్యం శుభ్రపర్చడం రైతులకు అసాధ్యంగా మారింది. ప్యాడీ క్లీనర్‌లో శుభ్రం చేసాకే ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలంటే నెలల తరబడి సమయం పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ఖానాపురం సబ్ మార్కెట్ యార్డులో కొనుగోళ్లు లేక నిలిచిపోయిన ధాన్యం

మొండికేస్తున్న రైతులు

ఖానాపురం సబ్ మార్కెట్ యార్డులోని కొనుగోలు కేంద్రానికి రైతులు ధాన్యం తీసుకువచ్చి 20 రోజులు దాటింది. ప్యాడీ క్లీనర్‌లో శుభ్రపరిచాకే టోకెన్ ఇస్తామని వ్యవసాయాధికారులు అంటుండగా రైతులు మాత్రం ప్యాడీ క్లీనర్ నిబంధన లేకుండానే కొనుగోలు చేయాలని మొండికేసి రోజుల తరబడి కొనుగోళ్ల కోసం ఎదురుచూస్తున్నారు. ఒక కొనుగోలు కేంద్రానికి ఒకటే ప్యాడీ క్లీనర్ ఇచ్చి వేలాది బస్తాల ధాన్యం శుభ్రం చేయాలంటే ఎలా సాధ్యమవుతుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. రైతు ఒక్కడే ధాన్యం శుభ్రం చేసుకోలేడు. అందుకు కూలీలపై ఆధారపడాలి. పైగా ప్యాడీ క్లీనర్ కరెంటు ఉన్నప్పుడే పనిచేస్తుంది. కరంటు పోతే ఎప్పుడు వస్తుందో తెలియదు. కొన్ని కొనుగోలు కేంద్రాల్లో కరెంటు వసతి లేదు. ఇలాంటి పరిస్థితుల్లో రైతు ధాన్యం శుభ్రం చేసుకోవాలంటే ఎన్ని రోజులు పడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

గతంలో మాదిరిగానే కొనుగోళ్లు చేపట్టాలి

పాకాల ఆయకట్టులో కొన్నేళ్లుగా చేపడుతున్న మాదిరిగానే ఈ ఏడాది అదేవిధంగా కొనుగోళ్లను చేపట్టాలని రైతులు కోరుతున్నారు. లేకుంటే ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేసున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి పాకాల ఆయకట్టులో ప్యాడీ క్లీనర్ నిబంధనను ఎత్తివేయాలని రైతులు కోరుతున్నారు.

పోలింగ్‌కు పటిష్ఠ భద్రత

(5వ పేజీ తరువాయి)

కేంద్రాల వద్ద ఇద్దరు పోలీసు సిబ్బందిని నియమిస్తే సమస్యాత్మక కేంద్రాల వద్ద అదనపు పోలీసు బలగాలు, సాయుధ రిజర్వు దళాలు, అవసరమైతే కేంద్ర బలగాలను దించుతారు. అవసరమైతే ఇక్కడ రెండు లేదా మూడు సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తారు. పోలింగ్ క్రతువు నిష్పాక్షికంగా జరిగేలా పర్యవేక్షించటానికి సూక్ష్మ పరిశీలకులను నియమిస్తారు. అత్యంత సున్నితమైన కేంద్రాల వద్ద పోలింగ్ సరళిని కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్, రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం నుంచి ప్రత్యక్షంగా వెబ్ క్యాస్టింగ్ ద్వారా పర్యవేక్షిస్తారు. పోలింగ్ కేంద్రాల్లో జరిగే ప్రక్రియను రికార్డు చేయడానికి సీసీ కెమెరాలు అమర్చుతారు. ఎక్కడ చిన్న అల్లరి జరిగినా నిమిషాల్లో ఘటనాస్థలికి చేరుకోవడానికి క్విక్ రెస్పాన్స్ టీమ్స్, ఫ్లయింగ్ స్క్వాడ్స్ నిరంతరం పెట్రోలింగ్ చేస్తాయి. నేరచరితగల వ్యక్తులకు అరెస్టు వారెంట్లు అమలు చేయటం, బైండోవర్ వంటి చర్యలు చేపడతారు. సమస్యాత్మక ప్రాంతాల పరిధిలో లైసెన్సుడ్ రివాల్వర్లు కలిగిన వారి నుంచి ముందు జాగ్రత్తగా పోలింగ్ ముందే వాటిని స్వాధీనం చేసుకుంటారు. గొడవలకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో ప్రచార సరళిపై నిఘా వేసి ఉంచుతారు. సమస్యాత్మక ప్రాంతాల్లోని రౌడీషీటర్లు, గొడవలు చేసేవారని పోలీసు రికార్డుల్లో ఇది వరకే నమోదైన వారిని ఇప్పటికే వెతికిపట్టి బైండోవర్ చేశారు. రౌడీ షీటర్లకు పోలీసుస్టేషన్లలో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రతీరోజు పోలీసుస్టేషన్‌కు వచ్చి హాజరు వేసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా గత లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా గొడవలు జరిగిన ప్రాంతాలనే ఈ పంచాయతీ ఎన్నికల్లో సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించారు. గత ఎన్నికల్లో గొడవలు చేసిన వారి వివరాలను సేకరించి వారి కదలికలపై నిఘా పెట్టారు. వీరిలో నేరచరిత్ర కలిగిన వారిని ఇప్పటికే బైండోవర్ చేశారు.

సమస్యాత్మకం అంటే..

గత సాధారణ లేదా స్థానిక ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల వద్ద గొడవలు, ఘర్షణలు, హింసాత్మక ఘటనలు జరిగినా, ఏదైనా కారణంతో రీపోలింగ్ నిర్వహించినా, ఓటర్లను ప్రలోభాలకు గురిచేయటం వంటి కేసులు నమోదైన ప్రాంతాలను సమస్యాత్మంగా గుర్తిస్తారు. మావోయిస్టుల ప్రభావం ఉన్నా, అంతరాష్ట్ర, అంతర్ జిల్లా సరిహద్దులకు సమీపంలోని పోలింగ్‌కేంద్రాల్లోకి బయటి వ్యక్తులు వచ్చే అవకాశమున్నా కూడా వాటిని కూడా సమస్యాత్మకమైన విగా పరిగణిస్తారు. సామాజిక వర్గాలు, రాజకీయ పార్టీల మధ్య తీవ్రమైన విబేధాలు లేదా కక్షలు కలిగిన ప్రాంతాలు, ఆయా మండలాల పరిధిలో ఏఏ గ్రామాల్లో నేరాలు, గొడవలు ఎక్కువగా జరుగుతున్నాయనే పోలీసు రికార్డుల ఆధారంగా సమస్యాత్మక ప్రాంతాలుగా పరిగణిస్తారు. పరిస్థితుల తీవ్రతను బట్టి మూడు కేటగిరీలుగా సమస్యాత్మక కేంద్రాలను ఎంపిక చేస్తారు. మావోయిస్టు సమస్య ఉన్న ప్రాంతాలను అత్యంత సమస్యాత్మక, రాజకీయ పార్టీ మధ్య పోటీ వాతావరణం ఆధారంగా సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తిస్తారు.

హెచ్చరికలు జారీ


నిబంధనలకు విరుద్ధంగా వేలం పాటలు నిర్వహించడం, బలవంతంగా ఏకగ్రీవాలు చేసేందుకు పాల్పడితే కేసులు పెడతామని పోలీసు అధికారులు హెచ్చరించారు. ఈ మేరకు మైకుల ద్వారా ప్రచారం కూడా చేస్తున్నారు. పోలీసు ఉన్నతాధికారులు సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించి తాజా పరిస్థితిని తెలుసుకుంటున్నారు. అక్కడ చేయాల్సిన భద్రతా ఏర్పాట్లపై మార్గదర్శనం నెరపుతున్నారు. సంబంధిత పోలీసుస్టేషన్ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. ఎన్నికల ప్రక్రియలో సహకరించాలని ఓటర్లకు ప్రత్యేంగా విజ్ఞప్తులు చేస్తున్నారు. ప్రస్తుతం నామినేషన్ల ప్రక్రియ ముగిసిన తర్వాత ఎన్నికల ప్రచారం జోరందుకోగానే సమస్యాత్మక ప్రాంతాల్లో భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు పోలీసు యంత్రాంగాలు కసరత్తు చేస్తున్నాయి. ప్రచారం సందర్భంగానూ, పోలింగ్‌రోజునా పగలు రాత్రి విజిబుల్ పోలింగ్ నిర్వహించనున్నారు. సిబ్బంది యూనిఫాంతో కనిపించేలా తిరుగుతారు. రాత్రి వేళల్లో వాహనాల తనిఖీలు నిర్వహిస్తారు. సమస్యాత్మక గ్రామాల్లో అప్పుడే చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను నియంత్రిస్తున్నారు. ముమ్మరంగా తనఖీలు చేస్తున్నారు. అనుమానాస్పద కదలికలు గమనించిన వెంటనే డయల్ 100, జిల్లా కంట్రోల్ రూమ్‌కి సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.



బరిలో రెబల్స్

- నేతల్లో గుబులు
- ఉపసంహరించుకునేలా పావులు
- బుజ్జగింపునకు ప్రయత్నాలు
- ముఖ్యనేతలకు తలనొప్పిగా మారిన వైనం

హనుమకొండ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ఘట్టం శనివారం ముగిసింది. దీంతో సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్ని నామినేషన్లు దాఖలైంది తెలిసిపోయింది. ఆదివారం నామినేషన్ల పరిశీలన జరిగింది. చెల్లిన నామినేషన్లు ఎన్నో స్పష్టమైంది. దీనిని బట్టి సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు ఎంత మంది పోటీలో ఉన్నది తేలింది. సోమవారం విజ్ఞప్తుల స్వీకరణ ఉంది. వాటిని డిసెంబర్ 2న పరిశీలించి, పరిష్కరిస్తారు. డిసెంబర్ 3న ఉపసంహరణలు జరిగిన తర్వాత మొదటి విడత ఎన్నికల్లో ఎంత మంది పోటీ పడుతుంది ముఖ్య చిత్రం తేటతెల్లం అవుతుంది. అయితే ముఖ్య నేతల్లో, ముఖ్యంగా ఆశావహుల్లో టెన్షన్ మొదలైంది. మొదటి విడత ఎన్నికలు జరిగే 69 సర్పంచ్ స్థానాలకు 496 నామినేషన్లు పడ్డాయి. అంటే ఒక్కో స్థానానికి 7 పోటీ పడుతున్నారు. అలాగే 658 వార్డు స్థానాలకు 1747 నామినేషన్లు దాఖలయ్యాయి. ఒక్కో వార్డులో ఇద్దరి నుంచి ముగ్గురు బరిలో ఉన్నారు. ఈ పరిస్థితి ఆశావహులను కలవరపరుస్తున్నది. వీరంతా బరిలో ఉంటే తమ గెలుపు అవకాశాలు ఎక్కడ దెబ్బ తింటాయోనని ఆందోళన చెందుతున్నారు. పైగా వీరిలో ఎక్కువ మంది తిరుగుబాటుదారులే ఉండడంతో మరింత టెన్షన్‌కు గురవుతున్నారు. రెబల్స్ ఉపసంహరించుకునేలా చేయాలని ఆశావహులు అప్పుడే ప్రధాన పార్టీల ముఖ్య నేతలు, ఎమ్మెల్యేలపై ఒత్తిడి తెస్తున్నట్టు తెలుస్తోంది. అధికార పార్టీ నేతలకు ఇది అగ్ని పరీక్షగా మారింది. తమ పార్టీ మద్దతుదారులు గెలిచేలా వీలైనంత మేరకు ఏకగ్రీవం చేయాలని ప్రయత్నిస్తున్న నేతలకు ఇందుకు భిన్నంగా పెద్ద సంఖ్యలో అభ్యర్థులు బరిలోకి దిగడంతో వారికి మింగుడు పడడటం లేదు. డిసెంబర్ 3న నామినేషన్ల ఉపసంహరణ చివరి తేదీ. ఆలోగా రెబల్స్ ఉపసంహరించుకునేట్లు ఇప్పటి నుంచే ప్రయత్నాలు మొదలయ్యాయి. పార్టీ అండతో బరిలో ఉన్న అభ్యర్థులకు మద్దతుగా రెబల్స్ బరిలో నుంచి తప్పుకునేలా పావులు కదుపుతున్నారు. నయానో, బయానో ఒప్పించే ప్రయత్నం చేస్తున్నారు. ఉపసంహరణల గడువు ముగిసిన తర్వాత వారిని బరిలో నుంచి



తప్పించుకునేందుకు వీలుకాదు కనుక మిగిలిన 48 గంటల్లో వారిని తమ దారికి తెచ్చుకునేందుకు మంతనాలను జోరుగా జరుపుతున్నారు. నజరాలను ఆశచూపుతున్నారు. వచ్చే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో అవకాశం ఇస్తామని కూడా హామీలు ఇస్తున్నట్టు తెలుస్తోంది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలకే ఈ రెబల్ బెడద అధికంగా ఉన్నట్టు సమాచారం. ఇది ఈ రెండు పార్టీల నేతలకు తలనొప్పిగా మారింది. ఎవరిని బరిలో ఉంచాలో, ఎవరిని తప్పుకునేలా బుజ్జగించాలో తెలియని పరిస్థితి నెలకొంది. ఆశావహులు సైతం తిరుగుబాటుల దారులను బుజ్జగించేందుకు తమ వంతు ప్రయత్నాలను సాగిస్తున్నారు. ఉపసంహరణల తర్వాత మొదటి విడత ఎన్నికల ముఖచిత్రం స్పష్టం కానున్న నేపథ్యంలో ఎన్నికల రాజకీయం అంతకంతకు వేడెక్కుతున్నది. అత్యధిక స్థానాలు దక్కించుకోవాలనే వ్యూహరచనలో ఉన్న ప్రధాన రాజకీయ పార్టీలు సమర్థులు, అంగబలం, అర్థబలం ఉన్న అభ్యర్థులకే పూర్తి మద్దతు ఇచ్చేస్తున్నాయి. స్థానిక పరిస్థితుల నేపథ్యంలో జరిగే పంచాయతీ ఎన్నికల్లో ఏ చిన్న అంశాన్ని వదలకుండా అన్నిటిని నేతలు నిశితంగా గమనిస్తున్నారు. రెబల్ నామినేషన్లు వేసిన గ్రామాల్లో జాగ్రత్తగా అభ్యర్థులను బలపరిచే క్రమంలో ప్రత్యర్థి పార్టీ సపోర్టు ఉన్న అభ్యర్థి బలాబలాలు ఏమిటీ ? ఆర్థిక బలం, ప్రజాబలం ఏ మేరకు ఉంది ? అందుకు దీటుగా ఎవరిని బరిలో కొనసాగిస్తే గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉంటాయనే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. మొదటి విడత ఎన్నికలు జరిగే గ్రామ పంచాయతీల్లో ముఖాముఖి, ముక్కోణం, బహుముఖ పోటీల్లో ఏదీ ఉంటుందో నామినేషన్ల ఉపసంహరణ తర్వాత స్పష్టమవుతుంది. అయితే ప్రస్తుత పరిస్థితిని బట్టి చూస్తే చాలా గ్రామాల్లో త్రిముఖ పోటీ తప్పకపోదని భావిస్తున్నారు.

4 పర్యాయాలు రేబల్లె ఏకగ్రీవం

ఎంసీపీఐ(యూ) పార్టీ బలపరిచిన అభ్యర్థులు ఏడు సార్లు గెలుపు

దుగ్గొండి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేబల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో నాలుగు పర్యాయాలు ఏకగ్రీవంగా, ఏడు దఫాలుగా ఎంసీపీఐ(యూ) పార్టీ బలపరిచిన అభ్యర్థులు సర్పంచ్‌లుగా గెలిచారు. మండలంలోని రేబల్లె గ్రామ పంచాయతీ 1981లో ఏర్పడింది. జనాభా 1500, ఉండగా ఓటర్లు 999 మంది ఉన్నారు. 8 వార్డులు ఉన్నాయి. 1981లో గ్రామ పంచాయతీ ఏర్పాడిన మొదటిసారిగా ఉమ్మడి సీపీఎం బలపరిచిన కాసుల వీరభద్రయ్య సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. 1990లో ఎంసీపీఐ(యూ) బలపరిచిన అభ్యర్థి గటిక వీరస్వామి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. గటిక వీరస్వామి గెలిచిన ఏడాదికే నక్సల్స్‌తో హత్య చేయబడ్డాడు. 1991లో ఎంసీపీఐ (యూ) బలపరిచిన అభ్యర్థి సిరిబొమ్మల పెద్ద కొంరయ్య, ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. 1995లో ఎంపీసీపీ(యూ) బలపరిచిన అభ్యర్థి కుసుంబ లక్ష్మి సర్పంచ్‌గా గెలుపొందారు. 2001లో ఎంసీపీఐ(యూ) బలపరిచిన మహ్మద్ హుస్సేన్ ఏకగ్రీవంగా గెలిచారు. 2007లో జరిగిన ఎన్నికల్లో ఎంసీపీఐ(యూ) బలపరిచిన గీసుపాక కొంరయ్య గెలిచారు. 2014లో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి మెరుగు రాంబాబు సర్పంచ్‌గా గెలుపొందారు. 2019 జరిగిన ఎన్నికల్లో ఎంసీపీఐ(యూ) బలపరిచిన అభ్యర్థి గటిక మమత సర్పంచ్‌గా గెలిచారు. గ్రామ పంచాయతీ గత నాలుగు దఫాలుగా జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో గెలుచుకోవడంతో పాటు ఒకే పార్టీ బలపరిచిన అభ్యర్థి గెలుచుకొని ప్రత్యేకతను సాధించుకున్నట్లు గ్రామస్థులు వెల్లడించారు. ఈసారి జరిగే ఎన్నికల్లో ఏ పార్టీ బలపరిచిన అభ్యర్థి గెలుచుకుంటారోనని పలువురు ముచ్చటించుకుంటున్నారు.

మాజీ సర్పంచుల బకాయిలు ఎన్ని?

- వివరాలు సేకరించిన ప్రభుత్వం
- కార్యదర్శుల బకాయిలపై ఆరా

హనుమకొండ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మాజీ సర్పంచులు తమ హయాంలో గ్రామ పంచాయతీల్లో వివిధ అభివృద్ధి పనుల కోసం తమ సొంత నిధులు ఏ మేరకు ఖర్చు పెట్టింది? మొత్తంగా బకాయిలు ఎన్ని ఉన్నాయనే అంశంపై రాష్ట్రప్రభుత్వం దృష్టి పెట్టినట్టు తెలుస్తోంది. పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ జారీ కావడానికి కొద్ది రోజుల ముందు మాజీ సర్పంచుల బకాయిల వివరాలను పంపాలని జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారులను కోరింది. పంచాయతీల వారీగా ఇప్పటి వరకు చేసిన పనులకు సంబంధించి చెల్లించాల్సిన బకాయిలు ఎంత మేరకు ఉన్నాయో చెప్పాలంటూ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు అధికారులు ఎంపీడీవోల ద్వారా పంచాయతీల వారీగా బకాయిల వివరాలను తెప్పించుకున్నట్టు తెలిసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తంగా రూ.79.68కోట్ల వరకు ఉన్నట్టు అంచనా. ఒక హనుమకొండ జిల్లాలోనే రూ.15.20 కోట్లు ఉన్నట్టు సమాచారం. 2024 జనవరి, ఫిబ్రవరితో పంచాయతీల పాలకవర్గాల గడువు ముగిసింది. అనంతరం ప్రత్యేకాధికాలరుల పాలన కొనసాగుతోంది.

కార్యదర్శుల బకాయిలు కూడా..

ప్రత్యేకాధికారుల పాలనలో కార్యదర్శులు పంచాయతీల్లో వివిధ పనులపై తమ జేబు నుంచి చేసిన ఖర్చుల వివరాలను కూడా ప్రభుత్వం అడిగినట్టు తెలుస్తోంది. పంచాయతీల్లో తాగునీరు, వీధి దీపాలు, పారిశుధ్యం, వరద ముంపు చర్యలతో పాటు అనేక రకాల పనులకు పంచాయతీ కార్యదర్శులు తమ సొంత నిధులను వెచ్చిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో వీరి బకాయిలు కూడా రూ.20కోట్ల వరకు ఉండవచ్చునని అంచనా. దీనితో మాజీ సర్పంచులు, కార్యదర్శుల బకాయిలు మొత్తంగా కలిపి రూ.99.68 కోట్ల వరకు ఉండవచ్చునని తెలుస్తోంది. సుమారు 20 నెలలకుపైగా పాలకవర్గాలు లేకపోవడంతో కేంద్రం నుంచి వచ్చే రూ. వందల కోట్ల నిధులు వెనక్కు వెళ్లకుండా డిసెంబరు లోపు ఎన్నికలు నిర్వహించి వాటిని పంచాయతీలకు మళ్లించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. అయితే ఈ బకాయిలను ఎప్పుడు చెల్లించేది స్పష్టత లేదు. పంచాయతీ ఎన్నికల తర్వాత విడుదల చేయవచ్చునని భావిస్తున్నారు.

రెండు గ్రామాల్లో ఏకగ్రీవం

ఉమ్మడి జిల్లా శాంతి నగర్, చంద్రుతండాలో సర్పంచ్‌ల ఎన్నిక



వెలంగిణి మేరీ

ఎల్కతుర్తి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో రెండు సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. ఎల్కతుర్తి మండలం శాంతినగర్ గ్రామ పంచాయతీ ఏకగ్రీవమైంది. గత సర్పంచ్ వెలంగిణి మేరిని గ్రామస్థులు రెండోసారి సైతం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో పాటు గ్రామంలో ఉన్న నాలుగు వార్డులను సైతం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 187 మంది ఓటర్లు ఉన్న శాంతినగర్‌లో 86 మంది మహిళలు, 101 మంది పురుషుల ఉన్నారు. గతంలో మాదిరిగా జనరల్ మహిళగా రిజర్వేషన్ అనుకూలించడంతో ఆమెకే రెండోసారి అవకాశం దక్కింది. కోతులనడుమ గ్రామానికి అనుబంధ గ్రామంగా ఉన్న శాంతినగర్ గత ప్రభుత్వం ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసింది, మొదటిసారిగా జనరల్ మహిళ కావడంతో మేరీని మొదటి సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే తిరిగి రిజర్వేషన్ అనుకూలించడంతో ఆమెనే రెండోసారి సైతం ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో పాటు వార్డులనూ ఏకగ్రీవం చేశారు. వరుసగా రెండుసార్లు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం విశేషం.

గుంటూర్‌పల్లి ఏకగ్రీవం?

గుంటూర్‌పల్లి పంచాయతీ పాలక వర్గం సైతం ఏకగ్రీవం కానుంది?. గ్రామంలో 6 వార్డుల్లో 386 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 196 మంది పురుషులు, 193 మంది మహిళలు ఉన్నారు. ఆరు వార్డులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా, సర్పంచ్ కోసం నెట్టెం నారాయణ, శ్రీరాంచౌదరి సుదిరెడ్డిలు ఇద్దరు నామినేషన్లు దాఖలు చేశారు. గ్రామ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని శ్రీరాంచౌదరి సుధీరెడ్డిని సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకోవడానికి నెట్టెం నారాయణను విత్‌డ్రా చేయించడానికి ఒప్పందం చేసుకున్నట్లు తెలుస్తోంది. నామినేషన్ల ఉపసంహరణ రోజున ఏకగ్రీవంగా ప్రకటించుకోనున్నట్లు తెలిసింది.

తొలి ఎన్నికల్లోనే చంద్రుతండా ఏకగ్రీవం..!



బానోత్ శ్రీను

కేసముద్రం : కేసముద్రం మండలం వెంకటగిరి శివారు నూతనంగా ఏర్పాటైన చంద్రుతండా గ్రామపంచాయతీ తొలి ఎన్నికల్లోనే ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉంది. మండలంలోనే అత్యల్పంగా 370 మంది ఓటర్లతో కూడిన ఈ గ్రామంలో తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుదారుడైన బానోత్ శ్రీను ఒక్కరే చివరి రోజైన శనివారం నామినేషన్ వేశారు. మిగిలిన ఎనిమిది వార్డులకు ఒకటి చొప్పున నామినేషన్లు దాఖలయ్యాయి. ఇక్కడ ఉపసర్పంచ్ స్థానాన్ని బీఆర్ఎస్ మద్దతుదారునికి, ఇరుపార్టీలు నాలుగు చొప్పున వార్డులను పంచుకుని ఆ మేరకు నామినేషన్లు వేసినట్లు తెలిసింది. నామినేషన్ల పరిశీలనలు, ఉపసంహరణల అనంతరం డిసెంబరు 3న వీరిని అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.

ప్రతీ ‘రోజు’కు ఓ లెక్కుంది..

- ఒకటో రోజు నామినేషన్ ప్రారంభం, 15వ రోజు ఎన్నికలు
- ఏడు రోజులు స్టేజ్-1 రిటర్నింగ్ ఆఫీసర్, ఆపై స్టేజ్-2 ఆర్వోలదే బాధ్యత

కేసముద్రం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రతీరోజుకు ఓ లెక్క ఉంటుంది. నామినేషన్ల ప్రారంభం నుంచి ఎన్నికల వరకు తేదీల వారీగా షెడ్యూల్‌ను ఎన్నికల అధికారులు సాధారణంగా విడుదల చేస్తారు. అయితే ఎన్నికల నిర్వహణలో తేదీలతో పాటు ‘రోజు’ వారీగా వ్యవహారాలు పరిగణలోకి తీసుకుంటారు. మూడు దశల్లో నిర్వహించే పంచాయతీ ఎన్నికల్లో తేదీలు వేర్వేరుగా ఉన్నప్పటికీ రోజువారీగా జరిగే ప్రక్రియ అంతా ఒకే విధంగా ఉంటుంది.



ఇందులో మొదటి ఏడు రోజులు ‘స్టేజ్-1’గాను, ఆ తర్వాత ఎనిమిదో రోజు నుంచి ఎన్నికల రోజు వరకు ‘స్టేజ్-2’గాను పరిగణిస్తారు. మొదటి (డే1)రోజు నామినేషన్ ప్రారంభమైతే ఆ రోజు నుంచి సరిగ్గా 15వ రోజున ఎన్నికలు నిర్వహిస్తారు. స్టేజ్-1లో రిటర్నింగ్ అధికారి (ఆర్వో-1) మొదటి మూడు రోజులు నామినేషన్లను స్వీకరించడం, నాలుగో రోజున సాయంత్రం 5 గంటల లోపు వరకు నామినేషన్ల పరిశీలన, ఐదో రోజున సాయంత్రం 5 గంటల లోపు వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. ఆరో రోజున సాయంత్రం 5 గంటల లోపు అభ్యంతరాలపై సంక్షిప్త దర్యాప్తు జరిపి పరిష్కరిస్తారు. ఏడో రోజున మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను ఉపసంహరించుకుంటారు. ఒక్క నామినేషన్ ఉంటే అదే రోజున ఏకగ్రీవంగా ప్రకటించి గెలిచినట్లుగా ధ్రువీకరణపత్రాన్ని జారీ చేస్తారు. ఆ తర్వాత మిగిలిన అభ్యర్థులతో జాబితాను రూపొందించి, వారికి గుర్తులు కేటాయిస్తారు. ఇక్కడితో స్టేజ్-1 రిటర్నింగ్ అధికారి విధులు పూర్తవుతాయి.

కీలకమైన ఎన్నికల నిర్వహణ బాధ్యత ఆర్వో-2దే..

స్థానిక సంస్థల ఎన్నికల్లో షెడ్యూల్‌లో మొదటి ఏడు రోజుల వరకు రిటర్నింగ్ అధికారి-1 విధులు పూర్తికాగా ఆ తదుపరి స్టేజ్-2లో ఎనిమిదో రోజు నుంచి 15వ రోజు ఎన్నికలయ్యేంత వరకు ఆర్వో-2 బాధ్యతలను నిర్వహిస్తారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండేందుకు రెండు భాగాలుగా విభజించి, ఇలా ఇద్దరు వేర్వేరు రిటర్నింగ్ అధికారులను ఏర్పాటు చేశారు. రిటర్నింగ్ అధికారి-2 ఎనిమిదో రోజున అభ్యర్థుల తుదిజాబితా తీసుకొని పోలింగ్ స్థానాలు, బూత్‌ల ఏర్పాటు, మెటీరియల్, సిబ్బంది కేటాయింపుల జాబితాను సిద్ధం చేస్తారు. తొమ్మిదోరోజున జిల్లా ఎన్నికల అధికారి ద్వారా ప్రిసైడింగ్, పోలింగ్ అధికారుల నియామకం, బీఎల్వో, వలంటీర్ల ఎంపిక, బూత్‌ల ఏర్పాట్లు, పదో రోజున పోలింగ్‌స్టేషన్‌లో మౌళిక సదుపాయాలు, మార్కింగ్‌లు ఏర్పాటు చేయడం, 11వ రోజున బ్యాలెట్ పేపర్లు, పెట్టెలు, ఇతర పోలింగ్ సామగ్రిని బూత్ వారీగా సిద్ధం చేసుకుంటారు. 12వ రోజున పోలింగ్ సిబ్బందికి తుది శిక్షణ, 13వ రోజున పోస్టల్ బ్యాలెట్లను స్వీకరిస్తారు. 14వ రోజున ఉదయం ఎన్నికల సిబ్బందికి సామగ్రిని అందజేసి, సాయంత్రం వరకు పోలింగ్ బూత్‌లకు తరలిస్తారు. 15వ రోజున ఎన్నికల నిర్వహణ, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన, గెలిచిన వారికి ధ్రువీకరణపత్రాలు ఇవ్వడం, వెంటనే ఉపసర్పంచ్ ఎన్నికల నిర్వహణ, అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికల సామగ్రిని అప్పగించడంతో ప్రక్రియ పూర్తవుతుంది.

ఓట్ల కోసం నోట్లు పట్టుకు రావద్దు

మడిపల్లిలో స్ఫూర్తిదాయక ఫ్లెక్సీ

హసన్‌పర్తి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మడిపల్లి గ్రామంలో గ్రామస్తులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న ఫ్లెక్సీ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. "నేను మడిపల్లి గ్రామవాసిని, నోట్లకు అమ్ముడు పోయే ఓట్లు మా ఇంట్లో లేవు.. ఓట్ల కోసం నోట్లు పట్టుకొని మా ఇంట్లోకి రాకండి.. తస్మాత్ జాగ్రత్త" అని మడిపల్లికి చెందిన కాందారి రమేష్ తన ఇంటి ముందు ఓ ఫ్లెక్సీని ఏర్పాటు చేయడం గ్రామస్తులకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ఇప్పుడు ఈ ఫ్లెక్సీ జిల్లా వ్యాప్తంగా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రస్తుతం గ్రామ పంచాయతీ ఎన్నికలలో ఊరి బాగు కోసం, అభివృద్ధి కోసం ఆరాటపడే వ్యక్తిని మాత్రమే సర్పంచ్‌గా గెలిపించుకోవాలని, అందుకోసం ఈ ఫ్లెక్సీని ఏర్పాటు చేసినట్లు కాందారి రమేష్ కుటుంబ సభ్యులు చెబుతున్నారు.



మడిపల్లిలో కాందారి రమేష్ ఇంటి ఎదుట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ



వణికిస్తున్న హెచ్‌ఐవీ

- రోజురోజుకూ పెరుగుతున్న కేసులు
- ప్రతీ సంవత్సరం మొక్కుబడిగా కార్యక్రమాలు
- నేడు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం

పోచమ్మమైదాన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లాలో రోజురోజుకూ ఎయిడ్స్ వ్యాధి చాపకింద నీరులా వ్యాపిస్తోంది. ఆరోగ్య సంస్థ హెచ్‌ఐవీపై అవగాహన కల్పిస్తున్నప్పటికీ కేసులు మాత్రం పెరుగుతూనే ఉన్నాయి. ప్రాణాంతక ఎయిడ్స్ మహమ్మారి రాకుండా మందులు కనిపెట్టడంలో ఎన్ని పరిశోధనలు జరిగినా ఫలితాలు మాత్రం ఉండడం లేదు. దీంతో ఎయిడ్స్ నివారణ ఒక్కటే మార్గంగా అనునిత్యం అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా ఏటా డిసెంబరు 1న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవంగా నిర్వహిస్తూ ప్రాణాంతక వైరస్‌పై అవగాహన కల్పిస్తున్నారు. వరంగల్ జిల్లాలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్ రోగుల సంఖ్య రోజు రోజుకూ గణనీయంగా పెరుగుతూ వస్తోంది. ఎయిడ్స్ కంట్రోల్ శాఖ నామమాత్రంగా వ్యవహరిస్తుండడంతో ఏటా రోగుల సంఖ్య పెరుగుతోంది.

వరంగల్ జిల్లాలో 5,464 మంది హెచ్‌ఐవీ బాధితులు

వరంగల్ జిల్లాలో ఇప్పటివరకు 5,464 మంది హెచ్‌ఐవీ బాధితులు ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. జిల్లాలో 2001 నుంచి హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 5,464 మంది హెచ్‌ఐవీ బాధితులు ఉండగా, వీరిలో 4,558 మందికి ప్రతీ నెల ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. 863 మంది బాధితులకు ఏఆర్‌టీ ద్వారా ప్రతీనెల రూ.2,016 పెన్షన్ అందిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలో ప్రతీ నెల కొత్తగా సుమారు 36 హెచ్‌ఐవీ కేసులు నమోదవుతున్నట్లు రిపోర్టులు చెబుతున్నాయి. కొత్తగా నమోదవుతున్న కేసులలో గర్భిణులు ఉండడం ఆందోళన కలిగిస్తోంది.

జిల్లాలో హై రిస్క్ కలిగిన వ్యక్తులు సుమారు 3,498 మంది ఉన్నారు. ఇందులో ఫిమేల్ సెక్స్ వర్కర్లు 2,269 మంది, స్వలింగ సంపర్కులు 1,112 మంది, ట్రాన్స్ జెండర్లు 117 మంది ఉన్నారు. ఈ గణంకాలు జిల్లా వాసులను వణుకు పుట్టిస్తున్నాయి.

నిద్ర మత్తులో ఎయిడ్స్ విభాగం

జిల్లాలో ఎయిడ్స్, హెచ్‌ఐవీ రోగుల సంఖ్య రోజురోజుకూ విపరీతంగా పెరుగుతోంది. అధికారులు మాత్రం తాత్కాలిక నామమాత్రపు లెక్కలతోనే సరిపుచ్చుతున్నారు. ప్రతీ నెల హెచ్‌ఐవీ కేసుల సంఖ్య పెరుగుతున్నా ఎయిడ్స్ విభాగం మాత్రం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తోంది. నామమాత్రపు ప్రచారంతో సరిపెడుతున్నారని విమర్శలు వెలువడుతున్నాయి. కండోమ్ ప్రమోషన్ జాడే కనిపించకుండా పోయిందని, శిక్షణ కార్యక్రమాలు కూడా గాలికి వదిలేశారని ఆరోపణలు వెలువడుతున్నాయి.

ముందు స్థానంలో వరంగల్ జిల్లా

ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్రంలో వరంగల్, హనుమకొండ జిల్లాలు ముందు స్థానంలో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం పంపిణీ చేసే మందులే కాక ప్రైవేటు ఫార్మా కంపెనీల ద్వారా జిల్లాలో ప్రతీ నెల రూ. లక్షలలో మందుల కొనుగోలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. అధికారుల పర్యవేక్షణ క్షేత్రస్థాయిలో లేకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది.

ఎయిడ్స్ నివారణకు కృషి



జిల్లాలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నివారణకు పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నాం. ఎయిడ్స్ హెచ్‌ఐవీ బారిన పడిన రోగులు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలి. 2024-25 సంవత్సరంలో 59,913 మందికి హెచ్‌ఐవీ రక్తపరీక్ష చేయగా 421మందికి హెచ్‌ఐవీ ఉన్నట్లు నిర్ధారించాం. గర్భిణులు 25,556 మందికి రక్త పరీక్ష నిర్వహించగా 9 మందికి ఉన్నట్లు నిర్ధారణ జరిగింది. జిల్లాలో మూడు ఐసీటీసీ కేంద్రాలు, 26 ఎఫ్ఐ-ఐసీటీసీ కేంద్రాలు, 1 ఏఆర్‌టీ కేంద్రం, 2 ఏఆర్‌టీ లింక్ కేంద్రాలు, విహాన్ కేర్ అండ్ సపోర్ట్ కేంద్రం-1, మూడు రక్తనిధి కేంద్రాల ద్వారా సేవలు కొనసాగుతున్నాయి.

– డాక్టర్ సాంబశివరావు, వరంగల్ డీఎంహెచ్‌వో

కేజీకేఎస్ రాష్ట్ర కమిటీ ఎన్నిక



గౌని సాంబయ్య (రాష్ట్ర ఉపాధ్యక్షుడు)



బుర్ర శ్రీనివాస్ (రాష్ట్ర కార్యదర్శి)

కాజీపేట, నవవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కాజీపేటకు చెందిన గౌని సాంబయ్య గౌడ్, కార్యదర్శిగా బుర్ర శ్రీనివాస్ గౌడ్‌ను ఎన్నిక య్యారు. వీరే కాకుండా వరంగల్ జిల్లానుంచి మరో 14 మందికి, ఓ మహిళను రాష్ట్ర కార్యవ ర్గంలోకి తీసుకున్నట్లు రాష్ట్ర కమిటీ సభ్యులు తెలిపారు. నూతనంగా ఎన్నికైన గౌని సాంబయ్య, బుర్రశ్రీనివాస్ గౌడ్‌లు మాట్లా డుతూ.. తమపై నమ్మకంతో రాష్ట్ర కమిటీలో చోటు కల్పించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు చెప్పారు. నిత్యం గౌడ సంఘం సభ్యులకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరి ష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

ప్రశాంతంగా రెండో విడత నామినేషన్లు

హసన్‌పర్తి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంచాయతీ ఎన్నికల హడావిడి ఆదివారం మొదటిరోజు రెండో విడత నామినేషన్ల స్వీక రణతో ప్రారంభమైంది. మండల పరిధిలో 15 పంచాయతీల్లో 15 సర్పంచ్ స్థానాలకు 8 మంది అభ్యర్థులు నామినేషన్ వేయగా 138 వార్డు మెంబర్ స్థానాలకు 11 మంది అభ్యర్థులు నామినేషన్ వేసినట్లు ఎన్నికల అధికారి, ఎంపీడీఓ సుమనవాణి తెలిపారు. అనంతసాగర్ పంచాయతీ క్లస్టర్ పరిధి (అనంతసాగర్, మడిపల్లి, జయగిరి) గ్రామాల్లో సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాలకు ఏ ఒక్కరు కూడా నామినేషన్ వేయలేదని తెలిపారు. సీతంపేట పంచాయతీ క్లస్టర్ పరిధిలో మొత్తం సర్పంచ్‌లు-2, వార్డు మెంబర్‌లు-1 నామినేషన్ దాఖలైనట్లు తెలిపారు. వీరిలో సీతంపేటలో సర్పంచ్‌లు-1, వార్డు మెంబర్‌లు-1 (9వ వార్డు), గంటూర్‌పల్లిలో సర్పంచ్‌లు-1, వార్డు మెంబర్లు-లేరు. నాగారం పంచాయతీ క్లస్టర్ పరిధిలో మొత్తం సర్పంచ్‌లు-3, వార్డు మెంబర్‌లు-5 నామినేషన్లు దాఖలైనట్లు తెలిపారు. వీటిలో నాగారం లో సర్పంచ్‌లు-2, వార్డు మెంబర్లు-5 (6వ వార్డు-2, 8వ వార్డు-3), సూదన్ పల్లిలో సర్పంచ్-1, వార్డు మెంబర్లు-లేరు. సిద్దాపూర్ క్లస్టర్ పరిధిలో మొత్తం సర్పంచ్‌లు-1, వార్డు మెంబర్లు-1 నామినేషన్లు దాఖలైనట్లు తెలిపారు. వీటిలో భైరాన్‌పల్లి సర్పంచ్-1, వార్డు మెంబర్-1 (5వ వార్డు), మల్లారెడ్డిపల్లి క్లస్టర్ పరిధిలో మొత్తం సర్పంచ్‌లు-2, వార్డు మెంబర్లు-2 నామినేషన్లు దాఖ లైనట్లు తెలిపారు. వీటిలో మల్లారెడ్డిపల్లి సర్పంచ్-1, వార్డు మెంబర్-1 (7వ వార్డు), కొత్తపల్లి సర్పంచ్-1, వార్డు మెంబర్-1 (4వ వార్డు)కి నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు.

3న విద్యావికాస్ ఉపకార వేతనాలు

న్యూశాయంపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : భారత్ వికాస్ పరిష త్(బీవీపీ) ఓరుగల్లు శాఖ ఆధ్వర్యంలో డిసెంబరు 3న సింగిల్ పేరెంట్ పిల్లలకు ఉపకార వేతనాలు అందజేయనున్నట్లు బీవీపీ అధ్యక్షులు డాక్టర్ సుధీర్‌కుమార్ తెలిపారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని నందిహిల్స్‌కాల నీలో ఉన్న బీవీపీ కార్యాలయంలో ఆదివారం బీవీపీ జిల్లా కార్యవర్గ సమా వేశం జరిగింది. ఈ సందర్భంగా సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. భారత్ వికాస్ పరిషత్ ఛారిటబుల్ ట్రస్ట్ హైదరాబాద్ సౌజన్యంతో విద్యావికాస్ స్కాలర్‌షిప్స్-2025 పేరిట ఒక్కొక్కరికి రూ. 5వేల చొప్పున 15మంది తండ్రిలేని విద్యార్థులకు నగదు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. డిసెం బరు 3 బుధవారం హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లో జరిగే కార్యక్రమానికి అర్హత ఉన్న విద్యార్థులు తల్లిదండ్రులతో హాజరై నగదు పురస్కారం అందుకోవాలన్నారు. అంతకుముందు బీవీపీ కార్యదర్శి కె. సత్యనారాయణ గత 6నెలలుగా నిర్వహించిన కార్యక్రమాలను వివరిం చారు. ఈ కార్యవర్గ సమావేశంలో బీవీపీ కార్యదర్శి కె. సత్యనారాయణ, ఫైనాన్స్ కార్యదర్శి బి.వెంకటరెడ్డి, బీవీపీ బాధ్యులు ఎం.సంతోష్‌రెడ్డి, జయ పాల్‌రెడ్డి, బీఎన్‌రెడ్డి, వీసీ రామారావు, వివేకానందప్రసాద్, ఎం.దామోదర్, రత్న, మంజుల, స్నిగ్ధ, ప్రొఫెసర్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మత్తు వదలండి.. మైదానానికి రండి

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

హసన్‌పర్తి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): యువత మత్తుకు బానిస లుగా కావద్దని క్రీడల్లో ఆసక్తిని పెంచుకొని ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు మైదానానికి రావాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. మండలంలోని రామారం ప్రాంతంలో ఆదివారం హనుమకొండ బ్యాడ్మింట న్ టోర్నమెంట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతోనే శారీరక ఆరోగ్యంతో పాటు మానసికోల్లాసం పెంపొందుతుందని అన్నారు. నియోజకవర్గంలో క్రీడారంగ బలోపేతానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటు న్నాని విద్యార్థులు, యువత మత్తును వదిలి మైదానాలకు చేరుకొని గొప్ప క్రీడాకారులుగా రాణించాలన్నారు. హసన్‌పర్తి ప్రాంతంలో ఇండోర్ స్టేడి యం ఏర్పాటు చేయడానికి తాను శక్తివంచన లేకుండా కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఆర్గనైజర్ బోయిన శశికాంత్, కోచ్ శీలం నరేందర్, కాంగ్రెస్ నాయకులు కనపర్తి కిరణ్, వీసం సురేందర్ రెడ్డి, పుల్ల రవీందర్, బండి చైతన్యరెడ్డి, గరిగె రాజు, పెద్దమ్మ సురేష్, శీలం యాదగిరి, క్రీడాకారులు పాల్గొన్నారు.

నేడు గీతా జయంతి

ఆలయాల్లో సామూహిక భగవద్గీత పారాయణం

వరంగల్ కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మార్గశిర మాసం ఏకా దశిని పురస్కరించుకొని డిసెంబరు 1న గీతాజయంతి సందర్భంగా వరం గల్ నగరంలోని పలు దేవాలయాల్లో గీతా జయంతి వేడుకలను నిర్వహిం చనున్నారు. ములుగు రోడ్‌లోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షే త్రంలో సామూహిక భగవద్గీత పారాయణం నిర్వహించనున్నారు. వరంగ ల్ జేపీఎన్‌రోడ్‌లో గల గీతాభవన్‌లో గీతా ప్రచారక పరిషత్ ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణం, బట్టల బజార్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవాల యంలో భగవద్గీత పారాయణం ఏర్పాటు చేశారు. ఇవే కాకుండా మురళీ కృష్ణ మందిరంలో పలు ఆధ్యాత్మిక సంస్థల ఆధ్వర్యంలో గీతాజయంతి సంద ర్భంగా పలు కార్యక్రమాలు, భగవద్గీత పారాయణాలు ఏర్పాటు చేశారు.

అలరించిన నృత్య సౌరభం

- ఘనంగా కాకతీయ నృత్య కళాక్షేత్ర 60వ వార్షికోత్సవం
- వెంపటి వారసత్వాన్ని కొనసాగించడం ఓరుగల్లుకే గర్వం
- వేడుకల్లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



వేడుకలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

హనుమకొండ కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చారిత్రక వరం గల్ నగరంలో 60 ఏళ్ల కిందట తొలి నృత్య కళాక్షేత్రంగా పురుడు పోసు కున్న వెంపటి నారాయణ కాకతీయ నృత్య కళాక్షేత్రం 60వ వార్షికోత్సవం ఆదివారం రాత్రి హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రం వేదికగా నేత్రప ర్వంగా జరిగాయి. సుమారు 300 మందికిపైగా కళాక్షేత్రం చిన్నారులు ఒకదాని వెంట ఒక నృత్యం అన్నట్లుగా 30 అంశాలపై చక్కని ఆహార్యం, అద్భుత ప్రదర్శనతో సుమారు 3గంటలపాటు ఏకధాటిగా నిర్వహించిన నృత్యాలు ప్రేక్షకులకు కనువిందు చేశాయి. చిన్నారుల తల్లిదండ్రులు, కళా భిమానులతో కిక్కిరిసిన ఆడిటోరియంలో ఒక థిల్లానా నృత్యం, జానపద సవ్వడులే కాకుండా బోనాలు, కూచిపూడి, భరతనాట్య విన్యాసాలతో అల రింపజేశారు. ప్రముఖ ఆర్యవైశ్య నాయకుడు గట్టు మహేశ్‌బాబు, కవిన్ ఫ్రెండ్లీ ఫౌండేషన్ యూఎస్ఏ అధ్యక్షుడు కె.వినోద్‌కుమార్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన వేడుకల్లో ముఖ్య అతిథిగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొన్నారు. కళల కాణాచి నగరంలో ఆరు దశాబ్దాలుగా వెంపటి వారసత్వాన్ని కొన సాగిస్తూ నృత్య రంగంలో వేలాది మంది శిష్యులను తయారు చేస్తున్న కాకతీయ నృత్య కళాక్షేత్రం నిర్వాహకురాలు వెంపటి నాగేశ్వరి, ఆమె వారసత్వాన్ని కొనసాగిస్తున్న శ్రావణిలను అభి నందించారు. కళలే మన సంస్కృతితోపాటు అభివృద్ధికి సూచిక లుగా నిలుస్తాయని కళల నగరంలో తల్లిదండ్రులు ప్రోత్సహిస్తూ అనేక మంది చిన్నారులను ఇంకా కళాకారులుగా తీర్చిదిద్దేందుకు తమ పిల్లలను ప్రోత్సహించాలన్నారు.

కళా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ శాంతికృష్ణ స్వాగతం పలు కుతూ.. చిన్నారుల తల్లిదండ్రుల అభిలాష మేరకు విభిన్న నృత్య రంగాల్లో తమ సంస్థలో తర్ఫీదు ఇస్తున్నామన్నారు. 2019లో తెలంగాణ జాతి గర్వించేలా బతుకమ్మ తల్లి మహా బృంద నృత్యం ద్వారా తమ సంస్థకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం లభించిందని చాటి చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది కె.నర్సింహారావు, భద్రకాళి ఆలయ ప్రధాన అర్చకుడు శేషు, మామునూరు ఏసీపీ ఎన్.వెంకటేశ్, ముంబయికి చెందిన నాట్యాచారిణి రాధామోహన్, రామోజు సుందర మూర్తి, ఆచార్య బన్న అయిలయ్య, గడ్డం వెంకన్న, పెందోట సురేశ్, పాలోజు భాస్కరాచార్య తదితరులు అతిథులుగా పాల్గొన్నారు. నాట్యాచా రిణి డాక్టర్ వెంపటి శ్రావణి కృషిని అతిథులంతా ప్రశంసించారు. నృత్యంలో పాల్గొన్న చిన్నారులను ఆశీర్వదిస్తూ అందరికీ జ్ఞాపికలు అంద జేశారు. డాక్టర్ ఎన్ఎస్ఆర్.మూర్తి వందన సమర్పణ చేశారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు



ఉర్రూతలూగించిన కార్తీక్ లైవ్ షో



పాట పాడుతున్న సింగర్ కార్తీక్

స్టెప్పులేసిన యువత

మడికొండ, నవంబరు 30 (ఆంధ్ర జ్యోతి): "నిజంగా నేనేనా.." అంటూ కొత్త బంగారు లోకం సినిమా కోసం పాట పాడి యువతలో ఉత్సాహాన్ని రేకెత్తించిన ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు కార్తీక్ తన లైవ్ షోతో ఆదివారం రాత్రి ఓరుగల్లు యువ తను హుషారెత్తించారు. ట్రైబ్ వైబ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యంలో మడి కొండలోని ఓ ఫంక్షన్‌హాల్ వేదికగా ఏర్పాటైన కార్యక్రమంలో కార్తీక్ పాల్గొని తనదైన శైలిలో వేలాది మంది అభిమానులను తన పాటలతో హోరె త్తించారు. ఒక కళాకారుడిగా వేలాది మంది అభిమానుల మధ్య ఉత్సాహంగా కనెక్టవడం కంటే సంతృప్తికరమైనది ఏముంటుందని అన్నారు. ఇష్టమైన పాటలను అభిమానులతో కలిసి ఆడి పాడే అంద మైన క్షణాలు ఓరుగల్లులో తనకు దక్కాయని తెలిపారు. ఆదిపురుష్ సినిమాలో రాంసీతారాం, ప్రియ మిథునం, హ్యాపీడేస్‌లో ఓమైఫ్రెండ్, విరూపాక్షలో నచ్చావులే, వర్షం సినిమాలో కోపమా నాపైనా..లాంటి సినిమా పాటలను ఓరుగల్లు ప్రేక్షకులతో పంచుకున్నారు. కార్యక్ర మంలో నిర్వాహకులు షోవెన్‌షా, వరుణ్ కురిచ్ తదితరులు పాల్గొ న్నారు. చలిని కూడా లెక్క చేయకుండా యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ పోలీస్ సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

షాప్ వర్కర్లకు కనీస వేతనాలు అందించాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పలయ్య, రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

హనుమకొండ చౌరస్తా, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): హనుమ కొండ, కాజీపేటలోని అన్నిరకాల షాపుల్లో పనిచేస్తున్న గుమస్తాలకు, వర్కర్లకు కనీస వేతనాలతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్, 8గంటల పనిని అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.ఉప్ప లయ్య, రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండ చౌరస్తా లోని సీపీరెడ్డి కాంప్లెక్స్‌లో ఆల్ షాప్ వర్కర్స్ యూనియన్ సీఐ టీయూ అనుబంధ హనుమకొండ జిల్లా ప్రథమ మహాసభ ఎస్‌కే. యాకూబ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఉప్పలయ్య, రమే ష్‌లు హాజరై మాట్లాడారు. అన్ని రకాల షాపులతో పాటు పెద్ద పెద్ద షాపింగ్‌మాళ్లు, హోటళ్లు, బంగారం, బట్టల దుకాణాలు, షోరూంలు, ఆస్పత్రులు, పెట్రోల్ బంకుల్లో పని చేస్తున్న కార్మికులకు యజమా న్యాలు కనీస వేతనాలు అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ, కార్మిక చట్టాలను రద్దు చేసి, లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చాలని చూస్తున్నారని వారు ధ్వజమెత్తారు. రాబోయేకాలంలో సీఐటీయూ ఆధ్వర్యంలో షాప్ వర్కర్స్, గుమస్తాల స్థానిక సమస్య లపై పెద్ద ఎత్తున పోరాటాలు, ఉద్యమాలు చేస్తామని వారు హెచ్చ రించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా ఆల్ షాప్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ సభ్యులు, ఆల్ వర్కర్స్ యూనియన్ బాధ్యులు పాల్గొన్నారు.

కార్మికులకు పని భద్రత కల్పించాలి

హనుమకొండ జిల్లాలో పని చేస్తున్న లాడ్జిల, హోటళ్ల కార్మికులకు పనిభద్రతతో పాటు కనీస వేతనాలు అమలయ్యే విధంగా జిల్లా కార్మికశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా కార్య దర్శి రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండ రాంనగర్ లోని సుందరయ్యభవన్ ఏర్పాటుచేసిన సమావేశంలో రమేష్ పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు, వివిధ షాపుల కార్మికులు పాల్గొన్నారు.

పూర్తయిన నామినేషన్ల పరిశీలన

(5వ పేజీ తరువాయి)

నామినేషన్లను రద్దు చేసి అర్హుల నామినేషన్ల జాబితాను అధికారులు ప్రకటించారు. సోమవా రం అప్పీలు దాఖలును స్వీకరించి ఉపసంహరణకు సంబంధించిన తర్వాత పూర్తి జాబితాను సిద్ధం చేయనున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

మండలం	సర్పంచ్	తిరస్కరణ	చెల్లినవి	వార్డులు	తిరస్కరణ	చెల్లినవి
భీమదేవరపల్లి	172	35	137	569	20	549
కమలాపూర్	207	43	164	733	30	703
ఎల్కతుర్తి	117	22	95	445	7	435

జీపీవో సంఘం జిల్లా అధ్యక్షుడిగా హరిప్రసాద్



వడ్డెపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): హనుమ కొండ జిల్లా గ్రామ పరిపాలన అధికారుల (జీపీవో) సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం హనుమ కొండ అంబేద్కర్ విగ్రహం ప్రాంతంలోని రెవెన్యూ క్ల బ్‌లో జరిగింది. ముఖ్య అతిథులుగా జీపీవోల సం ఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కందిరి శిరీషారెడ్డి, రాష్ట్ర నాయకులు బోళ్ల శ్రీనివాస్, బీరు ఎల్లన్న హాజరయ్యారు. ఈ సంద ర్భంగా హనుమకొండ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. జీపీవో సంఘం జిల్లా అధ్యక్షుడిగా సంకె హరిప్రసాద్, జిల్లా మహిళా అధ్యక్షురాలుగా ఫాతిమా, ప్రధాన కార్యదర్శులుగా కడారి అనిల్, ఎర్ర శ్రీకాంత్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కుక్కముడి నరేష్, వర్కింగ్ ప్రె సిడెంట్‌గా వేల్పుల సదానందంలు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా సయ్య ద్ జాకీర్ హుస్సేన్, ఈర్ల రవికిరణ్, సల్వాది లోకేశ్వర్, జెట్టి రాజు, మహి ళా ఉపాధ్యక్షురాలిగా అంబి వనిత, కోశాధికారిగా గడ్డం సురేష్, సహాయ కార్యదర్శులుగా పానుగంటి సారంగపాణి, విష్ణుమూర్తి, వేములకొండ కుమార్, ప్రచార కార్యదర్శులుగా నర్సింహులు, పద్మలను ఎన్నుకున్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

హసన్‌పర్తి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పలు కారణాలతో మృతి చెందిన మృతుల కుటుంబ సభ్యులను ఆదివారం మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ పరామర్శించి ప్రగాఢసానుభూతి తెలిపారు. జయగిరిలో ఇటీవల మృతి చెందిన సీపీఐ నాయకులు చింతా రాంనారాయణగౌడ్, తాళ్ళపల్లి దుర్గాప్రసాద్ స్వగృహాలకు వెళ్లి వారి చిత్రపటానికి పూలమాలలు వేసి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన వెంట కాజీపేట దర్గా పీఏసీఎస్ చైర్మన్ ఊకంటి వనంరెడ్డి, మల్లారెడ్డిపల్లి పీఏసీ ఎస్ చైర్మన్ జక్కుల రమేష్‌గౌడ్, రాజు, స్థానిక నాయకులు ఉన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

టీయూజేడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు రాజిరెడ్డి



ప్రెస్ క్లబ్‌లో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న టీయూడబ్ల్యూజే నేతలు

వడ్డెపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీయూజేడ బ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండ బాలసము ద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మహా ధర్నాకు సం బంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ.. జర్నలిస్టులకు తక్షణమే అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని, ఆరోగ్య బీమా పథకాన్ని పునరుద్ధరించాలని, అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, వృత్తి కమిటీని వెంటనే ఏర్పాటు చేయా లని అన్నారు. డిసెంబరు 3న ఉదయం 10 గంటలకు హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ వద్ద గల రాష్ట్ర సమాచార కమిషనర్ కార్యాలయం వద్ద జర్నలిస్టుల సమస్యలపై నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయా లని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాడిపెల్లి మధు, జాతీయ కౌన్సిల్ సభ్యులు పీవీ మద న్‌మోహన్, రాష్ట్ర, జిల్లా నేతలు కంకణాల సంతోష్, గడ్డం కేశవమూర్తి, బొల్లారపు సదయ్య, సీహెచ్. సోమనర్సయ్య, మేరుగుల రాజేంద్రప్రసాద్, ఎమ్డీ ఉస్మాన్ పాషా, డాక్టర్ పొడిశెట్టి విష్ణువర్ధన్, అనుముల రవి, దేవేం దర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య లోపం.. ప్రజలకు శాపం

- 10వ డివిజన్‌లో ఇళ్ల ముందే మురుగు
- తాగునీటి పైపులైన్ల కోసం రోడ్డు ధ్వంసం
- అపరిశుభ్ర పరిసరాలతో వ్యాధుల వ్యాప్తి
- పట్టించుకోని అధికారులు



రాజ్‌పుత్‌వాడలో శిథిలావస్థకు చేరిన డ్రైయినేజీ

హనుమకొండ చౌరస్తా, నవంబరు 30 (ఆంధ్ర జ్యోతి) : హనుమకొండ 10వ డివిజన్ మచిలీబజార్, రాజ్‌పుత్‌వాడలో డ్రెయినేజీల నిర్మాణం సరిగా లేక మురుగు నీరు రోడ్డుపైకి చేరడంతో స్థానికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరు వెళ్లడానికి రోడ్డుకు ఇరువైపుల కాల్వలు నిర్మించాల్సి ఉండగా, ఇరుకు గల్లీల కారణంగా రోడ్డుకు ఒక వైపు మాత్రమే కాలువల నిర్మించారు. దీంతో మురుగు నీరు ముందుకు సాగక రోడ్డు పైకి చేరడంతో ఈగలు, దోమలకు నిలయంగా మారాయి. ఫలితంగా వ్యాధులు ప్రబలుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇళ్ల ముందు ఉన్న చిన్నపాటి కాలువ సైతం శిథిలావస్థకు చేరుకోవడంతో మురుగు నీరు పారడం లేదు. దుర్గంధంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యలను పరిష్క రించాలని సంబంధిత అధికారులకు మొర పెట్టు కున్నా పట్టించుకున్న నాథుడే లేడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల స్థానికులతో కలిసి కార్పొరే టర్ తోట వెంకటేశ్వర్లు జీడబ్ల్యూఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించడం లేదని సిబ్బంది తమ గల్లీని పరిశీలించడం లేదని స్థాని కులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరుకుగా ఉన్న గల్లీలో తాగు నీటి సరఫరా కోసం రోడ్డు మధ్యలో నుంచి పైపులైన్ నిర్మాణం చేపట్టిన సదరు కాంట్రా క్టర్ నిర్లక్ష్యంతో ఉన్న చిన్న పాటి సీసీ రోడ్డు పూర్తిగా దెబ్బతింది. దీంతో అటుగా నడవలేని దుస్థితి దాపు రించిందని స్థానికులు వాపోతున్నారు. రోడ్డును తవ్వించిన కాంట్రాక్టర్ ఎలాంటి మరమ్మతు చేయక పోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నామని కాలనీవాసులు చెబుతున్నారు. స్మార్ట్ సిటీ అంటూ గొప్పలు చెప్పుకుంటున్న ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు అభివృద్ధిపై దృష్టి సారించి తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని స్థాని కులు వేడుకుంటున్నారు.



పైపులైన్ల నిర్మాణం కోసం తొలగించిన రోడ్డు

మా కాలనీని ఎవరూ పట్టించుకోవడం లేదు..

అనిశెట్టి స్రవంతి, 10వ డివిజన్ రాజ్‌పుత్‌వాడ



10వ డివిజన్ రాజ్‌పుత్ గల్లీలో ఏళ్ల తరబడి సైడ్ కాలువల నిర్మాణం సరిగా లేక మురుగు సమస్య వేధిస్తోంది. అసలే ఇరుకు గల్లీలు ఇటీవల వచ్చిన వరదల కారణంగా డ్రెయినే జీలో మట్టి పేరుకుపోయి మురుగు నీరు ముందుకు సాగడం లేదు. ఇళ్ల ముందే రోజుల తరబడి నిలిచి ఉండడంతో తీవ్ర దుర్గంధంతో సతమత మవుతున్నాం. మా కాలనీని అధికారులు పట్టించుకోవడం లేదు.

పైప్‌లైన్ల నిర్మాణం పేరుతో రోడ్లు ధ్వంసం..

ఆకుల నరేష్, 10వ డివిజన్



ఇరుకుగా ఉన్న మా గల్లీలో మిషన్ భగీరథ పేరుతో నీటి సరఫరా చేయడం కోసమని మంచిగా ఉన్న సీసీ రోడ్డును ఎక్కడికక్కడ తవ్వారు. అసలే ఇరుకు గల్లీ అం దులో చిన్నపాటి సీసీ రోడ్డు గుండా తాగు నీటి పైప్ లైన్ల నిర్మాణం కోసం కాంట్రాక్టర్ తవ్వి మరమ్మతు చేపట్టలేదు. ఈ రోడ్లపై చాలా మంది ప్రమా దాల బారిన పడ్డారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధు లు, కాంట్రాక్టర్ స్పందించి ధ్వంసమైన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి.

ఎలాంటి చీరలు కట్టుకోవాలి?

పండుగ రోజుల్లో, వివాహాది శుభకార్యాలప్పుడు, ఆఫీసుకు వెళ్లేటప్పుడు కట్టుకోవడానికి వీలుగా రకరకాల చీరలు అందుబాటులో ఉంటున్నాయి. అందరికీ అన్ని రకాల చీరలు నప్పవు. చీరలను ఎంపిక చేసుకునేటప్పుడు కొన్ని ముఖ్యాంశాలను గుర్తుపెట్టుకోవాలంటున్నారు నిపుణులు.



- రెండు విభిన్న రంగులు అంటే పూర్తిగా కాంట్రాస్ట్ కలర్స్‌తో రూపొందించిన చీరలు ఎంపిక చేసుకోకూడదు. ఉదాహరణకు లేత గులాబీ-ఊదా, నీలం-పసుపు, తెలుపు-ఎరుపు లాంటి రంగుల కాంబినేషన్లను కొనకపోవడమే మంచిది. ఇలాంటి చీరలు కట్టుకుంటే ఎత్తు తక్కువగా కనిపిస్తారు. వీటి లుక్ కొత్తగా అనిపించదు.
- రఫెల్స్ చీరలు ప్రస్తుతం ట్రెండింగ్‌లో లేవు. ఈ చీరలు కట్టుకుంటే లావుగా ఉన్నట్లు కనిపిస్తుండడంతో మహిళలు వీటిని ఇష్టపడడం లేదు. వీటికి బదులు జార్జెట్, షిఫాన్ చీరలను ఎంపిక చేసుకుంటే నాజూగ్గా కనిపిస్తారు.
- మందపాటి కాటన్ చీరలను కట్టుకోవడం, హ్యాండిల్ చేయడం పెద్ద సవాలుగా అనిపిస్తుంది. ఇవి రోజువారీ కట్టుకోవడానికి అనువుగా ఉండవు. పలుచగా, మెత్తగా, కంటికి ఇంపుగా కనిపించే చీరలను కట్టుకుంటే సౌకర్యవంతంగా ఉంటుంది.
- చీరలను కొనేటప్పుడు వాటి ఫ్యాబ్రిక్‌ను తప్పనిసరిగా పరిశీలించాలి. చలికాలంలో ఉన్ని లేదా వెల్వెట్ మిళితమైన చీరలు, వేసవికాలంలో పలుచని కాటన్ చీరలు, వర్షాకాలంలో నీటిని పీల్చుకోని సిల్క్ చీరలు కట్టుకోవాలి. ఫంక్షన్లు, పండుగలు లాంటి ప్రత్యేక సందర్భాల్లో పట్టు, జార్జెట్, క్రేప్, ఎంబ్రాయిడరీ చీరలు ధరిస్తే బాగుంటుంది. రోజువారీ అయితే సింపుల్ డిజైన్ లేదా చిన్న బార్డర్ ఉన్న చీరలు కట్టుకోవచ్చు.
- బొద్దుగా ఉన్నవారు అడ్డ గీతలు, పెద్ద పెద్ద పూల డిజైన్లతో కూడిన చీరలు కట్టుకోకూడదు. వీరు పలుచని ఫ్యాబ్రిక్‌కు ప్రాధాన్యమిస్తూ సన్నని పొడవాటి కొమ్మల డిజైన్లు, చిన్న ప్రింట్లు, సన్నని బార్డర్ ఉన్న చీరలను ఎంపిక చేసుకోవాలి.
- సన్నగా పొడవుగా ఉన్నవారు.. పెద్ద బోర్డర్లు, చక్కని ఎంబ్రాయిడరీ ఉన్న డిజైనర్ చీరలు కట్టుకోవచ్చు.

ఇంట్లోనే నగలు పాలిష్ చేసుకోవచ్చు

కాలం గడిచే కొద్దీ వెండి, బంగారు నగలు వన్నె తగ్గుతుంటాయి. కొద్దిగా నల్లబడుతుంటాయి కూడా. అందుకే పండుగలు, శుభకార్యాలప్పుడు వీటిని ధరించే ముందు నగల దుకాణానికి తీసుకెళ్లి పాలిష్ చేయిస్తూ ఉంటారు. ఇది ఖర్చుతో కూడుకున్న పని. అలాకాకుండా నగలను ఇంట్లోనే పాలిష్ చేసే విధానాల గురించి తెలుసుకుందాం..



- పెద్ద గిన్నెలో సగానికి పైగా గోరువెచ్చని నీళ్లు పోసి అందులో ఒక చెంచా సర్ఫ్, రెండు చెంచాల బేబీ షాంపూ వేసి బాగా కలపాలి. అందులో బంగారు, వెండి నగలు ఉంచి పావు గంటసేపు నాననివ్వాలి. తరువాత పాత టూత్ బ్రష్‌తో నగలను మెల్లగా తోమి మంచినీటిలో ముంచి కడగాలి. అంతే! నగలు కొత్తవాటిలా కనిపిస్తాయి.
- మెత్తని టూత్ బ్రష్ మీద కొద్దిగా టూత్‌పేస్టు వేసి దానితో నగలను మెల్లగా తోమాలి. తరువాత గోరువెచ్చని నీటితో కడిగేస్తే మురికి పూర్తిగా వదిలి నగలు చక్కగా మెరుస్తాయి.
- వెడల్పాటి గిన్నెలో అర కప్పు వెనిగర్‌ను తీసుకుని అందులో ఒక కప్పు నీళ్లు పోసి కలపాలి. అందులో బంగారు, వెండి నగలను పావుగంటసేపు ఉంచాలి. తరువాత చేత్తో రుద్ది కడిగితే ఆభరణాలు తళతళలాడతాయి.
- బంగారు, వెండి నగలను కుంకుడుకాయల రసంలో అరగంటసేపు నానబెట్టాలి. తరువాత కుంకుడు కాయల పిప్పితో రుద్ది మంచినీళ్లతో కడిగితే మురికి, జిడ్డు వదిలిపోయి నగలు కొత్తవాటిలా మెరుస్తాయి.
- ఒక గిన్నెలో రెండు చెంచాల బేకింగ్ సోడా, రెండు చెంచాల లిక్విడ్ డిటర్జెంట్ వేసి గోరువెచ్చని నీళ్లు పోసి బాగా కలపాలి. అందులో నగలు వేసి పది నిమిషాలు కదల్చకుండా ఉంచాలి. తరువాత మెత్తటి స్క్రబ్బర్‌తో తోమి మంచినీళ్లలో ముంచి తీస్తే నగల మెరుపుదనం తిరిగి వస్తుంది.
- వెండి నగల మీద టూత్ పౌడర్ చల్లి చేతి రుమాలుతో రుద్దితే వాటి నలుపుదనం మాయమవుతుంది. బంగారు నగలను శుభ్రం చేసిన తరువాత పసుపు నీళ్లలో ముంచి తీస్తే ప్రకాశవంతంగా కనిపిస్తాయి. తరువాత వీటిని మెత్తటి గుడ్డతో తుడిచి తేమ లేకుండా పొడిగా ఆరిన తరువాత బాక్సుల్లో భద్రపరచుకోవాలి.

తల్లిదండ్రులు కూలి పని చేస్తేగానీ పూట గడవని కుటుంబం ఆమెది. పుట్టుకతోనే వచ్చిన అంధత్వం కారణంగా ఎన్నో అవహేళనలు ఎదుర్కొంది. అంధుల పాఠశాలలో చేరిన ఆమె.. అక్కడి వారి ప్రోత్సాహంతో క్రికెట్‌లో శిక్షణ ప్రారంభించింది. ఇప్పుడు అంధుల ప్రపంచకప్ గెలిచిన భారతజట్టు సభ్యురాలుగా సర్వత్రా ప్రశంసలు అందుకుంటోంది పదిహేనేళ్ల పాంగి కరుణకుమారి ప్రయాణం గురించి ఆమె మాటల్లోనే...



ఇప్పటికీ నమ్మలేకపోతున్నా

"ప్రస్తుత అల్లూరి సీతారామరాజు జిల్లా వంతలమామిడి మా స్వగ్రామం. అమా నాన్న నా కంటి పాపలు. నాకు ఊహ తెలిసేంత వరకు వారి మాటలతోనే ఈ లోకాన్ని చూశాను. కొద్దిరోజుల క్రితం వరకు నన్ను కేవలం ఒక అంధురాలిగానే చూసిన ఈ సమాజం ఇప్పుడు దేశానికి టీ20 అంధుల ప్రపంచకప్ అందించిన భారత జట్టు సభ్యురాలిగా గుర్తించి.. అభిమానం చూపిస్తుంటే చెప్పలేనంత సంతోషంగా ఉంది. ఇన్నాళ్లూ నేను కార్చిన కన్నీళ్లు, పడిన కష్టాలు, ఎదుర్కొన్న అవమానాలను వరల్డ్‌కప్ విజయం మాయం చేసింది. అమ్మ సంధ్య, నాన్న రాంబాబుకు నేను రెండో సంతానం.. పుట్టుకతోనే నాకు రెండు కళ్లు కనిపించడం లేదని తెలిసి అమ్మ, నాన్న చాలా బాధపడ్డారు. నాకు పదేళ్లు వచ్చే వరకు వాళ్లు ఎక్కడికి వెళ్తే అక్కడికి నన్ను వెంట తీసుకువెళ్లేవారు. ఒక్క క్షణం కూడా నన్ను ఒంటరిగా విడిచి పెట్టి ఉండేవారు కాదు. నాకు కొంచెం ఊహ వచ్చాక నా చెల్లెలితో కలిసి బడికి వెళ్లేదాన్ని. పాఠశాలలో నన్ను తోటివారు ఏడిపించేవారు. నాతో ఎవరూ సరిగ్గా మాట్లాడే వారు కాదు. 'గుడ్డిది' అని హేళన చేసేవారు. ఆ బాధతో నేను "స్కూల్‌కు వెళ్లను" అని మొండికేసేదాన్ని. అమ్మ నన్ను సముదాయించేది. "నువ్వు మనుషుల దృష్టిలో గుడ్డిదానివి కావచ్చు కానీ, ఆ దేవుడి దృష్టిలో కాదు తల్లీ. నువ్వు బడికి వెళ్లి, చదువుకొని కొంచెం జ్ఞానం సంపాదిస్తే మేము లేని రోజు నువ్వు ఒంటరిగానైనా బతకగలవు" అని ధైర్యం చెప్పేది.

పుల్లలు, కట్టెలు ఏరుకొని..

అమ్మా నాన్న కూలికి వెళ్లి తెచ్చే నాలుగైదు వందల రూపాయలే మా ఐదుగురు కుటుంబ సభ్యులకు ఆధారం. కూలి పనులు లేనప్పుడు అడవిలో దొరికే పుల్లలు, కట్టెలు అమ్ముకొని పొట్ట నింపుకొంటూ ఉంటాం. వర్షా కాలం పనులు లేక పూట గడవడానికి కూడా ఇబ్బందిగా ఉంటుంది. చిన్న రేకుల షెడ్‌లో మా నివాసం. వర్షాలు పడినప్పుడు, చలి ఎక్కువగా ఉన్నప్పుడు తట్టుకోలేక అవస్థలు పడుతూ ఉంటాం. మా కుటుంబంలో నాకైనా కనీస సదుపాయాలు కల్పించాలనే ఉద్దేశంతో విశాఖపట్నంలోని ప్రభుత్వ అంధుల పాఠశాల గురించి తెలుసుకొని రెండేళ్ల క్రితం నన్ను అక్కడ చేర్పించారు. స్కూల్‌లో పీఈటీ సత్యవతి గారు, ప్రిన్సిపల్ విజయ మేడమ్ ప్రోత్సాహంతో క్రికెట్‌లో శిక్షణ ప్రారంభించా. గత ఏడాది జరిగిన రాష్ట్ర స్థాయి సెలెక్షన్స్‌లో భారత అంధుల క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ అజయ్‌రెడ్డి నా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించారు. నాకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. జాతీయ జట్టులో చోటు దక్కేలా నన్ను తీర్చిదిద్దారు. ఈ ఏడాది సెప్టెంబరులో టీ20 వరల్డ్‌కప్ కోసం బెంగళూరులో జరిగిన సెలక్షన్ మ్యాచ్‌లో సెంచరీ (114 పరుగులు) చేశా. ఆ ఇన్నింగ్స్‌తో సెలెక్టర్ల దృష్టిలో పడ్డాను. ప్రపంచకప్‌లో ఆడే భారత జట్టులో చోటు సంపాదించా.



అమ్మా నాన్న ఒప్పుకోలేదు..

భారత జట్టులో చోటు సంపాదించాలనే నా కల నిజమైంది. 15 ఏళ్లకే వరల్డ్‌కప్‌లో ఆడే అవకాశం లభించడంతో చాలా సంతోషపడ్డాను. అయితే అప్పటివరకు మా కుటుంబంలో ఎవరూ విశాఖపట్నం దాటి వెళ్లలేదు. "ఆడపిల్లను, అందులోనూ చూపులేని అమ్మాయిని శ్రీలంకకు ఎలా పంపించాలి?" అని అమ్మా నాన్న ఆందోళన పడ్డారు. దాంతో వరల్డ్‌కప్‌కు నన్ను పంపడానికి ఒప్పుకోలేదు. నాకు తెలుగు తప్ప మరే భాష రాదు. కాబట్టి వెంట తెలిసిన వాళ్లు లేకుండా అంత దూరం పంపేది లేదని భీష్మించుకొని కూర్చున్నారు. ఆ సమయంలో అజయ్ రెడ్డి సార్, కెప్టెన్ దీపిక అక్క వారితో మాట్లాడి నచ్చజెప్పారు. నా బాధ్యత తాము చూసుకుంటామని భరోసా ఇచ్చారు. నేను కూడా "మీరు ఒప్పుకున్నా లేకపోయిన నేను కచ్చితంగా వరల్డ్‌కప్‌లో ఆడతాను. కొలంబో వెళ్తాను" అని తెగేసి చెప్పడంతో చివరకు అమ్మా నాన్న అంగీకరించారు. కనీసం బస్సు ఎక్కే స్తోమత కూడా లేని నాకు విమానంలో ప్రయాణించే అవకాశం దక్కడం, నేను ప్రపంచకప్‌లో ఆడడం ఇప్పటికీ నమ్మలేకపోతున్నా. వరల్డ్‌కప్ ఫైనల్లో 42 కీలకమైన పరుగులు చేసి, జట్టును విజేతగా నిలపడంతో ముఖ్య భూమిక పోషించినందుకు చాలా సంతోషంగా ఉంది. వరల్డ్‌కప్ అందుకున్న క్షణాలను, ప్రధాని నరేంద్ర మోదీని కలిసిన సందర్భాన్ని నా జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేను. పారా, దివ్యాంగ క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తే నాలాంటి వారు మరింత మంది దేశం గర్వించేలా తయారవుతారు.

● ఎస్.ఎస్.బి.సంజయ్
హైదరాబాద్

వాటితో ఇబ్బందా?

వంటింటి సింక్‌లో, బాత్‌రూమ్ డ్రెయిన్ వద్ద, వాష్ బేసిన్ దగ్గర చిన్న చిన్న ఈగలు ఎగురుతూ కనిపిస్తుంటాయి. వీటినే డ్రెయిన్ ఫ్లైయిస్ అంటారు. వీటివల్ల ఎన్నో రకాల వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. వీటిని ఎలా నివారించాలో తెలుసుకుందాం..

- ఒక గిన్నెలో అర కప్పు వెనిగర్‌ను తీసుకుని అందులో రెండు చెంచాల బేకింగ్ సోడా, ఒక చెంచా ఉప్పు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని వంటగది సింక్‌లో, వాష్‌బేసిన్‌లో, బాత్‌రూమ్ డ్రెయిన్ వద్ద కొద్దికొద్దిగా చిలకరించాలి. రెండు గంటల తరువాత వేడి నీళ్లతో శుభ్రం చేయాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే మంచి ఫలితం కనిపిస్తుంది.



- ఒక కప్పు నీటిలో రెండు చెంచాల మిరియాల పొడి వేసి బాగా కలిపి స్ప్రే బాటిల్‌లో పోసి ఉంచుకోవాలి. చిన్న ఈగలు కనిపించిన ప్రదేశాల్లో మిరియాల నీటిని స్ప్రే చేస్తూ ఉండాలి. రోజుకు మూడుసార్లు ఇలా చేస్తుంటే సమస్య తీరుతుంది.
- చిన్న గిన్నెలో ఒక కప్పు నీళ్లు పోసి అందులో ఒక చెంచా బేకింగ్ సోడా, అయిదు చెంచాల నిమ్మరసం వేసి బాగా కలపాలి. ఈ నీటిని వంటగది సింక్‌లో, వాష్ బేసిన్‌లో చల్లాలి. అరగంట తరువాత ఈగలన్నీ మాయమవుతాయి.
- వెడల్పాటి గిన్నెలో అర కప్పు యాపిల్ సైడర్ వెనిగర్‌ను తీసుకుని దానిని ప్లాస్టిక్ కవర్‌తో మూసివేయాలి. తరువాత కవర్ మీద చిన్న చిన్న రంధ్రాలు చేయాలి. ఈ గిన్నెను సింక్ లేదా వాష్‌బేసిన్‌లో ఉంచాలి. యాపిల్ సైడర్ వెనిగర్ వాసనకు ఈగలన్నీ గిన్నెలోకి చేరి మునిగిపోతాయి. అలాగే గిన్నెలో ఒక కప్పు నీళ్లు, రెండు చెంచాల చక్కెర, రెండు చెంచాల డిష్ వాషింగ్ లిక్విడ్ కలిపిన మిశ్రమాన్ని తీసుకున్నా ఫలితం కనిపిస్తుంది.

మిరియాల్లో కల్తీని ఇలా...



శీతాకాలంలో ఎదురయ్యే జలుబు, దగ్గు, ముక్కు దిబ్బడ లాంటి ఆరోగ్య సమస్యలకు సత్వర ఔషధంలా పనిచేస్తాయి మిరియాలు. వీటిలో ఉండే పైపరిన్ సమ్మేళనం శరీరంలో వేడిని పెంచి జీర్ణక్రియ సజావుగా జరిగేలా చేస్తుంది. మిరియాల్లో సి, కె విటమిన్లతోపాటు ఐరన్, మాంగనీస్ లాంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతాయి. అదే కల్తీ మిరియాలు తీసుకుంటే పలు ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయిని నిపుణులు హెచ్చరిస్తున్నారు. బజారు నుంచి తెచ్చిన మిరియాల్లో కల్తీని ఎలా గుర్తించాలో తెలుసుకుందాం...

- బొప్పాయి, బెర్రీ పండ్లలో ఉండే నల్లని గింజలను ఎండబెట్టి వాటికి చౌకబారు నూనెలు పట్టించి మిరియాల్లో కలిపేస్తూ ఉంటారు. ఇలాంటి వాటిని తీసుకోవడం వల్ల కడుపులో వికారంతోపాటు జీర్ణాశయం, కాలేయం, మూత్రపిండాల సమస్యలు ఎదురవుతాయి.
- నిజమైన మిరియాలను చేతిలోకి తీసుకుని చూస్తే అవన్నీ చిన్న నొక్కులతో ఒకే సైజులో కనిపిస్తాయి. అవి నలుపు లేదా ముదురు గోధుమ రంగుల్లో ఉంటాయి. నోట్లో వేసుకుని నమిలితే ఘాటైన రుచితోపాటు, పూలు లేదా మట్టి వాసన తెలుస్తుంది.
- కొన్ని మిరియాలను టేబుల్ మీద వేసి వేలితో గట్టిగా నొక్కాలి. అవి వెంటనే చితికితే కల్తీవని గుర్తించాలి. నిజమైన మిరియాలు అంత త్వరగా చితకవు, పగలవు.
- ఒక గాజు గ్లాసు నిండా నీళ్లు తీసుకుని అందులో అయిదారు మిరియాలను వేయాలి. అవి నీటిలో మునిగి గ్లాసు అడుగుకు చేరితే నిజమైనవిగా గుర్తించాలి. బొప్పాయి గింజలైతే నీటి మీద తేలుతాయి.
- రెండు మిరియాలను తీసుకుని వేళ్లతో బాగా నలిపి వాసన చూడాలి. వెంటనే ఘాటైన వాసనతో ముక్కు రంధ్రాలు పూర్తిగా తెరచుకున్న భావన కలిగితే అవి నిజమైన మిరియాలని తెలుసుకోవచ్చు. ఏ ఇతర గింజలకు ఇలాంటి వాసన ఉండదు.
- కొన్ని మిరియాలను అరచేతి మధ్యలో ఉంచుకుని మరో చేత్తో ఒత్తిపెట్టి గట్టిగా రుద్దాలి. చేతికి నూనె లేదా రంగు అంటుకున్నట్లు అనిపిస్తే అవి కల్తీవని భావించవచ్చు.
- చిన్న పోపు గరిటెలో అయిదారు మిరియాలు వేసి స్టవ్ మీద పెట్టి వేడి చేయాలి. ఘాటైన వాసన వస్తే మంచి మిరియాలని తెలుసుకోవచ్చు. అలాకాకుండా చేదు, పసరు కలిసిన వాసన వస్తే అవి కల్తీవని నిర్ధారించాలి.
- మిరియాలను చిన్న రోలులో వేసి దంచితే తొందరగా పొడి కావు. దంచుతున్నప్పుడు మంచి సువాసన కూడా వస్తుంది. అదే కల్తీ గింజలైతే వెంటనే పొడి అవుతాయి. అందులో నుంచి ఏ వాసనా రాదు.

అతిరా మురళీ... కేరళకి చెందిన మొదటి మహిళా ర్యాలీ డ్రైవర్. బైక్‌ల నుంచి టిప్పర్ల వరకూ దేన్నయినా అవలీలగా నడిపేస్తారు. రెండుసార్లు నేషనల్ టైటిల్స్ సాధించి, మరో టైటిల్ కోసం సిద్ధమవుతున్న అతిర... "సాహసమే నా ఊపిరి" అంటున్నారు.





వేగం ఆమె ట్రాక్

"వాహనాలతో నా సావాసం చాలా చిన్న వయసులోనే మొదలయింది. మాది కేరళలోని కొట్టాయం. మా నాన్న మురళీధరన్, అమ్మ ఉష. నాన్న ట్రాన్స్‌పోర్ట్ రంగానికి చెందినవారు. మా ఇంట్లో విల్లీస్ జీపు, ఒక లారీతో సహా అనేక వాహనాలు ఉండేవి. వాటిని నడపాలని నేను ముచ్చటపడేదాన్ని. పన్నెండేళ్ళకే బైక్ నడపడం నేర్చుకున్నాను. పదిహేను ఏళ్ళకల్లా మూడు టన్నుల మినీ ట్రక్ నడిపాను. వయసుతో పాటే వాహనాల మీద నా ఆసక్తి కూడా పెరుగుతూ వచ్చింది.

లైసెన్సుల్లో రికార్డు

బీసీఏ పూర్తి చేశాక... ఎక్కడా ఉద్యోగం చెయ్యాలని అనిపించలేదు. కేరళకు వచ్చే టూరిస్టులకు సౌకర్యవంతమైన, సురక్షితమైన పర్యటన అనుభవాలను అందించడం కోసం ఒక టూర్ కంపెనీ ప్రారంభించాను. అదే సమయంలో వాహనాల మరమ్మతులు నేర్చుకున్నాను. బైక్, త్రీవీలర్, కారు, ట్రక్కు, లారీ, బస్సుల్లాంటి హెవీ ప్యాసింజర్ వాహనాలు, హెవీ గూడ్స్ మోటార్ వాహనాలు... ఇలా ప్రతిదీ నడపడంతోపాటు లైసెన్సులు కూడా పొందాను. అతి చిన్న వయసులో ఇన్ని లైసెన్సులు పొందిన పిన్న వయస్కురాలిగా నా పేరు 'ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్' 'యూనివర్సల్ రికార్డ్ ఫోరమ్'లలో నమోదయింది. అప్పుడు నా వయసు 21 ఏళ్ళు. సాహసాలు చేయాలనే తపన నాలో రోజురోజుకూ పెరుగుతూ వచ్చింది. అదే మోటార్ స్పోర్ట్స్ వైపు నన్ను మళ్ళించింది.



ఆ వేగం ట్రాక్‌కే పరిమితం

2021, 2022 సంవత్సరాల్లో.. వరుసగా రెండేళ్ళు 'ఇండియన్ నేషనల్ ర్యాలీ ఛాంపియన్‌షిప్' (ఐఎన్ఆర్‌సి) పోటీల్లో లేడీస్ క్లాస్‌లో విజేతగా నిలవడంతో నా పేరు కార్ రేస్ సర్కిల్స్‌లో మారుమోగింది. ఈ పోటీలను 'ఫెడరేషన్ ఆఫ్ మోటార్ స్పోర్ట్స్ క్లబ్స్ ఆఫ్ ఇండియా' నిర్వహిస్తుంది. ప్రతి సంవత్సరం వివిధ ప్రాంతాల్లో జరిగే ఈ పోటీలు... నాలుగు విభాగాల్లో ఉంటాయి. పలు రౌండ్లలో జరుగుతాయి. సుమారు 300 కిలోమీటర్ల ట్రాక్‌ను తక్కువ సమయంలో పూర్తి చేసినవారిని విజేతలుగా గుర్తిస్తారు. పోటీల్లో ప్రయాణించాల్సిన మార్గాలు రకరకాలుగా ఉంటాయి. మొత్తం అన్ని దశలనూ రెండు రోజుల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ ఏడాది కూడా పోటీల్లో పాల్గొంటున్నాను. తాజాగా కూర్గ్‌లో నిర్వహించిన రౌండ్‌తో సహా.. ఇప్పటివరకూ జరిగిన మూడు రౌండ్లలో మొత్తంగా అయిదో స్థానంలో, మహిళా విభాగంలో మొదటి స్థానంలో ఉన్నాను. వచ్చే నెలలో కోయంబత్తూరులో జరిగే నాలుగో రౌండ్ కోసం, మధ్యప్రదేశ్‌లో నిర్వహించే ఫైనల్ రౌండ్ కోసం సిద్ధమవుతున్నాను. మూడోసారి టైటిల్‌ను కచ్చితంగా గెలుస్తాననే నమ్మకం నాకుంది. మరోవైపు ఆటోమొబైల్స్ గురించి, పర్యాటక ప్రాంతాల విశేషాల గురించి యూట్యూబ్‌లో పోస్ట్ చేస్తూ ఉంటాను. నాకు వేగం ఇష్టమే. కానీ అది కేవలం ర్యాలీ ట్రాక్ మీద మాత్రమే. పబ్లిక్ రోడ్ల మీద బాధ్యతాయుతంగా వాహనాలు నడుపుతాను. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా... అప్రమత్తంగా ఉంటాను. నాకు వీలైనంతవరకూ... ప్రయాణాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రచారం చేస్తున్నాను."

మూడేళ్ల విరామం

నేను మోటార్ స్పోర్ట్స్‌లో పాల్గొంటానని చెప్పినప్పుడు... ఎంతో మంది నిరుత్సాహపరిచారు. ఎందుకంటే అప్పటివరకూ కేరళలో మోటార్ స్పోర్ట్స్‌లో పాల్గొన్న మహిళలెవరూ లేరు. అది చాలా ప్రమాదాలతో కూడుకున్న వ్యవహారం. కానీ నా గురించి నేను చెప్పుకోవాలంటే... "సాహసం నా ఊపిరి" అంటాను. అందుకే వెనక్కు తగ్గలేదు. మొదట ఆఫ్-రోడ్ ఈవెంట్స్‌లోకి అడుగుపెట్టాను. ఆ తరువాత మోటోక్రాస్ పోటీల్లో పాల్గొన్నాను. వాటి కోసం చాలా కష్టపడ్డాను. వేగం, కచ్చితత్వం, అప్రమత్తత, సెకన్ల వ్యవధిలో నిర్ణయం తీసుకొనే సామర్థ్యం... ఇలాంటివి ఎన్నో కావాలి. కొట్టాయానికి చెందిన జార్జి వర్గీస్ పర్యవేక్షణలో నా నైపుణ్యాలను పెంచుకున్నాను. 2000లో తొలిసారిగా జాతీయ ర్యాలీలో పాల్గొన్నాను. అయితే ఆ తరువాత మూడేళ్ళపాటు విరామం ఇవ్వాల్సి వచ్చింది. కారణం... ఆర్థిక పరిస్థితులు. మోటార్ స్పోర్ట్స్ శిక్షణకు, ప్రాక్టీస్‌కు, పోటీలకు సిద్ధం కావడానికి, పాల్గొనడానికి లక్షల్లో ఖర్చవుతుంది. నా వృత్తి ద్వారా నాకు వచ్చే ఆదాయంతో దాన్ని భరించే శక్తి నాకు లేదు. స్పాన్సర్ల కోసం చాలా ప్రయత్నించాను. చివరకు ఒక సంస్థ ముందుకు వచ్చింది. దాంతో మళ్ళీ రేస్ ట్రాక్ మీదికి వచ్చాను.

మట్టి ఇంట్లో ఉచిత బడి

వినూత్నం

చదివింది పన్నెండో తరగతి. అయితేనేం! తన దగ్గరున్న కొద్దిపాటి విద్యనే ఉచితంగా పంచాలనుకున్న ఒక గిరిజన మహిళ, సొంతగా ఒక బడినే నడుపుతోంది. పశ్చిమ బెంగాల్, మారుమూల గ్రామంలోని ఆ ఉచిత బడి, దాన్ని నడుపుతున్న ఏకైక ఉపాధ్యాయురాలు మాలతి ముర్ము గురించి తెలుసుకుందాం!

జిలిన్‌సెరంగ్, పశ్చిమ బెంగాల్‌లోని ఓ గిరిజన గ్రామం. ఈ మారుమూల గ్రామాన్ని బయటి ప్రపంచంతో అనుసంధానించే రోడ్డు, రవాణా సదుపాయాలు లేవు. ఆ గిరిజనుల అవసరాలన్నిటికీ నడకే ఆధారం. గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఉన్నప్పటికీ టీచర్ల కొరత కారణంగా ఆ పాఠశాల అరకొరగానే నడుస్తూ ఉంటుంది. దాంతో పది కిలోమీటర్ల దూరంలోని మరొక బడికి నడిచి వెళ్లలేక క్రమక్రమంగా ఆ గ్రామంలోని పిల్లలందరూ బడి మానేసి, ఇళ్లకే పరిమితమైపోయారు. 2019లో కొత్తగా పెళ్లైన మాలతి, పాతిక కిలోమీటర్ల దూరంలో ఉన్న తన గ్రామం బాగ్‌మండి నుంచి జిలింగ్‌సెరంగ్‌కు చేరుకుంది. ఆ ఊర్లో పిల్లలు బడి చదువు మానేసి, ఇంటి పనులకే పరిమితమవడాన్ని ఆమె గమనించింది. ఆరా తీస్తే, దగ్గర్లో ఎక్కడా ఒక్క బడి కూడా లేకపోవడం, కిలోమీటర్ల దూరం నడవవలసి రావడం, రోజంతా బడికే కేటాయించడం వల్ల వంటచెరకును సేకరించే సమయం లేకపోవడం లాంటి సమస్యలన్నీ ఆమె దృష్టికొచ్చాయి. అన్నిటికంటే ముఖ్యంగా ఆ నిరుపేద గిరిజనుల జీవనభృతి దెబ్బ తినకుండా ఉండాలంటే, వాళ్ల పిల్లలకు అదే గ్రామంలో బడిని ఏర్పాటు చేయడం అవసరమని ఆమె గ్రహించింది. అందుకు తానే ఎందుకు సంకల్పించకూడదని తనను తాను ప్రశ్నించుకుంది.

మట్టి గదులే తరగతి గదులుగా...

చదివింది పన్నెండో తరగతి. అయితేనేం.. ప్రాథమిక విద్యాబోధనకు ఆ చదువు సరిపోతుందని సర్దిచెప్పుకున్న మాలతి, మరో ఆలోచన లేకుండా పిల్లల కోసం ఇంటినే బడిగా మార్చింది. 'హయ్యర్ సెకండరీ స్కూలు పూర్తవగానే నాకు పెళ్లి చేశారు. 2019 ఏప్రిల్‌లో నేనీ గ్రామానికి వచ్చాను. పిల్లలు చదువుకోడానికి ఆసక్తి కనబరచడం లేదనే విషయాన్ని ఇక్కడికొచ్చిన కొద్ది రోజుల్లోనే గ్రహించాను. ఒకవేళ కిలోమీటర్ల దూరం నడిచి బడికి వెళ్లినా, కొద్ది రోజులకే బడి మానేస్తున్నట్టు కూడా కనిపెట్టాను. ఓ పక్క పేదరికం, మరోపక్క వాళ్లకు మార్గనిర్దేశం చేసేవాళ్లు లేకపోవడం వల్ల పిల్లలు బడి పట్ల ఆసక్తి కనబరచడం లేదు. అందుకే 2020, ఫిబ్రవరిలో నేనే చదువు చెప్పడం మొదలుపెట్టాను" అంటూ మీడియాకు వివరిస్తోంది మాలతి. కొవిడ్ సమయంలో ప్రభుత్వం నడిపే బడులు కూడా మూతపడ్డాయి. తరగతులన్నీ ఆన్‌లైన్ బాట పట్టాయి. కానీ అది కుగ్రామం. ఇంటర్నెట్ సదుపాయాలు లేకపోవడంతో కాస్త చదువు కాస్తా అటకెక్కింది. ఆ సమయంలో మాలతి బడి కీలకంగా మారింది. ఆ పరిస్థితిని సద్వినియోగం చేసుకున్న మాలతి, గ్రామీణుల సహాయంతో రెండు మట్టి గదులను నిర్మించి, వాటినే తరగతి గదులుగా మార్చేసుకుని కొత్త పాఠశాలకు శ్రీకారం చుట్టింది. మాలతి శ్రమ ఫలించింది. పిల్లలు బడిలో చేరడం మొదలుపెట్టారు. ఇప్పుడు ఏకంగా 45 మంది పిల్లలు ఆమె ఉచిత బడిలో చదువుకుంటున్నారు.






ప్రాథమిక పాఠాలు నేర్పిస్తూ...

మాలతీబాల స్కూల్ అనే పేరుతో నడుస్తున్న ఈ బడిలో మాలతి, ఇంగ్లీషు, గణితం, సైన్స్‌లో ప్రాథమిక పాఠాలు బోధిస్తోంది. ఎలాంటి బోధనార్హతలూ లేకపోయినా, ఎలాంటి ఉపాధ్యాయ శిక్షణా తీసుకోకపోయినా, గిరిజన బాలలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలనే మాలతి సంకల్పం అభినందనీయం.

జేఈఈ మెయిన్ ఫిజిక్స్ ప్రిపరేషన్

కాన్సెప్ట్ తెలిస్తే కష్టం కాదు



టెన్త్, ఇంటర్ వంటి అకడమిక్ పరీక్షలకు, కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌కు తేడా ఉంది. అకడమిక్ పరీక్షల్లో మంచి మార్కుల కోసం పాఠ్య పుస్తకాల్లోని విజ్ఞానం సరిపోతుంది. అదే పోటీపరీక్షలకు లోతుగా అధ్యయనం చేయాలి. సిలబస్‌కు అనుగుణంగా ప్రిపేర్ కావాలి. మోడల్ పేపర్స్ సాధన చేయాలి. మాక్ టెస్టులకు హాజరుకావాలి. అలాగే ప్రతి మార్కు మంచి ర్యాంకు సాధనలో కీలకమే. ఈ నేపథ్యంలో జేఈఈ మెయిన్‌లో ఫిజిక్స్‌కు ఎలా ప్రిపేరైతే మంచిదో పరిశీలిద్దాం.

సబ్జెక్టు పరిజ్ఞానానికి తోడు ప్రాబ్లెమ్ సాల్వింగ్ స్కిల్స్ తెలియాలి. అందుకోసం క్లిష్టమైన వాటిని విశ్లేషించే సామర్థ్యాన్ని అలవర్చుకోవాలి.

- మొదట సబ్జెక్టుపై సిలబస్‌కు అనుగుణంగా సంపూర్ణ అవగాహన కలుగజేసుకోవాలి. తదుపరి రెగ్యులర్ ప్రాక్టీస్‌తో సబ్జెక్టుపై పట్టు లభిస్తుంది.
- వారాంతంలో జరిగే పరీక్షల్లో మార్కులు తక్కువ వచ్చినప్పటికీ ఇబ్బంది పడాల్సిందేమీ లేదు. ఫెయిల్యూర్‌ను సక్సెస్‌కు తొలిమెట్టుగా భావించాలి. అసలా ప్రశ్నను ఎలా అర్థం చేసుకున్నాం, సమాధానాన్ని కనుగొనే క్రమంలో ఎక్కడ తప్పు దొర్లింది అన్నది తెలుసుకుని, సరైన పద్ధతిలో దాన్ని నేర్చుకోవాలి. ఆ తప్పు పునరావృతం కాకుండా చూసుకోవాలి.
- ఒక సమస్యకు పరిష్కారం కనుగొనే పద్ధతిలో వేగమే కాదు, కచ్చితత్వానికీ ప్రాధాన్యం ఇవ్వాలి.

మార్కుల స్కోర్ పెంపు కోసం

- గడచిన ప్రశ్నపత్రాలను విశ్లేషించుకుంటే కొన్ని చాప్టర్లకే ప్రాధాన్యం ఇస్తున్నట్టు అర్థమవుతుంది. 75 శాతం ప్రశ్నలు 25శాతం చాప్టర్ల నుంచే వస్తున్నాయి. 25 ప్రశ్నలకు అంటే అందులో కనీసం 15కి సమాధానాలు సరిగ్గా గుర్తించగలిగితే చాలు, సీటు గ్యారంటీ వస్తుంది.
- చాప్టర్ల వారీగా అవి... ప్రశ్నల లెక్కన మోడ్రన్ ఫిజిక్స్(4), కరెంట్ ఎలక్ట్రిసిటీ(3), ఎలక్ట్రోస్టాటిక్స్(2), రే ఆప్టిక్స్(2), మెకానిక్స్(5), వేవ్స్(3), థర్మోడైనమిక్స్(2)

ఎలా చదవాలంటే?

- డిసెంబర్ నెలంతా రోజుకు ఒక చాప్టర్ చొప్పున సబ్జెక్టు అంతా చదవాలి.
- డివైడ్ అండ్ కాంకర్ అంటే చాప్టర్‌ను అయిదారు భాగాలుగా విభజించుకుని పట్టు సాధించాలి.
- కాన్సెప్ట్‌ను అర్థం చేసుకునేందుకు షార్ట్ నోట్స్‌ని ఉపయోగించాలి. ప్రాబ్లెమ్‌ని సాల్వ్ చేసే పద్ధతిలో కాన్సెప్ట్‌ను అర్థం చేసుకునే పద్ధతిని తెలుసుకోవాలి.
- ప్రతి రోజూ పది నుంచి ఇరవై ప్రాబ్లెమ్స్ సాల్వ్ చేయాలి. ఎక్కడైనా తప్పు దొర్లితే దాన్ని కనీసం అయిదారు సార్లు ప్రాక్టీస్ చేయాలి.
- ప్రతి అదివారం ఫుల్ సిలబస్‌పై ఒక మోడల్ టెస్ట్ ప్రాక్టీస్ చేయాలి.
- నెగెటివ్ మార్కులు రాకుండా జాగ్రత్త పడాలి. టైమ్ మేనేజ్‌మెంట్ ముఖ్యం. ర్యాండమ్ వీడియోలు చూసి టైమ్ వృథా చేసుకోవద్దు.
- ప్రిపరేషన్ మొదటి రోజు నుంచి మార్కులు అని కాకుండా సబ్జెక్టుపై దృష్టి పెట్టడం మంచిది.
- సీటు తెచ్చుకోవడం ఎంత మాత్రం మేజిక్ లేదంటే లక్ కాదని విద్యార్థులు గ్రహించాలి. ఎంతో కృషి ఉంటేనే అనుకున్న సీటు లభిస్తుందని తెలుసుకోవాలి.

రెండు రకాలు

- మొదటిది కాన్సెప్ట్‌ను అర్థం చేసుకోవడం. అందుకు ఎన్‌సీఈఆర్‌టి పుస్తకాలతో సొంత నోట్స్‌ను రూపొందించుకోవాలి.
- కాన్సెప్ట్‌ను నేర్చుకునేందుకు థియరీ ఓరియెంటెడ్ మెటీరియల్ చాలు. రేఖా చిత్రాలు, చార్టులు, టేబుల్స్‌తో కాన్సెప్ట్‌ను అర్థం చేసుకోవాలి.
- ప్రతి చాప్టర్‌పై ఒకట్రెండు పేజీల మేర షార్ట్ నోట్స్‌ను తయారు చేసుకోవాలి.
- కాన్సెప్టును గుర్తుంచుకోవడంలో విజువలైజేషన్ టెక్నిక్స్, టిప్స్ సహాయపడతాయి.
- ఫార్ములా లేదా చార్టులను గుర్తుంచుకోవడంలో న్యూమానిక్స్(జ్ఞప్తికి తెచ్చుకోవడం) కీలకం. ఉదాహరణకు ఇఎండబ్ల్యు చాప్టర్‌లో ఎప్పుడూ ఒక ప్రశ్న వస్తుంది. చాలా సార్లు ఈ ప్రశ్న ఇఎండబ్ల్యుకు సంబంధించిన వేవ్‌లెంథ్/ ఫ్రీక్వెన్సీ శక్తి ఆర్డర్‌పైన ఉంటుంది. ఉదాహరణకు - రేడియో వేవ్స్ - మైక్రో వేవ్స్ - ఇన్‌ఫ్రారెడ్ రేస్ - విజిబుల్ రేస్ - అల్ట్రావయలెట్ రేస్ - ఎక్స్ రేస్ - గామా(ఆర్) రేస్ - కాస్మిక్ రేస్

దీనిని గుర్తుంచుకునేందుకు..... రెడ్ మార్షియన్స్ ఇన్వేడెడ్ వీనస్ యూజింగ్ ఎక్స్‌రే గన్ లేదా మా ఇంటికి వచ్చి ఉండు ఇష్టం లేకపోతే రాకు అన్న పద్ధతి ఉపయోగించాలి.

- ఇదే విధంగా రేడియో యాక్టివ్ సిరీస్ ఆర్డర్‌ను గుర్తుంచుకోవచ్చు. థోరియం సిరీస్(4ఎన్), నెప్టూనియమ్ సిరీస్(4ఎన్+1), యురేనియమ్ సిరీస్(4ఎన్+2), యాక్టీనియం సిరీస్(4ఎన్+3). దీని కోసం సినిమా రంగం ఆంధ్రలోకి ఎలా వచ్చిందో చెబితే సరిపోతుంది. తమిళనాడు(టిఎన్) ఉత్తర ఆంధ్ర(యుఎ) - రివర్స్‌లో అంటే - ఎయుఎన్‌టి అని గుర్తుంచుకోవచ్చు.
- రెండోది ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్. ప్రాబ్లెమ్‌ను పూర్తిగా చదవాలి. దానికి సంబంధించిన ఫార్ములా ఉపయోగించాలి. రోజుకు ఒకటి రెండు గంటలు న్యూమరికల్స్ ప్రాక్టీస్ చేయాలి. గడచిన అయిదేళ్ల ప్రశ్నపత్రాలను సాల్వ్ చేస్తే సంపూర్ణ అవగాహన కలిగించుకోవచ్చు.

డాక్టర్ కిషన్‌రావ్ టంకశాల,
బన్సాల్ క్లాసెస్, హిమయతనగర్, హైదరాబాద్

దిక్సూచి

మ్యాట్

దేశంలోని బిజినెస్ స్కూళ్లలో ప్రవేశానికి ఉద్దేశించిన పరీక్షల్లో మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్(మ్యాట్) ఒకటి. ఆలిండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఏఐఎంఏ) దీన్ని ఏటా నాలుగుసార్లు నిర్వహిస్తుంది. ప్రస్తుతం డిసెంబర్‌లో నిర్వహించే పరీక్షకు ప్రకటన ఇచ్చింది. డిగ్రీ ఉత్తీర్ణులకు తోడు కోర్సు చివరి ఏడాది చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

- పేపర్ బేస్డ్ టెస్ట్(పీబీటీ), కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) అలాగే పీపీటీ+సీబీటీగా అంటే మూడు రకాలుగా ఈ టెస్టును నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల్లోని కాలేజీలకు తోడు దేశవ్యాప్తంగా ఆరువందలకు పైగా సంస్థల్లో ప్రవేశానికి ఈ స్కోర్ ఉపయోగపడుతుంది. అలాగే ఇందులో సాధించిన స్కోర్ ఏడాది పాటు చెల్లుతుంది.
- రెండు గంటల వ్యవధికలిగిన ఈ పరీక్షలో అయిదు విభాగాల నుంచి 150 ప్రశ్నలు అడుగుతారు. లాంగ్వేజ్ కాంప్రహెన్షన్, ఇంటెలిజెన్స్ అండ్ క్రిటికల్ రీజనింగ్, మేథమెటికల్ స్కిల్స్, డేటా అనాలిసిస్ అండ్ సఫిసియెన్సీ, ఎకనామిక్ అండ్ బిజినెస్ ఎన్విరాన్‌మెంట్ అంశాల్లో ప్రశ్నలు ఉంటాయి. సమాధానాన్ని కరెక్ట్‌గా గుర్తిస్తే ఒక మార్కు ఇస్తారు. తప్పుగా గుర్తిస్తే పావు మార్కు తగ్గిస్తారు. వెబ్‌సైట్‌లో మాదిరి ప్రశ్నలు ఉన్నాయి. ఇటు క్యాట్, అటు ఐసెట్‌కు మధ్యస్థంగా మ్యాట్ ఉంటుంది.
- **పీబీటీ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** డిసెంబర్ 7
- **సీబీటీ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** డిసెంబర్ 15
- **పేపర్ ఆధారిత పరీక్ష తేదీ:** డిసెంబర్ 13
- **కంప్యూటర్ ఆధారిత పరీక్ష:** డిసెంబర్ 21
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** పేపర్ ఆధారిత - హైదరాబాద్, విశాఖపట్టణం; కంప్యూటర్ ఆధారిత - హైదరాబాద్, విజయవాడ
- **వెబ్‌సైట్:** https://mat.aima.in



మేనేజ్‌లో పీజీ డిప్లొమా

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్(మేనేజ్) 2026-28 విద్యాసంవత్సరానికి సంబంధించి పీజీడీఎం(అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్) కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. అగ్రికల్చర్ సంబంధ కోర్సులో డిగ్రీ ఉత్తీర్ణులు ఈ కోర్సు చేసేందుకు అర్హులు. 2025 క్యాట్ స్కోర్, గ్రూప్ డిస్కషన్, ఎస్సే రైటింగ్, అకడమిక్ రికార్డ్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ఉంటుంది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు వచ్చే ఏడాది ఫిబ్రవరి 10లోగా దరఖాస్తు చేసుకోవాలి.

వెబ్‌సైట్: www.manage.gov.in/ABMAdmissions/appln.pdf

జాబ్ కార్నర్

బీడిఎల్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీలు

హైదరాబాద్‌లోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్(బీడీఎల్) 80 మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది.

విభాగాలు: ఎలక్ట్రానిక్స్, మెకానికల్, ఎలక్ట్రికల్, కంప్యూటర్ సైన్స్, మెటలర్జీ, కెమికల్, సివిల్, ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్స్

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగాలో 55 నుంచి 60 శాతం మార్కులతో డిగ్రీ/ పీజీ - డిప్లొమా, సీఏ/ ఐసీడబ్ల్యుఏఐ పాసై ఉండాలి.

ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు: డిసెంబర్ 3 నుంచి 29 వరకు

వెబ్‌సైట్: https://bdl-india.in

भारत डायनामिक्स लिमिटेड
BHARAT DYNAMICS LIMITED

అప్రెంటిస్‌షిప్

బీడీఎల్ - కంచన్‌బాగ్ యూనిట్‌లో 156 ట్రేడ్ అప్రెంటిస్‌షిప్ ఖాళీలు ఉన్నాయి.

ట్రేడ్‌లు: ఫిట్టర్ 70, ఎలక్ట్రీషియన్ 10, ఎలక్ట్రానిక్స్ మెకానిక్ 30, మెషినిస్ట్ 15, మెషినిస్ట్ గ్రైండర్ 2, మెకానికల్ డీజిల్ 5, మెకానిక్ ఆర్ అండ్ ఏసీ 5, టర్నర్ 15, వెల్డర్ 4

అర్హత: టెన్త్‌తో పాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.

వయసు: డిసెంబర్ 8 నాటికి వయస్సు 14-30 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలి.

ఎంపిక: విద్యార్హతలు, రిజర్వేషన్ నిబంధనల ఆధారంగా

దరఖాస్తు: అప్రెంటిస్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్‌కు డిసెంబర్ 8(హార్డ్ కాపీలు పంపేందుకు డిసెంబర్ 12)

వెబ్‌సైట్: www.apprenticeshipindia.gov.in

బ్యాంక్ ఆఫ్ బరోడాలో మేనేజర్లు

బ్యాంక్ ఆఫ్ బరోడా 82 మేనేజర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది

పోస్టులు: జోనల్ రిసీవబుల్ మేనేజర్ 13, రీజినల్ రిసీవబుల్ మేనేజర్ 13, ఏరియా రిసీవబుల్ మేనేజర్ 49, కంప్లయన్స్ మేనేజర్ 1, కంప్లయింట్ మేనేజర్ 1, ప్రాసెస్ మేనేజర్ 1, వెండర్ మేనేజర్ 1, ఫ్లోర్ మేనేజర్ 3

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి

ఎంపిక: ఇంటర్వ్యూ ఆధారంగా

ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఆఖరు తేదీ: డిసెంబర్ 9

వెబ్‌సైట్: www.bankofbaroda.bank.in

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

మాస్ సాంగ్‌కు చిరు.. వెంకీ స్టెప్స్



చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న 'మన శంకర వరప్రసాద్ గారు' షూటింగ్ శరవేగంగా సాగుతోంది. హీరో వెంకటేశ్ ఈ చిత్రంలో ఓ ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. తాజాగా ఈ సినిమా గురించి ఓ ఆసక్తికరమైన అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ అగ్రహీరోలిద్దరూ సినిమాలో ఓ గీతానికి కాలు కదపనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే ఓ అదిరిపోయే మాస్ గీతాన్ని భారీ సెట్ వేసి షూట్ చేస్తున్నారు. దాదాపు 500 మంది డ్యాన్సర్లతో కలర్‌ఫుల్‌గా ఈ పాటను చిత్రీకరిస్తున్నారు. విజయ్ పొలకి ఈ పాటకు కొరియోగ్రఫీ చేస్తున్నారు. ఈ మాస్ గీతం వచ్చే ఏడాది విడుదలయ్యే ఉత్తమ పాటల్లో ఒకటిగా నిలిచిపోతుంది, వీరిద్దరి ఎనర్జీ, స్టైల్ ప్రేక్షకులకు అద్భుతమైన వినోదం అందించనుందని మేకర్స్ చెప్పారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రం విడుదల కానుంది. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్‌పై సాహు గారపాటి, చిరంజీవి కుమార్తె సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. నయనతార కథానాయిక. ఈ చిత్రానికి ఎడిటర్: తిమ్మరాజు, సినిమాటోగ్రఫీ: సమీర్ రెడ్డి, సంగీతం: భీమ్స్ సిసిరోలియో.



అఖండ నుంచి అవతార్ వరకూ...

● డిసెంబర్‌లో బాక్సాఫీస్ వార్


ప్రతి ఏటా సంక్రాంతి వస్తుందంటే చాలు, సినిమా ప్రేమికులకు పండగే. కానీ ఈ సారి డిసెంబర్ మాత్రం మామూలుగా లేదు. బాక్సాఫీసు రికార్డులు బద్దలుకొట్టేందుకు పాన్ ఇండియా స్టార్ల నుంచి హాలీవుడ్ దిగ్గజాల వరకూ అందరూ క్యూ కట్టారు. నందమూరి బాలకృష్ణ 'అఖండ 2' గర్జనతో మొదలై, జేమ్స్ కామెరాన్ సృష్టించబోయే విజువల్ వండర్ వరకూ... ఈ ఏడాది ముగింపు బాక్సాఫీసు దగ్గర వేడి పుట్టించనుంది.

మొదటి వారమే మాస్ జాతర

డిసెంబర్ నెల ఆరంభమే అదిరిపోయే రేంజ్‌లో ఉండబోతోంది. 'అఖండ'లో అఘోరాగా విశ్వరూపం చూపారు బాలకృష్ణ. ఆ చిత్రానికి సీక్వెల్‌గా తెరకెక్కిన 'అఖండ 2' డిసెంబర్ 5న థియేటర్లలో విడుదలకు దిగుతోంది. అదే రోజు బాలీవుడ్ హీరో రణ్‌వీర్‌సింగ్ 'ధురంధర్', మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి నటించిన 'కలంకావల్' చిత్రాలు విడుదలవుతున్నాయి.

- రెండో వారంలో 'అన్నగారు వస్తారు' అంటూ కార్తీ సందడి చేయనున్నారు. దీంతోపాటు 'మోగ్లీ, సైక్ సిద్ధార్థ్' చిత్రాలు కూడా డిసెంబర్ 12నే విడుదలవుతున్నాయి.
- ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రేమికులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న తేదీ డిసెంబర్ 19. జేమ్స్ కామెరాన్ తెరకెక్కించిన దృశ్యకావ్యం 'అవతార్ 3' వెండితెరపై అద్భుతాలు సృష్టించేందుకు సిద్ధంగా ఉంది. దీనికి ఒక రోజు ముందు ప్రదీప్ రంగనాథన్ నటించిన 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' చిత్రం విడుదలవుతోంది.

క్రిస్మస్ కిటకిట: సంక్రాంతిని తలపించేలా క్రిస్మస్ రోజునా బాక్సాఫీసు దగ్గర పలు చిత్రాలు వరుస కడుతున్నాయి. డిసెంబర్ 25న ఏకంగా ఏడు సినిమాలు విడుదలవుతున్నాయి. మోహన్‌లాల్ 'వృషభ', హాలీవుడ్ మూవీ 'అనకొండ', గుణశేఖర్ దర్శకత్వంలో తెరకెక్కిన యూత్‌ఫుల్ డ్రామా 'యుఫోరియా', రోషన్ మేకా హీరోగా నటించిన క్రీడా నేపథ్య చిత్రం 'ఛాంపియన్'తో పాటు 'శంబల, దండోరా, పతంగ్' చిత్రాలు ఒకే రోజు ప్రేక్షకుల ముందుకొస్తున్నాయి. డిసెంబర్ బరిలో నిలిచిన చిత్రాలు డజనుకు పైగానే ఉన్నాయి. మరి వీటిలో ఎన్ని చిత్రాలను విజయం వరిస్తుందో వేచి చూడాలి.



దుల్కర్ కొత్త సినిమా

మలయాళ కథానాయకుడు దుల్కర్ సల్మాన్ 'ఐ యామ్ గేమ్' అనే కొత్త సినిమాతో అలరించబోతున్నారు. నహాస్ హిదాయత్ దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రాన్ని దుల్కర్ సల్మాన్, జోమ్ వర్గీస్ నిర్మిస్తున్నారు. మేకర్స్ ఆదివారం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు. నైట్ క్లబ్, క్యాసినో బ్యాక్‌డ్రాప్‌లో స్టయిలిష్ సూట్ వేసుకున్న దుల్కర్ రక్తం తడిసిన చేతితో గన్ పట్టుకుని ఇంటెన్స్ లుక్‌లో కనిపించడం అదిరిపోయింది. మిష్కిన్, ఆంటోని వర్గీస్, సంయుక్త విశ్వనాథన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

లెజెండ్‌తో నటించడం నా అదృష్టం



హర్షాలి మల్హోత్రా

'బాలకృష్ణ గారి లాంటి లెజెండరీ యాక్టర్‌తో కలసి నటించడం నిజంగా నా అదృష్టం. సెట్‌లో ఆయన చిత్ర బృందంతో సరదాగా ఉన్నారు. తెలుగు సినిమాకు కొత్త వ్యక్తిని అయిన నన్ను ఎంతో ప్రోత్సహించారు. బాలకృష్ణగారు వెరీ ఎనర్జిటిక్, అన్‌స్టాపబుల్' అని అన్నారు నటి హర్షాలి మల్హోత్రా. నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను తెరకెక్కించిన 'అఖండ 2: తాండవం'లో ఆమె కీలక పాత్ర పోషించారు. తేజస్విని నందమూరి సమర్పణలో 14 రీల్స్ బేనర్‌పై రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మించారు. ఈనెల 5న విడుదలవుతున్న సందర్భంగా హర్షాలి మీడియాతో మాట్లాడారు.

- దాదాపు పదేళ్ల తర్వాత మళ్లీ తెరముందుకు వస్తున్నందుకు ఆనందంగా ఉంది. 'బంజరంగీ భాయిజాన్' చిత్రం తర్వాత కొంత గ్యాప్ వచ్చింది. ఈ సమయంలో చదువుపై దృష్టి పెట్టాను. అలాగే కథక్ నృత్యం కూడా నేర్చుకున్నాను. ఒక మంచి పాత్ర కోసం ఎదురు చూస్తున్నప్పుడు 'అఖండ 2'లో అవకాశం వచ్చింది.
- ఈ చిత్రంలో నేను జననీ అనే పాత్రలో కనిపిస్తాను. జననీ జీవితం ప్రమాదంలో పడినప్పుడల్లా అఖండ వచ్చి రక్షిస్తాడు. ఈ సినిమాలో నేను కొన్ని యాక్షన్ స్టంట్స్ కూడా చేశాను.
- డైరెక్టర్ బోయపాటి గారు 'నువ్వు తప్పకుండా చేయగలవు' అని ఎంతో ప్రోత్సహించేవారు. సన్నివేశం పూర్తయిన తర్వాత 'అద్భుతంగా చేశావ'ని అభినందించేవారు. నాకు సంజయ్ లీలా బన్సాలీ గారి సినిమాలో నటించాలని ఉంది. ఆయన హీరోయిన్లని చూపించే విధానం అద్భుతంగా ఉంటుంది.

సుకుమార్ చిత్రంలా ఉంటుంది

'సహకుటుంబానాం' నా స్నేహితుడు విక్రమ్ చేయాలనుకున్న సినిమా. కానీ ఆయన చనిపోవడంతో ఆ కథ లైన్‌ను తీసుకుని ఉదయ్ చేశాడని తెలిసి ఎంతో సంతోషించా. ఈ చిత్రం సుకుమార్ గారి ఆలోచన లాగా ఉంటుంది. అందర్నీ ఆకట్టుకుంటుంది' అని దర్శకుడు బుచ్చిబాబు సానా అన్నారు. రామ్‌కిరణ్, మేఘా ఆకాశ్ జంటగా ఉదయ్ శర్మ



తెరకెక్కించిన చిత్రం 'సహకుటుంబానాం'. హెచ్.మహదేవ్ గౌడ్ నిర్మించారు. ఈ చిత్రం ట్రైలర్‌ను బుచ్చిబాబు సానా విడుదల చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ 'ఇటువంటి కథను నా 48 ఏళ్ల కెరీర్‌లో ఎప్పుడూ వినలేదు. చాలా ప్రత్యేకంగా ఉండబోతోంది' అని చెప్పారు. రామ్‌కిరణ్ మాట్లాడుతూ 'అందరి అంచనాలను అందుకునేలా ఈ సినిమా ఉంటుంది. కచ్చితంగా విజయం సాధిస్తుంది' అని తెలిపారు.

కన్నడ హాస్యనటుడు ఉమేశ్ కన్నుమూత



ప్రముఖ కన్నడ హాస్యనటుడు ఉమేశ్ (80) ఆదివారం ఉదయం బెంగళూరులో కన్నుమూశారు. కొన్నాళ్లుగా ఆయన లివర్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, కన్నడ సాంస్కృతిక శాఖ మంత్రి శివరాజ్ తంగడిగతోపాటు పలువురు అభిమానులు, సినీ నటులు పెద్దఎత్తున తరలివచ్చి నివాళులు అర్పించారు. ఉమేశ్ 1945 ఏప్రిల్ 22న మైసూరులో జన్మించారు. బాల్యంలోనే ఉమేశ్ పలు సినిమాల్లో నటించారు. కే హిరణ్ణయ్య మిత్రమండలిలో చేరాక పలు నాటకాల్లో భిన్నమైన పాత్రలను పోషించారు. 350 సినిమాలకుపైగా నటించారు. ఆయనకు భార్య ఉష, కుమార్తె ఉన్నారు. ఆదివారం సాయంత్రం బనశంకరి స్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

సందేశాత్మక చిత్రంతో

ప్రస్తుత భారతదేశ, సామాజిక, రాజకీయ ఇతివృత్తంతో ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు నిర్మాత అతీకూర్ రెహమాన్ తెలిపారు. నూతన నటీనటులతో రూపొందుతున్న ఈ చిత్రం వివరాలను ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన వివరించారు. 'టాలీవుడ్‌లో ఆర్ఎక్స్ ఫ్లోర్ మూవీస్ అనే కొత్త బేనర్‌ను ఏర్పాటు చేశాం. వినోద ప్రధానమైన చిత్రాలతో పాటు పలు సామాజిక సమస్యలపై సందేశాత్మకంగా ఉండే చిత్రాలను నిర్మిస్తాం. ఈ నెల్లోనే సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్తాం' అని తెలిపారు.



చెత్త సినిమాలకు అత్యున్నత పురస్కారాలా?



అదూర్ గోపాలకృష్ణన్

ప్రముఖ మలయాళ సినీ దర్శకుడు, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత అదూర్ గోపాలకృష్ణన్ జాతీయ చలనచిత్ర అవార్డుల ఎంపికపై తీవ్ర విమర్శలు చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... గత కొంతకాలంగా చెత్త సినిమాలకు అత్యున్నత పురస్కారాలు దక్కుతున్నాయని ఆరోపించారు. దీనిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. నాసిరకం చిత్రాల ఎంపికకు జ్యూరీ అసమర్థతే ప్రధానకారణం అని ఆరోపిస్తూ, అర్హత కలిగిన జ్యూరీ ఉంటేనే సరైన చిత్రాలకు గౌరవం దక్కుతుందని స్పష్టం చేశారు. నాణ్యమైన సినిమాలను గుర్తించి, ప్రోత్సహించడమే జాతీయ అవార్డుల ఏర్పాటు వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశమనీ, కానీ ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయ నిర్ణేతల ప్రమాణాలు తక్కువగా ఉంటే, వారి గుర్తింపు కోసం నాసిరకం చిత్రాలనే పురస్కారాలకు ఎంపిక చేస్తారని ఎద్దేవా చేశారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే జాతీయ పురస్కారాలను ఇవ్వడం మానుకుంటే మంచిదని గోపాలకృష్ణన్ అభిప్రాయపడ్డారు 71వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో మలయాళ చిత్రం 'ది కేరళ స్టోరీ' కి అవార్డులు రావడంపై గోపాలకృష్ణన్ కొన్నాళ్లుగా పరోక్షంగా విమర్శలు చేస్తున్నారు.

స్పోర్ట్స్



గాయత్రి జోడీదే డబుల్స్ ట్రోఫీ

- టైటిల్ నిలబెట్టుకున్న భారత ద్వయం
- సయ్యద్ మోదీ ఫైనల్లో శ్రీకాంత్ ఓటమి

లఖ్‌నవూ: భారత డబుల్స్ స్టార్ జోడీ గాయత్రీ గోపీచంద్/ట్రీసా జాలీ సొంతగడ్డపై అదరగొట్టింది. సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో డబుల్స్ టైటిల్ నిలబెట్టుకొని ఈ వేదికపై తమకు తిరుగులేదని చాటుకుంది. ఆదివారం ఇక్కడ జరిగిన మహిళల డబుల్స్ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ గాయత్రి ద్వయం 17-21, 21-13, 21-15తో జపాన్ జోడీ కహో ఒసావ/మియా తనబెను ఓడించి విజేతగా నిలిచింది. ఇక, పురుషుల సింగిల్స్‌లో ఎనిమిదేళ్లుగా అంతర్జాతీయ టైటిల్ కోసం ఎదురుచూస్తున్న ప్రపంచ మాజీ నెంబర్‌వన్ కిడాంబి శ్రీకాంత్‌కు మరోసారి నిరాశే ఎదురైంది. కిడాంబి ఫైనల్ చేరినా రన్నరప్‌కే పరిమితమయ్యాడు. తుదిపోరులో హాంకాంగ్ షట్లర్ జాసన్ గునవాన్ 21-16, 8-21, 22-20తో శ్రీకాంత్‌పై నెగ్గి టైటిల్ దక్కించుకున్నాడు. శ్రీకాంత్ చివరగా 2017లో ఫ్రెంచ్ ఓపెన్ నెగ్గాడు.

హాకీ రన్నరప్.. భారత్

బెల్జియం ఖాతాలో అజ్లాన్ షా కప్

ఇపోహ్ (మలేసియా): సుల్తాన్ అజ్లాన్ షా హాకీ కప్‌లో భారత్ రన్నరప్ టైటిల్‌తో సరిపెట్టుకుంది. ఆదివారం జరిగిన హోరాహోరీ ఫైనల్లో బెల్జియం 1-0తో భారత్‌ను ఓడించి తొలిసారి చాంపియన్‌గా నిలిచింది. మ్యాచ్‌లో నమోదైన ఏకైక గోల్‌ను థిబ్యూ స్టాక్‌బ్రూక్స్ 34వ నిమిషంలో చేశాడు.


ఐపీఎల్‌కు రస్సెల్ గుడ్‌బై

పవర్ కోచ్‌గా కేకేఆర్ జట్టుతో చేరిక



కోల్‌కతా: వెస్టిండీస్ స్టార్ ఆల్‌రౌండర్ ఆండ్రీ రస్సెల్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)కు వీడ్కోలు పలికాడు. 2014 నుంచి కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్)కు ఆడుతున్న 37 ఏళ్ల రస్సెల్‌ను ఇటీవలే ఆ జట్టు విడుదల చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఈనెల 19న జరిగే మినీ వేలంలో రస్సెల్‌కు భారీ ధర పలకొచ్చని అంతా భావిస్తున్న తరుణంలో.. అతను ఏకంగా లీగ్‌కే గుడ్‌బై చెప్పడం గమనార్హం. ఆటగాడిగా వైదొలగుతున్న తాను ఐపీఎల్‌లో కోచ్‌గా కొనసాగుతానని రస్సెల్ తెలిపాడు. కేకేఆర్ జట్టు సహాయక బృందంలో పవర్ కోచ్‌గా చేరుతున్నట్టు వెల్లడించాడు. ఐపీఎల్‌లో 140 మ్యాచులు ఆడిన రస్సెల్.. 174.18 స్ట్రయిక్ రేట్‌తో 2651 పరుగులు చేశాడు. 123 వికెట్లు పడగొట్టాడు.

అభిషేక్ తుఫాన్ ఇన్నింగ్స్



హైదరాబాద్: సఫారీలతో టీ20 సిరీస్‌కు ముందు టీమిండియా స్టార్ అభిషేక్ శర్మ విశ్వరూపం చూపించాడు. సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీ ఎలీట్ గ్రూప్-సిలో భాగంగా ఇక్కడి జింఖానా మైదానంలో బెంగాల్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ జట్టు ఆటగాడు అభిషేక్ (52 బంతుల్లో 8 ఫోర్లు, 16 సిక్సర్లతో 148) బౌండరీలు, సిక్సర్లతో పరుగుల వరద పారించాడు. కేవలం 32 బంతుల్లోనే సెంచరీ సాధించిన అతను.. సెంచరీ చేరే క్రమంలో 12 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసుకొని చరిత్ర సృష్టించాడు. ఈ క్రమంలో ఓవరాల్‌గా పురుషుల టీ20ల్లో వేగవంతమైన ఫిఫ్టీ చేసిన ఆటగాడిగా యువరాజ్, క్రిస్ గేల్, హజ్రతుల్లా జజాయ్, సాహిల్ చౌహాన్‌తో కలిసి మూడోస్థానంలో నిలిచాడు. దీపేందర్ సింగ్ (నేపాల్, 9 బంతుల్లో), అశుతోష్ శర్మ (భారత్, 11 బంతుల్లో) తొలి రెండుస్థానాల్లో ఉన్నారు. ఇక, ముస్తాక్ అలీ టోర్నీలో అశుతోష్ తర్వాత ఈ ఘనత సాధించిన రెండో ఆటగాడు అభిషేక్. 2023 టోర్నీలో హిమాచల్‌తో పోరులో రైల్వేస్ తరఫున అశుతోష్ 11 బంతుల్లోనే ఫిఫ్టీ చేశాడు. కాగా, బెంగాల్‌తో పోరులో అభిషేక్ తుఫాన్ ఇన్నింగ్స్‌కు తోడు ప్రభ్‌సిమ్రన్ సింగ్ (35 బంతుల్లో 70) సత్తా చాటడంతో పంజాబ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 310 పరుగుల భారీ స్కోరు చేసింది. ప్రభ్‌సిమ్రన్‌తో కలిసి అభిషేక్ తొలి వికెట్‌కు 205 రన్స్ నమోదు చేశాడు. ఛేదనలో బెంగాల్ 20 ఓవర్లలో 198/9 స్కోరుకే కుప్పకూలి భారీ ఓటమిని మూటగట్టుకుంది. కాగా, ఈ టోర్నీలో బరోడా (గతేడాది సిక్కింపై 349/5) తర్వాత పంజాబ్‌దే అత్యధిక స్కోరు. అంతేకాదు.. పునీత్ బిస్త్ (17 సిక్సర్లు) తర్వాత ఓ ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన ఆటగాడిగానూ అభిషేక్ మరో రికార్డు సృష్టించాడు.

విరాట్ దంచేశాడు

వయస్సు అనేది సంఖ్యే కానీ ఆటకు అడ్డు కాదని రోహిత్, కోహ్లీ జోడీ మరోసారి నిరూపించింది.. మొన్నటి ఆస్ట్రేలియా పర్యటనలో ఫామ్ చాటుకున్న ఈ దిగ్గజ జంట దక్షిణాఫ్రికాతో తొలి వన్డేలోనూ ఆ జోరు కొనసాగించింది.. ముఖ్యంగా విరాట్ మాస్టర్ క్లాస్ బ్యాటింగ్‌తో సెంచరీతో విజృంభిస్తే.. రోహిత్ అర్ధ శతకంతో అదరగొట్టాడు. మొత్తంగా రో-కో ద్వయం ఫ్యాన్స్‌ను ఉర్రూతలూగించిన ఈ పోరులో భారత్ గెలుపొందింది.. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో ముందంజలో నిలిచింది.

- సెంచరీతో విజృంభణ
- రోహిత్, రాహుల్ అర్ధ శతకాలు
- భారత్‌దే తొలి వన్డే
- ఉత్కంఠ పోరులో సఫారీల ఓటమి

రాంచీ: దక్షిణాఫ్రికాతో రెండు టెస్ట్‌ల్లో వైట్‌వాష్ అయిన భారత్ వన్డే సిరీస్‌లో పుంజుకుంది. రోహిత్, కోహ్లీ జోడీ ధనాధన్ బ్యాటింగ్‌తో విజృంభించిన వేళ 17 పరుగులతో సఫారీలను ఓడించింది. ఆదివారం ఉత్కంఠగా జరిగిన తొలి వన్డేలో మొదట భారత్ 50 ఓవర్లలో 349/8 స్కోరు చేసింది. కోహ్లీ (120 బంతుల్లో 11 ఫోర్లు, 7 సిక్స్‌లతో 135) సెంచరీతో చెలరేగగా, కెప్టెన్ కేఎల్ రాహుల్ (56 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 60), రోహిత్ (51 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లతో 57) అర్ధ శతకాలతో మెరిశారు. బార్ట్‌మన్, బర్గర్, బాష్, యాన్సెన్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. భారీ ఛేదనలో దక్షిణాఫ్రికా 49.2 ఓవర్లలో 332 రన్స్‌కు ఆలౌటైంది. బ్రీట్‌స్కే (80 బంతుల్లో 8 ఫోర్లు, సిక్స్‌తో 72), యాన్సెన్ (39 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లతో 70), బాష్ (51 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 67) అర్ధ శతకాలతో పోరాడారు. కుల్దీప్ 4, హర్షిత్ 3, అర్ష్‌దీప్ 2 వికెట్లు తీశారు. కోహ్లీ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

'టాప్' విఫలమైనా..: భారీ ఛేదనలో హర్షిత్ ధాటికి దక్షిణాఫ్రికా 11/3తో తీవ్ర ఇక్కట్లలో పడింది. అయితే మిడిల్, లోయర్ మిడిలార్డర్ ఆటగాళ్లు పట్టు వీడకుండా పోరాడి భారత్‌లో గుబులు రేపారు. జోర్జీ (39), బ్రేవిస్ (37), యాన్సెన్‌లతో కలిసి బ్రీట్‌స్కే మూడు అర్ధ శతక భాగస్వామ్యాలతో సఫారీలను పోటీలోకి తెచ్చాడు. కానీ మూడు బంతుల తేడాతో యాన్సెన్, బ్రీట్‌స్కేను అవుట్ చేసిన కుల్దీప్ భారత్‌కు కీలక బ్రేక్ ఇచ్చాడు. కానీ బాష్, సుబ్రేయన్, బర్గర్ ఒత్తిడి లేకుండా ఆడి మ్యాచ్‌ను చివరి ఓవర్ వరకూ తీసుకొచ్చి ఉత్కంఠ రేపారు.


రో-కో షో: భారత్ ఇన్నింగ్స్‌ను రోహిత్, విరాట్ కోహ్లీ తమదైన శైలిలో నిర్మించారు. జైస్వాల్ త్వరగా నిష్క్రమించినా..ఇన్నింగ్స్ చక్కదిద్దే భారాన్ని రో-కో తమ భుజాలపై వేసుకున్నారు. టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా సారథి మార్‌క్రమ్ తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. అయితే ఇన్నింగ్స్ నాలుగో ఓవర్‌లో జైస్వాల్ (18)ని బర్గర్ క్యాచవుట్ చేశాడు. దాంతో ఫ్యాన్స్ హర్షధ్వానాల నడుమ క్రీజులోకి వచ్చిన కోహ్లీ ఎదుర్కొన్న మొదటి బంతిని ఫోర్ బాదివారిలో జోష్‌లో నింపాడు. మరోవైపు వ్యక్తిగత స్కోరు ఒక పరుగు వద్ద లైఫ్ పొందిన రోహిత్ యాన్సెన్ బౌలింగ్‌లో 4,4తో బ్యాటుకు పని చెప్పడంతో ఏడో ఓవర్లోనే జట్టు స్కోరు 50 దాటింది. ఆపై కోహ్లీ కూడా బర్గర్ బౌలింగ్‌లో 6,4తో కదం తొక్కడంతో స్టేడియం హోరెత్తింది. వీరిద్దరూ ప్రత్యర్థి బౌలర్లను ఓ ఆటాడుకొని ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడడంతో స్కోరుబోర్డు రేసు గుర్రంలా పరిగెత్తింది. 14వ ఓవర్లోనే జట్టు స్కోరు సెంచరీ దాటగా..బాష్ బౌలింగ్‌లో చూడచక్కటైన సిక్సర్‌తో విరాట్ ఫిఫ్టీ మార్క్ చేరాడు. తర్వాత రోహిత్ కూడా 60వ అర్ధ శతకం పూరించినా..కొద్దిసేపటికే యాన్సెన్ బౌలింగ్‌లో ఎల్బీగా వెనుదిరిగాడు. దాంతో 136 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. రుతురాజ్ గైక్వాడ్ (8), సుందర్ (13) త్వరగా నిష్క్రమించగా.. కేఎల్ రాహుల్ జతగా జట్టు ఇన్నింగ్స్‌ను పునర్ నిర్మించే బాధ్యతను కోహ్లీ చేపట్టాడు. యాన్సెన్ బౌలింగ్ బౌండరీతో సెంచరీ పూరించిన విరాట్..స్టేడియం మొత్తం చప్పట్లతో హోరెత్తగా గాల్లోకి ఎగిరి సంబరాలు చేసుకున్నాడు. తదుపరి సుబ్రాయన్ బౌలింగ్‌లో కోహ్లీ 4,6,6,4తో రెచ్చిపోయాడు. అదే ఊపులో బార్ట్‌మన్ బౌలింగ్‌లో 2 ఫోర్లు కొట్టిన విరాట్..బర్గర్ బౌలింగ్‌లో భారీషాట్ కొట్టే యత్నంలో క్యాచవుటయ్యాడు. రాహుల్‌తో కలిసి ఐదో వికెట్‌కు విరాట్ 76 రన్స్ జోడించాడు. కోహ్లీ పెవిలియన్ చేరాక బ్యాట్ ఝుళిపించిన రాహుల్ అర్ధ శతకం పూర్తి చేశాడు. జడేజా (20 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 32) వేగంగా ఆడడంతో..ఈ జోడీ ఆరో వికెట్‌కు 36 బంతుల్లోనే 65 రన్స్ జోడించింది.



రోహిత్ (57)

రోహిత్ సిక్సర్ల రికార్డ్

హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ మరో రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. వన్డేలలో అత్యధిక సిక్సర్లు బాదిన ఘనత సొంతం చేసుకున్నాడు. దక్షిణాఫ్రికాతో తొలి వన్డేకు ముందు *349* సిక్సర్లతో ఉన్న హిట్‌మ్యాన్ ఈ మ్యాచ్‌లో మూడు సిక్సర్లు బాది షాహిద్ అఫ్రీది (*351* సిక్సర్లు) రికార్డును తిరగ రాశాడు. అయితే రోహిత్ కేవలం *277* మ్యాచ్‌ల్లోనే ఈ ఫీట్ అందుకోగా, అఫ్రీది *398* మ్యాచ్‌ల్లో ఆ రికార్డు సాధించాడు.



సచిన్‌ను వెనక్కు నెట్టి..

వన్డేలలో 52వ శతకం సాధించిన విరాట్.. ఒక ఫార్మాట్‌లో అత్యధిక సెంచరీలు చేసిన రికార్డ్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ క్రమంలో టెస్ట్‌ల్లో సచిన్ చేసిన 51 సెంచరీల రికార్డును కోహ్లీ తిరగరాశాడు. ఇక.. మూడు ఫార్మాట్లలో కలిపి కోహ్లీ మొత్తం 83(టెస్ట్‌ల్లో 30, వన్డేల్లో 52, టీ20ల్లో ఒకటి) సెంచరీలు సాధించాడు. సచిన్ వంద శతకాల (టెస్ట్‌లు-51, వన్డేలు 49)తో ముందున్నాడు. అలాగే దక్షిణాఫ్రికాపై వన్డేలలో అత్యధిక సెంచరీలు (5) చేసిన టెండూల్కర్ రికార్డునూ కోహ్లీ (6) బద్దలుగొట్టాడు.

7000

విరాట్ కొట్టిన ఈ శతకం..క్రికెట్ చరిత్రలో ఏడు వేల సెంచరీ కావడం విశేషం.

విరాట్ కోహ్లి (120 బంతుల్లో 11 ఫోర్లు, 7 సిక్స్‌లతో 135)

స్కోరుబోర్డు

భారత్: జైస్వాల్ (సి) డికాక్ (బి) బర్గర్ 18, రోహిత్ (ఎల్బీ) యాన్సెన్ 57, కోహ్లీ (సి) రికెల్టన్ (బి) బర్గర్ 135, గైక్వాడ్ (సి) బ్రేవిస్ (బి) బార్ట్‌మన్ 8, సుందర్ (సి) బాష్ (బి) బార్ట్‌మన్ 13, కేఎల్ రాహుల్ (సి) డికాక్ (బి) యాన్సెన్ 60, జడేజా (సి) మార్‌క్రమ్ (బి) బాష్ 32, హర్షిత్ (నాటౌట్) 3, అర్ష్‌దీప్ (బి) బాష్ 0, కుల్దీప్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 23; మొత్తం: 50 ఓవర్లలో 349/8; వికెట్లపతనం:** 1-25, 2-161, 3-183, 4-200, 5-276, 6-341, 7-347, 8-347; **బౌలింగ్:** యాన్సెన్ 10-0-76-2, బర్గర్ 10-0-65-2, బాష్ 10-0-66-2, బార్ట్‌మన్ 10-0-60-2, సుబ్రాయన్ 10-0-73-0.

దక్షిణాఫ్రికా: మార్‌క్రమ్ (సి) రాహుల్ (బి) అర్ష్‌దీప్ 7, రికెల్టన్ (బి) హర్షిత్ 0, డికాక్ (సి) రాహుల్ (బి) హర్షిత్ 0, బ్రీట్‌స్కే (సి) కోహ్లీ (బి) కుల్దీప్ 72, జోర్జి (ఎల్బీ) కుల్దీప్ 39, బ్రేవిస్ (సి) గైక్వాడ్ (బి) హర్షిత్ 37, యాన్సెన్ (సి) జడేజా (బి) కుల్దీప్ 70, బాష్ (సి) రోహిత్ (బి) ప్రసిద్ధ్ 67, సుబ్రాయన్ (సి) రాహుల్ (బి) కుల్దీప్ 17, బర్గర్ (సి) రాహుల్ (బి) అర్ష్‌దీప్ 17, బార్ట్‌మన్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 49.2 ఓవర్లలో 332; వికెట్ల పతనం:** 1-7, 2-7, 3-11, 4-77, 5-130, 6-227, 7-228, 8-270, 9-312, 10-332; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 10-1-64-2, హర్షిత్ 10-0-65-3, సుందర్ 3-0-18-0, ప్రసిద్ధ్ 7.2-1-48-1, కుల్దీప్ 10-0-68-4, జడేజా 9-0-66-0.

ముఖేష్‌కు స్వర్ణం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఖేలో ఇండియా యూనివర్సిటీ క్రీడల్లో తెలుగు షూటర్ నేలవల్లి ముఖేష్ పసిడి పతకం కొల్లగొట్టాడు. రాజస్థాన్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో కేఎల్ యూనివర్సిటీ తరపున బరిలోకి దిగిన ముఖేష్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో 578/600 స్కోరుతో అగ్ర స్థానంలో నిలిచాడు.

బిజినెస్

ఐసీఐసీఐ ప్రు లార్జ్ క్యాప్ ఫండ్‌తో అద్భుతమైన రిటర్నులు

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లార్జ్ క్యాప్ ఫండ్ ప్రారంభమైనప్పటి నుంచి అద్భుతమైన పనితీరును కనబరుస్తూ మదుపరులకు మెరుగైన రిటర్నులు అందించింది. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ 2008 మే నెలలో ఈ ఫండ్ ప్రారంభించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు అంటే 17 ఏళ్లుగా ఈ ఫండ్ నిలకడగా ఇన్వెస్టర్లకు లాభాలను అందిస్తూ వస్తోంది. ఈ ఫండ్ ప్రారంభ సమయంలో రూ.10 లక్షలు పెట్టుబడిగా పెడితే ప్రస్తుతం అది సుమారు రూ.1.13 కోట్లకు చేరుకుంది. అంటే ఏటా 15 శాతం వరకు రిటర్నులను ఈ ఫండ్ అందించింది. ఇదే సమయంలో నిఫ్టీ 100 టీఆర్ఐ ఏటా సగటున 11.3 శాతం రిటర్నులు మాత్రమే అందించింది. 2008 ఆర్థిక సంక్షోభం, 2013లో వడ్డీ రేట్ల పెంపు, 2020 కొవిడ్-19 వంటి సంక్షోభాలు వచ్చినప్పటికీ ఈ ఫండ్‌లో ఆటుపోట్లు తక్కువగా ఉండటం గమనార్హం.

- ఇసుజు మోటార్స్ ఇండియా.. నిజామాబాద్‌లో కొత్త సర్వీస్ సెంటర్‌ను ప్రారంభించింది. ఇందుకోసం 6ఎస్ ఆటోమొబైల్స్ లిమిటెడ్‌ను అధీకృత సర్వీస్ పార్ట్‌నర్‌గా నియమించుకుంది.
- 2025-26 ద్వితీయార్థంలో బీఎఫ్ఎస్ఐ రంగం పటిష్ఠమైన వృద్ధిని నమోదు చేసే అవకాశం ఉందని రేటింగ్ సంస్థ కేర్ ఎడ్జ్ వెల్లడించింది. రిటైల్, ఎంఎస్ఎంఈ రంగాల జోరుతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ క్రెడిట్ 11.5-12.5% వృద్ధి చెందవచ్చని అంచనా వేసింది. ఇదే సమయంలో ఎన్‌బీఎఫ్‌సీల ఏయూఎం 1.7 రెట్లు పెరిగే వీలుందని పేర్కొంది.

కార్పొరేట్ రుణాలకు పెరిగిన గిరాకీ

మార్చిలోగా రూ.7 లక్షల కోట్లకు చేరే అవకాశం

ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి

బాండ్స్ ద్వారా రూ.12,500 కోట్లు



న్యూఢిల్లీ: ఆర్థిక వృద్ధి జోరందుకోవడంతో కార్పొరేట్ రుణాలకూ గిరాకీ పెరుగుతోంది. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) చివరి నాటికల్లా తమ బ్యాంకు పంపిణీ చేసే కార్పొరేట్ రుణాలు రూ.7 లక్షల కోట్లకు చేరుకుంటాయని భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి తెలిపారు. దీంతో సెప్టెంబరు త్రైమాసికంలో 7.1 శాతం మాత్రమే ఉన్న ఎస్‌బీఐ పరపతి వృద్ధి రేటు వచ్చే రెండు త్రైమాసికాల్లో రెండంకెలకు చేరే అవకాశం ఉందన్నారు. ఆర్థిక వ్యవస్థ గాడిలో పడడంతో కంపెనీల నుంచి వర్కింగ్ క్యాపిటల్ రుణాలతో పాటు టర్మ్ రుణాలు, ప్రాజెక్టు రుణాలకూ గిరాకీ పెరుగుతోందని ఆయన తెలిపారు.

అయితే కాలపరిమితి తీరే డిపాజిట్లు, ఇతర చెల్లింపుల కోసం మాత్రం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రూ.12,500 కోట్ల విలువైన రుణ పత్రాలు జారీ చేసే అవకాశం ఉంద ని శెట్టి చెప్పారు. డిసెంబరు 5న వెలువడే ద్రవ్య, పరపతి విధానంలో ఆర్‌బీఐ రెపో రేటు పావు శాతం తగ్గించినా దాని ప్రభావం తమ నికర వడ్డీ లాభాల (ఎన్ఐఎం)పై ఏమాత్రం ఉండదని ఎస్‌బీఐ చైర్మన్ మరోసారి స్పష్టం చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ తమ ఎన్ఐఎంలు మూడు శాతానికి చేరతాయన్నారు. ఈ ద్రవ్య, పరపతి విధానంలోనూ ఆర్‌బీఐ కీలక రెపో రేటు పావు శాతానికి మించి తగ్గించకపోవచ్చని తెలిపారు.

పెరుగుతున్న వినియోగం

జీఎస్‌టీ రేట్ల సవరణ, పండగ సీజన్‌తో దేశంలో వినియోగం అమాంతం పుంజుకుంది. దీంతో కంపెనీలు తమకు మంజూరైన వర్కింగ్ క్యాపిటల్ రుణ పరిమితిని పూర్తి స్థాయిలో ఉపయోగించుకుంటున్నట్టు శెట్టి తెలిపారు. ఇప్పటికే ఆమోదం తెలిపిన టర్మ్ లోన్లనూ (కాలపరిమితి రుణాలు) వినియోగించుకుంటున్నట్టు చెప్పారు. కొత్త ప్రాజెక్టుల కోసం అవసరమయ్యే రుణాల కోసం కూడా కంపెనీల నుంచి డిమాండ్ పెరిగిందన్నారు.

సీఏఆర్ భళా

ప్రస్తుతం ఎస్‌బీఐ మూలధన సమృద్ధి నిష్పత్తి (సీఏఆర్) 15 శాతం వద్ద ఉందని శ్రీనివాసులు శెట్టి చెప్పారు. వచ్చే ఐదారు సంవత్సరాల వరకు సీఏఆర్ ఇదే స్థాయిలో కొనసాగే అవకాశం ఉందన్నారు. దీంతో పరపతి వృద్ధి కోసం కొత్తగా ఈక్విటీ షేర్లు జారీ చేయాల్సిన అవసరం ఉండకపోవచ్చన్నారు. ఎస్‌బీఐ ఈ ఏడాది జూలైలో క్యూఐపీ ద్వారా ఈక్విటీ షేర్లు జారీ చేసి రూ.25,000 కోట్లు సమీకరించింది. దీంతో బ్యాంకు సీఏఆర్ మరింత బలోపేతమైంది. ప్రస్తుతం ఉన్న 15 శాతం సీఏఆర్‌తో ఏటా రూ.12 లక్షల కోట్ల రుణ వితరణ సామర్థ్యం ఎస్‌బీఐకి ఉందన్నారు.

టాప్ గేర్‌లో ఐపీఓ మార్కెట్

- జనవరిలోగా మరో 24 ఐపీఓలు
- రూ.40,000 కోట్ల సమీకరణ
- మరో రికార్డు దిశగా ఐపీఓ మార్కెట్

న్యూఢిల్లీ: ఐపీఓ మార్కెట్లో జోరు కొనసాగుతోంది. వచ్చే ఏడాది జనవరిలోగా రూ.40,000 కోట్లు సమీకరించేందుకు మరో 24 కంపెనీలు పబ్లిక్ ఇష్యూల (ఐపీఓ)కు వస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో ఇప్పటికే 96 కంపెనీలు ఐపీఓల ద్వారా మార్కెట్ నుంచి రూ.1.6 లక్షల కోట్ల వరకు సమీకరించాయి. ఇందులో 40 శాతం నిధులను గత మూడు నెలల్లోనే సమీకరించాయి. గత ఆర్థిక సంవత్సరం మొత్తం 91 కంపెనీలు ఐపీఓల ద్వారా సమీకరించిన రూ.1.6 లక్షల కోట్లకు ఇది సమానం. ప్రస్తుత జోరు ఇదే విధంగా కొనసాగితే ఈ సంవత్సరం ప్రైమరీ మార్కెట్ ద్వారా కంపెనీలు సమీకరించే మొత్తం రికార్డు స్థాయిలో రూ.2 లక్షల కోట్లు మించిపోతుందని మర్చంట్ బ్యాంకింగ్ వర్గాలు చెబుతున్నాయి.

బారులు తీరుతున్న కంపెనీలు

సెకండరీ మార్కెట్ ఆటుపోట్లలో ఉన్నా ప్రస్తుతం ఐపీఓ మార్కెట్ మాత్రం మంచి జోరు మీద ఉంది. దీంతో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీతో పాటు మీషో, జునిపర్ గ్రీన్ ఎనర్జీ వంటి కంపెనీలన్నీ ఐపీఓల బాట పట్టాయి. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ రూ.10,721 కోట్ల సమీకరణ కోసం వచ్చే నెల రెండో వారంలో ఐపీఓకు వస్తోంది. రూ.5,421 కోట్ల సమీకరణతో మీషో డిసెంబరు 3న ఐపీఓకు వస్తోంది. వీటికి తోడు బెంగళూరు కేంద్రంగా పనిచేసే హోమ్ అండ్ స్లీప్ సొల్యూషన్స్ (వేక్‌ఫిట్) రూ.1,400 కోట్ల సమీకరణ కోసం డిసెంబరు 8-10 తేదీల మధ్య ఐపీఓ జారీ చేస్తోంది.

26,500 పైన బుల్లిష్

(డిసెంబరు 01-05 తేదీల మధ్య వారానికి)

ఆస్ట్రో గైడ్



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 25,843-26,310 పాయింట్ల మధ్యన కదలాడి 158 పాయింట్ల లాభంతో 26,203 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 26,500 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 25,810, 25,534, 25,215, 24,566 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 26,600 బ్రేక్‌డౌన్ స్థాయి: 25,800
నిరోధ స్థాయిలు: 26,400, 26,500, 26,600 (26,300 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 26,000, 25,900, 25,800 (26,100 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



1వ తేదీ			
హైదరాబాద్	635	విజయవాడ	665
వరంగల్	637	గోదావరి	635
చిత్తూరు	663	విశాఖపట్నం	625
		డజను గుడ్లు రూ. 90	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	110	విజయవాడ	113
వరంగల్	110	గుంటూరు	118
కరీంనగర్	110	ఒంగోలు	118
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	109
కర్నూలు	110	నెల్లూరు	114
విశాఖపట్నం	112	అనంతపురం	114
గోదావరి	113		

ఆటుపోట్లకు అవకాశం!

ప్రస్తుతం జీవితకాల గరిష్ఠాల్లో ఉన్న మార్కెట్లు ఈ వారం తీవ్ర ఆటుపోట్లను ఎదుర్కొనే అవకాశం ఉంది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు వస్తుండటంతో పాటు జియో పొలిటికల్ పరిణామాలే ఇందుకు కారణం. అమెరికా డాలర్, ఫెడ్ వడ్డీ రేట్లు, బాండ్ ఈల్డ్స్ పెరుగుదల అంశాలు బెంచ్‌మార్క్ సూచీలను నడిపించనున్నాయి. ప్రస్తుతం ఐటీ, బ్యాంక్, ఆటో, మీడియా, హెల్త్‌కేర్, ఫైనాన్స్ రంగాలు బలంగా కనిపిస్తున్నాయి. మదుపరులు ఎంపిక చేసుకున్న స్టాక్స్‌లోనే పెట్టుబడులు పెట్టడం మంచిది.

స్టాక్ రికమండేషన్స్

మహీంద్రా అండ్ మహీంద్రా: కొన్ని నెలలుగా అప్‌ట్రెండ్‌లో కొనసాగుతున్న ఈ కౌంటర్‌లో నెల క్రితం 10 శాతం మేర దిద్దుబాటు జరిగింది. కన్సాలిడేషన్ పూర్తవగానే మళ్లీ క్రమంగా పెరుగుతోంది. జీవితకాల గరిష్ఠాన్ని బ్రేక్ చేసేందుకు సిద్ధంగా ఉంది. గత శుక్రవారం రూ.3,757 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.3,700 పై స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.3,950 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.3,660 వద్ద కచ్చితమైన స్టాప్‌లాస్ తప్పనిసరి.

ఎక్సైడ్ ఇండస్ట్రీస్: కొంతకాలంగా డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తున్న ఈ షేరు ప్రస్తుతం కీలకమైన మద్దతు స్థాయి వద్దకు చేరుకుంది. ఇక్కడ టర్న్ అరౌండ్ అయ్యే అవకాశం ఉంది. గత శుక్రవారం రూ.374 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.370 శ్రేణిలో ప్రవేశించి రూ.410 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ రూ.355.

వరుణ్ బెవరేజెస్: జీవితకాల గరిష్ఠం నుంచి దాదాపుగా 40 శాతం పతనమైన ఈ కౌంటర్ మరోసారి కీలకమైన మద్దతు స్థాయి రూ.461 వద్ద బౌన్స్ అయ్యింది. రిలేటివ్ స్ట్రెంత్ క్రమంగా పెరుగుతోంది. గత శుక్రవారం 480 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.470 పై స్థాయిలో ప్రవేశించి రూ.530 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ రూ.460.

ఐఐఎఫ్ఎల్: ఈ ఏడాది మార్చి నుంచి అప్‌ట్రెండ్‌లో కొనసాగుతున్న ఈ షేరు జీవితకాల గరిష్ఠం దగ్గర దిద్దుబాటుకు లోనయ్యాయి. కన్సాలిడేషన్ పూర్తవటంతో మరోసారి బ్రేకౌట్‌కి సిద్ధంగా ఉంది. రిలేటివ్ స్ట్రెంత్ మెరుగ్గా ఉంది. గత శుక్రవారం రూ.578 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.570 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.650/770 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ రూ.540.

వేదాంత లిమిటెడ్: కొద్ది రోజుల క్రితం 15 ఏళ్ల గరిష్ఠాన్ని బ్రేక్ చేసిన ఈ షేరు ప్రస్తుతం జీవితకాల గరిష్ఠ స్థాయిలో కొనసాగుతోంది. అక్కడే కన్సాలిడేషన్ కొనసాగుతోంది. రిలేటివ్ స్ట్రెంత్ క్రమంగా పుంజుకుంటోంది. పైగా మెటల్స్‌కు మంచి డిమాండ్ ఉండటం సానుకూల అంశం. గత శుక్రవారం రూ.526 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.500 శ్రేణిలో ప్రవేశించి రూ.660 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ రూ.485.



- మూర్తి నాయుడు పాదం, మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

26,300 కీలకం

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

గత వారం నిఫ్టీ కీలక స్థాయి 26,000 వద్ద రియాక్షన్‌కు గురైనా తదుపరి బలమైన పునరుజ్జీవం సాధించి వారం మొత్తం మీద 320 పాయింట్ల లాభంతో 26,200 వద్ద ముగిసింది. రెండు వారాల పాటు 26,000 వద్ద కన్సాలిడేషన్, ఆటుపోట్ల అనంతరం జీవితకాల గరిష్ఠ స్థాయిలకు చేరువలో నిలకడగా ముగిసింది. గత రెండు వారాల్లో కొన్ని రియాక్షన్లు ఎదురైనా ఆల్‌టైమ్ హై వద్ద నిలకడగా ముగియడం ట్రెండ్‌లో సానుకూలతను సూచిస్తోంది. నెలవారీ చార్టుల ప్రకారం నవంబరులో మార్కెట్ నిలకడ ధోరణి ప్రదర్శించింది. మిడ్‌క్యాప్-100 సూచీ సైతం జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో క్లోజయినా స్మాల్‌క్యాప్-100 సూచీ మైనర్ కరెక్షన్ సాధించింది. నిఫ్టీ మరోసారి 26,300 వద్ద పరీక్ష ఎదుర్కోబోతోంది.

బుల్లిష్ స్థాయిలు: మరింత అప్‌ట్రెండ్ కోసం 26,300 కన్నా పైన నిలదొక్కుకోవాలి. అప్పుడు మార్కెట్ కొత్త శిఖరాల వైపు అడుగులు వేస్తుంది. తదుపరి మానసిక అవధి 26,500.

బేరిష్ స్థాయిలు: 26,300 వద్ద విఫలమైతే మైనర్ అప్రమత్త ధోరణిగా భావించాలి. గతంలో నమోదైన కనిష్ఠ స్థాయి 26,150 కన్నా దిగజారితే మరింత బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 26,000. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకుని తీరాలి. విఫలమైతే స్వల్పకాలిక బలహీనత మరింతగా కొనసాగుతుంది.

బ్యాంక్ నిఫ్టీ: గత వారం ఈ సూచీ సైతం జీవితకాల గరిష్ఠ స్థాయి 59,750 సమీపంలో క్లోజయింది. ఈ సూచీ గత నాలుగు వారాలుగా ర్యాలీలో ఉండి 3,000 పాయింట్ల మేరకు లాభపడింది. ట్రెండ్‌లో సానుకూలత కోసం ఈ సూచీ మానసిక అవధి 60,000 కన్నా పైన నిలదొక్కుకోవడం తప్పనిసరి. రియాక్షన్‌లో పడి మద్దతు స్థాయి 59,400 వద్ద విఫలమైతే మరింత బలహీనత తప్పదు. ప్రధాన మద్దతు స్థాయి 58,700.

పాటర్న్: మరింత అప్‌ట్రెండ్ కోసం మార్కెట్ 26,300 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్ వద్ద నిలదొక్కుకోవాలి. 26,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనతలో పడుతుంది. 26,300 దాటితే పుల్‌బ్యాక్ రియాక్షన్‌కు ఆస్కారం ఉన్నందు వల్ల స్వల్పకాలిక ట్రేడర్లు అప్రమత్తంగా ఉండాలి.

టైమ్ : ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	26,300, 26,390
మద్దతు	26,220, 26,150

బలహీనపడిన తుఫాన్

అమరావతి, విశాఖపట్నం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మూడు రాష్ట్రాలను దడ పుట్టించిన 'దిత్వా' తుఫాన్ బలహీనపడింది. ఉత్తర దిశ నుంచి వీస్తున్న పొడి చలిగాలులు, సముద్రంలో తుఫాన్ పరిసరాల్లో ఉన్న మేఘాలు విచ్ఛిన్నం కావడంతో ఆదివారం సాయంత్రానికి తీవ్ర వాయుగుండంగా బలహీనపడింది. శనివారం రాత్రి నుంచి తమిళనాడుకు సమాంతరంగా పయనించి ఆదివారం మధ్యాహ్నానికి ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరికి చేరువగా వచ్చింది. ఆ తరువాత తుఫాన్‌గా కొనసాగేందుకు వాతావరణం అనుకూలించకపోవడంతో మధ్యాహ్నం నుంచి జోరు తగ్గింది. అయితే తుఫాన్ ఆవరించిన ప్రాంతం ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరికి మరింత చేరువై వాయుగుండంగా మారుతుందని భారత వాతావరణశాఖ తెలిపింది. ఈ క్రమంలో తీవ్ర వాయుగుండంగా మారి సాయంత్రానికి పుదుచ్చేరికి తూర్పు ఆగ్నేయంగా 90, చెన్నైకు దక్షిణ ఆగ్నేయంగా 140 కి.మీ.ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది ఉత్తర దిశగా పయనించి ఆదివారం రాత్రి లేదా సోమవారం ఉదయానికి పుదుచ్చేరికి 20, చెన్నైకు 40 కి.మీ.ల దూరంలో సముద్రంలోకి రానున్నదని తెలిపింది.

చలి గుప్పిట్లో ఆదిలాబాద్, కుమరం భీం జిల్లాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

అడవుల జిల్లాగా పేరున్న ఆదిలాబాద్‌ను చలి చుట్టుముట్టేసింది. గత రెండు రోజులుగా వాతావరణంలో బాగా మార్పులు చోటు చేసుకోవడంతో ఒక్కసారిగా పగటి ఉష్ణోగ్రతలు పడిపోయి కనిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. చల్లటి ఈదురు గాలులతో ఉదయం 9 గంటల వరకు బయటకు వెళ్లే పరిస్థితులు కనిపించడం లేదు. సాయంత్రం 5 గంటలకే జనం ఇళ్లలోకి వెళ్లిపోతున్నారు. 7 గంటల ప్రాంతంలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. ముఖ్యంగా వ్యవసాయ, రోజు వారి కూలీలు చలి తీవ్రతతో తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారు. ఆదివారం గరిష్ఠ ఉష్ణోగ్రతలు 28 డిగ్రీలు నమోదు కాగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు 8.2 డిగ్రీలుగా నమోదయ్యాయి. ఈ శీతాకాల సీజన్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 8.2కు పడిపోవడం ఇదే మొదటిసారి. భీంపూర్ మండలం అర్లి(టి)లో 10.3, బోథ్ పొచ్చెరలో 10.4, తలమడుగులో 11.2, తాంసిలో 11.4, గుడిహత్నూర్‌లో 12.2 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోనూ అతి తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ప్రజలు చలికి వణికిపోతున్నారు. ఏజెన్సీ గ్రామాల్లో చలి మరింతగా వణికిస్తోంది. సిర్పూర్(యు) మండలంలో ఆదివారం 9.7 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. తిర్యాణిలో 10.8, కెరమెరిలో 11.4, వాంకిడిలో 12.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. హైదరాబాద్ నగరంలోనూ ఆదివారం చలి గాలుల తీవ్రత పెరిగింది. శనివారం రాత్రి శేరిలింగంపల్లిలో 14.1, రామచంద్రాపురంలో 14.4, రాజేంద్రనగర్‌లో 14.7డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మూడు రోజులుగా నగరంలో చలి తీవ్రత పెరుగుతోంది.



ఆదిలాబాద్ పట్టణ పరిసర ప్రాంతాలను కప్పేసిన మంచు

నేడు 4 జిల్లాలకు భారీ వర్ష సూచన

బంగాళాఖాతంలో ఏర్పడ్డ దిత్వా తుపాను ప్రభావంతో రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో సోమ, మంగళవారాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ముఖ్యంగా తూర్పు, దక్షిణ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో కొన్ని చోట్ల భారీ వర్షం కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఆ నాలుగు జిల్లాలకు యెల్లో అలెర్ట్ జారీ చేసింది. రెండు రోజుల పాటు హైదరాబాద్‌లో తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.



బీసీల యుద్ధభేరీ సభలో అభివాదం చేస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, మధుసూదనాచారి, శ్రీనివాస్‌గౌడ్, గుజ్జ కృష్ణ తదితరులు

బీసీ రిజర్వేషన్ల బాధ్యత కాంగ్రెస్, బీజేపీలదే

- 8, 9 తేదీల్లో ఢిల్లీలో ఆందోళన: జాజుల

కవాడిగూడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించాల్సిన బాధ్యత కాంగ్రెస్, బీజేపీలదేనని తెలంగాణ బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఈ విషయంలో మోసం చేసిన ఆ రెండు పార్టీలను ప్రధాన శత్రువులుగా బీసీ సమాజం పరిగణించాలని పిలుపునిచ్చారు. ఆదివారం ఇందిరాపార్కు వద్ద బీసీల యుద్ధభేరి మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ.. డిసెంబరు 8, 9 తేదీలలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బీసీల రిజర్వేషన్ల సాధన కోసం ఆందోళన చేపడతామని ఆయన తెలిపారు. శాసన మండలిలో ప్రతిపక్షనేత మధుసూదనాచారి మాట్లాడుతూ.. బీసీలకు 42% రిజర్వేషన్ల హామీని కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో మెజార్టీ ప్రజలదే రాజ్యాధికారమని, భారత్‌లో మాత్రం అగ్రవర్ణాల ఆధిపత్యం కొనసాగిస్తూ బీసీలను అణగదొక్కుతున్నారని ఆరోపించారు.

10న చలో ఢిల్లీ.. ఓబీసీ జాతీయ సదస్సు

- బీసీలకు 50% రిజర్వేషన్లు కల్పించాలి: ఆర్.కృష్ణయ్య



బర్కత్‌పుర, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బీసీలకు చట్టసభల్లో 50% రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, క్రీమీలేయర్‌ను పూర్తిగా రద్దు చేయాలని తదితర డిమాండ్ల సాధన కోసం డిసెంబరు 10న చలో ఢిల్లీ, ఓబీసీ జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య వెల్లడించారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. బీసీల అభివృద్ధికి 2 లక్షల కోట్ల రూపాయలతో ప్రత్యేక పథకాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో నిర్వహించనున్న ఓబీసీ జాతీయ సదస్సుకు 8 మంది కేంద్రమంత్రులు, వివిధ పార్టీలకు చెందిన 20 మంది ఎంపీలు పాల్గొంటారని పేర్కొన్నారు. జనవరి చివరి వారంలో పరేడ్‌గ్రౌండ్‌లో 5 లక్షల మందితో నిర్వహించే బీసీ సభకు ప్రధాని మోదీని ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాంచందర్‌రావు, చిత్రంలో అభయ్ పాటిల్, బీఎల్ సంతోష్, సందీప్ పాత్రా, డీకే అరుణ

ఐక్యంగా పనిచేస్తే.. అధికారం మనదే

- వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించడం కష్టమేం కాదు
- ఒక్కసారి పార్టీ కండువా వేసుకుంటే బీజేపీ కుటుంబమే..
- రాంచందర్‌కు నాలాంటి లక్ష మంది మద్దతు: బీఎల్ సంతోష్
- పార్టీకి కార్యకర్తలే సుప్రీం: రాంచందర్‌రావు

హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పార్టీ నాయకులంతా కలిసికట్టుగా పనిచేయాలని బీజేపీ సంస్థాగత జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ పిలుపునిచ్చారు. రాష్ట్ర పార్టీలో పలువురు సీనియర్ నాయకుల మధ్య అంతర్గత విభేదాలు పతాకస్థాయికి చేరుకున్న నేపథ్యంలో ఆయన తనదైన శైలిలో స్పందించారు. 'మీరంతా ఐక్యంగా పనిచేయండి.. కలిసి పనిచేస్తే కాంగ్రెస్‌ను ఓడించడం కష్టమేం కాదు' అని వ్యాఖ్యానించారు. కొత్త, పాత అన్న వాదనకు తావులేదని, ఒకసారి పార్టీ కండువా వేసుకుంటే అంతా బీజేపీ కుటుంబ సభ్యులే అని చెప్పారు. ఎంత క్రియాశీలకంగా పనిచేస్తే పార్టీ నాయకత్వం కూడా అంతే స్థాయిలో స్పందిస్తుందని పార్టీ శ్రేణులనుద్దేశించి అన్నారు. ఆదివారం తుక్కుగూడలోని ఓ ఫంక్షన్ హాలులో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అధ్యక్షతన సంస్థాగత వర్క్‌షాప్ నిర్వహించారు. దీనికి బీఎల్ సంతోష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ అభయ్ పాటిల్, కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జాతీయ అధికార ప్రతినిధి సందీప్ పాత్రాతో పాటు రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్షులు, జిల్లా ఇన్‌చార్జ్‌లు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సంస్థాగత బలోపేతం, పోలింగ్ బూత్‌స్థాయి కార్యక్రమాల నిర్వహణపై ప్రధానంగా చర్చించారు. బీఎల్ సంతోష్ మాట్లాడుతూ.. అన్నీ పరిశీలించిన తర్వాతే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా రాంచందర్‌రావును నియమించినట్లు స్పష్టం చేశారు. 'రాంచందర్‌రావును అధ్యక్షుడిగా నియమించినప్పుడు కొంతమంది అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినట్లు మా దృష్టికి వచ్చింది. ఆయన శక్తిసామర్థ్యాలు అన్నీ పరిశీలించాకే ఆయన్ను నియమించాం. ఎవరిని యుద్ధ సమయంలో వాడుకోవాలో, ఎవరిని శాంతి సమయంలో వాడుకోవాలో పార్టీకి తెలుసు.. రాంచందర్‌రావుకు నాలాంటి వాళ్లు లక్ష మంది మద్దతు ఉంది. ఆయనపై ఎవరెన్ని ఫిర్యాదులు చేసినా ఏమీ కాదు. కేంద్ర పార్టీ మొత్తం ఆయనకు అండగా ఉంది' అని వ్యాఖ్యానించారు. పార్టీలో క్రమశిక్షణ ఉల్లంఘించిన వారు ఏ స్థాయిలో ఉన్నా చర్యలు తీసుకోవాలని ఆయన రాంచందర్‌రావుకు సూచించినట్లు సమాచారం. 'పార్టీలో నాయకుల అనుచరులుగా కాకుండా కార్యకర్తలుగా ఎదగండి. రాంచందర్‌రావుకు మద్దతుగా నిలవండి' అని బీఎల్ సంతోష్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పంచాయతీ ఎన్నికలను ఒక అవకాశంగా మలుచుకుని స్థానికంగా ఎదగాలని సూచించారు. ఒక్కో నాయకుడు ఐదారు పంచాయతీల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేయాలని ఆదేశించారు. బీజేపీకి కార్యకర్తలే సుప్రీం అని రాంచందర్‌రావు అన్నారు. తెలంగాణలో పార్టీ బలోపేతం దిశగా ఈ వర్క్‌షాప్ కీలక అడుగు కాబోతోందని చెప్పారు. 'వచ్చే ఎన్నికల్లో విజయం సాధించడమే మన లక్ష్యం. కలిసికట్టుగా పనిచేద్దాం' అని పిలుపునిచ్చారు. వర్క్‌షాప్ అనంతరం.. సంతోష్, రాంచందర్‌రావు, అభయ్ పాటిల్‌తో కలిసి పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

ఐటీలో హెచ్‌ఐవీ బగ్!

ఆ రంగానికి చెందినవారిలో ఇటీవల పెరుగుతున్న వైరస్ కేసులు

- విచ్చలవిడి వీకెండ్ పార్టీలు, డ్రగ్స్, మత్తు ఇంజెక్షన్ల వినియోగంతో సమస్య
- జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వెల్లడి





హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నిత్య నూతన సాంకేతికతలతో ఆధునిక పోకడలకు చిరునామా అయిన ఐటీ రంగంలో హెచ్‌ఐవీ బగ్ ప్రవేశించింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఐటీ రంగానికి చెందినవారిలో హెచ్‌ఐవీ సంక్రమణ శాతం పెరుగుతోందని 'జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (న్యాకో)' తాజాగా హెచ్చరించింది. అన్ని రాష్ట్రాల ఎయిడ్స్ నియంత్రణ సొసైటీలు అప్రమత్తంగా ఉండాలని.. ఈ రంగానికి సంబంధించి హెచ్‌ఐవీ పరీక్షల సంఖ్యను పెంచాలని సూచించింది. మొత్తంగా హెచ్‌ఐవీ వ్యాప్తి తగ్గినా.. ఐటీ రంగంతోపాటు వ్యవసాయ కూలీల్లో మాత్రం స్వల్పంగా పెరుగుతోందని వెల్లడించింది. ఇక తెలంగాణలో గత ఏడాదితో పోల్చితే ఈసారి హెచ్‌ఐవీ సంక్రమణ రేటు 0.44 నుంచి 0.41కు తగ్గిందని తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ(టీశాక్) వెల్లడించింది.2030 నాటికి ఎయిడ్స్‌ను ప్రజారోగ్య ముప్పు జాబితా నుంచి తొలగించే దిశగా చర్యలు చేపట్టినట్టు తెలిపింది.

హెచ్‌ఐవీ విస్తృతికి ఏమిటీ కారణం?

ఐటీ రంగంలో హెచ్‌ఐవీ వ్యాప్తి పెరగడానికి కొంతకాలంగా విదేశీ తరహా ఆధునిక జీవనశైలికి అలవాటు పడటం కారణమవుతోందని న్యాకో వర్గాలు చెబుతున్నాయి. కొందరు వారాంతాల్లో పార్టీల పేరుతో విచ్చలవిడిగా వ్యవహరిస్తుండటం, ఎక్కువ మందితో శారీరక సంబంధాలు, డ్రగ్స్ మద్యం మత్తులో అరక్షిత శృంగారంలో పాల్గొనడం, ఒకరు వాడిన డ్రగ్స్ ఇంజెక్షన్లను మరొకరు వాడటం వంటివి హెచ్‌ఐవీ వ్యాప్తికి కారణం అవుతున్నాయని అంటున్నాయి. ఇక గర్భం రాకుండా ఉండేందుకు చాలా మంది కండోమ్‌లు వాడేవారని.. కానీ శృంగారం తర్వాత కూడా వేసుకోగల ఐపిల్ తరహా తక్షణ గర్భనిరోధక మాత్రలు అందుబాటులోకి రావడంతో అరక్షిత శృంగారం పెరిగిందని చెబుతున్నాయి. ఇక వ్యవసాయ కూలీల్లో హెచ్‌ఐవీపై అవగాహన తక్కువగా ఉండటం, అరక్షిత శృంగారం, వారు తరచూ పని కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళుతుండటం వంటివి వ్యాప్తికి కారణమని వివరిస్తున్నాయి. వారి జీవనశైలి కారణంగా రిస్క్ పీపుల్ కేటగిరీలో ఉంటారని న్యాకో వర్గాలు వివరిస్తున్నాయి.

రాష్ట్రంలో తగ్గిన వైరస్ వ్యాప్తి రేటు

తెలంగాణలో హెచ్‌ఐవీ వ్యాప్తి రేటు 2023లో 0.44శాతం ఉండగా.. 2025లో 0.41శాతానికి తగ్గిందని టీశాక్ తెలిపింది. ఎయిడ్స్ సంబంధిత మరణాలలో 80శాతం తగ్గుదల నమోదైందని వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా శిబిరాలు నిర్వహించి 8,21,508 మందిని స్ర్కీనింగ్ చేయగా.. కొత్తగా 5,517 మందిని పాజిటివ్‌గా గుర్తించామని తెలిపింది. రాష్ట్రంలో ఇప్పటివరకు 1,38,290 మంది హెచ్‌ఐవీ పాజిటివ్ వ్యక్తులను గుర్తించి ఏఆర్‌టీ చికిత్స అందిస్తున్నట్టు వెల్లడించాయి. హెచ్‌ఐవీతో జీవిస్తున్న వారు తగిన జాగ్రత్తలు తీసుకునేలా, మందులు వినియోగించేలా అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపాయి. ఇక 2023-24లో 1,977మంది హెచ్‌ఐవీతో మృతిచెందగా, 2024-25లో 193మరణాలే నమోదైనట్టు పేర్కొన్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో 22, ప్రైవేటులో 8కేంద్రాల ద్వారా హెచ్‌ఐవీ బాధితులకు కౌన్సెలింగ్, ఔషధాలు, ఆరోగ్య పరీక్షలు ఉచితంగా అందిస్తున్నారు. రాష్ట్రంలో 2023లో 34,656మంది హెచ్‌ఐవీ బాధితులకు చేయూత పింఛన్లు అందుతుండగా, ఈ ఏడాది 45,374 మంది పింఛన్ తీసుకుంటున్నట్టు టీశాక్ అధికారులు తెలిపారు.

ప్రైవేటుతో పాటు హోమియో, ఆయుర్వేద ఆస్పత్రుల్లో చికిత్సలు

ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చిన డేటా ఆధారంగా రాష్ట్రంలో ఇప్పటివరకు 1.28 లక్షల మంది హెచ్‌ఐవీ బాధితులను గుర్తించారు. దానికితోడు ప్రైవేటు ఆస్పత్రులు, హోమియో, ఆయుర్వేద ఆస్పత్రుల్లో హెచ్‌ఐవీ చికిత్స పొందుతున్న వారి వివరాలను కూడా టీశాక్ సేకరించింది. ప్రైవేటులో సుమారు 5,600 మంది, హోమియోపతి కేంద్రాల్లో మరో 5 వేల మంది చికిత్స పొందుతున్నట్టు గుర్తించింది. దీంతో మొత్తం 1.38 లక్షల మంది హెచ్‌ఐవీ బాధితుల వివరాలను న్యాక్ డేటాకు లింక్ చేసింది.

ధరణితో అన్నదాతల అరిగోస

- రికార్డులకెక్కని వారసుల పేర్లు
- రంగారెడ్డి జిల్లా తుమ్మలూరులో ఘటన
- దొంగ పత్రాలతో కాజేసిన 'రియల్' సంస్థలు
- ప్రభుత్వం న్యాయం చేయాలి: బాధిత రైతులు

పంజాగుట్ట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పక్కాగా భూరికార్డులు నమోదు చేసి రైతులకు న్యాయం చేస్తామని గత బీఆర్‌ఎస్ సర్కారు తెచ్చిన 'ధరణి' వెబ్‌సైట్‌తో అరిగోస పడుతోంది ఓ రైతు కుటుంబం. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుమ్మలూరు రెవెన్యూ గ్రామ వాసి గదగూటి ఎల్లయ్యకు 371, 372, 373, 377 సర్వే నంబర్లలో తాత ముత్తాతల నుంచి సంక్రమించిన 52 ఎకరాల భూమి ఉంది. 1998లో మరణించిన ఆయనకు నలుగురు కొడుకులు, ఇద్దరు కుమార్తెలున్నారు. 'ధరణి' పోర్టల్‌లో రెవెన్యూ అధికారులు నమోదు చేయలేదు. రాజధాని హైదరాబాద్‌కు చేరువలో ఉన్న ఈ భూమి బంగారం కావడంతో కొందరువ్యక్తులు, కొన్ని రియల్ ఎస్టేట్ సంస్థల కన్ను పడింది. వారు దొంగ పత్రాలతో ఆ భూమిని తమ పేర్లపైకి బదలాయించుకుని వెంచర్లు వేసి విక్రయానికి ప్రయత్నిస్తున్నారు. దీంతో న్యాయవాది అరుణ్‌కుమార్‌తో కలిసి ఆదివారం మీడియా ముందుకు వచ్చిన ఎల్లయ్య కుటుంబ వారసులు జి.హరికృష్ణ, జి.నరేష్, శ్రీరాములు, జి.శాంతమ్మ, యాదమ్మ, లక్ష్మమ్మ తమ గోడు వెళ్లబోసుకున్నారు. '1998లో మా తాత (గదగూటి ఎల్లయ్య) మరణించినప్పటి నుంచి కొవిడ్ వరకూ ఆ భూమిలో పంటలు పండించాం. మా తాత ఎవరికీ పీటీ హక్కులు బదలాయించలేదు. కబ్జాలో మేమే ఉన్నా.. చుట్టూ ఫెన్సింగ్ వేసి మా భూమిలోకి తమను వెళ్లనివ్వడం లేదు. స్థానిక ప్రజాప్రతినిధులతోపాటు పోలీసులు, రెవెన్యూ యంత్రాంగం వారికే వత్తాసు పలకడంతోపాటు మాపైనే తప్పుడు కేసులు బనాయించడంతో ఇబ్బందుల పాలవుతున్నాం' అని కన్నీరు మున్నీరయ్యారు. తుమ్మలూరు వెంచర్‌లో ప్లాట్లు కొనుగోలు ప్రయత్నిస్తున్న వినియోగదారులు జాగ్రత్త పడాలని హితవు పలికారు. ఆ వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేస్తే డబ్బు పోగొట్టుకోవడంతోపాటు న్యాయపరమైన చిక్కులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. రెవెన్యూ అధికారులు స్పందించి తమ తాత వారసులుగా తమకు హక్కులు కల్పించాలని కోరారు. రికార్డుల్లో తమ పేర్లు నమోదు చేయాలని కోరారు. సమావేశంలో ఎల్లయ్య వారసులు మహేందర్, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

కోట్ల పేట!

- కోకాపేటలో భూముల ధరకు రెక్కలు
- 3న మరో 2 ప్లాట్లకు హెచ్‌ఎండీఏ వేలం
- రూ.1200కోట్లకు పైగా వస్తుందని అంచనా
- ఇప్పటికే 4 ప్లాట్లతో 2,708కోట్ల ఆదాయం
- గతంలో 45ఎకరాలకు 3,319కోట్లు వస్తే..
- తాజాగా 27ఎకరాలకే 3900 కోట్లు

హైదరాబాద్ సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కోకాపేటలో భూముల ధరలు సరి కొత్త రికార్డులను సృష్టిస్తున్నాయి. ఇక్కడ భూములను కొనుగోలు చేసేందుకు తెలుగు రాష్ట్రాల వారే గాకుండా.. కర్ణాటక, తమిళనాడు దక్షిణాది రాష్ట్రాలతోపాటు ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన రియల్ ఎస్టేట్ సంస్థలు, డెవలపర్లు పోటీ పడుతుండడం ఆసక్తికరంగా మారింది. గత వారం రెండు దఫాలుగా నాలుగు ప్లాట్లను హెచ్‌ఎండీఏ వేలం వేయగా.. ఐదు ఎకరాల స్థలాన్ని ఎకరాకు రూ.151కోట్ల చొప్పున నలుగురు వ్యక్తులు దక్కించుకున్నారు. రెండు దఫాల్లో కలిపి మొత్తం నాలుగు ఓపెన్ ప్లాట్ల (దాదాపు 18ఎకరాల)ను విక్రయించగా.. హెచ్‌ఎండీఏకు రూ.2708 కోట్ల మేర ఆదాయం సమకూరింది. తాజాగా ఈ నెల 3వ తేదీన 4ఎకరాల విస్తీర్ణంలోని 19వ నంబర్ ప్లాటు, 4.04ఎకరాల విస్తీర్ణంలోని 20వ నంబర్ ప్లాటును వేలం వేసేందుకు హెచ్‌ఎండీఏ సిద్ధమవుతుండగా.. ఈ సారి ఎంత ధర పలుకుతుందోనన్న ఆసక్తి నెలకొంది. ఇటీవల 15వ నంబర్ ప్లాట్‌ను దక్కించుకోవడానికి పోటీపడిన సంస్థలే ఈ ప్లాట్లను కొనుగోలు చేసే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. రెండు ప్లాట్ల విక్రయంతో దాదాపు రూ.1200కోట్లపైగా ఆదాయం వచ్చే అవకాశాలున్నాయి.

అంతర్జాతీయ స్థాయి సదుపాయాలతో..

కోకాపేటలో అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలతో పలు లేఅవుట్లను హెచ్‌ఎండీఏ అభివృద్ధి చేసింది. 2022లో నియో పోలీసు, గోల్డెన్ మైల్ లేఅవుట్లలోని 49.94ఎకరాల విస్తీర్ణంలోని 8ప్లాట్లను విక్రయించగా.. సగటున ఎకరా రూ.40కోట్ల మేర పలికింది. అత్యధికంగా ఎకరాకు రూ.60కోట్లు వచ్చాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.2వేల కోట్ల ఆదాయం వచ్చింది. ఆ తర్వాత 2023 ఆగస్టులో 45.33ఎకరాలు అమ్మకానికి పెట్టి ఎకరాకు అప్‌సెట్ ధరను రూ.35కోట్లు నిర్ణయించగా.. అత్యధికంగా రూ.100కోట్లు పలికి రికార్డు సృష్టించింది. సగటున ఎకరం ధర రూ.73.23కోట్లు పలికింది. 45ఎకరాల విక్రయం ద్వారా హెచ్‌ఎండీఏకు రూ.3319కోట్ల ఆదాయం వచ్చింది. ప్రస్తుతం కోకాపేటలో ఎకరాకు రూ.99 కోట్ల కనీస ధరను హెచ్‌ఎండీఏ నిర్ణయిస్తే.. సగటున రూ.142.83కోట్ల దాకా పలికింది. రెండేళ్ల క్రితం నాటి సగటు ధరతో పోలిస్తే 97శాతం పెరుగుదల నమోదు కావడం గమనార్హం. ఈ సారి కేవలం 27ఎకరాలు అమ్మడం ద్వారానే రూ.3900కోట్లపైగా ఆదాయం వచ్చే అవకాశాలున్నాయి. కాగా, కొనుగోలు చేసిన స్థలాల్లో లగ్జరీ అపార్ట్‌మెంట్లను నిర్మిస్తున్న రియల్ ఎసేట్ సంస్థలు.. ఇవి పూర్తయితే హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో తమకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని భావిస్తున్నాయి.

కొత్తగూడెంలో అరుదైన ఖనిజ సంపద

- అందుకే ఎర్త్‌సైన్స్ వర్సిటీ ఏర్పాటు: తుమ్మల
- రేపు ప్రారంభించనున్న సీఎం.. ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం కార్పొరేషన్/ కొత్తగూడెం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలో అరుదైన ఖనిజ సంపద లభ్యమయ్యే ప్రాంతాలు ఉన్నాయని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. అందుకే కొత్తగూడెం ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ స్థాపనకు అత్యుత్తమ ప్రదేశంగా నిలిచిందన్నారు. డిసెంబరు 2న ముఖ్యమంత్రి చేతుల మీదుగా కొత్తగూడెంలోని ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవం, అనంతరం బహిరంగ సభ నిర్వహించనున్న నేపథ్యంలో.. ఆదివారం ఆయన పర్యటన ఏర్పాట్లను పరిశీలించి.. అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. భూగోళ శాస్త్రాలు, సహజ వనరులు, ఖనిజ పరిశోధనలకు ప్రధాన కేంద్రంగా నిలిచేలా దేశంలోనే ప్రత్యేకత కల ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందన్నారు. దేశ ఆర్థిక సంస్కరణలకు మార్గదర్శకుడైన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సేవలను గౌరవిస్తూ యూనివర్సిటీకి ఆయన పేరు పెట్టాలని ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయాన్ని మంత్రివర్గం, అసెంబ్లీ ఆమోదించాయని తెలిపారు. జాతీయ రహదారి పక్కనే అభివృద్ధి చెందుతున్న ఈ యూనివర్సిటీ భవిష్యత్తులో ప్రపంచ స్థాయి పరిశోధనా సంస్థగా నిలవనుందన్నారు. గడువు పూర్తి కావడంతో పాల్వంచలో తొలగించిన విద్యుత్ కేంద్రాల స్థానే.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కాలుష్యం తక్కువగా ఉండే విధంగా కొత్త విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నిర్మాణానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలపడం హర్షణీయమని పేర్కొన్నారు.

బీమా వ్యతిరేక విధానాలను తిప్పి కొడతాం

కేంద్ర ప్రభుత్వ బీమా వ్యతిరేక విధానాలను తిప్పి కొడతామని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. ప్రపంచంలోకెల్లా నమ్మకమైన సంస్థగా ఎల్‌ఐసీ గుర్తింపు పొందిందన్నారు. కమీషన్ తగ్గింపు ద్వారా ఎల్‌ఐసీ ఏజెంట్ల వ్యవస్థతోపాటు పరోక్షంగా బీమా సంస్థను దెబ్బ తీయాలని చూస్తోందని ఆదివారం ఖమ్మంలో జరిగిన ఎల్‌ఐసీ ఏజెంట్ల సమాఖ్య 7వ మహాసభలో ఆయన చెప్పారు. కేంద్ర మంత్రితో మాట్లాడి ఏజంట్ల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎల్‌ఐసీని పరిరక్షించుకునేందుకు రాజకీయాలకతీతంగా అన్ని పార్టీలు ముందుకు రావాలన్న తుమ్మల.. అందుకు తన వంతు సంపూర్ణ సహకారం ఉంటుందని చెప్పారు.

విలీనంతో లాభమా..? నష్టమా..?

జీహెచ్‌ఎంసీ శివారు మునిసిపాలిటీల్లో చర్చ.. పన్ను హెచ్చు తగ్గులపై భిన్నాభిప్రాయాలు

- మౌలిక సదుపాయాల మెరుగుదలపై ఆశలు
- సేవల్లో పారదర్శకతపై స్థానికుల్లో ఆందోళన
- విలీన కసరత్తులో పురపాలక శాఖ బిజీ

హైదరాబాద్ సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీలో శివారు మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల విలీనంపై మిశ్రమ స్పందన వస్తోంది. పన్నులు, పౌర సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల కల్పనకు సంబంధించి మార్పులు ఉంటాయన్న అభిప్రాయం స్థానికుల్లో వ్యక్తమవుతోంది. విలీనంతో పన్నులు పెరిగే అవకాశముందని కొన్ని మునిసిపాలిటీల్లో చెబుతుండగా.. మరి కొన్ని చోట్ల జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఆస్తులతో పోలిస్తే తాము ఇప్పుడు ఎక్కువ పన్ను చెల్లిస్తున్నామని.. విలీనంతో అది తగ్గుతుందని పేర్కొంటున్నారు. మణికొండ, నార్సింగి, తెల్లాపూర్‌లో జీహెచ్‌ఎంసీతో పోలిస్తే అధిక పన్ను చెల్లిస్తున్నామని స్థానికులు చెబుతున్నారు. 'గ్రౌండ్‌తో కలిపి రెండంతస్తుల భవనానికి జీహెచ్‌ఎంసీ పరిధిలో ఏటా రూ.12 వేలు చెల్లిస్తుండగా.. మేం అంతే విస్తీర్ణంలో ఉన్న నిర్మాణానికి రూ.26 వేలకుపైగా పన్ను చెల్లిస్తున్నాం' అని మణికొండ వాసి ఒకరు పేర్కొన్నారు. విలీనంతో ఈ వ్యత్యాసం తగ్గుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తెల్లాపూర్‌లోనూ కొందరు స్థానికులు తాము బల్దియాతో పోలిస్తే ఎక్కువ పన్ను చెల్లిస్తున్నామని చెబుతున్నారు. బోడుప్పల్‌లోని ఓ వ్యక్తి ఇందుకు భిన్నంగా స్పందించారు. తాను ఇప్పుడు రూ.10 వేల పన్ను చెల్లిస్తున్నానని, జీహెచ్‌ఎంసీలో కలిపితే పన్ను పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పీర్జాదిగూడ, జల్‌పల్లి, బడంగ్‌పేట, మీర్‌పేట తదితర మునిసిపాలిటీల్లోనూ కొందరు పన్ను పెరుగుతుందేమోనని అనుమాన పడుతున్నారు.కాగా, 'మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో గతంలో ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారమే పన్ను మదింపు జరుగుతోంది. హెచ్చుతగ్గులు ఉంటే సర్కారు తీసుకునే నిర్ణయం ఆధారంగా హేతుబద్ధీకరణ జరగాల్సి ఉంటుంది' అని ఓ అధికారి తెలిపారు.

కేంద్రీకృతమైతే ఏమవుతుందో..?.

జీహెచ్‌ఎంసీ శివార్లలోని కార్పొరేషన్లు, మునిసిపాలిటీల్లో ప్రస్తుతం అధికారులు, సిబ్బంది.. స్థానికులకు కొంత అందుబాటులో ఉంటున్నారు. చిన్నా చితక సమస్యలపై ఫిర్యాదు చేస్తే స్పందించే అవకాశముంది. అదే జీహెచ్‌ఎంసీలో విలీనం చేస్తే ఈ పరిస్థితి ఉండదేమోనన్న భయం కొందరిలో ఉంది. పాలన కేంద్రీకృతమైతే ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం జరుగుతుందేమోనని నిజాంపేటకు చెందిన ఒకరు పేర్కొన్నారు. 'విలీనం అనంతరం పాలనా వ్యవస్థ ఎలా ఉంటుందో..? సర్కిల్, జోనల్ కార్యాలయాలకు వెళ్లాల్సి వస్తుందా..? వార్డుల వారీగా ఆఫీసులు ఉంటాయా..?' అని కొందరు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా, జీహెచ్‌ఎంసీలో విలీనమయ్యే 27 మునిసిపాలిటీల్లో ప్రస్తుతం మణికొండ, నార్సింగి, నిజాంపేట, బడంగ్‌పేట, అమీన్‌పూర్ వంటి చోట్ల ఆస్తి పన్ను, భవన నిర్మాణ అనుమతులు, ఇతరత్రా ఆదాయం రూ.40-70కోట్ల వరకు ఉండగా.. కొన్ని చోట్ల 10కోట్లకూ చేరుకోవడం లేదు. భవన నిర్మాణాలు ఎక్కువగా జరిగే చోట ఆదాయం అధికంగా ఉండగా.. ఇతర మునిసిపాలిటీల్లో పరిస్థితి తీసికట్టుగా ఉంది. కొన్ని మునిసిపాలిటీల్లో వెలగని వీధి దీపం మార్చేందుకూ రోజుల సమయం పడుతుందని స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలో విలీనంతో తమ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్న భావనా కొందరిలో వ్యక్తమవుతోంది. వేతనాలు, అప్పులకు వాయిదాలు చెల్లించాల్సిన జీహెచ్‌ఎంసీ పరిస్థితి.. నెల గడిస్తే చాలన్నట్టుగా ఉంది. ఏది ఏమైనా ప్రభుత్వంనిధులిస్తే తప్ప విలీన మునిసిపాలిటీల్లో మౌలిక సదుపాయాలు కల్పించే పరిస్థితి ఉండదు.

అత్యంత గోప్యంగా ప్రక్రియ..

జీహెచ్‌ఎంసీలో ఔటర్ లోపల, రింగ్ రోడ్డును ఆనుకుని ఉన్న 20 మునిసిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లను విలీనం చేయాలని ఇటీవల మంత్రి వర్గం నిర్ణయించింది. అందుకు సంబంధించిన కసరత్తు మొదలైంది. భౌగోళిక స్వరూపం, మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలోని జనాభా, ఆయా సంస్థల వారీగా ఆదాయం, వ్యయం, వేతనాల చెల్లింపు, ఉత్పత్తి అవుతోన్న చెత్త, మౌలిక సదుపాయాలు ఏ మేరకు ఉన్నాయన్న వివరాలను పురపాలక శాఖ సేకరిస్తోంది. ఇందుకు సంబంధించిన అధ్యయన బాధ్యతలను సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్(సీజీజీ)కు జీహెచ్‌ఎంసీ అప్పగించింది. విలీనం అనంతరం మెగా కార్పొరేషన్‌ను రెండు లేదా మూడు కార్పొరేషన్లుగా విభజిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఇందుకు సంబంధించిన ప్రక్రియను అధికారులు అత్యంత రహస్యంగా చేపడుతున్నారు.

రాహుల్ ప్రజాదరణను చూసి

కేంద్రం భయపడుతోంది..

» అందుకే తప్పుడు కేసులు పెడుతోంది: మహేశ్ గౌడ్



హైదరాబాద్/న్యూఢిల్లీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజల్లో రాహుల్ గాంధీకి పెరుగుతున్న ప్రజాదరణను చూసి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భయపడుతోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. సోనియా, రాహుల్‌పై తాజాగా మరో ఎఫ్ఐఆర్ నమోదు కావడమే దీనికి తిరుగులేని సాక్ష్యమని ఆదివారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. రాహుల్‌ను రాజకీయంగా సవాల్ చేయలేక కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేస్తూ బీజేపీ సర్కారు ఆయనపై తప్పుడు కేసులు బనాయిస్తోందని మండిపడ్డారు. నేషనల్ హెరాల్డ్ కేసుపై దశాబ్ద కాలంగా విచారణ సంస్థలు దర్యాప్తు చేస్తున్నా ఒక్క ఆరోపణనూ నిరూపించలేకపోయాయన్నారు. రాజ్యాంగ విలువలు, ప్రజల హక్కులు, సత్యం కోసం రాహుల్‌గాంధీ పోరాటం చేస్తున్నారని, అందుకే ఆయనంటే బీజేపీకి భయమని చెప్పారు. బెదిరింపులకు కాంగ్రెస్ ఏనాటికీ తలొగ్గబోదన్నారు.

పార్లమెంటులో రాష్ట్ర సమస్యలను లేవనెత్తుతాం: చామల

పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో తెలంగాణకు సంబంధించిన సమస్యలు, పెండింగ్ పనులు, ప్రజా సమస్యలను బలంగా లేవనెత్తుతామని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పార్టీ ఎంపీల ఫోరం కన్వీనర్ మల్లు రవి నేతృత్వంలో.. రీజినల్ రింగ్‌రోడ్డు, రీజినల్ రైల్, మూసీ పునరుద్ధరణ ప్రాజెక్టు, పట్టణ స్థానిక సంస్థలకు అర్బన్ చాలెంజ్ ఫండ్, కొత్త రైల్వే మార్గాలకు ఆమోదం, వరంగల్, కొత్తగూడెం, పెద్దపల్లి విమానాశ్రయాలకు అనుమతులివ్వాలంటూ డిమాండ్ చేస్తామని చెప్పారు. అలాగే రాష్ట్రానికి అవసరమైన ఆర్థిక అనుమతులూ ఇవ్వాలని కోరతామని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. థర్మల్ విద్యుత్తుకు సంబంధించి ప్రభుత్వం టెండర్లు పిలవకుండానే కుంభకోణాలు ఎలా జరిగాయంటూ హరీశ్‌రావును టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్‌గౌడ్ ప్రశ్నించారు. హరీశ్ తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

కోనసీమలా హుస్నాబాద్ అభివృద్ధి: పొన్నం



హుస్నాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గౌరవెల్లి రిజర్వాయర్‌తో ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. ఉత్తర తెలంగాణకు హుస్నాబాద్ నియోజకవర్గాన్ని కోనసీమగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ నెల 3న సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో జరిగే సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభ ఏర్పాట్లను కలెక్టర్ హైమావతితో కలిసి ఆదివారం పరిశీలించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలో దాదాపు రూ. 480 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని వెల్లడించారు. బహిరంగసభకు జన సమీకరణపై హుస్నాబాద్ టౌన్, హుస్నాబాద్ రూరల్ కార్యకర్తలతో సమావేశమైన మంత్రి పొన్నం.. జనసమీకరణలో భాగంగా ఇంటింటికెళ్లి కరపత్రాలను పంపిణీ చేయాలని సూచించారు.

కేంద్రాన్ని ప్రశ్నించడంలో రేవంత్ విఫలం

» తెలంగాణ రైతులపై బీజేపీకి ప్రేమలేదు: హరీశ్‌రావు



హైదరాబాద్/నారాయణఖేడ్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు చేస్తున్న అన్యాయాన్ని ప్రశ్నించడంలో సీఎం రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఆధ్వర్యంలో కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు ఆదివారం హైదరాబాద్‌లోని హరీశ్‌రావు నివాసంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా, సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రయోజనాలు, హక్కులను కాపాడటంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేసిందని విమర్శించారు. 8 మంది బీజేపీఎంపీలున్నా రాష్ట్రానికి ఒక్క మెడికల్ కాలేజీ తేలేకపోయారన్నారు. ఉత్తరాది రాష్ట్రాల రైతులకు ప్రయోజనం కలిగించడం ఉన్న ప్రేమ.. తెలంగాణ రైతాంగం పట్ల బీజేపీకి లేదని.. అందుకే కేంద్రం గోధుమలకు ఇచ్చిన మద్దతు ధరను వరికి కల్పించడం ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు అడుగడుగునా ఇబ్బందులు తప్పడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి 46 లక్షల ఎకరాలకు రైతు భరోసా ఇవ్వాల్సి ఉన్నప్పటికీ, 70 లక్షల ఎకరాలకు ఎగ్గొట్టేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. సంగారెడ్డి జిల్లాలోని బీడు భూములను సస్యశ్యామలం చేయడం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన బసవేశ్వర, సంగమేశ్వర ఎత్తిపోతల పథకాలను ప్రారంభించకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

భూ కుంభకోణంపై స్పందించండి రాహుల్.. !

» లేదంటే మీకూ.. భాగస్వామ్యం ఉన్నట్లే: కేటీఆర్

హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో రూ.5లక్షల కోట్ల విలువైన భూ కుంభకోణానికి సీఎం రేవంత్ రెడ్డి సిద్ధమయ్యారని, దీనిపై కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ తక్షణం స్పందించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ (హెచ్ఐఎల్‌టీపీ).. వెనక పెద్ద కుంభకోణం ఉందని వివరిస్తూ.. రాహుల్‌కు ఆదివారం ఆయన ఓ బహిరంగ లేఖ రాశారు. దీనిపై మౌనంగా ఉంటే రాహుల్‌కూ ఈ అవినీతిలో భాగస్వామ్యం ఉందని భావించాల్సి వస్తుందని పేర్కొన్నారు. బాలానగర్, జీడిమెట్ల, సనత్ నగర్, ఉప్పల్, మల్లాపూర్, రామచంద్రాపురం, హయత్ నగర్ వంటి కీలక క్లస్టర్‌లలో ఉపాధి కల్పన ను ప్రోత్సహించడానికి.. రాయితీ ధరలకే గత ప్రభుత్వాలు సుమారు 9,300 ఎకరాల పారిశ్రామిక భూమిని కేటాయించాయని తెలిపారు. హెచ్ఐఎల్‌టీపీ కింద.. ఇప్పుడు లక్షల కోట్ల విలువైన భూములను సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం సూచించే విలువలో, కేవలం 30శాతం చెల్లించి వాణిజ్య లేదా నివాస జోన్‌లుగా మార్చుకోవచ్చని చెబుతున్నారని అన్నారు. ప్రజలకు దక్కాల్సిన ఈ విలువైన ఆస్తులను నామమాత్రపు ధరకు ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేలా ఈ విధానం ఉందని ఆరోపించారు. ఈ మొత్తం పాలసీలో దాగున్న రాజకీయ అవినీతి అనేక ప్రశ్నలను లేవనెత్తుతోందన్నారు. తన బహిరంగలేఖకు రాహుల్ ఇచ్చే సమాధానం తెలంగాణ ప్రయోజనాలు కాపాడేలా ఉంటుందా?..లేక ప్రజల ఆస్తులను దోచుకుంటున్న నేతలకు అండగా నిలబడేలా ఉంటుందా? అన్నది ప్రజలు గమనిస్తారని కేటీఆర్ పేర్కొన్నారు.

తుఫాను ప్రభావం.. శ్రీలంకలో 212మంది మృతి

» కొలంబోలో చిక్కుకుపోయిన 400 మంది భారతీయులు

కొలంబో, నవంబరు 30: శ్రీలంకలో దిత్వా తుఫాను మృతుల సంఖ్య 212కు చేరింది. మరో 218 మంది గల్లంతయ్యారని శ్రీలంక విపత్తుల నిర్వహణ కేంద్రం(డీఎంసీ) ఆదివారం ప్రకటించింది. 2,73,606 కుటుంబాలకు చెందిన 9,98,918 మంది ప్రజలపై తుఫాను తీవ్ర ప్రభావం చూపినట్టు డీఎంసీ పేర్కొంది. భారత ప్రభుత్వ సాయంతో శ్రీలంక ప్రభుత్వం సహాయ, పునరావాస కార్యక్రమాలు కొనసాగిస్తోంది. బాధితుల ప్రాణాలను కాపాడేందుకు శ్రీలంక అధికారులకు భారత వాయుసేన(ఐఏఎఫ్), జాతీయ విపత్తుల నిర్వహణ దళం(ఎన్‌డీఆర్ఎఫ్) సిబ్బంది సాయం చేస్తున్నారని భారత విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. కాగా, కొలంబోలోని విమానాశ్రయంలో చిక్కుకుపోయిన సుమారు 400 మంది భారతీయులను ఆదివారం స్వదేశానికి తరలించారు. వీరిలో సుమారు 150 మందిని సీ130 విమానంలో ఢిల్లీకి పంపించారు. మిగిలిన 250 మందిని ఐఎల్76 విమానంలో కేరళలోని తిరువనంతపురానికి తరలించారు.



సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, ఉత్తమ్, దుద్దిళ్ల, దామోదర, పొన్నం

రేపటి కోసం..

(మొదటిపేజీ తరువాయి)

మీడియాతో మాట్లాడారు. విజన్ డాక్యుమెంట్‌ను తెలంగాణ రైజింగ్-2047గా పిలుస్తున్నామని, ఇందులో విజన్, స్ట్రాటజీ రెండు అంశాలు ఉంటాయని అన్నారు. విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో లక్షలాది మందిని భాగస్వాములను చేస్తున్నామని, నీతి ఆయోగ్, ఐఎస్‌బీ లాంటి సంస్థల సహకారంతో డాక్యుమెంట్‌ను తయారు చేస్తున్నామని వెల్లడించారు. ప్రతి అంశాన్నీ లోతుగా విశ్లేషించి భవిష్యత్తు ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్రాన్ని మూడు విభాగాలుగా విభజించామని తెలిపారు. ఓఆర్ఆర్ లోపల కోర్ అర్బన్ రీజనల్ ఎకానమీ (క్యూర్), ఓఆర్ఆర్ నుంచి రీజినల్ రింగ్ రోడ్డు వరకు పెరీ అర్బన్ రీజనల్ ఎకానమీ (ప్యూర్), ఆర్ఆర్ఆర్ నుంచి రాష్ట్రమంతా రూరల్ అగ్రికల్చరల్ రీజనల్ ఎకానమీ (రేర్)గా గుర్తించి ప్రత్యేక ప్రణాళిక అమలు చేయనున్నామని వివరించారు.

మూడు విభాగాలుగా తెలంగాణ..

దేశవ్యాప్తంగా మెట్రోపాలిటన్ నగరాలు ప్రస్తుతం కాలుష్య సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని సీఎం రేవంత్ అన్నారు. తెలంగాణలో తాము క్యూర్‌గా పేర్కొంటున్న ఔటర్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతాన్ని కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలను ఈ ప్రాంతం నుంచి తరలిస్తున్నామని తెలిపారు. క్యూర్ ప్రాంతాన్ని సర్వీస్ సెక్టార్‌గా మారుస్తున్నామని, ఇందులో మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ వంటి కార్యక్రమాలు చేపట్టబోతున్నామని పేర్కొన్నారు. ఇక ఔటర్ రింగ్ రోడ్డు అవతలి భాగంలో 360 కిలోమీటర్ల రీజనల్ రింగ్ రోడ్డు రాబోతున్నాయని, ప్యూర్‌గా పిలుచుకోనున్న ఈ ప్రాంతంలో భారత్ ఫ్యూచర్ సిటీతోపాటు అనేక పారిశ్రామిక పార్కులు ఉంటాయని వెల్లడించారు. గ్రీన్ ఫీల్డ్ హైవే, బుల్లెట్ ట్రైన్ వంటివి ఇక్కడ రాబోతున్నాయని, దీనికి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిందని ప్రకటించారు. అలాగే వ్యాపార ఎగుమతులు, దిగుమతులకు నౌకాశ్రయం కీలకమని, తెలంగాణలో తీర ప్రాంతం లేనందున ఏపీలోని మచిలీపట్నం పోర్టుకు కనెక్టివిటీ తీసుకొస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ నుంచి మచిలీపట్నం పోర్టుకు డెడికేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మించనున్నామన్నారు.

వరంగల్‌లో అంతర్జాతీయ విమానాశ్రయం..

తెలంగాణలో ఇప్పుడు అంతర్జాతీయ విమానాశ్రయం ఒక్కటే ఉన్నందున.. వరంగల్‌లోనూ అంతర్జాతీయ విమానాశ్రయం కావాలని పారిశ్రామికవేత్తలు కోరుతున్నారని సీఎం రేవంత్ అన్నారు. దీంతో వ్యాపార ఎగుమతులు గణనీయంగా పెరుగుతాయని, అందుకే వరంగల్‌లో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. అలాగే ఆదిలాబాద్, కొత్తగూడెం, రామగుండంలో ఎయిర్ పోర్టులు తీసుకురాబోతున్నామని, హైవే, పోర్ట్, ఎయిర్ పోర్టు కనెక్టివిటీతో పెట్టుబడులు తీసుకువచ్చి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం చేస్తామని చెప్పారు. ఇక రీజనల్ రింగ్ రోడ్డు నుంచి తెలంగాణ సరిహద్దుల వరకు మూడో రీజియన్‌గా పరిగణిస్తున్నామన్నారు. వ్యవసాయ ఆధారిత ఉత్పత్తులను మరింత ప్రోత్సహించడం, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు ఏర్పాటుచేయడం, రైతుల ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం కోసం ఈ ప్రాంతాన్ని రేర్‌గా పిలుస్తున్నామని పేర్కొన్నారు. క్యూర్, ప్యూర్, రేర్‌లో తెలంగాణ ముఖచిత్రాన్ని చూస్తున్నామని, ఈ మూడింటినీ క్రోడీకరించి తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ ఉండబోతోందని అన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి ప్రణాళికలు రచిస్తున్నామన్నారు.

దేశ ఆర్థికవ్యవస్థలో 10% వాటా లక్ష్యంగా..

దేశానికి అవసరమైన దాని కంటే ఎక్కువ ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేస్తున్నామని, అయినా.. ప్రజలకు పౌష్టికాహారం ఇవ్వలేకపోతున్నామని సీఎం రేవంత్ అన్నారు. అందరికీ విద్య అందుబాటులో ఉన్నప్పటికీ నాణ్యమైన విద్య, సాంకేతిక విద్య అందుబాటులో లేదన్నారు. అందుకే అంతర్జాతీయ విద్యా సంస్థలను రాష్ట్రానికి రప్పించి నాలెడ్జ్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని తెలిపారు. దేశ జనాభాలో తెలంగాణ వాటా 2.5 శాతం ఉండగా, దేశ ఆర్థిక వ్యవస్థలో 5శాతంగా ఉందని, దీనిని 10 శాతానికి పెంచేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని వెల్లడించారు. 2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడం లక్ష్యమని పునరుద్ఘాటించారు. తెలంగాణ రైజింగ్ ఉత్సవాలకు ప్రపంచవ్యాప్తంగా నిపుణులు వస్తున్నారని, సచివాలయంలో వార్ రూం, డిప్యూటీ సిఎం పర్యవేక్షిస్తారని అన్నారు. "ఏపీ, తమిళనాడు, మరో రాష్ట్రం మాకు పోటీ కాదు. చైనా, జపాన్, జర్మనీ, సింగపూర్, దక్షిణ కొరియాతో పోటీ పడబోతున్నాం. అభివృద్ధి చెందిన దేశాలే మాకు పోటీ. వారే మాకు ఆదర్శం. చైనా, జపాన్, దక్షిణ కొరియా, సింగపూర్ మాకు రోల్ మోడల్. వారినే ఆదర్శంగా తీసుకుని పోటీ పడతాం. ఆయా దేశాల నుంచీ పెట్టుబడులను ఆకర్షిస్తున్నాం. తెలంగాణలో పెట్టుబడులు పెట్టకుంటే చాలా కోల్పోతామన్న భావన అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలకు కలిగేలా విజన్-2047 ప్రణాళిక ఉంటుంది" అని సీఎం రేవంత్ అన్నారు.

ఈ నెల 6 వరకు జిల్లాల్లో ఉత్సవాలు

తెలంగాణ రాష్ట్రం దేశంతోనే కాకుండా.. ప్రపంచంతో పోటీ పడేలా తీర్చిదిద్దడం తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క అన్నారు. తెలంగాణ రైజింగ్-2047 సమ్మిట్ పేరిట డిసెంబరు 1 నుంచి 6వ తేదీ వరకు ఉమ్మడి జిల్లాల వారీగా ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరవుతారని చెప్పారు. ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించే ఉత్సవాల్లోనూ సీఎం పాల్గొంటారని తెలిపారు. ఇక గ్లోబల్ సమ్మిట్‌లో ఏర్పాటుచేసిన స్టాళ్లను ప్రజలందరూ చూసేందుకు డిసెంబరు 11, 12, 13 తేదీల్లో అవకాశం కల్పిస్తామన్నారు. కాగా, విజన్ డాక్యుమెంట్ రూపకల్పనకు రాష్ట్రవ్యాప్తంగా 4లక్షల మంది ప్రజల అభిప్రాయాలు సేకరించామన్నారు. కాగా, తెలంగాణ రైజింగ్ ఉత్సవాల్లో పాల్గొనాలంటూ ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి రాసిన లేఖను సీఎం రేవంత్, మంత్రులు విడుదల చేశారు.

రేపటిలోగా నివేదిక సమర్పించాలి: సీఎం రేవంత్

మంత్రులు, అధికారులు తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్‌లో తమ శాఖ పరిధిలోని ప్రతి అంశాన్నీ సోమ, మంగళవారాల్లో చర్చించి క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. 2వ తేదీ రాత్రికి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. 3, 4 తేదీలలో అన్ని శాఖలు ఇచ్చిన నివేదికలను సీఎస్, స్పెషల్ సీఎస్, సీఎంవో అధికారులు పరిశీలించాలని, అవసరమైన మార్పులు చేసి.. తుది ప్రతిని సిద్ధం చేయాలని అన్నారు. 6వ తేదీ సాయంత్రం వరకు విజన్ 2047 డాక్యుమెంట్ సంపూర్ణంగా సిద్ధం కావాలని, అన్ని విభాగాల అధికారులు డాక్యుమెంట్ రూపకల్పన కోసం పూర్తి సమయం కేటాయించాలని నిర్దేశించారు. గ్లోబల్ సదస్సు ఏర్పాట్లు నిర్వహణలో శాఖల మధ్య సమన్వయం ఉండాలన్నారు. ఇక ఈ నెల 13న ఎల్బీ స్టేడియంలో ప్రపంచ దిగ్గజ ఫుట్‌బాల్ ఆటగాడు లియోనెల్ మెస్సీ పాల్గొనే సెలెబ్రిటీ ఫుట్‌బాల్ మ్యాచ్‌లో ఆడేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం గంటపాటు ప్రాక్టీస్ చేశారు. ఎంసీహెచ్‌ఆర్‌డీలోని ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ఇతర క్రీడాకారులతో కలిసి ప్రాక్టీస్‌లో పాల్గొన్నారు.



ఎంసీహెచ్‌ఆర్‌డీలోని ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ఇతర క్రీడాకారులతో కలిసి ప్రాక్టీస్‌లో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి

గ్లోబల్ సమ్మిట్‌కు

ప్రధాని మోదీ, రాహుల్‌కు ఆహ్వానం

స్వయంగా ఆహ్వానించనున్న సీఎం రేవంత్

హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులను ఆహ్వానించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేలను సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా కలిసి ఆహ్వానించనున్నారు. కేంద్ర మంత్రులు, అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, దిగ్గజ పారిశ్రామికవేత్తలు, ప్రముఖ ఆర్థికవేత్తలు, క్రీడాకారులు, మీడియా ప్రముఖులు, దౌత్యవేత్తలు, వివిధ రంగాల నిపుణులను కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించనుంది. సదస్సుకు ఆహ్వానించే వారి స్థాయికి తగినట్లు రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు ఆహ్వానాలు అందించనున్నారు. ఇందుకోసం ఆహ్వాన కమిటీని నియమించనున్నారు. ఈ కమిటీని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ సమన్వయం చేయనున్నారు. కాగా, వివిధ రంగాలకు సంబంధించి ఇప్పటికే 4,500 మంది ప్రతినిధులకు ఆహ్వానాలు పంపామని, వారిలో వెయ్యి మంది ఇప్పటికే తమ రాకను నిర్ధారించారని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ తెలిపారు.

నారాయణపేట, వనపర్తి జిల్లాల్లో

నేడు సీఎం పర్యటన

» పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఆత్మకూరు/నారాయణపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి వనపర్తి జిల్లాలోని ఆత్మకూరు, నారాయణపేట జిల్లాలోని మక్తల్ పట్టణాల్లో సోమవారం పర్యటించనున్నారు. ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో నేరుగా హైదరాబాద్ నుంచి ఆత్మకూరులోని జాతర మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు మధ్యాహ్నం ఒంటి గంటకు చేరుకోనున్నారు. అనంతరం 1:20 గంటలకు పీజేపీ క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు. కృష్ణానదిపై జూరాల దిగువన వంతెన నిర్మాణానికి, 50 పడకల ఆస్పత్రి, ఇండోర్ స్టేడియం నిర్మాణం, రూ.15 కోట్ల వ్యయంతో మునిసిపాలిటీలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేస్తారు. ఆ తర్వాత నారాయణపేట జిల్లాలోని మక్తల్ మునిసిపాలిటీలో రూ.15 కోట్ల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు, మక్తల్-నారాయణపేట మధ్య రూ.210 కోట్ల వ్యయంతో నిర్మించనున్న నాలుగు వరుసల రోడ్డు పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం మక్తల్‌లోని నారాయణపేట రోడ్‌లో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభలో ప్రసంగిస్తారు. సభ ఏర్పాట్లను నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ వినీత్‌లతో అధికారుల బృందం పరిశీలించింది. సీఎం పర్యటన ఏర్పాట్లను మంత్రి వాకిటి శ్రీహరి పర్యవేక్షిస్తున్నారు.

90% డిగ్రీ పట్టాలు చిత్తుకాగితాలతో సమానం

నైపుణ్యాలు అందించని డిగ్రీలు నాలుక గీసుకోవడానికీ పనికిరావు

- ప్రభుత్వ ఉద్యోగమే సర్వస్వం అనుకునేవాళ్లు మూర్ఖులు
- వదాన్య స్వచ్ఛంద సంస్థ వార్షికోత్సవంలో జయప్రకాశ్ నారాయణ
- వదాన్య సేవలను కొనియాడిన ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణప్రసాద్



వదాన్య 15వసంతాల వేడుకను ప్రారంభిస్తున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణప్రసాద్, రామేశ్వరరావు, జయప్రకాశ్ నారాయణ, గాలి మాధవీలత, వదాన్య వ్యవస్థాపకుడు అశోక్ పడపాటి, హను రాఘవపూడి, బీవీఎస్ రవి, సువర్ణ

హైదరాబాద్ సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మన దేశంలో నూటికి 90శాతం మంది డిగ్రీ పట్టాలు చిత్తుకాగితాలతో సమానమని, అవి నిరర్థకమైనవని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ అన్నారు. నైపుణ్యాలు అందించని డిగ్రీ పట్టాలు నాలుకగీసుకోవడానికీ పనికిరావని చెప్పారు. సమాజ పురోగతికి కావాల్సింది పట్టాలు కాదని.. సృజనాత్మకత, ఉత్పత్తి సామర్థ్యాలు, క్రిటికల్ థింకింగ్, సమస్య పరిష్కారం వంటి నైపుణ్యాలన్నారు. దేశంలో 24 కోట్ల మంది పాఠశాలల్లో ఉన్నారని, వారిలో నూటికి ఎనభై మంది భవిష్యత్తు ప్రశ్నార్థకమేనని పేర్కొన్నారు. విద్యా వ్యవస్థంటే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, కోర్టుకేసులేనా అని ఆయన ప్రశ్నించారు. పిల్లల పేరుతో దేశంలో ఒక డ్రామా నడుస్తోందని మండిపడ్డారు. ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం రూ.లక్షకుపైగా వెచ్చిస్తున్నా, కనీస విద్యాప్రమాణాలు అందడంలేదని జయప్రకాశ్ నారాయణ (జేపీ) ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాలయాల్లో పేరుకే పరీక్షలు జరుగుతున్నాయన్నారు. బట్టీయం లేదా కాపీ కొట్టడమే తప్ప ఉత్తీర్ణత పొందినవారిలో 20శాతంమందికి మించి మిగతా విద్యార్థులకు సబ్జెక్టుల్లో కనీస పరిజ్ఞానం ఉండడం లేదన్న పలు అధ్యయనాలను ఉదహరించారు. వదాన్య స్వచ్ఛంద సంస్థ 15వ వార్షికోత్సవం ఆదివారం గచ్చిబౌలీలోని ఈఎస్‌సీఐ ఆడిటోరియంలో జరిగింది. ముఖ్య వక్తగా జేపీ మాట్లాడుతూ..ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే సర్వస్వంగా భావించేవారంతా పరమమూర్ఖులు అన్నారు. పాలకులు ఉద్యోగాలు ఇస్తామని అబద్ధపు వాగ్దానాలు ఇచ్చి యువతను మభ్యపెడుతున్నారని, ప్రభుత్వ ఉద్యోగాల మోజు సమాజాన్ని అల్లకల్లోలం చేస్తోందని చెప్పారు. జిల్లా కలెక్టరుకన్నా ఇంటి మరుగుదొడ్డిలో తూము పూడికతీసే ప్లంబరు మిన్న అన్న విషయాన్ని గుర్తించాలని జేపీ అన్నారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. పేదవర్గాల్లోని ప్రతిభావంతులను గుర్తించి, వారి చదువుకు ఆర్థిక సహాయం అందిస్తున్న వదాన్య జనసొసైటీ సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. అశోక్ పడపాటి బృందం యువతకు ఆదర్శనీయమని పేర్కొన్నారు. ప్రముఖ సినీ దర్శకుడు హను రాఘవపూడి, సినీ రచయిత బీవీఎస్ రవి.. వదాన్యతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. చినాబ్ రైల్వే వంతెన ఇంజనీరు గాలి మాధవీలత మాట్లాడుతూ పేదరికం వల్ల ఉన్నత చదువులకు దూరమవుతున్న యువతను గుర్తించి సరైన అవకాశాలు కల్పించడం గొప్ప విషయమన్నారు. ఐఎఫ్ఎస్ అధికారిణి సువర్ణ మాట్లాడుతూ విలువైన సమయాన్ని సమాజ శ్రేయస్సు కోసం కేటాయిస్తున్న వదాన్య వలంటీర్లను అభినందించారు. వదాన్య వ్యవస్థాపకుడు అశోక్ పడపాటి మాట్లాడుతూ ఇప్పటివరకు తమ సంస్థ సేవలు పొందిన వారిలో 100మందిపైగా ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారని, వారిలో 50మంది ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. ఉన్నత చదువుకు ఆర్థిక సహకారం, ల్యాప్‌టాప్‌ల పంపిణీతోపాటు పోటీపరీక్షల అభ్యర్థులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ జి.రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గానికో ఎంఎస్‌ఎంఈ పార్కు!

మహిళల కోసం ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తాం.. మహిళా సాధికారత ఇంటి నుంచే మొదలవ్వాలి

» రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళల కోసం ప్రత్యేకంగా ఎంఎస్‌ఎంఈ పార్కును అభివృద్ధి చేస్తామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. అది తమ ప్రభుత్వ సంకల్పమన్నారు. మహిళా సాధికారతే తమ లక్ష్యమని, దాన్ని మాటల్లో కాకుండా చేతల్లో చూపుతున్నామని తెలిపారు. 2047 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలన్న లక్ష్యసాధనలో మహిళలను కీలక భాగస్వాములుగా చేస్తామన్నారు. 'వీ హబ్' ఆధ్వర్యంలో ఆదివారం అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 'వీ-ఎనేబుల్ గ్రాడ్యుయేషన్' వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళా సాధికారత పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చాలంటే మార్పు ఇంటి నుంచే మొదలు కావాలన్నారు. తెలంగాణలో మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు 52.7 శాతం అని, ఇది జాతీయ సగటు 45.2 కంటే ఎక్కువగా ఉండడం రాష్ట్ర ప్రగతికి ప్రతిబింబమని తెలిపారు. మహిళలు కూడా వ్యాపారాలను విజయవంతంగా నిర్వహించగలరని 'వీ హబ్' నిరూపించిందన్నారు. ఈ స్ఫూర్తితో ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలు ప్రారంభించే అంకుర సంస్థలను అంతర్జాతీయ స్థాయి వ్యాపార సంస్థలుగా మార్చేలా 'వీ హబ్ 2.0'కు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. మహిళల ఆలోచనా తీరులోనూ మార్పు రావాలన్నారు. ఉద్యోగాలు సృష్టించేలా కొత్తగా ఆలోచించాలని సూచించారు.

రాష్ట్రంలో 'అదితి'కి ఆతిథ్యం

లక్షలాది మందికి ఉపాధి కల్పించడంతో పాటు నూతన ఆవిష్కరణలనుతీసుకొచ్చే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటిదని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. కార్యక్రమంలో భాగంగా రాష్ట్రప్రభుత్వం కేంద్ర ప్రాయోజిత పథకమైన 'అసిస్టెన్స్ ఇన్ డిప్లాయింగ్ ఎనర్జీ ఎఫిషియంట్ టెక్నాలజీస్ ఇన్ ఇండస్ట్రియల్ ఎస్టాబ్లిష్‌మెంట్(అదితి)'కి పూర్తి మద్దతు ఇచ్చిందని చెప్పారు. దీపి ద్వారా ప్రయోజనం పొందే మొదటి క్లస్టర్లలో ఒకటిగా మెదక్ జిల్లాలోని ఫార్మా పరిశ్రమను ఎంచుకున్నందుకు రాష్ట్ర ప్రభుత్వానికి బీఈఈ కృతజ్ఞతలు తెలిపిందన్నారు. అదితి పథకాన్ని ప్రోత్సహించడంపై విద్యుత్తు శాఖ పరిధిలోని బీఈఈ, ఈఈఎస్ఎల్ మీడియా సలహాదారు ఎ.చంద్రశేఖరరెడ్డి రూపొందించిన ప్రత్యేక నివేదికను మంత్రి శ్రీధర్‌బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అదితి పథకం ఎంఎస్‌ఎంఈలకు ఒక వరమని ప్రశంసించారు. అదితి అమలులో తెలంగాణ దేశానికే రోల్ మోడల్‌గా మారాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.

రూ.1.90 కోట్ల సైబర్ మోసం కేసులో ముగ్గురి అరెస్టు

» నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలు ఇచ్చినందుకే..

హైదరాబాద్ సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్ట్ చేశామని వృద్ధుడిని బెదిరించి రూ.1.90 కోట్లు వసూలు చేసిన కేసులో బ్యాంకు ఖాతాలు ఇచ్చి సహకరించిన ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని కొత్తపేటకు చెందిన పండు వినీత్ కుమార్ (24)కు సైబర్ నేరగాళ్లకు ఖాతాలు సరఫరా చేసే సందీప్ అలియాస్ అలెక్స్ పరిచయమయ్యాడు. బ్యాంకు ఖాతాలు తీసి ఇస్తే డబ్బులు ఇస్తానని చెప్పడంతో వినీత్ అందుకు అంగీకరించాడు. కమీషన్ మాట్లాడుకొని మహబూబ్‌నగర్ తిరుమలదేవునిగుట్టకు చెందిన వ్యాపారి జి.తిరుపతయ్య(40), మెహిదీపట్నం లక్ష్మీనగర్ కాలనీకి చెందిన వ్యాపారి గౌని విశ్వనాథం (46)ల ధ్రువపత్రాలతో పలు బ్యాంకు ఖాతాలు తెరిచిన వినీత్.. వాటిని సందీప్‌కు అందించాడు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్‌కు చెందిన ఓ 71 ఏళ్ల వృద్ధుడికి ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు సీబీఐ అధికారులమంటూ వీడియో కాల్ చేసి బెదిరించారు. 'మీ ఆధార్ కార్డుతో ముంబై కెనరా బ్యాంకులో ఖాతా తెరిచారు. దాని నుంచి ఉగ్ర సంస్థలకు నిధులు వెళ్లాయి. మీపై మనీలాండరింగ్, దేశ ద్రోహం కేసులు నమోదయ్యాయి. మీ ఖాతాల్లో ఉన్న డబ్బు పరిశీలించాలి' అని చెప్పి అన్ని వివరాలు సేకరించారు. నవంబరు 7 నుంచి 14 వరకు ఆయన ఖాతాల నుంచి రూ.1.92 కోట్లు తమ ఖాతాలోకి మళ్లించుకున్నారు. మోసం గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్యాంకు ఖాతాల ఆధారంగా దర్యాప్తు చేసిన వారు.. వినీత్, తిరుపతయ్య, విశ్వనాథంలను అరెస్ట్ చేశారు.

సింగరేణి కార్మికుల వారసులు ఉన్నత ఉద్యోగాలు సాధించాలి

» వారి కోసమే 'చెమట చుక్కల తర్ఫీదు': సంస్థ సీఎండీ



కొత్తగూడెం టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికుల వారసులు ప్రపంచ స్థాయిలో ఉన్నత ఉద్యోగం సాధించే దిశగా ముందుకు సాగాలని సింగరేణి ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం పిలుపునిచ్చారు. ఐఐటీ, ఐఐఎం, బిట్స్ పిలానీ వంటి యూనివర్సిటీల్లో విద్యాభ్యాసం చేసే దిశగా పయనించాలని కోరారు. ఆదివారం కొత్తగూడెంలో జరిగిన 'చెమట చుక్కల తర్ఫీదు' అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్మికుల పిల్లలు దేశ, విదేశాల్లో విద్యాభ్యాసం చేయడంతో పాటు ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడేందుకు అవగాహన కల్పించాలనే లక్ష్యంతో సింగరేణి వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా 'చెమట చుక్కల తర్ఫీదు' అవగాహన సదస్సులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యార్థులు ఉన్నతంగా ఎదిగేందుకు తోడ్పాటునందించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని అన్నారు.

దేవ్‌జీని కోర్టులో హాజరు పరచాలి

» ఏపీ ఉప ముఖ్యమంత్రికి దేవ్‌జీ తమ్ముడి కుమార్తె లేఖ

కోరుట్ల/కోరుట్ల రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శి దేవ్‌జీ అలియాస్ తిప్పిరి తిరుపతిని కోర్టులో హాజరు పరచాలంటూ ఆయన తమ్ముడి కుమార్తె సుమ ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఎక్స్‌లో లేఖను పోస్టు చేశారు. ఆ లేఖలో వివరాలు ఇలా ఉన్నాయి. 'మా పెద్దనాన్న తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ మావోయిస్టు పార్టీ చీఫ్‌గా ఉన్నారు. ఇటీవల ఆయన పోలీసుల కస్టడీలో ఉన్నారనే వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈ వార్తలు నిజామా? కాదా? అనేది మా కుటుంబానికి స్పష్టంగా తెలియడం లేదు. కానీ ప్రతి రోజు వినిపించే ఈ సమాచారం మా కుటుంబాన్ని తీవ్ర కలిచివేతకు గురి చేస్తోంది. ఒక వేళ ఈ వార్తలు నిజమే అయితే దయచేసి ఆయనను కోర్టులో హాజరు పరిచేలా చూడాలి లేదా లొంగిపోవడానికి అవకాశం ఇవ్వాలని మా కుటుంబం తరపున మనస్ఫూర్తిగా మిమ్మల్ని వేడుకుంటున్నా. 40 ఏళ్లుగా మా కుటుంబం ఆయన కోసం ఎదురు చూడని రోజు లేదు. ఆయన కోసం వేచి చూస్తున్న సమయాన్ని మాటలో చెప్పలేం. సర్ మీపై మాకున్న నమ్మకం చాలా పెద్దది. ఒక అభిమానిగా, జనసేన పార్టీ కార్యకర్తగా మిమ్మల్ని చేతులెత్తి వేడుకుంటున్నాం. మా కుటుంబానికి మీరు తప్పకుండా న్యాయం చేస్తారని మనస్ఫూర్తిగా విశ్వసిస్తున్నాం.' ఈ లేఖ సోషల్ మీడియాలో వైరల్ అయింది.

మీ 'సేవ'లకు ఎటువంటి అంతరాయం లేదు

» మీడియా కథనాలను ఖండించిన ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ - మీసేవా

హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వివిధ పనుల కోసం అవసరమయ్యే కుల, ఆదాయ ధ్రువపత్రాల జారీ ప్రక్రియ స్తంభించిందంటూ వచ్చిన పలు మీడియా కథనాలను 'ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ - మీసేవా' ఆదివారం ఖండించింది. రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ సేవలు ఎటువంటి అంతరాయం లేకుండా కొనసాగుతున్నాయని మీ సేవా అధికారులు ఒక ప్రకటన తెలిపారు. నవంబర్ 24 నుంచి 29 వరకు మొత్తం 2,28,805 దరఖాస్తులను మీ సేవా కేంద్రాలు ప్రాసెస్ చేశాయని తెలిపారు. కొన్ని కేంద్రాల్లో స్వల్ప జాప్యం చోటు చేసుకున్నా.. దానికి పూర్తిగా స్థానిక సమస్యలేనని కారణమని, వ్యవస్థ మొత్తాన్ని ప్రభావితం చేసే అవాంతరాలు కావని స్పష్టం చేశారు.

ఫిబ్రవరిలో 3వ ప్రపంచ తెలుగు మహాసభలు

అమలాపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మూడో ప్రపంచ తెలుగు మహాసభలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలోని కిమ్స్ ప్రాంగణం వేదిక కానుంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 28, మార్చి 1వ తేదీల్లో జరగనున్న తెలుగు మహాసభలకు సంబంధించి కిమ్స్ కళాశాలలో ఆదివారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిమ్స్ విద్యా సంస్థల ఛైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు మాట్లాడుతూ 10వేల మందితో ఫిబ్రవరి 28న పట్టణంలో శోభాయాత్ర జరుగుతుందని, వెయ్యి మందికిపైగా కవులతో సమ్మేళనం నిర్వహిస్తామని తెలిపారు. వివిధ రాష్ట్రాలకు చెందిన గవర్నర్లు, ముఖ్యమంత్రులు, డిప్యూటీ సీఎంలతో సహా, తెలుగుభాష కోసం పనిచేస్తున్న ప్రపంచంలో పేరెన్నిగన్న వ్యక్తులందరినీ ఈ వేదికపైకి పిలిచి సత్కరించనున్నట్టు ఆయన తెలిపారు.



బ్బా..బాబూ.. నీ కాళ్లు మొక్కుతా

ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు ఓటర్లను ఆకట్టుకునేందుకు ఎన్ని పాట్లైనా పడతారు, ఎన్ని పీట్లైనా చేస్తారనేందుకు నిదర్శనం ఈ చిత్రం. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం అప్పాజీపల్లి సర్పంచ్ స్థానానికి నామినేషన్ వేసిన బీజేపీకి చెందిన భూమయ్య.. బ్బా..బాబూ.. నీ కాళ్లు మొక్కుతా నాకు ఓటేయ్యండి అంటూ ఓటర్లను ఇలా ప్రసన్నం చేసుకుంటున్నారు.

- అల్లాదుర్గం

ప్రెసిడెంట్ గారి భర్తనైనా అవుదామని!

ప్రియురాలితో సర్పంచ్ పదవికి నామినేషన్ వేయించిన యువకుడు.. ఆ వెంటనే ఆమెతో పెళ్లి



శ్రీజతో చంద్రశేఖర్‌గౌడ్

సంగారెడ్డి రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తమ గ్రామానికి సర్పంచ్ అవ్వాలని అనుకున్న ఓ యువకుడు ఎన్నికల్లో పోటీ చేయడానికి ఎదురుచూస్తున్నాడు. ఆ ఎన్నికలు వచ్చేసినా.. రిజర్వేషన్ అనుకూలించక పోటీ చేసే అవకాశం కోల్పోయాడు. కానీ, నిరుత్సాహపడని ఆ యువకుడు ప్రెసిడెంట్‌ని కాకపోతేనేం.. ప్రెసిడెంట్ గారి భర్తనైనా అవుదామనే ఆలోచనతో తన ప్రేయసితో నామినేషన్ వేయించేశాడు. ఆపై, క్షణం కూడా ఆగకుండా ఆ యువతిని పెళ్లి చేసేసుకున్నాడు. సంగారెడ్డి మండలం తాళ్లపల్లికి చెందిన చంద్రశేఖర్ గౌడ్ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలని భావించినా.. ఆ గ్రామ పంచాయతీ ఎస్సీ మహిళకు రిజర్వు అయింది. దీంతో చంద్రశేఖర్ తన ప్రియురాలు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన శ్రీజతో నామినేషన్ వేయించాడు. అనంతరం శ్రీజను పెళ్లి చేసుకున్న చంద్రశేఖర్ గౌడ్.. తమకు రక్షణ కల్పించాలంటూ సంగారెడ్డి రూరల్ పోలీసులను ఆశ్రయించాడు. మరోపక్క, తమ కుమార్తె కనిపించడం లేదంటూ శ్రీజ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంగారెడ్డి పోలీసుస్టేషన్‌కు వెళ్లిన సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్.. చంద్రశేఖర్ గౌడ్, శ్రీజలకు మద్దతుగా నిలిచారు. కాగా, అప్పటిదాకా ఏకగ్రీవం అనుకున్న తాళ్లపల్లి గ్రామ సర్పంచ్ స్థానానికి శ్రీజ నామినేషన్‌తో ఎన్నిక అనివార్యమైంది.

పల్లెపోరు.. నామినేషన్ల జోరు

తొలి విడతలోని 4,236 సర్పంచ్ స్థానాలకు 25,654 నామినేషన్లు

» 37,440 వార్డు మెంబర్ స్థానాలకు 82,276 నామినేషన్లు

» సర్పంచ్‌కు సగటును ఆరుగురు, వార్డు సభ్యునికి సగటున ఇద్దరు పోటీ

» నామినేషన్ ఉపసంహరణకు 3వ తేదీ తుది గడువు



హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పల్లెపోరులో నామినేషన్ల జోరు కనబడుతోంది. తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాలకు పెద్ద సంఖ్యలో నామినేషన్లు వచ్చాయి. ఒక్కో సర్పంచ్ స్థానానికి సగటును ఆరుగురు అభ్యర్థులు ఎన్నికల్లో తలపడుతున్నారు. వార్డు సభ్యులను స్థానాలను చూస్తే.. ఒక్కో స్థానానికి సగటున 2.2మంది పోటీలో ఉన్నారు. తొలివిడత ఎన్నికలు జరిగే 189మండలాల్లోని 4,236 సర్పంచ్ స్థానాలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ శనివారంతో ముగిసింది. మూడు రోజులు పాటు సాగిన ఈ ప్రక్రియలో ఆయా స్థానాలకు 25,654 మంది నామినేషన్లు సమర్పించారు. తొలి రెండు రోజుల్లో 8,198 మంది నామినేషన్లు వేయగా, చివరి రోజు 17,940మంది నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే, తొలి విడతకు సంబంధించి 37,440 వార్డు సభ్యుల స్థానాలకు తొలిరెండు రోజుల్లో 11,680, చివరిరోజు 70,596 మొత్తం 82,276 నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ నామినేషన్లకు సంబంధించి అన్ని చోట్ల నేడు, రేపు అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం ఉంటుంది. మూడో తేదీ నామినేషన్ల ఉపసంహరణకు గడువు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక అదే రోజు ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల వివరాలను ఎన్నికల అధికారులు ప్రకటిస్తారు.

రెండో విడత నామినేషన్ల స్వీకరణ ప్రారంభం

రెండో విడత ఎన్నికల్లో భాగంగా 4,333 సర్పంచ్, 33,350వార్డు సభ్యుల స్థానాలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఆదివారం ప్రారంభమైంది. మంగళవారం వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. అనంతరం 3న పరిశీలన, 4న వినతుల స్వీకరణ, 5న అప్పీళ్ల పరిశీలన చేపడతారు. ఈనెల 6న ఉపసంహరణ, పోటీలో ఉన్నవారి తుది జాబితాను ప్రకటిస్తారు. 14న పోలింగ్ నిర్వహించి అదే రోజున ఫలితాలను ప్రకటిస్తారు.

చంపుతామని బెదిరించారు

సర్పంచ్ అభ్యర్థి భర్త ఫిర్యాదు

తిప్పర్తి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా యల్లమ్మగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేతలు తనని కిడ్నాప్ చేసి వేధించారని ఆ గ్రామ సర్పంచ్ అభ్యర్థి భర్త యాదగిరి పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశాడు. యల్లమ్మగూడెం సర్పంచ్ స్థానానికి యాదగిరి భార్య నాగలక్ష్మి శనివారం నామినేషన్ వేశారు. నామినేషన్ వేసేందుకు వెళ్లడానికి కారు తీసుకొస్తానని ఇంటి నుంచి వెళ్లిన యాదగిరి తిరిగిరాకపోగా నాగలక్ష్మి ఒంటరిగా వెళ్లి తన నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సూచన మేరకు నల్లగొండ ఎస్పీకి ఫిర్యాదు చేయించారు. ఆ తర్వాత అరగంట వ్యవధిలోనే కొందరు వ్యక్తులు యాదగిరిని తిప్పర్తి పోలీస్‌స్టేషన్ దగ్గర వదిలివెళ్లారు. అయితే, గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బలవంతంగా తనని కారులో ఎక్కించుకొని తీసుకెళ్లారని యాదగిరి పోలీసులకు తెలిపాడు. మధ్యలో మరో కారు మార్చి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో తిప్పారని, తన భార్య దాఖలు చేసిన నామినేషన్‌ను ఉపసంహరించుకోవాలంటూ దాడి చేశారని, మూత్రం తాపించి చంపుతామని బెదిరించారని వివరించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



బంగారిగడ్డ సర్పంచ్ పదవికి రూ.73లక్షలు

» వేలం పాటలో దక్కించుకున్న మైనారిటీ మహిళ

» ఆ సొమ్ముతో గ్రామంలో ఆలయ నిర్మాణానికి తీర్మానం

చండూరురూరల్, గుర్రంపోడు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ స్థానానికి వేలంపాటలు కొనసాగుతున్నాయి. నల్లగొండ జిల్లాలోని బంగారిగెడ్డ, ములకలపల్లి సర్పంచ్ స్థానాలు వేలంపాటల ద్వారా ఏకగ్రీవం అయ్యాయి. చండూరు మండలం బంగారిగడ్డ సర్పంచ్ పదవిని మహ్మద్ సమీనా ఖాసిం అనే మైనార్టీ మహిళ ఏకంగా రూ.73లక్షలకు వేలంలో దక్కించుకున్నారు. బంగారిగడ్డ గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానం బీసీ మహిళకు రిజర్వ్ అయింది. ఆదివారం గ్రామపెద్దల సమక్షంలో వేలం జరిగినట్టు తెలిసింది. వేలం ద్వారా వచ్చిన నగదును గ్రామంలో కనకదుర్గ దేవాలయ నిర్మాణానికి వినియోగించాలని తీర్మానించారు. ఇక, గుర్రంపోడు మండలం ములకలపల్లి గ్రామ సర్పంచ్‌గా బొడ్డుపల్లి లింగస్వామిని ఏకగ్రీవం చేసేందుకు గ్రామస్థులు నిర్ణయించారు. ఇందుకు గాను గ్రామంలో సగం వరకు పూర్తయిన రామాలయ నిర్మాణాన్ని రూ.19 లక్షలు వెచ్చించి పూర్తి చేస్తానని లింగస్వామి హామీ ఇచ్చారని తెలిసింది.



కపూర్‌నాయక్‌తండాలో ర్యాలీ చేస్తున్న గిరిజన రైతులు

సమస్యలు పరిష్కరించకపోతే బహిష్కరణే

సిద్దిపేట జిల్లా కపూర్‌నాయక్‌తండా రైతులు, మెదక్ జిల్లాలో నాలుగు గ్రామాల ప్రజల హెచ్చరికలు

» పోటీ చేయడం ఇష్టం లేక ఒకరు, పోటీ చేసే అవకాశం రాక మరొకరి ఆత్మహత్యాయత్నాలు

అక్కన్నపేట/వెల్దుర్తి, నాగర్‌కర్నూల్ క్రైం/మదనాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామాల్లో సుదీర్ఘ కాలంగా నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తేనే పంచాయతీ ఎన్నికల్లో పాల్గొంటామని లేనిపక్షంలో ఎన్నికలను బహిష్కరిస్తామని సిద్దిపేట జిల్లా కపూర్‌నాయక్ తండా రైతులు, మెదక్ జిల్లా వెల్దుర్తి మండల పరిధిలోని నాలుగు గ్రామాల ప్రజలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తాత ముత్తాతల కాలం నుంచి తాము సాగు చేసుకుంటున్న భూములను ధరణి పోర్టల్‌లో నిషేధిత జాబితాలో చేర్చడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆ సమస్యను పరిష్కరిస్తేనే ఓట్లు వేస్తామంటూ కపూర్‌నాయక్ తండాలో గిరిజన రైతులు ఆదివారం ర్యాలీ చేశారు. తమకు పట్టాలు ఇచ్చే వరకు ఎన్నికలను బహిష్కరిస్తామని తేల్చిచెప్పారు. అలాగే, వెల్దుర్తి నుంచి మెదక్ వరకు ప్రధాన రోడ్డును వెంటనే నిర్మించాలని లేకుంటే స్థానిక ఎన్నికలను బహిష్కరిస్తామంటూ వెల్దుర్తి మండల పరిధిలోని శెట్టిపల్లి కలాన్, రామాయిపల్లి, బండపోసానిపల్లి, ఎదులపల్లి గ్రామాల ప్రజలు శెట్టిపల్లి కలాన్‌లో ఆదివారం రాస్తారోకో చేశారు. ఇక, సర్పంచ్ స్థానానికి పోటీ చేసే అవకాశం కోల్పోయాననే మనస్తాపంతో ఒకరు, పోటీ చేయడం లేక మరొకరు ఆత్మహత్యకు యత్నించారు. నాగర్‌కర్నూల్ జిల్లా శ్రీపురం గ్రామానికి చెందిన ఓర్సు బంగారయ్య ఆదివారం ఆత్మహత్యకు యత్నించాడు. శ్రీపురం సర్పంచ్ స్థానం జనరల్ మహిళకు రిజర్వు కాగా బంగారయ్య పోటీ చేసే అవకాశం కోల్పోయాడు. ఈ విషయంపై ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డిని కలిసేందుకు బంగారయ్య ఆదివారం సాయంత్రం క్యాంపు కార్యాలయానికి వెళ్లాడు. కానీ ఎమ్మెల్యే లేకపోవడంతో కార్యాలయ ఆవరణలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా.. స్థానికులు అతడిని ఆస్పత్రికి తరలించారు. ఇక, వనపర్తి జిల్లా మదనాపురం మండలంలోని దుప్పల్లి గ్రామానికి చెందిన గొల్ల సుజాత ఎన్నికల్లో పోటీ చేయడం ఇష్టం లేక ఆత్మహత్యకు యత్నించింది. దుప్పల్లి స్థానం బీసీ మహిళకు రిజర్వు కాగా.. కాంగ్రెస్ మద్దతుతో ఆ పార్టీ నాయకుడు గొల్ల నాగరాజు తన భార్య గొల్ల సుజాతను అభ్యర్థిగా నిర్ణయించారు. కానీ, ఎన్నికల్లో పోటీ చేయాలని కుటుంబసభ్యుల నుంచి ఎదురైన ఒత్తిడిని తట్టుకోలేక సుజాత ఆదివారం ఉదయం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా కుటుంబసభ్యులు ఆస్పత్రిలో చేర్పించారు.

మైనారిటీ అభ్యర్థులకు మజ్లిస్ మద్దతు!

హైదరాబాద్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న మజ్లిస్ పార్టీ(ఎంఐఎం) గ్రామ పంచాయితీ ఎన్నికల్లో మైనారిటీ వర్గం అభ్యర్థులకు మద్దతుగా నిలువనుంది. విజయావకాశాలున్న ప్రాంతాల్లో పోటీ చేస్తున్న మైనారిటీ అభ్యర్థుల తరఫున రాష్ట్ర, జిల్లా స్థాయి పార్టీ నాయకులు ప్రచారంలో పాల్గొననున్నారు. అవసరమైన పక్షంలో అధికార కాంగ్రెస్ నేతల సమన్వయంతో పనిచేయాలని మజ్లిస్ సూచించినట్లు సమాచారం. పంచాయతీ ఎన్నికల్లో, మైనారిటీ వర్గం ఓట్లు చీలిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మజ్లిస్ అధిష్ఠానం జిల్లా నాయకత్వానికి స్పష్టం చేసింది. గతంలో గ్రామ ఎన్నికల్లో పోటీ చేయని మజ్లిస్ ఈసారి పరిస్థితులకు అనుగుణంగా మైనారిటీ వర్గం అభ్యర్థులు లేదా మైనారిటీలతో సఖ్యతగా ఉండే నాయకులకు మద్దతుగా నిలువాలని నిర్ణయించుకుంది. మరోవైపు ముస్లింలు అధికంగా ఉండే ప్రాంతాల్లో మునిసిపల్ ఎన్నికల కోసం మజ్లిస్ ఇప్పటి నుంచే అభ్యర్థులను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

సర్పంచ్ ఎన్నికల రిజర్వేషన్ల ఖరారులో పొరపాట్లు

తప్పుదారి పట్టించేవిధంగా జీవో 46: బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ల ఖరారులో జరిగిన పొరపాట్లను సరిదిద్ది ఎన్నికలు నిర్వహించాలని లేని పక్షంలో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ తెలిపారు. ఈ ఎన్నికల రిజర్వేషన్లకు సంబంధించి విడుదల చేసిన జీవో 46 వాస్తవాలను తప్పుదారి పట్టించే విధంగా ఉందని ఆయన ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో 2019లో జరిగిన స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ల కింద బీసీలకు 22.78 శాతం సీట్లు దక్కగా ప్రస్తుతం 21.39 శాతం మాత్రమే రిజర్వ్ అయినట్టు తెలిపారు. రిజర్వేషన్ల ఖరారులో జరిగిన పొరపాట్ల కారణంగా గతంలో కంటే బీసీలకు సీట్లు తగ్గినట్టు ఆయన వివరించారు. రాష్ట్రంలో బీసీలకు సంబంధించి సమగ్ర సమాచారం, డేటా అందుబాటులో ఉన్నా పరిగణనలోకి తీసుకోక, గతంలో కంటే సీట్లు తగ్గడంపై బీసీ వర్గాల్లో తీవ్ర అసంతృప్తి పెల్లుబుకుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

71,550 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

విధంగా పెరిగాయి. రాష్ట్ర ఖజానాకు భారీగా నిధులు సమకూరాయి. గత రెండేళ్లలో 724లక్షల కేసుల లిక్కర్, 960 లక్షల కేసుల బీర్ల అమ్మకాలు జరిగాయి. ఈ అమ్మకాల విలువ రూ.71,550 కోట్లు కావడం గమనార్హం. పాతపాలసీ ప్రారంభమైన 2023 డిసెంబరులో ఏకంగా రూ.4,297 కోట్ల వ్యాపారం జరిగింది. అనంతరం 2024 జనవరి నుంచి డిసెంబరు వరకు రూ.37,485 కోట్ల మద్యం విక్రయాలు జరగగా, ఈ ఏడాది జనవరి నుంచి నవంబరు వరకు రూ.29,766 కోట్ల అమ్మకాలు జరిగాయి. ఈ మొత్తం అమ్మకాల ద్వారా వచ్చిన ఆదాయంలో ప్రభుత్వానికి 80 శాతం మేర సమకూరింది. దీనికి అదనంగా మద్యం దుకాణాల దరఖాస్తు ఫీజులు, లైసెన్స్ ఫీజుల రూపంలో ఆదాయం వచ్చింది.

ఎన్నికలతో పెరిగిన అమ్మకాలు..

పాత మద్యం పాలసీ సమయంలోనే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు వేర్వేరుగా రావడం రాష్ట్రంలో మద్యం అమ్మకాలు పెరగడానికి దోహదపడింది. ఈసారి ఫీజుల పెంపు, కొత్త పాలసీ ద్వారా ఆదాయాన్ని మరింత పెంచుకునే దిశగా ఎక్సైజ్ శాఖ.. మద్యం పాలసీలో కొన్ని కీలక మార్పులు చేసింది. ఇందులో భాగంగా మద్యం దుకాణం లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకునే ఫీజును గతంలో ఉన్న రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచింది. ఈ పెంపు ప్రభుత్వానికి అదనపు ఆదాయాన్ని తెచ్చిపెట్టింది. దీంతోపాటు మద్యం దుకాణదారులు చెల్లించాల్సిన వార్షిక లైసెన్స్ ఫీజును కూడా అమ్మకాల స్థాయి ఆధారంగా స్లాబ్‌లుగా విభజించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఒక్కో దుకాణానికి ప్రతి ఏటా అత్యధికంగా రూ.కోటి 10 లక్షల ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అమ్మకాలను బట్టి రూ.1.10 కోట్లు, రూ.85 లక్షలు, రూ.56 లక్షలు, రూ.55 లక్షలు, రూ50 లక్షల స్లాబ్‌లను నిర్ణయించారు. అయితే లైసెన్స్‌దారులు చెల్లించాల్సిన లైసెన్స్ ఫీజులో ఆరో వంతును ఎక్సైజ్ శాఖ ఇప్పటికే వసూలు చేసింది.

కొత్త వ్యాపారులకు కలిసొచ్చే కాలం..

కొత్తగా లైసెన్స్ దక్కించుకున్న వ్యాపారులు సోమవారం నుంచి తమ దుకాణాలను కొత్త పాలసీ ప్రకారం ప్రారంభించనున్నారు. కాగా, ఈసారి వ్యాపారులకు కూడా పరిణామాలు లాభాలార్జించేలా కలిసివచ్చే అవకాశం ఉందని ఎక్సైజ్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. కొత్త పాలసీ కాలంలో గ్రామ పంచాయతీ, పరిషత్, మునిసిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికలు జరగనున్నాయి. అంతేకాకుండా త్వరతో జరగబోయే మేడారం జాతర వంటి భారీ ఉత్సవాలు కూడా మద్యం అమ్మకాలు భారీగా పెరగడానికి కారణమవుతాయి. ఇదే జోష్‌తో కొత్త మద్యం వ్యాపారులు రంగంలోకి దిగుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా సీఎం పర్యటన: కవిత

» ఎస్‌ఈసీకి తెలంగాణ జాగృతి ఫిర్యాదు



హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న తరుణంలో సీఎం రేవంత్ రెడ్డి జిల్లా కేంద్రాల్లో శంకుస్థాపన కార్యక్రమాలు చేపట్టడం ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ప్రభుత్వ సొమ్మును ఉపయోగించి సీఎం ప్రచారం చేస్తున్నారని ఆమె ఆదివారం నాడు 'ఎక్స్' వేదికగా విమర్శించారు. పట్టణాల్లోని సీఎం సభలకు ప్రభుత్వ సొమ్ముతో గ్రామీణ ప్రాంత ప్రజలను తరలిస్తున్నారని ఆక్షేపించారు. ప్రజాధనాన్ని అక్రమంగా ఖర్చు చేసి ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్నారని, తక్షణమే ఎన్నికల నియమావళిని అమలు చేయాలని కవిత డిమాండ్ చేశారు. ఈ అంశంపై తెలంగాణ జాగృతి నేతలు ఆదివారం రాష్ట్ర ఎన్నికల సంఘానికి వినతిపత్రం సమర్పించారు. సీఎం రేవంత్ పర్యటనలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.